ఈనాడు
THE LARGEST CIRCULATED TELUGU DAILY

విజయవాడ 20-11-2025 గురువారం సిటీ సంపుటి 52 . సంచిక 100
రూ. 6-50 పేజీలు 14
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

శ్రద్ధాంజలి



కీ॥ శే॥ శ్రీ చెరుకూరి రామారావు గారు

ఫౌండర్ చైర్మన్, చెరుకూరి గ్రూప్

(05.04.1949 - 10.11.2025)

కర్మణ్యే వాధికారస్తే మా ఫలేషు కదాచన | మా కర్మ ఫలహేతుర్భూర్మాతే సంగోస్త్వ కర్మణీ || (భగవద్గీత 2 వ అధ్యాయంలో 47 శ్లో.)

మీ కీర్తి అజరామరం.. మీ స్ఫూర్తి ఆచరణీయం.. మీ విలువలు మాకు మార్గదర్శకం..
మీ జీవితం మాకు ఆదర్శనీయం.. మీరు లేరన్న నిజం మాకు తీరని శోకం.

కష్టేఫలి అన్న సిద్ధాంతాన్ని నమ్మి సాధారణ జీవితంలో
అసాధారణంగా ఎదిగి, రెండు తెలుగు రాష్ట్రాల్లో
వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించి వినియోగదారులకు
నిరంతర సేవలు అందిస్తూ ... ఆపన్నులకు చేయూతనిస్తూ ....
మా అందరి హృదయాల్లో చిరస్మరణీయంగా నిలిచిన
కీ॥ శే॥ శ్రీ చెరుకూరి రామారావు గారికి మా హృదయపూర్వక అశ్రుతాంజలి.

మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ :

భార్య : చెరుకూరి విజయలక్ష్మి
కుమారులు : చెరుకూరి వెంకటేశ్వర ప్రసాద్ బాబు & చెరుకూరి గోపీనాథ్
కోడళ్ళు : చెరుకూరి లక్ష్మి ప్రసాద్ & చెరుకూరి గాయత్రి
మనవలు & మనవరాళ్లు : అభిలాష, ఓషో, విజయ రామారావు, నాగ చాందిని
మరియు **చెరుకూరి గ్రూప్** ఉద్యోగులు.

తేది: 10 నవంబర్, 2025 కార్తీక సోమవారం రోజున స్వర్గస్తులైనారు.
పెద్దకర్మ : నేడు తేది 20 నవంబర్, 2025 రోజు మా స్వగృహము హరిహరపురం, వనస్థలిపురం నందు జరుపబడును.

CHERUKURI RESIDENCE


గిల్

శుభ్‌మన్ ఔట్

రెండో టెస్టుకు కెప్టెన్‌గా పంత్

గువాహటి: మెడ గాయం కారణంగా దక్షిణాఫ్రికాతో తొలి టెస్టు నుంచి అర్ధంతరంగా తప్పుకొన్న టీమ్‌ఇండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఇంకా కోలుకోలేదు. అతను శనివారం గువాహటిలో మొదలయ్యే రెండో టెస్టుకు దూరమైనట్లే. గిల్ జట్టుతో పాటే గువాహటికి వెళ్లినప్పటికీ.. మ్యాచ్ సమయానికి ఫిట్‌నెస్ సాధించే అవకాశం లేకపోవడంతో పక్కన పెట్టక తప్పలేదు. బీసీసీఐ అధికారికంగా ప్రకటించనప్పటికీ టీమ్‌మేనేజ్‌మెంట్ గిల్‌పై ఇప్పటికే నిర్ణయం తీసుకుందని సమాచారం. గిల్ దూరమయ్యాక తొలి టెస్టులో జట్టును నడిపించిన వైస్ కెప్టెన్ రిషభ్ పంత్.. రెండో టెస్టులోనూ సారథ్య బాధ్యతలు నిర్వర్తించనున్నాడు. ఈడెన్ గార్డెన్స్‌లో జరిగిన తొలి టెస్టులో భారత్ తొలి ఇన్నింగ్స్‌లో భాగంగా రెండో రోజు బ్యాటింగ్ చేస్తుండగా మెడ నొప్పి తీవ్రమై గిల్ రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగారు. అతను తిరిగి మైదానంలోకే రాలేదు. ఈ మ్యాచ్‌లో భారత్ 30 పరుగుల తేడాతో అనూహ్య పరాజయం చవిచూసిన సంగతి తెలిసిందే. సిరీస్ ఆరంభం కాబోతుండగా జట్టు నుంచి విడుదల చేసిన ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డిని తిరిగి జట్టులోకి తీసుకున్నారు.


కాన్వే

కివీస్‌దే వన్డే సిరీస్

నేపియర్ (న్యూజిలాండ్): వెస్టిండీస్‌తో మూడు వన్డేల సిరీస్‌ను ఆతిథ్య న్యూజిలాండ్ మరో మ్యాచ్ ఉండగానే చేజిక్కించుకుంది. బుధవారం రెండో మ్యాచ్‌లో 5 వికెట్ల తేడాతో నెగ్గిన కివీస్.. సిరీస్‌లో 2-0 ఆధిక్యం సాధించింది. వర్షం వల్ల ఈ మ్యాచ్‌ను 34 ఓవర్లకు కుదించగా.. మొదట విండీస్ 9 వికెట్లకు 247 పరుగులు సాధించింది. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' కెప్టెన్ షై హోప్ (109 నాటౌట్; 69 బంతుల్లో 13×4, 4×6) సెంచరీతో కదం తొక్కాడు. కివీస్ బౌలర్లలో నాథన్ స్మిత్ (4/42), కైల్ జేమీసన్ (3/44) రాణించారు. కివీస్ 33.3 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. ఓపెనర్లు డెవాన్ కాన్వే (90; 84 బంతుల్లో 13×4, 1×6), రచిన్ రవీంద్ర (56; 46 బంతుల్లో 4×4, 5×6) తొలి వికెట్‌కు 106 పరుగులు జోడించి జట్టుకు శుభారంభం అందించారు. టామ్ లేథమ్ (39 నాటౌట్; 29 బంతుల్లో 4×4, 1×6), కెప్టెన్ మిచెల్ శాంట్నర్ (34 నాటౌట్; 15 బంతుల్లో 3×4, 2×6) మిగతా పని పూర్తిచేశారు.


రివాల్డో మూన్సామి

దక్షిణాఫ్రికా-ఎకు ఊరట విజయం

రాజ్‌కోట్: ఇండియా-ఎతో అనధికారిక వన్డే సిరీస్‌లో దక్షిణాఫ్రికా-ఎకు ఊరట విజయం దక్కింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను ఇప్పటికే కోల్పోయిన ఆ జట్టు ఆఖరి వన్డేలో 73 పరుగుల తేడాతో భారత్-ఎను ఓడించింది. లువాన్ ప్రిటోరియస్ (123; 98 బంతుల్లో 9×4, 6×6), రివాల్డో మూన్సామి (107; 130 బంతుల్లో 13×4, 2×6) సెంచరీలతో చెలరేగడంతో తొలుత దక్షిణాఫ్రికా-ఎ 6 వికెట్లకు 325 పరుగులు సాధించింది. ఖలీల్ అహ్మద్ (2/82), ప్రసిద్ధ్ కృష్ణ (2/52), హర్షిత్ రాణా (2/47) రెండేసి వికెట్లు పడగొట్టారు. భారత జట్టు 49.1 ఓవర్లలో 252 పరుగులకు ఆలౌటైంది. రుతురాజ్ గైక్వాడ్ (25), అభిషేక్‌శర్మ (11), కెప్టెన్ తిలక్‌వర్మ (11), రియాన్ పరాగ్ (17) విఫలమయ్యారు. ఇషాన్ కిషన్ (53; 67 బంతుల్లో 3×4, 2×6), ఆయుష్ బదోని (66; 66 బంతుల్లో 8×4) పోరాడినా ఫలితం లేకపోయింది.

ఫైనల్లో నిఖత్

- మరో అయిదుగురు భారత బాక్సర్లు కూడా
- ప్రపంచ బాక్సింగ్ కప్ ఫైనల్స్

గ్రేటర్ నోయిడా: 20 నెలలుగా ప్రపంచ వేదికల్లో ఎక్కడా పతకం సాధించని ప్రపంచ మాజీ ఛాంపియన్ నిఖత్ జరీన్.. ఎట్టకేలకు పోడియంపై నిలవబోతోంది. ప్రపంచ బాక్సింగ్ కప్ ఫైనల్స్‌లో ఈ తెలంగాణ బాక్సర్ తుది పోరుకు అర్హత సాధించడం ద్వారా పతకం ఖాయం చేసుకుంది. మహిళల 51 కేజీల సెమీఫైనల్లో నిఖత్.. ఉజ్బెకిస్థాన్ బాక్సర్ గనీవా గుల్సెవర్‌ను ఓడించింది. జడ్జిలు ఆమెను ఏకగ్రీవంగా విజేతగా ప్రకటించారు. ఫైనల్లో ఆమె.. గువో జి జువాన్ (చైనీస్ తైపీ)ని ఢీకొంటుంది. "చాన్నాళ్ల తర్వాత మళ్లీ నాకు పతకం దక్కడం సంతోషంగా ఉంది. ఇకపై నేను ముందుకే సాగుతా. సొంత అభిమానుల మధ్య ఇంతకుముందు ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచా. ఇప్పుడు ఈ టోర్నీలో సెమీస్ నెగ్గా. ఫైనల్లో గెలిచి స్వర్ణం సాధిస్తానని ధీమాగా ఉన్నా" అని నిఖత్ పేర్కొంది. టోర్నీలో ఇంకో అయిదుగురు భారత బాక్సర్లు ఫైనల్ చేరారు. 57 కేజీల సెమీస్‌లో జాస్మిన్ 5-0తో సర్సెన్బెక్ (కజకిస్థాన్)పై నెగ్గింది. జాదుమణి సింగ్ (57 కేజీలు), పవన్ బర్త్వాల్ (55 కేజీలు), సచిన్ సివాచ్ (60 కేజీలు), హితేశ్ గులియా (70 కేజీలు) కూడా ఫైనల్లో అడుగుపెట్టారు.


నిఖత్


సచిన్


ప్రాంజలి, అభినవ్

అభినవ్, ప్రాంజలి జోడీకి మిక్స్‌డ్ స్వర్ణం

టోక్యో: డెఫ్‌లింపిక్స్‌లో భారత షూటర్లు అభినవ్ దేశ్వాల్, ప్రాంజలి సత్తా చాటారు. 10మీ ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ ఈవెంట్లో ఈ జోడీ స్వర్ణం గెలుచుకుంది. ఈ ద్వయం 16-6తో చైనీస్ తైపీకి చెందిన యా యు కావ్, మింగ్ జుయి సు జోడీపై విజయం సాధించింది. 50మీ రైఫిల్ ప్రోన్ ఈవెంట్లో కుశాగ్ర సింగ్ కాంస్య పతకం గెలుచుకున్నాడు. డెఫ్‌లింపిక్స్‌లో భారత షూటర్లు ఇప్పటివరకు 11 పతకాలు సాధించారు.

ఆంధ్ర హ్యాట్రిక్ విజయం

జంషెడ్‌పూర్: రంజీ ట్రోఫీలో ఆంధ్ర వరుసగా మూడో విజయం నమోదు చేసింది. బుధవారం ముగిసిన ఎలైట్ గ్రూపు-ఎ మ్యాచ్‌లో ఆంధ్ర ఇన్నింగ్స్, 81 పరుగుల తేడాతో ఝార్ఖండ్‌ను చిత్తుచేసింది. ఓవర్‌నైట్ స్కోరు 34/2తో నాలుగో రోజు ఉదయం ఆట కొనసాగించిన ఝార్ఖండ్ రెండో ఇన్నింగ్స్‌లో 52.2 ఓవర్లలో 158 పరుగులకే కుప్పకూలింది. శరణ్‌దీప్ సింగ్ (65; 114 బంతుల్లో 10×4) ఒంటరి పోరాటం చేశాడు. సౌరభ్ కుమార్ (5/47), త్రిపురణ విజయ్ (3/39) విజృంభించి ఆంధ్రకు విజయాన్ని అందించారు. ఈ గెలుపుతో ఆంధ్రకు ఏడు పాయింట్లు లభించాయి. ఇప్పటి వరకు అయిదు మ్యాచ్‌లాడిన ఆంధ్ర 3 విజయాలు, 2 డ్రాలతో మొత్తం 22 పాయింట్లు గెలుచుకుని గ్రూపు-ఎ పట్టికలో రెండో స్థానంలో ఉంది. విదర్భ (25) అగ్రస్థానంలో కొనసాగుతోంది. తొలి ఇన్నింగ్స్‌లో ఝార్ఖండ్ 328 పరుగులు చేయగా.. ఆంధ్ర 567/6 స్కోరు వద్ద డిక్లేర్ చేసింది. డబుల్ సెంచరీతో సత్తాచాటిన అభిషేక్‌రెడ్డి (247; 348 బంతుల్లో 20×4, 2×6)ని 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు వరించింది.

హైదరాబాద్ పరాజయం

జమ్ము: హైదరాబాద్, జమ్ముకశ్మీర్ మధ్య రంజీ ట్రోఫీ ఎలైట్ గ్రూపు-డి మ్యాచ్‌లో లాంఛనం ముగిసింది. బుధవారం జమ్ముకశ్మీర్ 281 పరుగుల తేడాతో హైదరాబాద్‌ను ఓడించింది. 472 పరుగుల లక్ష్యం నేపథ్యంలో.. ఓవర్‌నైట్ స్కోరు 169/7తో నాలుగో రోజు ఉదయం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన హైదరాబాద్ కొద్దిసేపటికే చేతులెత్తేసింది. 190 పరుగులకు ఆలౌటైంది. చివరి రోజు ఆటలో కేవలం 5.2 ఓవర్లు ఆడిన హైదరాబాద్ మరో 21 పరుగులు చేసి.. మిగతా మూడు వికెట్లు కోల్పోయింది. ఎడమచేతి వాటం స్పిన్నర్ అబిద్ ముస్తాక్ (7/68) విజృంభించి జమ్ముకశ్మీర్‌కు విజయాన్ని అందించాడు. తొలి ఇన్నింగ్స్‌ల్లో జమ్ముకశ్మీర్ 170, హైదరాబాద్ 121 పరుగులకే కుప్పకూలాయి. రెండో ఇన్నింగ్స్‌లో జమ్ముకశ్మీర్‌లో 422 పరుగులు సాధించింది.


క్యురసావ్ జట్టు

క్యురసావ్.. అదరగొట్టేశావ్!

- ఫుట్‌బాల్ ప్రపంచకప్‌లో బుల్లి దేశం

ఈనాడు క్రీడావిభాగం


ప్రస్తుతం భారత్ జనాభా 146 కోట్లు. దాదాపు శతాబ్దం చరిత్ర ఉన్న ఫుట్‌బాల్ ప్రపంచకప్‌లో మన దేశం ఒక్కసారీ ఆడింది లేదు. కానీ భారత్‌లో ఒక చిన్న పట్టణంతో సమానంగా జనాభా ఉన్న ఓ దేశం వచ్చే ఏడాది సాకర్ ప్రపంచకప్‌లో బరిలోకి దిగనుంది. ఆ దేశమే.. క్యురసావ్. ఈ కరిబియన్ దీవి జనాభా కేవలం లక్షా 56 వేలు. అలాంటి బుల్లి దేశం.. అత్యంత కఠినమైన అర్హత ప్రక్రియ ఉండే ఫుట్‌బాల్ ప్రపంచకప్‌లో ముందంజ వేసింది. ఈ మెగా టోర్నీలో ఆడబోతున్న అత్యంత చిన్న దేశం ఇదే. ఇప్పటిదాకా ఈ రికార్డు ఐస్‌లాండ్ పేరిట ఉండేది. 3,50,000 జనాభా ఉన్న ఆ దేశం 2018 ప్రపంచకప్‌నకు అర్హత సాధించింది. ఆ రికార్డును ఇప్పుడు క్యురసావ్ బద్దలు కొట్టింది. ఈ రికార్డు ఎప్పటికీ అలాగే నిలిచిపోయినా ఆశ్చర్యం లేదు. నెదర్లాండ్స్ కింగ్‌డమ్‌లో భాగమైన క్యురసావ్.. ప్రపంచకప్‌లో ఆడబోతుండడంలో డచ్ దేశం పాత్ర కీలకం. ఒకప్పుడు వివిధ వయసు విభాగాల్లో నెదర్లాండ్స్‌కు ప్రాతినిధ్యం వహించిన అరడజను మంది ఆటగాళ్లు.. ఇప్పుడు క్యురసావ్‌కు ఆడుతున్నారు. క్యురసావ్‌లో సరైన ఫుట్‌బాల్ మైదానాలు, సౌకర్యాలు లేవు. అయినా ఆ దేశ ఆటగాళ్లు వేరే దేశాల్లో సాధన చేస్తూ, క్లబ్‌లకు ఆడుతూ నైపుణ్యం సంపాదించారు. వీళ్లందరిలో జట్టు భావన తీసుకొచ్చి తీవ్రమైన పోటీ ఉండే ప్రపంచకప్ క్వాలిఫయర్స్‌లో ముందుకు తీసుకెళ్లడమే అసలైన సవాల్. ఆ పనే చేశాడు డచ్ కోచ్ డిక్ అడ్వొకాట్. ఆయన వయసు 78 ఏళ్లు కావడం విశేషం. కోచ్‌గా అడ్వొకాట్‌కు సుదీర్ఘ చరిత్రే ఉంది. 1994 ప్రపంచకప్‌లో కోచ్‌గా నెదర్లాండ్స్‌ను క్వార్టర్స్‌కు తీసుకెళ్లిన అడ్వొకాట్.. 2006 ప్రపంచకప్‌లో దక్షిణ కొరియాకు మేనేజర్‌గా పని చేశాడు. అతడి శిక్షణలోనే అమెరికా కూడా ప్రపంచకప్‌నకు అర్హత సాధించింది. ఇప్పుడు అతడి మార్గనిర్దేశంలో క్యురసావ్ ఈ మెగా టోర్నీకి బెర్తు సంపాదించింది. అయితే ఆ జట్టుకు ప్రపంచకప్ బెర్తు ఖరారైన మ్యాచ్‌లో కోచ్ అందుబాటులో లేడు. కుటుంబ కారణాలతో అతను స్వదేశానికి వెళ్లిపోయాడు. కోచ్ లేకపోయినా.. తన కంటే మెరుగైన జమైకాను నిలువరించగలిగింది క్యురసావ్. ఉత్కంఠభరితంగా సాగిన ఈ మ్యాచ్ 0-0తో డ్రా అయింది. మ్యాచ్‌లో ఎక్కువగా జమైకా ఆధిపత్యమే సాగింది. స్టాపేజ్ టైంలో ఆ జట్టుకు పెనాల్టీ కూడా వచ్చింది. అయితే వీడియో రివ్యూ తర్వాత రిఫరీ ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాల్సి వచ్చింది. లేదంటే క్యురసావ్ కథ ముగిసేది. అంతకుముందు బెర్ముడాపై 7-0తో భారీ విజయం సాధించడంతో జమైకాపై ఒక పాయింట్ ఆధిక్యంలో నిలిచింది క్యురసావ్. కాబట్టే చివరి మ్యాచ్ డ్రా అయినా ఆ జట్టు ముందంజ వేయగలిగింది. ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన రెండో దేశమైన భారత్ దశాబ్దాలుగా ఎంత ప్రయత్నిస్తున్నా ప్రపంచకప్‌నకు అర్హత సాధించడం లేదు. అర్హత ప్రమాణాలకు దగ్గర్లో కూడా వెళ్లట్లేదు. అలాంటిది కొంచెం సర్దుకుంటే నరేంద్ర మోదీ స్టేడియంలో పట్టేంత జనాభా ఉన్న దేశం ఈ టోర్నీకి అర్హత సాధించడం అద్భుతమే కదా!

అఫ్గాన్ చేతిలో భారత్-బి ఓటమి

అండర్-19 ముక్కోణపు సిరీస్

బెంగళూరు: అండర్-19 ముక్కోణపు సిరీస్‌లో బుధవారం భారత్-బి 71 పరుగుల తేడాతో అఫ్గానిస్థాన్ చేతిలో ఓడిపోయింది. నమన్ పుష్పక్ (4/45), ఇషాన్ సూద్ (2/24) విజృంభించడంతో మొదట అఫ్గానిస్థాన్ 45.2 ఓవర్లలో 168 పరుగులకే ఆలౌటైంది. ఫైసల్ (58), అజిజుల్లా (42) రాణించారు. స్వల్ప ఛేదనలో భారత్-బి తేలిపోయింది. అబ్దుల్ అజీజ్ (6/38) ధాటికి 29.3 ఓవర్లలో 97 పరుగులకే ఆలౌటైంది. యువ్‌రాజ్ గోహిల్ (60 నాటౌట్) పోరాటం సరిపోలేదు. మిగతా బ్యాటర్లలో ఒక్కరూ రెండంకెల స్కోరు చేయలేకపోయారు. సలామ్ ఖాన్, వహిదుల్లా చెరో రెండు వికెట్లు పడగొట్టారు.

టెన్నిస్ హాల్ ఆఫ్ ఫేమ్‌లో ఫెదరర్


ఫెదరర్

న్యూయార్క్: టెన్నిస్ దిగ్గజం రోజర్ ఫెదరర్‌కు ఇంటర్నేషనల్ టెన్నిస్ హాల్ ఆఫ్ ఫేమ్‌లో చోటు దక్కింది. అద్భుతమైన ఆటతో టెన్నిస్ అభిమానులను ఉర్రూతలూగించిన ఫెదరర్.. పురుషుల సింగిల్స్‌లో 20 గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు గెలిచిన తొలి ఆటగాడిగా నిలిచాడు. 2022లో అతడు రిటైరయ్యాడు. నామినీల్లో 75 శాతం ఓట్లు వచ్చిన వారికి హాల్ ఆఫ్ ఫేమ్‌లో స్థానం లభిస్తుంది. పాత్రికేయులు, అభిమానులు, హాల్ ఆఫ్ ఫేమ్ సభ్యులు తదితరులు ఓట్లు వేశారు. 2026 ఆగస్టులో అధికారికంగా ఫెదరర్‌కు హాల్ ఆఫ్ ఫేమ్‌లో చోటు కల్పిస్తారు.

రింకు.. 176

కోయంబత్తూరు: టీమ్‌ఇండియా బ్యాటర్ రింకు సింగ్ రంజీల్లో తన అత్యుత్తమ స్కోరును అందుకున్నాడు. తమిళనాడుతో డ్రాగా ముగిసిన మ్యాచ్‌లో ఈ ఉత్తర్ ప్రదేశ్ మిడిలార్డర్ బ్యాటర్ 176 పరుగుల మారథాన్ ఇన్నింగ్స్ ఆడాడు. 247 బంతులు ఎదుర్కొన్న అతను 17 ఫోర్లు, 6 సిక్సర్లు కొట్టాడు. రింకుతో పాటు అభిషేక్ గోస్వామి (79), శివమ్ మావి (54), ఆర్యన్ జుయల్ (43) కూడా రాణించడంతో 460 పరుగులు సాధించిన యూపీ.. 5 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం దక్కించుకుంది. మ్యాచ్ ముగిసే సమయానికి తమిళనాడు రెండో ఇన్నింగ్స్‌లో 103/2తో నిలిచింది. తొలి ఇన్నింగ్స్‌లో ఆ జట్టు 455 పరుగులకు ఆలౌటైంది.

చెస్ ప్రపంచకప్

క్వార్టర్స్‌లో అర్జున్ ఓటమి


అర్జున్

పంజిమ్: చెస్ ప్రపంచకప్‌లో అర్జున్ ఇరిగేశి కథ ముగిసింది. క్వార్టర్‌ఫైనల్లో అతడు 1.5-2.5తో చైనాకు చెందిన వీ యి చేతిలో పరాజయం పాలయ్యాడు. రెండు క్లాసికల్ గేమ్స్ కూడా డ్రాగా ముగియడంతో ఆటగాళ్లు టైబ్రేక్ ఆడారు. టైబ్రేక్ తొలి ర్యాపిడ్ గేమ్ డ్రాగా ముగియగా.. రెండో గేమ్‌లో నెగ్గడం ద్వారా వీ యి నెగ్గి క్వార్టర్స్‌లో పైచేయి సాధించాడు. సెమీస్‌లో అతడు ఎసిపెంకోతో తలపడతాడు. క్వార్టర్స్‌లో ఎసిపెంకో 4-2తో షంక్‌లాండ్ (అమెరికా)ను ఓడించాడు. మరో సెమీస్‌లో యకుబయేవ్ (ఉజ్బెకిస్థాన్), సిందరోవ్ (ఉజ్బెకిస్థాన్) తలపడతారు. క్వార్టర్స్‌లో యకుబయేవ్ 1.5-0.5తో డొంచెంకో (జర్మనీ)పై, సిందరోవ్ 3.5-2.5తో మార్టినెజ్ అల్కాంటరాపై నెగ్గారు.


శ్రీకాంత్

ప్రిక్వార్టర్స్‌లో లక్ష్య, శ్రీకాంత్

ఆస్ట్రేలియన్ ఓపెన్ బ్యాడ్మింటన్

సిడ్నీ: ఆస్ట్రేలియన్ ఓపెన్ ప్రపంచ టూర్ సూపర్ 500 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత స్టార్ షట్లర్లు లక్ష్యసేన్, కిదాంబి శ్రీకాంత్, హెచ్.ఎస్. ప్రణయ్ ప్రిక్వార్టర్‌ఫైనల్లో అడుగుపెట్టారు. బుధవారం పురుషుల సింగిల్స్ తొలి రౌండ్లో లక్ష్య 21-17, 21-13తో లీ యాంగ్ (చైనీస్ తైపీ)పై, శ్రీకాంత్ 21-19, 19-21, 21-15తో లీ చియా హావో (చైనీస్ తైపీ)పై, ప్రణయ్ 6-21, 21-12, 21-17తో యొహానెస్ మార్సెలినో (ఇండోనేసియా)పై విజయం సాధించారు. తరుణ్ మన్నెపల్లి 21-13, 17-21, 21-19తో మాగ్నస్ జొహానెసెన్ (డెన్మార్క్)పై, ఆయుష్ శెట్టి 21-11, 21-15తో సామ్ యువాన్ (కెనడా)పై నెగ్గి ప్రిక్వార్టర్స్ చేరుకున్నారు. కిరణ్ జార్జ్ 21-11, 22-24, 17-21తో కెంటా నిషిమోటో (జపాన్) చేతిలో పోరాడి ఓడాడు. మిక్స్‌డ్ డబుల్స్ తొలి రౌండ్లో మోహిత్ జగ్లాన్- లక్షిత జగ్లాన్ జోడీ 12-21, 16-21తో యకుర- క్రిస్టల్ (కెనడా) జంట చేతిలో పరాజయం చవిచూసింది.

భారత్ తొలి ప్రత్యర్థి అమెరికా

2026 అండర్-19 ప్రపంచకప్

దుబాయ్: అమెరికాతో పోరుతో భారత జట్టు 2026 అండర్-19 వన్డే ప్రపంచకప్ టైటిల్ వేటను ఆరంభించనుంది. జింబాబ్వే, నమీబియా సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న ఈ టోర్నమెంట్ జనవరి 15 నుంచి ఫిబ్రవరి 6 వరకు జరుగుతుంది. మొత్తం 16 జట్లను నాలుగు గ్రూపులుగా విభజించారు. టోర్నీలో మొత్తం 41 మ్యాచ్‌లు జరుగుతాయి. అమెరికా, బంగ్లాదేశ్, న్యూజిలాండ్‌లతో కలిసి భారత్ గ్రూప్-ఎ లో ఉంది. టాంజానియా, జపాన్ జట్లు కూడా ఈ ప్రపంచకప్‌లో ఆడుతున్నాయి. టోర్నీ షెడ్యూలును ఐసీసీ బుధవారం ప్రకటించింది. భారత జట్టు జనవరి 15న అమెరికాతో మ్యాచ్ ఆడుతుంది. 17న బంగ్లాదేశ్‌తో, 24న న్యూజిలాండ్‌తో తలపడుతుంది.

న్యూజిలాండ్ క్రికెట్ బోర్డు అధ్యక్షుడిగా గ్రేట్‌బ్యాచ్

క్రైస్ట్‌చర్చ్: న్యూజిలాండ్ మాజీ బ్యాటర్ మార్క్ గ్రేట్‌బ్యాచ్ ఆ దేశ క్రికెట్ బోర్డు అధ్యక్షుడిగా ఎంపికయ్యాడు. అతడు 1988 నుంచి 1996 వరకు 41 టెస్టులు, 84 వన్డే మ్యాచ్‌లు ఆడాడు. గ్రేట్‌బ్యాచ్ గతంలో న్యూజిలాండ్ సెలక్టర్, కోచ్‌గా కూడా పని చేశాడు. లెస్లీ ముర్డోక్ స్థానంలో అతడు న్యూజిలాండ్ క్రికెట్ (ఎన్‌జెడ్‌సీ) అధ్యక్షుడిగా బాధ్యతలు అందుకున్నాడు.


హర్మన్‌ప్రీత్


హర్మన్‌ప్రీత్.. ట్రిపుల్ ధమాకా

దిల్లీ: మహిళల వన్డే ప్రపంచకప్ కోసం 47 ఏళ్లుగా కొనసాగుతున్న నిరీక్షణకు ఈ నెలలోనే తెరదించింది భారత జట్టు. ఫైనల్లో దక్షిణాఫ్రికాపై అద్భుత విజయంతో హర్మన్‌ప్రీత్‌సేన ప్రపంచకప్‌ను చేజిక్కించుకోవడంతో దేశంలో క్రికెట్ అభిమానుల ఆనందానికి అవధుల్లేకపోయాయి. ఈ విజయంతో భారత మహిళల జట్టు రాత మారిపోయింది. బీసీసీఐ నుంచే కాక వివిధ వర్గాల నుంచి నజరానాల వర్షం కురిసింది. అంతే కాక భారత జట్టులోని స్టార్ క్రికెటర్ల బ్రాండ్ విలువ కూడా అమాంతం పెరిగి వారి కోసం కంపెనీలు క్యూ కడుతున్నాయి. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ ప్రచారం చేస్తున్న బ్రాండ్ల సంఖ్య ప్రపంచకప్ ముందుతో పోలిస్తే మూడు రెట్లకు పెరిగిందట. "ప్రపంచకప్ కంటే ముందు హర్మన్ 8-10 బ్రాండ్లకు ప్రచారం చేసేది. ఈ టోర్నీ తర్వాత అవి మూడు రెట్లకు పెరిగాయి. తన పారితోషకం కూడా మూడింతలైంది. క్రీడా ఉత్పత్తులకే కాక ఇతర బ్రాండ్ల ప్రచారం కోసం కూడా ఆమెను సంప్రదిస్తున్నారు" అని హర్మన్‌ప్రీత్ మేనేజర్ నుపుర్ కశ్యప్ తెలిపింది.

ఈనాడు

విజయవాడ 20-11-2025 గురువారం సిటీ సంపుటి 52 . సంచిక 100 — THE LARGEST CIRCULATED TELUGU DAILY — రూ. 6-50 పేజీలు 14 — www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru



ఆధ్యాత్మికతతో మానవసేవ

రెండింటినీ అనుసంధానించిన మహనీయుడు బాబా

'అందరినీ ప్రేమించు.. అందరినీ సేవించు' అనే సత్యసాయి బోధన స్ఫూర్తితో సాగుదాం

బాబా శతజయంతి ఉత్సవాల్లో ప్రధాని మోదీ ● స్మారక నాణెం, తపాలా బిళ్లల ఆవిష్కరణ

కష్టాలు, బాధలకు.. సత్యసాయి పరిష్కారం చూపారు: ముఖ్యమంత్రి చంద్రబాబు

బాబా భౌతికంగా మనతో లేకపోయినా.. ఆయన చూపిన ప్రేమ, సేవాస్ఫూర్తి, అందించిన సందేశాలు ప్రపంచవ్యాప్తంగా కోట్ల మందిని నడిపిస్తున్నాయి. బాబా నడయాడిన పుట్టపర్తి పవిత్ర భూమి. ఇక్కడ ఏదో మహత్తు ఉంది. శతజయంతి ఉత్సవాల్లో పాల్గొనడం నా అదృష్టం. బాబా బోధనలు పట్టణాల నుంచి గిరిజన ప్రాంతాల వరకు విద్య, ఆరోగ్య, సేవా కార్యక్రమాల ద్వారా ఎందరినో స్పృశిస్తున్నాయి.

– ప్రధాని మోదీ



సత్యసాయిబాబా సేవలను స్మరించుకుంటూ రూ.100 నాణేన్ని ఆవిష్కరిస్తున్న ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్

ప్రజల దాహార్తిని తీర్చారు – పవన్‌కల్యాణ్

బాబా జీవితమే పాఠం – లోకేశ్

సేవలను మరింతగా విస్తరిస్తాం – ఆర్‌జే రత్నాకర్

2లో



బాబా మహాసమాధికి నమస్కరిస్తున్న ప్రధాని మోదీ

ఈనాడు – పుట్టపర్తి

అందరినీ ప్రేమించు.. అందరినీ సేవించు.. అంటూ తన బోధనలతో ఆధ్యాత్మికతను మానవసేవకు అనుసంధానం చేసి ప్రపంచవ్యాప్తంగా కోట్ల మంది హృదయాల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించిన ప్రేమమూర్తి సత్యసాయి... అని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. బాబా శతజయంతి ఉత్సవాల్లో పాల్గొనేందుకు ఆయన బుధవారం శ్రీసత్యసాయి జిల్లా కేంద్రమైన పుట్టపర్తికి వచ్చారు. అంతకుముందు విమానాశ్రయంలో మోదీకి సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు స్వాగతం పలికారు. అక్కడి నుంచి మోదీ ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్



హాలుకు చేరుకుని సత్యసాయి మహాసమాధిని దర్శించుకుని నివాళి అర్పించారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. తర్వాత హిల్‌వ్యూ స్టేడియంలో నిర్వహించిన ప్రపంచ మహిళా దినోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మోదీతో పాటు సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్, కేంద్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, కిషన్‌రెడ్డి, భూపతిరాజు శ్రీనివాసవర్మ, సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్, ప్రముఖ క్రికెటర్ సచిన్ తెందూల్కర్, సినీనటి ఐశ్వర్యారాయ్, దేశీయ సత్యసాయి సంస్థల అధ్యక్షుడు నిమీష్‌పాండే తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ.. సత్యసాయి శతజయంతి ఈ తరానికి వేడుక మాత్రమే కాదని, దైవ ఆశీర్వాదమన్నారు.

(మిగతా 2లో)

మారేడుమిల్లిలో మరో ఎన్‌కౌంటర్

ఎదురుకాల్పుల్లో ఏడుగురు మావోయిస్టుల మృతి

మృతుల్లో ఏవోబీ స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు టెక్ శంకర్

- నంబాల కేశవరావు వద్ద గార్డ్‌గా పనిచేసిన జ్యోతి కూడా
- మరో ఐదుగురు జగరగొండ ఏరియా కమిటీ సభ్యులు
- టెక్ శంకర్ మినహా ఆరుగురు ఛత్తీస్‌గఢ్ వారే
- మంగళవారం ఎదురుకాల్పుల నుంచి తప్పించుకుని బుధవారం చిక్కిన బృందం



ఎదురుకాల్పుల్లో మృతి చెందిన టెక్ శంకర్

మావోయిస్టు పార్టీకి దెబ్బ మీద దెబ్బ తగులుతూనే ఉంది. ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు, దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శి మడ్వి హిడ్మా, ఆయన భార్య మడకం రాజేతో పాటు మరో నలుగురు కమాండర్లు మంగళవారం అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందారు. 24 గంటలు కూడా గడవకముందే బుధవారం ఉదయం ఆ ప్రాంతం మరోసారి తుపాకుల మోతతో దద్దరిల్లింది. మంగళవారం తప్పించుకున్న బృందంలోని ఏడుగురు మావోయిస్టులు బుధవారం జరిగిన ఎదురుకాల్పుల్లో ప్రాణాలు కోల్పోయారు.

(మిగతా 8లో)

అతనే ఓ బాంబు

ఐఈడీ, ల్యాండ్‌మైన్ తయారీలో దిట్ట.. టెక్ శంకర్

8లో

మావోయిస్టుల వెన్నువిరిచాం

దక్షిణ బస్తర్, దండకారణ్యంలో కోలుకోలేని దెబ్బతీశాం

8లో

దేవ్‌జీ మా అదుపులో లేరు

నిఘా విభాగాధిపతి మహేష్‌చంద్ర లడ్డా



నేడు పదోసారి సీఎంగా నీతీశ్ ప్రమాణం

ఎన్డీయే శాసనసభాపక్ష నేతగా ఎన్నిక

9లో



కొట్టివేసిన నిబంధనలనే మళ్లీ తెచ్చారు

ట్రైబ్యునళ్ల సంస్కరణల చట్టం (2021)పై సుప్రీంకోర్టు తీవ్ర ఆక్షేపణ

10లో

వివాదాస్పదమైన వాటిని రద్దు చేస్తూ తీర్పు

రైతులు కాలర్ ఎగరేసుకునేలా చేస్తా

అన్నదాత అభ్యున్నతికి పంచ సూత్రాలు

- నూతన విధానాలతో ముందుకు 'సాగు'దాం
- 'పీఎం కిసాన్- అన్నదాత సుఖీభవ' నిధుల విడుదలలో సీఎం చంద్రబాబు



పీఎం కిసాన్–అన్నదాత సుఖీభవ చెక్కును రైతులతో కలిసి విడుదల చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి అచ్చెన్నాయుడు, కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి

ఈనాడు, కడప, న్యూస్‌టుడే, పెండ్లిమర్రి: వ్యవసాయ రంగంలో వినూత్న మార్పులు తెస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వెల్లడించారు. రైతులు పాత విధానాలను విడనాడి.. నూతన ఒరవడితో పంటలు సాగు చేసేలా ప్రోత్సాహకాలు అందిస్తామని తెలిపారు. పంచ సూత్రాల అమలుతో రైతులు కాలర్ ఎగరేసుకుని తిరిగేలా చేస్తామని హామీ ఇచ్చారు. వైఎస్సార్ కడప జిల్లా కమలాపురం నియోజకవర్గం పెండ్లిమర్రి మండలంలో 'పీఎం కిసాన్- అన్నదాత సుఖీభవ' కింద రెండో విడత నిధులను ముఖ్యమంత్రి బుధవారం విడుదల చేశారు. తొలుత కోయంబత్తూరు నుంచి ప్రధాని నరేంద్రమోదీ పాల్గొన్న ఈ కార్యక్రమాన్ని ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా రైతులతో కలిసి వీక్షించారు. అనంతరం రెండో విడతగా ఒక్కొక్కరికి రూ.7వేల చొప్పున రూ.3,315 కోట్లను 46,85,838 మంది రైతుల బ్యాంకు ఖాతాలకు ముఖ్యమంత్రి విడుదల చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడారు. 'ఇప్పటివరకు రెండు విడతల్లో రూ.14 వేలు జమచేశాం. మూడోవిడతగా మరో రూ.6వేలు చెల్లిస్తాం. దీంతో ఏడాదికి రూ.20వేల సాయం అందుతుంది. వైకాపా పాలనలో ఆర్థిక విధ్వంసం జరిగి రాష్ట్రానికి ఇబ్బందులు తలెత్తినా హామీలు అమలు చేస్తున్నాం' అని సీఎం చంద్రబాబు అన్నారు. 'రైతులంతా సాగులో సాంకేతికతను వినియోగించాలి.

(మిగతా 3లో)

బ్యాంకు కాల్స్ 1600 సిరీస్ నంబరు నుంచే రావాలి

జనవరి 1 నుంచే: ట్రాయ్

ఇతర ఆర్థిక సంస్థలకూ నిర్దేశిత గడువు

12లో

'మద్యం' కేసులో కీలక నిందితులకు హైకోర్టులో ఎదురుదెబ్బ

- ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, గోవిందప్పల డిఫాల్ట్ బెయిలు రద్దు
- ఈ నెల 26లోపు ఏసీబీ కోర్టులో లొంగిపోవాలని ఆదేశం



ధనుంజయరెడ్డి కృష్ణమోహన్‌రెడ్డి బాలాజీ గోవిందప్ప

ఈనాడు, అమరావతి: మద్యం కుంభకోణం కేసులో నిందితులు సీఎంవో మాజీ కార్యదర్శి, విశ్రాంత ఐఏఎస్ అధికారి కె.ధనుంజయరెడ్డి(ఏ-31), ఓఎస్డీ కృష్ణమోహన్‌రెడ్డి(ఏ-32), భారతి సిమెంట్స్ డైరెక్టర్ బాలాజీ గోవిందప్పలకు(ఏ-33) హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఈ ముగ్గురికీ డిఫాల్ట్ బెయిలిస్తూ విజయవాడ ఏసీబీ కోర్టు సెప్టెంబరు 6న ఇచ్చిన ఉత్తర్వులను హైకోర్టు బుధవారం రద్దుచేసింది. ఈ నెల 26లోపు ఏసీబీ కోర్టులో లొంగిపోవాలని నిందితులకు తేల్చిచెప్పింది. ఏసీబీ కోర్టు ఇచ్చిన డిఫాల్ట్ బెయిలును రద్దుచేయాలంటూ సీఐడీ వేసిన పిటిషన్లను పాక్షికంగా అనుమతించింది. మరోవైపు ఏసీబీ కోర్టులో రెగ్యులర్ బెయిలు పిటిషన్లు దాఖలు చేసుకోవచ్చని నిందితులకు సూచించింది. విచారణ జరిపి నిర్ణయం ప్రకటించాలని ఏసీబీ కోర్టుకు స్పష్టంచేసింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి బుధవారం ఈ మేరకు తీర్పు ఇచ్చారు. వాస్తవానికి 24వ తేదీ లోపు ఏసీబీ కోర్టులో లొంగిపోవాలని న్యాయమూర్తి తీర్పులో పేర్కొన్నారు. నిందితుల తరఫు సీనియర్ న్యాయవాదులు స్పందిస్తూ.. గడువును 26 వరకు పెంచాలని

(మిగతా 10లో)

మద్యం సొమ్ముతో ఆస్తుల కొనుగోలు



అరబిందోకు భూమి అమ్మి రూ.13.30 కోట్ల లంచాల నల్లధనం వైట్‌లోకి మార్పు


ఆ డబ్బుతో పలుచోట్ల స్థిరాస్తులపై పెట్టుబడులు

10లో

చెవిరెడ్డి భాస్కరరెడ్డి, ఆయన కుటుంబీకుల పేరిట కొన్న ఆస్తుల జప్తునకు చర్యలు

ఏసీబీ కోర్టులో పిటిషన్ దాఖలుకు సిట్‌కు రాష్ట్ర ప్రభుత్వ అనుమతి

ఇదీ సంగతి!



అవసరం లేదు సార్.. నాకు కంఠస్థం వచ్చు!!



సత్యసాయిబాబా స్మారకార్థం తపాలా బిళ్లలను ఆవిష్కరిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబులతో కేంద్ర మంత్రులు భూపతిరాజు శ్రీనివాసవర్మ, కిషన్‌రెడ్డి, రామ్మోహన్‌నాయుడు, క్రికెటర్ సచిన్ తెందూల్కర్, శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్, సినీనటి ఐశ్వర్యారాయ్, దేశీయ సత్యసాయి సంస్థల అధ్యక్షుడు నిమీష్‌పాండే, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎంపీ బీకే పార్థసారథి

ఆధ్యాత్మికతతో మానవసేవ

సేవలను మరింతగా విస్తరిస్తాం




సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ ప్రారంభోపన్యాసం చేస్తూ... బాబా బోధించిన ప్రేమ, ధర్మమార్గాన్ని భవిష్యత్తు తరాలకు మరింత చేరువ చేయడం, సేవలను విస్తరించడం ట్రస్టు ప్రధాన ధ్యేయమని చెప్పారు. బాబా శతజయంతి ఉత్సవాలను భారీస్థాయిలో నిర్వహించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న బాబా భక్తులు, సేవాదళ్ సభ్యులు, ప్రస్తుత, పూర్వ విద్యార్థులు అందించిన సహకారం వెలకట్టలేనిదన్నారు.

(మొదటి పేజీ తరువాయి)

సత్యసాయి సెంట్రల్ ట్రస్టు చేపడుతున్న బృహత్తర కార్యక్రమాలు అభినందనీయమని మోదీ ప్రశంసించారు. రాయలసీమకు తాగునీరు అందించేందుకు 3 వేల కి.మీ. పైప్‌లైన్ వేయడం, ఒడిశాలో వరద బాధితులకు వెయ్యి ఇళ్లు నిర్మించడం, లక్షల రూపాయలు ఖర్చయ్యే ఆధునిక వైద్యాన్ని ఉచితంగా అందించడం, గుజరాత్ భూకంప సమయంలో సత్యసాయి సేవాదళ్ సేవలు అందించడం.. తదితరాలను గుర్తుచేసుకున్నారు.

సకలజనుల సంతోషమే ఆయన జీవితం



'ప్రేమ, సేవ, ప్రశాంతత, పరిష్కారానికి బాబా ప్రతిరూపం. విశ్వశాంతి, విశ్వసౌభాగ్యం, సకల జనుల సంతోషమనే భావనతో ఆయన జీవించారు. మానవసేవే మాధవసేవ అని నమ్మి బోధించారు.. ఆచరించారు.. ఫలితం చూపించారు' అని సీఎం చంద్రబాబు కొనియాడారు. 'ఒకే మతం.. అది ప్రేమ, ఒకే కులం.. అది మానవత, ఒకే భాష.. అది హృదయం, ఒకటే న్యాయం.. అది కర్మ. ఒకే దేవుడు.. ఆయన ఒక్కడే శక్తిమంతుడు.. అని బాబా బోధించారు. కష్టాలు, బాధలు, సమస్యలకు పరిష్కారం చూపారు. బాబాను చూస్తూ భజనలు చేస్తూ సామాన్యుల నుంచి దేశాధినేతల వరకు అనుగ్రహం పొందారు' అని సీఎం చెప్పారు. 'నేను ఓ సందర్భంలో సత్యసాయిని కలవగా... బంగారూ ఒక పని చేస్తావా అని నన్ను అడిగారు. నేను పుట్టిన ప్రాంతంలో తాగునీరు లేదు. నా భక్తులు నిధులు ఇస్తామంటున్నారు. తాగునీటి ప్రాజెక్టు నిర్వహణను చేపడతానని నాకు హామీ ఇస్తావా... అని అడిగారు. నేను సంతోషంగా ఒప్పుకొని ఆ ప్రాజెక్టును పూర్తిచేశాను. ఆ సంకల్పాన్ని బాబానే నాకిచ్చారు. 102 సత్యసాయి విద్యాలయాల ద్వారా 60వేల మందికి ఒకటో తరగతి నుంచి పీహెచ్‌డీ వరకు విలువలతో కూడిన విద్యను ఉచితంగా అందిస్తున్నారు. రెండు సూపర్ స్పెషాలిటీ, రెండు జనరల్, రెండు సంచార ఆసుపత్రుల్లో రోజూ 3వేల మందికిపైగా ఉచితంగా వైద్య సేవలందుతున్నాయి. సెంట్రల్ ట్రస్టు 140 దేశాల్లో సేవలందిస్తోంది. 7.5 లక్షల మంది సేవాదళ్ సభ్యులున్నారు. బాబా చూపిన మార్గాన్ని, సేవాస్ఫూర్తిని భావితరాలకు అందించాలి. ఉత్సవాల ఏర్పాట్లకు కేంద్ర ప్రభుత్వం సహకరించింది. రాష్ట్ర పండుగగా ప్రకటించి నిర్వహణ బాధ్యతలను మేం తీసుకున్నాం' అని చంద్రబాబు వివరించారు.

ప్రజల దాహార్తిని తీర్చారు



ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ.. అత్యంత వెనుకబడిన జిల్లాలో పుట్టిన సత్యసాయి ఈ ప్రాంత ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఎంతో కృషిచేశారని, జలజీవన్ మిషన్‌కు అదే స్ఫూర్తి అని కొనియాడారు. 20 ఏళ్ల కిందటే హాలీవుడ్ నటుడు ఒకరు... బాబా వద్దకు వచ్చి ఆశీర్వాదం తీసుకున్నారని తెలిసి ఆశ్చర్యం కలిగిందన్నారు.

బాబా జీవితమే పాఠం



మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. 'సత్యసాయి జీవితమే మనందరికీ పాఠం. ఆయన బోధనల నుంచి ఎంతో నేర్చుకోవాలి. బాబా కృషితో ప్రపంచ ఆధ్యాత్మికతకు చిరునామాగా పుట్టపర్తి ఎదిగింది. పేదలకు ప్రేమతో సాయం అందించాలని బాబా చెప్పిన సూక్తి నాకు ఆదర్శం. విద్యా సంస్కరణల ద్వారా విద్యార్థులు, యువతను తీర్చిదిద్దేందుకు ప్రయత్నిస్తున్నాం' అని చెప్పారు.

ఆ ఐదు అంశాలూ జీవితానికి పునాదులు



ప్రముఖ సినీనటి ఐశ్వర్యారాయ్ బచ్చన్ మాట్లాడుతూ... బాబా బోధించిన క్రమశిక్షణ, అంకితభావం, భక్తి, దృఢసంకల్పం, సత్యాసత్య విచక్షణ.. ఈ ఐదు అంశాలూ ప్రతి జీవితానికీ పునాదులుగా నిలుస్తాయని చెప్పారు. తాను బాలవికాస్ విద్యార్థినిని అని గుర్తు చేసుకున్నారు. ప్రసంగం పూర్తయ్యాక ఐశ్వర్యారాయ్ మోదీ వద్దకు వెళ్లి ఆయన కాళ్లకు నమస్కరించారు. మోదీ ఆమెను ఆశీర్వదించారు.



అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

హిల్‌వ్యూ స్టేడియంలో నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను అలరించాయి. శ్రీసత్యసాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లెర్నింగ్ అనంతపురం క్యాంపస్ విద్యార్థినుల వేదమంత్రోచ్చారణలతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ప్రఖ్యాత కర్ణాటక సంగీత విద్వాంసురాలు సుధా రఘునాథన్, నవీన్‌లు... మైత్రీం భజాత అనే ప్రార్థన గీతాన్ని శ్రావ్యంగా ఆలపించారు. తర్వాత జరిగిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. గుజరాత్‌లోని సత్యసాయి పాఠశాలల విద్యార్థుల నృత్యం అలరించింది. బాబా జీవిత చరిత్రపై త్వరలో విడుదల కానున్న చలనచిత్రం నుంచి 'శ్రీసత్యసాయి బాబాకు నివాళి' అనే నృత్య రూపకాన్ని జాతీయ అవార్డు గ్రహీత కళా మాస్టర్ ఆధ్వర్యంలో సత్యసాయి విద్యాసంస్థల బాలికలు ప్రదర్శించారు. ప్రముఖ డ్రమ్మర్ శివమణి నేతృత్వంలో కేరళ ఉన్నికృష్ణన్ మరార్, తమిళనాడు మణిమారన్ బృందాల సంగీత ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది.

ప్రపంచకప్ సమయంలో బాబా పుస్తకం పంపారు



ప్రముఖ క్రికెటర్ సచిన్ తెందూల్కర్ మాట్లాడుతూ.. 'ఐదేళ్ల వయసప్పుడు నా జుట్టు సత్యసాయి జుట్టులా ఉందని... నేను సత్యసాయిబాబాలా ఉన్నాననేవారు' అని గుర్తు చేసుకున్నారు. '2011 ప్రపంచకప్ సమయంలో అపారమైన అంచనాలు, ఒత్తిడి మాపై ఉన్నాయి. బెంగళూరులో మేం శిక్షణలో ఉన్నప్పుడు బాబా ఫోన్ చేసి ఒక పుస్తకం పంపించారు. అది నాలో అనూహ్యమైన విశ్వాసాన్ని పెంచింది. అనంతర కాలంలో ప్రపంచకప్ గెలిచాం' అని వివరించారు. తన మనసులో ఉన్న ప్రశ్నలను తాను అడగకముందే బాబా చెప్పేవారని గుర్తుచేసుకున్నారు. సత్యసాయి.. తన మానసిక, ఆధ్యాత్మిక ధైర్యం అని చెప్పారు.

సేవలను స్మరించుకుంటూ..

సత్యసాయి సేవలను స్మరించుకుంటూ రూ.100 స్మారక నాణెం, నాలుగు తపాలా బిళ్లలను మోదీ ఆవిష్కరించారు. శ్రీసత్యసాయి జిల్లాలోని 20 వేల మంది బాలికలకు సుకన్య సమృద్ధి యోజన పథకాన్ని వర్తింపజేస్తామని, 100 మంది రైతులకు గిర్ ఆవులను అందిస్తామని ప్రధాని ప్రకటించారు. ఈ మేరకు ముగ్గురు బాలికలకు ఖాతా పుస్తకాలను, అంతకు ముందు ప్రశాంతి నిలయంలో రైతులకు గోవులను అందించారు. కార్యక్రమంలో సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి.రమణ, ట్రస్టు సభ్యులు చక్రవర్తి, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.



ప్రధాని నరేంద్ర మోదీకి జ్ఞాపిక అందిస్తున్న సీఎం చంద్రబాబు



మోదీకి బాబా చిత్రపటాన్ని అందజేస్తున్న ఆర్‌జే రత్నాకర్, బోర్డు సభ్యుడు చక్రవర్తి



ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు మాటామంతీ



సచిన్‌తెందూల్కర్‌ను ఆత్మీయంగా పలకరిస్తున్న ప్రధాని మోదీ



ప్రధాని మోదీకి నమస్కరిస్తున్న సినీనటి ఐశ్వర్యారాయ్



గోవుకు గడ్డి తినిపిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ

రీసేల్ అయ్యే బండే కావాలి

- ఆ తర్వాతే మైలేజీ, డిజైన్‌లకు ప్రాధాన్యం
- కొత్త బైకుల కొనుగోళ్లలో వినియోగదారుల పోకడ
- చెన్నైలో నిర్వహించిన అధ్యయనంలో వెల్లడి

ఈనాడు, చెన్నై: మార్కెట్ సామ్రాజ్యానికి వినియోగదారుడే రాజు... అతని వ్యవహారశైలి, సంతృప్తులను తెలుసుకోవడం కంపెనీలకు ఎంతో అవసరం. ద్విచక్ర వాహనాల కొనుగోళ్లలో వినియోగదారులు ఏం ఆలోచిస్తున్నారనే కోణంలో చెన్నైలో ఇటీవల ఓ ఆసక్తికర అధ్యయనం నిర్వహించారు. కొనుగోలుదారుల ఆలోచనా విధానాల్ని, వారి పోకడల్ని అంచనా వేసేందుకు కాంచీపురం జిల్లాకు చెందిన అపోలో ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ కామర్స్ విభాగాధిపతి ఇ. విజయలక్ష్మి, తంజావూరు జిల్లా పెరవూరాని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ కామర్స్ విభాగాధిపతి డాక్టర్ ఎన్.పళనివేల్ ఈ అధ్యయనం చేశారు. ఆటోమొబైల్స్ రంగంలో తమిళనాడు దూసుకుపోతుండటం, చెన్నైలో ద్విచక్ర వాహనాల మార్కెట్ పెద్దఎత్తున ఉండటంతో ఈ నగరాన్ని ఎంపిక చేసుకున్నారు. వివిధ షోరూముల్లో బైకులు కొన్న 500 మందిని కలిసి అభిప్రాయాలు తెలుసుకున్నారు.

పురుషులే ఉత్సాహంగా..

కచ్చితంగా రీసేల్ అయ్యే బైకులనే కొంటామని 50.5 శాతం మంది చెప్పారు. వీరిలో ఎక్కువమంది 30 ఏళ్లు దాటిన పురుషులు. 40.3 శాతం మంది ఈ అభిప్రాయాన్ని మధ్యస్తంగా సమర్థించగా.. 9.2 శాతం మంది దీనితో విభేదించారు. రీసేల్‌ను పక్కనపెట్టి తమకు నచ్చిన బైకుల్ని కొనేందుకు ఆసక్తి చూపుతున్న వారిలో ఎక్కువమంది 30 ఏళ్లలోపువారే ఉన్నట్లు తేలింది.

ధరలతో సంఘర్షణ

బైకుల్ని కొనే ముందు వాటి ధరలు ఎక్కువమంది చూస్తున్నారు. తమ ఆదాయవనరులకు లోబడి ఉంటేనే ముందుకెళుతున్నట్లు అధ్యయనంలో తేలింది. ద్విచక్రవాహనాల ధరలు వాటి మార్కెట్‌పై కచ్చితంగా ప్రభావం చూపుతాయని 62.1 శాతం మంది చెప్పారు. లీటరుకు 60 కి.మీ. మైలేజీ ఇచ్చేవాటిని ఎక్కువమంది ఇష్టపడుతున్నట్లు వెల్లడైంది. బైకులను కొన్నాక వాటి పనితీరుపై సంతృప్తిగా ఉన్నట్లు 61.2 శాతం మంది, మధ్యస్తంగా సంతృప్తి చెందినట్లు 36.8 శాతం మంది, ఏమాత్రమూ సంతృప్తిగాలేనట్లు 2 శాతం మంది చెప్పారు.

పరిచయస్థుల దగ్గరికే...

బైకులను కొనేందుకు తమకు పరిచయం ఉన్న డీలర్ల వద్దకే వినియోగదారులు వెళ్తున్నట్లు వెల్లడైంది. తమ జీవనశైలికి, పనితీరుకు తగ్గ వాహనం ఎంపికపై డీలర్లతో వారు చర్చిస్తున్నారు. ధరతో పాటు డిజైన్, మైలేజీ, కంపెనీకి ఉన్న సర్వీసు ఇచ్చే సామర్థ్యం తదితరాలను సరిచూసుకుంటున్నారు.

- పేద, మధ్య, ఉన్నత తరగతుల వారిని దృష్టిలో ఉంచుకుని వేర్వేరు రకాల్లో, వేర్వేరు ధరల్లో బైకులను మార్కెట్లోకి విడుదల చేయాల్సిన అవసరముందని అధ్యయనకర్తలు అభిప్రాయపడ్డారు. తద్వారా తమ ఆదాయ వనరుల్ని బట్టి వాహనాల్ని ఎంపిక చేసుకునే వీలు వినియోగదారులకు ఉంటుందని సూచించారు.

రేషన్ డీలర్ల కమీషన్ పెంచాలి

- రాష్ట్ర రేషన్ డీలర్ల సంఘం డిమాండ్

ఈనాడు, అమరావతి: రేషన్ డీలర్లకు క్వింటాల్‌కు రూ.200 చొప్పున కమీషన్, గౌరవ వేతనంగా రూ.7,500 ఇవ్వాలని రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దివి లీలా మాధవరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం విజయవాడలో రాష్ట్ర రేషన్ డీలర్ల సమావేశం జరిగింది. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో లీలా మాధవరావు మాట్లాడుతూ.. '2018లో చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడే రేషన్ డీలర్ల కమీషన్ పెంచారు. 8 ఏళ్లుగా మళ్లీ పెంచలేదు. 65 ఏళ్లపైబడిన వారికి ఇళ్లవద్దకే రేషన్ అందించడం వల్ల ఖర్చులు పెరుగుతున్నాయి. వాహనాలతో పంపిణీ సమయంలో సహాయకుడికి రూ.5వేలు ఇచ్చేవారు. ఇప్పుడూ అలాగే ఇవ్వాలి. తెదేపా హయాంలో ఇచ్చిన ఉత్తర్వులకు అనుగుణంగా ఈఎస్ఐ సౌకర్యంతోపాటు డీలర్లు చనిపోయినప్పుడు మట్టిఖర్చుల కింద రూ.15 వేలు ఇప్పించాలి. ఈ విషయాలను త్వరలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం' అని వివరించారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఖాసిం, వర్కింగ్ ప్రెసిడెంట్ అడపా వెంకటరమణ, మహిళా విభాగ నేతలు హేమలత, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

మహిత భక్తి





శ్రీసత్యసాయి శత జయంతి ఉత్సవాలు గురువారం నుంచి ప్రారంభం కావడంతో పుట్టపర్తి క్షేత్రం భక్తులతో కిటకిటలాడుతోంది. ఈ ప్రత్యేక సందర్భాన్ని పురస్కరించుకొని బాపట్ల జిల్లా చీరాలకు చెందిన సూక్ష్మ కళాకారిణి అన్నం మహిత 215 పెన్సిళ్ల ములుకుల(ముల్కి)పై సత్యసాయి జీవిత చరిత్రను ఆంగ్లంలో చెక్కారు. ఇందు కోసం ఆమె నాలుగు నెలల పాటు శ్రమించారు. త్వరలోనే పుట్టపర్తికి వెళ్లి దీన్ని అందజేయనున్నట్లు తెలిపారు. ఈమె భగవద్గీతలోని అన్ని శ్లోకాలను 810 పెన్సిళ్లపై చెక్కి గుర్తింపు పొందారు. మహాత్మా గాంధీ, నెల్సన్ మండేలా, అంబేడ్కర్, శ్రీపొట్టి శ్రీరాములు జీవిత చరిత్రలను సైతం లిఖించారు.

– న్యూస్‌టుడే, చీరాల అర్బన్

గ్రహం అనుగ్రహం

20–11–2025 గురువారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; దక్షిణాయనం; శరదృతువు, కార్తిక మాసం, బహుళపక్షం

అమావాస్య: ఉ. 10-35, తదుపరి.. మార్గశీర్ష శుక్లపక్ష పాడ్యమి

విశాఖ: ఉ. 10-24 తదుపరి అనూరాధ

వర్జ్యం: మ. 2-50 నుంచి 4-36 వరకు

అమృత ఘడియలు: రా. 1-29 నుంచి 3-15 వరకు

దుర్ముహూర్తం: ఉ. 9-54 నుంచి 10-38 వరకు తిరిగి మ. 2-21 నుంచి 3-06 వరకు

రాహుకాలం: మ. 1-30 నుంచి 3-00 వరకు

సూర్యోదయం: ఉ.6.11; సూర్యాస్తమయం: సా.5.20

అనూరాధ కార్తె

చలి పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
హైదరాబాద్	14.3	29.4
విజయనగరం	18.0	28.0
అనంతపురం	18.5	32.2
రాజమహేంద్రవరం	18.5	35.5
విశాఖపట్నం	19.2	30.6
కడప	20.0	29.0
విజయవాడ	20.0	31.2
నరసాపురం	20.6	32.0
శ్రీకాకుళం	21.0	30.0
కర్నూలు	21.0	32.1
తిరుపతి	21.1	29.7
గుంటూరు	22.0	30.0
నెల్లూరు	22.2	30.8
ఒంగోలు	22.4	31.9
తాడేపల్లిగూడెం	27.0	32.0

చంద్రబాబు తిరుగులేని శక్తి

- 'ఎస్క్రో విధానం' ఆయన దార్శనికతకు నిదర్శనం
- ప్రముఖ పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్రా కితాబు

ఈనాడు, అమరావతి: పెట్టుబడుల ఆకర్షణకు ముఖ్యమంత్రి చంద్రబాబు తెస్తున్న పాలసీలు, అవిశ్రాంతంగా చేస్తున్న కృషిని మహీంద్రా గ్రూపు సంస్థల ఛైర్మన్ ఆనంద్ మహీంద్రా కొనియాడారు. చంద్రబాబును తిరుగులేని శక్తిగా అభివర్ణించారు. దేశంలో తొలిసారిగా పెట్టుబడిదారులకే నేరుగా రాయితీలు చెల్లించేందుకు రాష్ట్రంలో ఎస్క్రో విధానాన్ని తీసుకురానున్నట్లు విశాఖలో జరిగిన సీఐఐ సదస్సులో చంద్రబాబు ప్రకటించడం ఆయన దార్శనికతకు నిదర్శనమని ఆనంద్ మహీంద్రా ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. "పారిశ్రామికవేత్తల కోసం రాష్ట్ర ప్రభుత్వం రాయితీలు, భూ కేటాయింపులు, త్వరితగతిన ఇతర అనుమతులు ఇస్తోంది. అధికారుల చుట్టూ తిరిగే అవసరం లేకుండా ఎస్క్రో విధానాన్ని తెస్తాం. మేం అనుసరిస్తున్న విధానాలతో గత 18 నెలల్లోనే 20 బిలియన్ అమెరికా డాలర్ల పెట్టుబడులు వచ్చాయి. రాబోయే మూడేళ్లలో ఒక ట్రిలియన్ అమెరికా డాలర్ల పెట్టుబడులు సాధిస్తాం. లక్షల మందికి ఉపాధి కల్పిస్తాం" అని సీఐఐ సదస్సులో చంద్రబాబు చేసిన ప్రసంగం వీడియోను ఎక్స్‌లో పోస్టు చేశారు.

మహీంద్రాకు స్వాగతం పలికేందుకు ఎదురుచూస్తున్నా: చంద్రబాబు

ఆనంద్ మహీంద్రా పోస్టుపై స్పందించిన చంద్రబాబు.. ఆయనకు ధన్యవాదాలు తెలియజేశారు. త్వరలో మీకు ఆంధ్రప్రదేశ్‌లో ఆత్మీయంగా స్వాగతం పలికేందుకు ఎదురుచూస్తున్నానని ఎక్స్‌లో పోస్టు చేశారు.

స్థానిక ఎన్నికలొస్తున్నాయి.. ఇప్పటి నుంచే ప్రజల్లో ఉండండి

సీఎం చంద్రబాబు దిశా నిర్దేశం

ఈనాడు, అమరావతి: మూడు నాలుగు నెలల్లో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇప్పటి నుంచే ప్రజల్లో ఉంటూ ఎన్నికలకు సిద్ధం కావాలని సీఎం చంద్రబాబు సూచించారు. తెదేపా ఎమ్మెల్యేలు, నాయకులు, కార్యకర్తలతో బుధవారం రాత్రి ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్ పథకం కింద సుమారు 47 లక్షల మంది రైతులు లబ్ధి పొందుతున్నారనే విషయాన్ని ఇంటింటికీ వెళ్లి వివరించాలన్నారు. పది రోజుల్లో ఈ కార్యక్రమాన్ని పూర్తిచేయాలని సూచించారు. 'సూపర్ సిక్స్‌తో పాటు ఎన్నికల సమయంలో హామీ ఇవ్వని అనేక కొత్త పథకాలను అమలు చేశాం. కార్యకర్తలు నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం గురించి వివరించాలి' అని తెలిపారు. ఏ కార్యక్రమం చేపట్టినా జనసేన, భాజపాల్ని కలుపుకొని వెళ్లాలని, స్థానిక సంస్థల ఎన్నికలకు మూడు పార్టీలు కలిసి వెళతాయని ఆయన పేర్కొన్నారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన చంద్రబాబు



ఈనాడు, అమరావతి: సీపీఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ, సుజాత దంపతుల కుమార్తె సాయిలీల, అల్లుడు సాయికృష్ణలను సీఎం చంద్రబాబు ఆశీర్వదించారు. ఇటీవల వీరి వివాహం కేరళ రాష్ట్రంలో జరిగింది. బుధవారం శ్రీసత్యసాయి, వైఎస్సార్ కడప జిల్లాల పర్యటన పూర్తైన తర్వాత రాత్రి పది గంటలకు తాడేపల్లిలోని రామకృష్ణ నివాసానికి చేరుకుని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆయన వెంట జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఉన్నారు.

రైతులు కాలర్ ఎగరేసుకునేలా చేస్తా

(మొదటి పేజీ తరువాయి)

ఇందుకు పలు విధానాలు తీసుకొస్తాం. కేంద్రం, రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కార్లు రైతుల కోసం పనిచేస్తున్నాయి. దేశంలో ఎక్కడా లేనివిధంగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్నాం. మరింతగా విస్తరించి పురుగు మందుల అవశేషాలు లేని పంటలను సాగు చేసి ప్రపంచ దేశాలకు ఎగుమతి చేద్దాం. రాయలసీమ ఎడారి అవుతుందన్నారు. రాయలసీమ ప్రజల్లో ఆశలు చిగురింపజేసిన వ్యక్తి ఎన్టీఆర్. ఎన్ని ఇబ్బందులు వచ్చినా నదుల అనుసంధానం పూర్తిచేస్తా. రాష్ట్రంలో అన్ని ప్రాజెక్టులు, చెరువులు నీటితో కళకళలాడుతున్నాయి. ఉచిత విద్యుత్తుకు ఏటా రూ.10వేల కోట్లు వెచ్చిస్తున్నాం. జలవనరులు బాగా ఉన్నందున రూ.5వేల కోట్ల వరకు ఆదా అవుతాయి. వీటిని రైతుల కోసం వెచ్చిస్తాం' అని చంద్రబాబు తెలిపారు.

పురుగున్న మొక్కకే మందు

'తుపాను సమయంలో సాంకేతికతను వినియోగించడంతో ప్రాణ, ఆస్తినష్టాన్ని తగ్గించాం. గ్రీన్ ఎనర్జీ వినియోగం పెంచుతాం. రైతులు రసాయనిక ఎరువులు, క్రిమిసంహారక మందుల వినియోగం తగ్గించాలి. వరికి ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి. వైకాపా ప్రభుత్వం భూసార పరీక్షల్ని సైతం ఆపేసింది. శాటిలైట్ ద్వారా భూసార పరీక్షలు చేసే సాంకేతిక పరిజ్ఞానం తెస్తున్నాం. డ్రోన్‌లో కెమెరా అమర్చి పురుగున్న మొక్కకే క్రిమిసంహారక మందు చల్లేలా సాంకేతికత తీసుకొస్తాం' అని సీఎం తెలిపారు. భూమిలో, వాతావరణంలో తేమ శాతాన్ని లెక్కించి పంటకు నీటి తడులు ఇచ్చేలా సాంకేతికత తీసుకొస్తాం. పంట సాగు నుంచి మార్కెటింగ్ వరకు వ్యవస్థను అనుసంధానం చేస్తాం. ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలని ప్రధాని మోదీని కోరతా. దీనిపై ఇప్పటికే నివేదిక ఇవ్వాల్సి ఉండగా అందలేదు. రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా మారుస్తాం. గుజ్జు పరిశ్రమలు తీసుకొస్తున్నాం. మార్కెటింగ్, లాజిస్టిక్ వ్యవస్థలను బలోపేతం చేసి రైతుల్ని అన్ని రకాలుగా ఆదుకుంటాం' అని చంద్రబాబు హామీ ఇచ్చారు. అనంతరం పంట పొలాలకు చేరుకుని రైతులతో ముఖాముఖీ మాట్లాడారు. తోటల్లోకి వెళ్లి ఉద్యాన పంటల సాగును పరిశీలించారు. ప్రకృతి సేద్య విధానాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. మహిళా కూలీలతో ముచ్చటించారు. అంతకు ముందు రైతులతో కలిసి చెట్టు కింద రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మంత్రి అచ్చెన్నాయుడు, కమలాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి, తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసులరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి, కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



రైతు రవి అందించిన గొర్రెపిల్లతో సీఎం



చామంతి తోటలో రైతులతో మాట్లాడుతున్న చంద్రబాబు

చంద్రబాబు సూచించిన పంచ సూత్రాలు

1) నీటి భద్రత. 2) డిమాండ్ ఆధారిత పంటల సాగు. 3) అగ్రిటెక్. 4) ఫుడ్ ప్రాసెసింగ్. 5) ప్రపంచ వేదికగా మార్కెటింగ్.

రాష్ట్రంలో కొత్తగా 500 ఈవీ ఛార్జింగ్ కేంద్రాలు

- ఏర్పాటుకు ముందుకొచ్చిన 'సర్వోటెక్'

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో విద్యుత్ వాహనాల వినియోగాన్ని పెంచాలన్న లక్ష్యంతో జాతీయ రహదారుల వెంట ఈవీ ఛార్జింగ్ నెట్‌వర్క్‌ను అందుబాటులోకి తెచ్చేందుకు నెడ్‌క్యాప్ ప్రణాళికలు రూపొందిస్తోంది. దీని కోసం 30 కి.మీ.లకు ఒక ఈవీ ఛార్జింగ్ స్టేషన్ ఉండేలా చూడాలని భావిస్తోంది. దీనికి అనుగుణంగా పెట్రోలు బంకులు, స్టార్ హోటళ్లలో ఛార్జింగ్ కేంద్రాల ఏర్పాటుకు దిల్లీకి చెందిన 'సర్వోటెక్' సంస్థ ముందుకొచ్చింది. ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు, బస్సులకు అవసరమైన ఛార్జింగ్ కేంద్రాల ఏర్పాటుకు నెడ్‌క్యాప్‌తో సంప్రదింపులు జరుపుతోంది. అందుబాటులో ఉన్న స్థలం, అక్కడి అవసరాలకు అనుగుణంగా 30 కిలోవాట్ల నుంచి 360 కిలోవాట్ల సామర్థ్యం ఉన్న ఛార్జింగ్ కేంద్రాలను ఈ సంస్థ ఏర్పాటు చేయనుంది. ఆటోమోటివ్ రీసెర్చ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(ఏఆర్ఏఐ), ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ ఆటోమోటివ్ టెక్నాలజీ(ఐసీఏటీ) ధ్రువీకరణతో వీటిని ఏర్పాటు చేసేందుకు నిర్ణయించింది.

✦ రాష్ట్రంలోని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, హెచ్‌పీ, బీపీసీఎల్ పెట్రోలు బంకుల్లో ఛార్జింగ్ కేంద్రాల ఏర్పాటుకు ఈ సంస్థ ప్రతిపాదించింది. కనీసం 500 ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయనుందని అధికారులు తెలిపారు.

✦ రాష్ట్రంలో ప్రస్తుతం 1.8 లక్షల విద్యుత్ వాహనాలు, 601 ఛార్జింగ్ స్టేషన్లు అందుబాటులో ఉన్నాయి. సగటున 205 కి.మీ.లకు ఒక ఛార్జింగ్ స్టేషన్ ఉన్నట్లు చెబుతున్నారు. దీంతో దూర ప్రాంతాలకు వెళ్లే ఈవీ ట్రక్‌లు, బస్సులు, కార్లకు ఛార్జింగ్ సదుపాయాలు పూర్తి స్థాయిలో అందుబాటులో లేవు. ఈ దృష్ట్యా జాతీయ రహదారి వెంట ఉన్న పెట్రోలు బంకులు, స్టార్ హోటళ్లలో ఛార్జింగ్ కేంద్రాల ఏర్పాటును ప్రోత్సహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందుకు నిబంధనలను సడలించింది. మొదటగా ఏర్పాటు చేసే 5 వేల ఛార్జింగ్ కేంద్రాలకు మూలధన పెట్టుబడిలో 25 శాతం (గరిష్ఠంగా రూ.3 లక్షలు) ప్రోత్సాహకంగా అందించాలని నిర్ణయించింది.

రాజమహేంద్రవరానికి రింగ్ రోడ్డు

- మంత్రి నారాయణ



సమీక్షలో పాల్గొన్న మంత్రి నారాయణ, ఎమ్మెల్యేలు బుచ్చయ్యచౌదరి, శ్రీనివాస్, బలరామకృష్ణ, తదితరులు

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం, దాని చుట్టుపక్కల గ్రామాలను కలుపుతూ త్వరలో రింగ్‌రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేస్తున్నట్లు రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బుధవారం అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మంత్రి మాట్లాడారు. మధురపూడి, రాజానగరం, దివాన్‌చెరువు, సంపత్‌నగర్, కడియం మీదుగా రింగ్‌రోడ్డు నిర్మాణానికి సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. రానున్న పుష్కరాలను దృష్టిలో పెట్టుకొని నగర శివారు ప్రాంతాల మీదుగా రోడ్లు, కాలువల విస్తరణపై దృష్టి సారించనున్నట్లు తెలిపారు. బొమ్మూరు నుంచి సరస్వతి ఘాట్ వరకు 80 అడుగుల రోడ్డును రూ.వంద కోట్లతో అభివృద్ధి చేస్తున్నామన్నారు. పుష్కర ఘాట్లనూ విస్తరించనున్నామన్నారు. రాజమహేంద్రవరంలో రూ.100 కోట్లతో ముంపు సమస్యను పరిష్కరించనున్నట్లు తెలిపారు. మంత్రి వెంట రాజమహేంద్రవరం నగర, గ్రామీణ, రాజానగరం ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి శ్రీనివాస్, గోరంట్ల బుచ్చయ్యచౌదరి, బత్తుల బలరామకృష్ణ, రుడా ఛైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, జేసీ మేఘా స్వరూప్, కమిషనర్ రాహుల్ మీనా పాల్గొన్నారు.

భయమనే దెయ్యం వదలాలంటే..



మీకు వేదికపై మాట్లాడాలంటే భయమా? అయితే సందర్భం దొరికినప్పుడల్లా మైక్ తీసుకొని తోచింది మాట్లాడుతూనే ఉండండి. మీకు ఇంగ్లిష్ మాట్లాడటం కష్టంగా అనిపిస్తోందా? తప్పులు దొర్లుతున్నా సరే, ప్రతి ఒక్కరితో ఆ భాషలోనే సంభాషించండి. ఎలాంటి భయాలకైనా ఒకటే విరుగుడు. అదేంటంటే.. పదే పదే ఆ పనులు చేయడం. ఇలా చేస్తే భయమనే దెయ్యం మిమ్మల్ని వదిలి పారిపోతుంది.

– రాబ్ ఫ్రహియన్, డిజిటల్ మార్కెటింగ్ ఎక్స్‌పర్ట్

స్థూలకాయం.. ఇదిగో ఇలా దూరం!



ఈనాడు ఉచిత వెబినార్‌తో

వేళాపాళా లేని నిద్రాహారాలు.. కాలు కదపని కొలువులు.. నిత్యం ఒత్తిడితో సతమతమయ్యే జీవనశైలి.. వెరసి ఈతరం స్థూలకాయం బారిన పడుతోంది. ఆడామగా అనే తేడా లేకుండా ప్రపంచ వ్యాప్తంగా ఇదో ఎడతెగని సమస్యలా మారింది. మన దేశంలో ప్రతి నలుగురిలో ఒకరు అధిక బరువుతో ఇబ్బంది పడుతున్నారు అంటోంది జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే. తెలుగు రాష్ట్రాల్లోనూ స్థూలకాయ బాధితుల సంఖ్య ఆందోళనకర స్థాయిలో ఉందనే విషయం ప్రస్ఫుటం. చిన్నారులనూ వదలని ఈ ఊబకాయం... ఒక్కసారి ఒంటిని చుట్టేస్తే కుదురుగా ఉండదుగా! మధుమేహం, గుండె జబ్బులు, కిడ్నీ వ్యాధులు, బీపీ, ఫ్యాటీ లివర్, క్యాన్సర్‌లాంటి ప్రమాదకరమైన రుగ్మతలనూ మోసుకొస్తుంది. మరి ఇంతటి భయంకరమైన ఊబకాయం మన దరికి చేరకుండా ఉండాలంటే ఏం చేయాలి? ఎలాంటి ఆహారం తీసుకోవాలి? ఏమేం వ్యాయామాలు చేయాలి? జీవనశైలిలో చేయాల్సిన మార్పులేంటి? అందుబాటులో ఉన్న అధునాతన వైద్య చికిత్సలేంటి? ఈ వివరాలన్నింటిపై 'ఈనాడు' ప్రత్యేక ఉచిత వెబినార్ నిర్వహిస్తోంది. ప్రముఖ వైద్యనిపుణులు **డా. రాకేశ్ కలపాల, డా. పి.వి.రావులు** అవగాహన కల్పిస్తారు. ఆరోగ్యాభిలాషులందరూ ఇందులో పాల్గొనవచ్చు. విలువైన సమాచారం తెలుసుకొని ఊబకాయం దరిచేరకుండా చూసుకోవచ్చు.

జూమ్ మీటింగ్, యూట్యూబ్ లైవ్‌లో వెబినార్ నిర్వహిస్తారు

వెబినార్ తేదీ: నవంబరు 23 ఆదివారం

సమయం: ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు

క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

Webinar ID: 985 1335 8216
Passcode: 407923

యూట్యూబ్ లైవ్ కోసం స్కాన్ చేయండి

Join from PC, Mac, iPad, or Android:
Zoom - https://hov.to/db9a07ef
Yt Live - https://hov.to/f8b4719c

ఉద్యాన పంటల నష్టానికి రూ.4.82 కోట్ల పెట్టుబడి రాయితీ

ఈనాడు, అమరావతి: భారీవర్షాలు, వరదల కారణంగా గతేడాది మే, అక్టోబరులో దెబ్బతిన్న ఉద్యాన పంటలకు ప్రభుత్వం రూ.4.82 కోట్ల పెట్టుబడి రాయితీ విడుదల చేసింది. రాష్ట్ర విపత్తు నిబంధనల ప్రకారం.. 2024 మేలో నష్టపోయిన 2,856 మంది రైతులకు రూ.4.32 కోట్లు, అక్టోబరులో నష్టపోయిన 501 మంది రైతులకు రూ.50.16 లక్షలు మంజూరుచేసింది.

రాష్ట్రానికి తుపాను ముప్పు

- 22న బంగాళాఖాతంలో అల్పపీడనం
- చలితో వణికిపోతున్న ఏజెన్సీ

ఈనాడు, విశాఖపట్నం: రాష్ట్రానికి తుపాను ముప్పు పొంచి ఉంది. ఆగ్నేయ బంగాళాఖాతంలో శనివారం అల్పపీడనం ఏర్పడే అవకాశముందని వాతావరణ శాఖ తెలిపింది. ఆ తర్వాత 48 గంటల్లో ఇది పశ్చిమ-వాయవ్య దిశగా కదులుతూ వాయుగుండంగా బలపడే అవకాశముందని పేర్కొంది. నైరుతి బంగాళాఖాతంలో తుపానుగా బలపడుతుందని నిపుణుల అంచనా. ప్రస్తుతం నైరుతి బంగాళాఖాతంలో అల్పపీడనం కొనసాగుతోంది. దీని ప్రభావంతో గురువారం ప్రకాశం, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో, శుక్రవారం కృష్ణా, బాపట్ల, ప్రకాశం, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో శుక్ర, శని, ఆదివారాల్లో ఓ మోస్తరు నుంచి తేలికపాటి వర్షాలు, మంగళవారం కొన్ని చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం పేర్కొంది.

జి.మాడుగులలో 4.6 డిగ్రీల ఉష్ణోగ్రత

రాష్ట్రంలో చలి తీవ్రత కొనసాగుతోంది. ఏజెన్సీ ప్రాంత ప్రజలు గజగజలాడిపోతున్నారు. మంగళవారం రాత్రి అత్యల్పంగా అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగులలో 4.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఈ సీజన్‌లో ఇదే అత్యల్పం కావడం గమనార్హం. అదే జిల్లాలోని ముంచంగిపుట్టులో 5.8, చింతపల్లిలో 6.8, డుంబ్రిగుడలో 7.8, పాడేరు, పెదబయలులో 8.1 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. పార్వతీపురం మన్యం, అనకాపల్లి, విజయనగరం, శ్రీకాకుళం, ఎన్టీఆర్ జిల్లాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు 15 డిగ్రీల లోపే నమోదయ్యాయి.

✦ తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 5 డిగ్రీలు తక్కువగా నమోదవుతున్నాయి. గురువారం తెలంగాణలో చలిగాలులు వీయొచ్చని ఐఎండీ తెలిపింది.

నీతీశ్‌కుమార్ ప్రమాణస్వీకార వేడుకకు చంద్రబాబు, లోకేశ్

ఈనాడు, అమరావతి: బిహార్ సీఎంగా నీతీశ్‌కుమార్ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొనేందుకు సీఎం చంద్రబాబు, విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ పట్నా వెళ్లనున్నారు. గురువారం ఉదయం 8 గంటలకు విజయవాడ నుంచి పట్నాకు బయలుదేరుతారు. ఉదయం 10:20 గంటలకు పట్నాలోని గాంధీ మైదాన్‌లో జరగనున్న కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం మూడు గంటలకు అమరావతి చేరుకుంటారు.

24 వరకు రోజుకు 75 వేల మందికే అయ్యప్పస్వామి దర్శనం

ఈనాడు, అమరావతి: శబరిమల అయ్యప్పస్వామి దర్శనానికి ఈ నెల 24వ తేదీ వరకు రోజుకు 75వేల మంది చొప్పున భక్తుల్నే అనుమతించనున్నారు. భక్తులు భారీగా తరలివస్తుండడంతో కేరళ హైకోర్టు ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు పథనంతిట్ట ఎస్పీ ఆనంద్ తెలిపారు. ఈ మేరకు ఏపీ డీజీపీ కార్యాలయం బుధవారం ఓ ప్రకటన విడుదల చేసింది. "రోజుకు వర్చువల్ క్యూలైన్ ద్వారా 70వేల మందిని, స్పాట్ బుకింగ్ ద్వారా 5వేల మందినే అయ్యప్ప దర్శనానికి అనుమతిస్తాం. బుక్ చేసుకున్న తేదీల్లోనే భక్తులు దర్శనానికి రావాలి" అని ఆనంద్ విజ్ఞప్తి చేశారు.

ఈనాడు

మావోయిస్టులకు శరాఘాతం

నాలుగైదు అంచెల్లోని రక్షణ వలయాల నడుమ కదిలే కోటగా కీకారణ్యాల్లో సంచరిస్తూ... ఎంచుకున్న లక్ష్యాలపై గురితప్పని రీతిలో మెరుపు దాడులకు దిగుతూ... కొన్నేళ్లుగా భద్రతా బలగాలకు కంటిపై కునుకు లేకుండా చేసిన కరడుగట్టిన మావోయిస్టు నేత- మడ్వి హిడ్మా. గెరిల్లా యుద్ధతంత్రంలో, ఆధునిక ఆయుధాల వాడకంలో ఆరితేరిన ఆయన మొన్న మారేడుమిల్లి అడవుల్లో హతంకావడం- అస్తిత్వ పోరాటంలో చెల్లాచెదురవుతున్న వామపక్ష తీవ్రవాద శ్రేణులకు శరాఘాతం వంటిదే! హిడ్మా బృందం ఎన్‌కౌంటర్‌ను వెన్నంటి నిన్న ఏపీలోని అదే అటవీ ప్రాంతంలో మరో ఏడుగురు ఎదురుకాల్పుల్లో మరణించడం, వారిలో పేలుడు పదార్థాల వినియోగంలో నిపుణుడైన టెక్ శంకర్ ఉండటం- మావోయిస్టులకు మింగుడుపడని పరిణామమే! ఇదే సమయంలో విజయవాడ, ఏలూరు, కాకినాడ జిల్లా సామర్లకోట, రావులపాలెంలలో యాభై మందికి పైగా తీవ్రవాదులు పట్టుబడటం జనసామాన్యంలో తీవ్ర కలకలం సృష్టిస్తోంది. వరస ఎన్‌కౌంటర్లు, అరెస్టులు, లొంగుబాట్లతో దేశీయంగా మావోయిస్టు ఉద్యమం ఇప్పుడు తీవ్రస్థాయిలో నాయకత్వ సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది!

చిన్నతనంలోనే వామపక్ష తీవ్రవాదం పట్ల ఆకర్షితుడై ఆయుధం పట్టిన హిడ్మా- భీకర దాడులకు సారథ్యం వహిస్తూ, మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడి స్థాయికి వేగంగా ఎదిగారు. 340 మందికిపైగా సాయుధ దళాల సిబ్బంది, సాధారణ పౌరులు ప్రాణాలు కోల్పోవడానికి కారణమైన మారణకాండల్లో ఆయనకు ప్రమేయమున్నట్లు అధికారిక దస్త్రాలు వెల్లడిస్తున్నాయి. దండకారణ్యం ఆనుపానులన్నీ బాగా తెలిసిన హిడ్మా గతంలో కనీసం పన్నెండు ఎన్‌కౌంటర్లు, యాభై ఆపరేషన్ల నుంచి తప్పించుకున్నట్లు పోలీసు వర్గాలు పేర్కొంటున్నాయి. అంతటి చురుకైన గెరిల్లా నాయకుడి మరణం- కేంద్రం, వివిధ రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడివేటతో మావోయిస్టు ఉద్యమమెంతగా కకావికలమవుతోందో కళ్లకుకడుతోంది. ఈ క్రమంలోనే గత రెండు సంవత్సరాల్లో లొంగిపోయిన వారికి దాదాపు రెండున్నర రెట్ల మంది మావోయిస్టులు ఈ ఏడాదిలో అస్త్రసన్యాసం చేశారు. అలాగని రక్తసిక్తమైన మావోయిస్టు ఉద్యమ చరిత్ర చివరి అధ్యాయానికి చేరిందని నిఘాపరంగా పోలీసులు ఉదాసీనంగా ఉండటానికి వీల్లేదు. దేశీయంగా అణగిపోయిందనుకున్న ఉగ్రవాద భూతం ఇటీవల అనూహ్య రీతిలో జడలువిప్పుకొని ఎర్రకోట దగ్గర విధ్వంసం సృష్టించింది. అలాగే, వామపక్ష తీవ్రవాద వ్యాప్తికి కారణమైన సామాజిక ఆర్థిక సమస్యల పరిష్కారంపై ప్రభుత్వాలు శ్రద్ధ వహించకపోతే ఆ ముప్పు మరో రూపంలో ముంచుకొస్తుంది!

వామపక్ష తీవ్రవాద జ్వాలలకు మూలాలేంటో శోధించడానికి గతంలో ప్లానింగ్ కమిషన్ ఓ నిపుణుల సంఘాన్ని ఏర్పరచింది. ఆదివాసీ ప్రాంతాల్లో పాలనా వైఫల్యాలు, కొరవడిన కనీస మౌలిక సదుపాయాలు, ఆర్థిక దోపిడీలే తీవ్రవాదానికి ఆజ్యంపోశాయని డాక్టర్ బందోపాధ్యాయ్ నేతృత్వంలోని ఆ కమిటీ నివేదిక తేల్చిచెప్పింది. గనుల తవ్వకం, ఇతరత్రా అభివృద్ధి ప్రాజెక్టుల్లో నిర్వాసితులైన లెక్కకుమిక్కిలి నిర్భాగ్యులకు పునరావాసం అందకపోవడం, భూమిపై హక్కులు కొరవడటమూ సామాజిక అశాంతికి ప్రోదిచేస్తున్నాయి. అత్యాచారాల వంటి హేయ నేరాలకు పాల్పడుతున్నవారికి వెంటనే పడని శిక్షలు, ఒక పట్టాన తెమలని కేసుల మూలంగా బాధిత జనసమూహాల్లో కొన్ని 'తక్షణ న్యాయం'కోసం రాజ్యాంగేతర శక్తులవైపు చూస్తున్నాయి. సమ్మిళిత ప్రగతి విధానాలు, న్యాయ, పోలీసు సంస్కరణల అమలుకు పాలకులు కట్టుబడితేనే దేశీయంగా శాంతిభద్రతలు సుస్థిరమవుతాయి!




నాయకులు మేనేజర్లవే కాదు, కింది వారి అభిప్రాయాల్నీ, ముఖ్యంగా శ్రమించే కార్మికుల గొంతులనూ వినాలి. ఎంత ఓపిగ్గా వింటే అంతగా వారిలో స్ఫూర్తి నింపగలరు. చాలామంది వ్యాపారవేత్తలు పోటీ సంస్థలను పట్టించుకున్నంతగా సొంత సంస్థల మీద దృష్టిపెట్టరు.

– ఆదిత్య విక్రమ్ బిర్లా

క్షమ... ఓ దివ్యగుణం!

ఆధ్యాత్మిక సాధనలో క్షమాగుణానికి అత్యంత ప్రాధాన్యం ఉంది. హృదయం తేలికపడి ఆనందాన్ని అనుభవించాలంటే అది క్షమ అనే దివ్యగుణ సాధనతోనే సాధ్యం. పెద్ద పెద్ద తప్పులను సైతం క్షమించగలిగే సహృదయులు ఉంటారు. మూర్ఖులు క్షమను బలహీనతగా, పిరికితనంగా భావిస్తారు. అది తప్పు. క్షమ... దైవీగుణం.

కొందరు అహంకారంతో ఎదుటివారిని అవమానపరుస్తారు. అలాంటి వారిని క్షమించడం అంత సులభమైన విషయం కాదు. కార్చిచ్చు అడవిని కాల్చినట్లుగా ఆ బాధ మనసును దహించివేస్తుంది. అటువంటి సమయంలో మొదట తనను తాను కుదుటపరచుకుని సడలిపోని ధైర్యంతో నిలబడగలగాలి. ఆత్మాభిమానాన్ని అణచుకుని క్షమించడం సాధనపరంగా కొంత ఎత్తుకు ఎదిగిన వారికే సాధ్యమవుతుంది. అందుకే క్షమించడానికి చాలా ధైర్యం కావాలంటారు. క్షమించగలిగే హృదయం దైవానికి ప్రీతిపాత్రమవుతుంది. దైవం అక్కడే కొలువై ఉంటాడంటారు పండితులు. అలాంటి సహృదయుణ్ని లోకమూ ప్రేమిస్తుంది. క్షమించగలిగే గొప్ప మనసును కైవసం చేసుకోవడమే సాధనలోని పరమార్థం. క్షమా గుణంవల్ల ఎదుటి వ్యక్తిపై ఉన్న ద్వేషం, అసూయ వంటి చెడుభావాలు కరిగిపోతాయి. వాటి స్థానంలో ప్రేమ అనే దివ్య బీజం అంకురిస్తుంది. అది క్రమంగా ఎదిగి చల్లని నీడనిచ్చే కల్పవృక్షంలా భాసిల్లి శాంతి అనే ఆనందానుభూతిని హృదయంలో పాదుకొల్పుతుంది. మనస్తాపానికి కారణమైన వారిపై కోపం, ద్వేషం వంటివి మనిషి హృదయంలో సహజంగా జనిస్తాయి. దయకు ఆలవాలమైన మానవ హృదయం శాంతికి నోచుకోవాలంటే ఆ దుర్గుణాలను మొగ్గలోనే తుంచేయాలి. క్షమించగలిగే దివ్య గుణాన్ని సాధించినప్పుడే ఆ కార్యం సాఫల్యమవుతుంది.



అంతర్యామి


క్షమించగల గొప్ప హృదయం కలవాడు తనకు ప్రీతిపాత్రుడని చెబుతాడు శ్రీకృష్ణ భగవానుడు. ధ్యానం, జ్ఞానం, భక్తి అనే సద్గుణాలు క్షమాగుణం వల్ల ప్రవర్ధమానమవుతాయి. సులభమైన విషయం కాకపోయినా క్షమాగుణాన్ని సాధించినప్పుడే ఆధ్యాత్మిక సాధన వేగవంతమవుతుంది. పయనం భగవంతుడి వైపు సాగుతుంది. ఎదుటివారి తప్పులను క్షమించలేనంత కాలం ఆ భారాన్ని హృదయం మోస్తూనే ఉంటుంది. దాన్ని తగ్గించుకునే మార్గం క్షమను ఆశ్రయించడమే! తాను చేసే తప్పులకు మనిషి తనను తాను క్షమించుకోవడం సైతం ప్రాధాన్యం సంతరించుకున్న అంశం. ఎదుటివారి తప్పులను క్షమించినప్పుడు సాధకుడి హృదయం తేలికవుతుంది. శాంతి లభిస్తుంది. ఎన్నో తప్పులు చేస్తాం. వాటిని భగవంతుడు క్షమించాలని కోరుకుంటాం. అలాగే మనం కూడా ఎదుటివారి తప్పులను క్షమించగలగాలి. అలాంటి హృదయం మల్లెపువ్వంత స్వచ్ఛంగా వెలుగొందుతుంది. సౌహార్ద్ర పరిమళాలు వెదజల్లే సాధకుడి హృదయం నిజంగా బలసంపన్నమై క్షమకు నెలవవుతుంది.

– గోపాలుని రఘుపతిరావు

డాలర్ చాప కిందకి నీరు!

డాలర్... దశాబ్దాలుగా అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థను అనుసంధానిస్తున్న అమెరికా కరెన్సీ. ఇదే అగ్రరాజ్యానికి ఆయుధంగా మారుతోంది. తనకు గిట్టని దేశాలపై ఎడాపెడా ఆంక్షలు విధిస్తోంది. డాలర్లు చిక్కకుండా చేస్తూ పైచేయి సాధిస్తోంది. బాధిత దేశాలు డాలర్‌కు ప్రత్యామ్నాయాలను వెతుక్కోవాల్సిన పరిస్థితిని అమెరికాయే కల్పిస్తోంది. చేసుకున్న వారికి చేసుకున్నంత అంటే ఇదేనేమో!

డాలర్‌కు గట్టి ప్రత్యామ్నాయాలు అవతరించినప్పుడు అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ నడకే మారిపోతుంది. ఇతర దేశాలు తమ వాణిజ్యంలో, విదేశీ మారక ద్రవ్య నిల్వల్లో డాలర్ వాటాను తగ్గించినా, తొలగించినా దాన్ని డీ-డాలరైజేషన్ అంటారు. రష్యా, ఇరాన్ వంటి దేశాలపై అమెరికా ఆర్థిక ఆంక్షలు విధించడమంటే అవి వాణిజ్య లావాదేవీలు నడపడానికి డాలర్లు చిక్కకుండా చేయడమే. దీంతో అవి అనివార్యంగా డాలర్‌కు బదులు ప్రత్యామ్నాయాలు వెదుకుతాయి. సొంత కరెన్సీల్లో వ్యాపారం చేస్తాయి. అమెరికా ఆంక్షలకు గురికాని ఇతర దేశాలు, ముఖ్యంగా వర్ధమాన దేశాలు కూడా జరుగుతున్నది చూసి తమ జాగ్రత్తలో తాముండాలనీ, ప్రత్యామ్నాయ మార్గంలో వ్యాపారానికి దిగుతాయి. ఇప్పటికే ఆ దిశగా ప్రయత్నాలు మొదలుపెట్టాయి. దీంతో ప్రపంచంలో డీ-డాలరైజేషన్ ప్రక్రియ క్రమంగా కార్యరూపం దాలుస్తోంది. వివిధ దేశాలు తమ ఎగుమతులు, దిగుమతులకు చెల్లింపులు జరపడానికి డాలర్లతోపాటు సొంత కరెన్సీలను వాడే ధోరణి బలపడుతోంది.



సొంత బాటలో...

ఇంతకాలం ప్రపంచ దేశాలు ఎగుమతి దిగుమతులకు డాలర్లలో చెల్లింపులు జరపడానికి అమెరికా, ఐరోపా, జపాన్ బ్యాంకుల ఆధిపత్యంలోని స్విఫ్ట్ వ్యవస్థను ఆశ్రయిస్తున్నాయి. రష్యా, ఇరాన్‌లపై అమెరికా ఆంక్షలు విధించడంతో ఆ దేశాల చమురు ఎగుమతులకు డాలర్లలో చెల్లింపులు జరగకుండా స్విఫ్ట్ దిగ్బంధించగలిగింది. అందుకే చైనా, రష్యాలు స్విఫ్ట్‌కు ప్రత్యామ్నాయాలను ఏర్పాటు చేసుకున్నాయి. చైనా తన వాణిజ్య భాగస్వాములకు ఎగుమతులు చేసినప్పుడు వాటికి చెల్లింపులను సదరు దేశాల కరెన్సీల్లో స్వీకరిస్తోంది. ఆయా దేశాల దిగుమతులకు యువాన్లలో చెల్లింపులు జరుపుతోంది. ఇలా సొంత కరెన్సీలతో వాణిజ్యం జరుపుకోవడానికి బ్రిక్స్ కూటమి గట్టిగా కృషి చేస్తోంది. మొదట్లో తటపటాయించిన భారత్ కూడా ఇప్పుడు సొంత కరెన్సీలో చెల్లింపులకు సరేనంటోంది.

కొత్త మార్గాల్లో వ్యాపారం

ఇటీవలి కాలంలో అమెరికా తనకు గిట్టని దేశాలపై డాలర్‌ను దుడ్డుకర్రగా మార్చి బాదుతోంది. రష్యా, ఇరాన్, వెనెజువెలా దేశాలపై ఆర్థిక ఆంక్షలు విధించింది. డాలర్లు చిక్కకుండా చేసి, వాటి వ్యాపారాన్ని దెబ్బతీసింది. ఆ దేశాలను ప్రపంచ వాణిజ్యం నుంచి బయటికి పంపడానికి ఇదంతా చేసింది. రేపు తమకూ ఇలాంటి పరిస్థితే తలెత్తితే ఎలాగని ఇతర దేశాల్లో ఆందోళనతో కూడిన అనుమానం మొదలైంది. ఫలితంగా, డాలర్ మీద ఆధారపడటం తగ్గించి కొత్త మార్గాల్లో వాణిజ్యం చేసే ప్రయత్నం ఊపందుకొంటోంది. డీ-డాలరైజేషన్ ప్రక్రియకు చైనా సారథ్యం వహిస్తోంది. వ్యాపారానికి ఇతర దేశాల కరెన్సీలు, యువాన్లలో చెల్లింపులు, జమలను స్వీకరిస్తోంది. తన ఎగుమతులకు చెల్లింపులను డాలర్లలో మాత్రమే కాకుండా సొంత కరెన్సీలోనూ స్వీకరిస్తోంది. రష్యా కూడా చైనా, భారత్, కొన్ని ఆఫ్రికన్ దేశాల కరెన్సీలు, రూబుళ్లలో వ్యాపారం చేస్తోంది. భారత్ 30 దేశాలతో రూపాయితో జమలు, చెల్లింపులకు ఖాతాలు తెరచింది. అయితే రష్యాకు భారత్ చేసే ఎగుమతులకన్నా దిగుమతులే ఎక్కువ కావడంతో మన రూపాయలు రష్యన్ బ్యాంకుల్లో పేరుకుపోతున్నాయి. రష్యా భారత్ నుంచి ఎక్కువ దిగుమతులు చేసుకుంటే అవి ఖర్చయ్యేవి. కాకపోతే, ఆ రూపాయలతో భారత్‌లో పెట్టుబడులు పెట్టే అవకాశం ఉండటంతో, ఆ దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయి.

క్రమంగా వీడ్కోలు

భారత్ ఇతర దేశాలతో రూపాయలు, స్థానిక కరెన్సీల్లో వ్యాపారం మొదలుపెట్టింది. సింగపూర్, యుఏఈ, నేపాల్, భూటాన్‌లలో యూపీఐ చెల్లింపులు ఊపందుకుంటున్నాయి. ఒక్కసారిగా డాలర్లకు దూరం జరిగితే చమురు, ఇతర దిగుమతుల ధరలు పెరిగిపోయి సామాన్యులు ద్రవ్యోల్బణం బారిన పడతారు. అందుకే డాలర్ ఆధిపత్యాన్ని క్రమక్రమంగా వదిలించుకోవాలని ప్రపంచ దేశాలు చూస్తున్నాయి.

ఇంకొంత కాలం...

ప్రస్తుతానికి అమెరికన్ డాలర్ రిజర్వు కరెన్సీ హోదాను నిలబెట్టుకుంటున్నా, ఆ దేశ రుణభారం బాగా పెరిగిపోతోంది. దానికి తోడు రాజకీయ అనిశ్చితి, చపలచిత్త విధానాలు, నిర్ణయాలు డాలర్‌పై నమ్మకాన్ని దెబ్బతీస్తున్నాయి. ప్రపంచ దేశాల కేంద్ర బ్యాంకులు తమ విదేశీమారక ద్రవ్య నిల్వల్లో డాలర్ల వాటాను తగ్గిస్తున్నాయి. బంగారం వాటా పెరుగుతోంది. కేంద్ర బ్యాంకులు కాంచనం కొనుగోళ్లను పెంచేయడమే ప్రస్తుత బంగారం ధరల విజృంభణకు ఒక ముఖ్య కారణం. అయినా ప్రపంచంలో ఇప్పటికీ 47శాతం లావాదేవీలకు డాలర్లనే ఉపయోగిస్తున్నారు. అందుకని, మరికొంత కాలం డాలర్ ఆధిపత్యం కొనసాగవచ్చు. ఆ తరవాత కూడా డాలర్ స్థానాన్ని ఏ ఒక్క దేశ కరెన్సీ ఆక్రమించకపోవచ్చు. స్థానిక కరెన్సీలు, డిజిటల్ కరెన్సీలు, బంగారం వాడకం పెరగవచ్చు. బహుళ ధ్రువ ప్రపంచం దిశగా సాగవచ్చు.

ఇంత బలమెలా?

రెండో ప్రపంచ యుద్ధంతో ఐరోపా ఆర్థికంగా కకావికలమైంది. అప్పటిదాకా అంతర్జాతీయ వాణిజ్యంలో ఆధిపత్యం చలాయించిన బ్రిటన్ తదితర దేశాలు ఆర్థికంగా చితికిపోయాయి. బ్రిటిష్ కరెన్సీ పౌండ్‌తో పాటు ఐరోపాలోని ఇతర దేశాల కరెన్సీల విలువ కూడా క్షీణించింది. రెండు ప్రపంచ యుద్ధాల్లోనూ చెక్కుచెదరకుండా నిలిచింది అమెరికా ఒక్కటే. ఆ దేశం దగ్గర అప్పటికీ ఇప్పటికీ ప్రపంచంలోనే అత్యధిక బంగారం నిల్వలు ఉన్నాయి. అందుకే 1944లో బ్రెట్టన్‌వుడ్స్‌లో అన్ని దేశాలూ అమెరికన్ డాలర్‌ను రిజర్వు కరెన్సీగా ఉపయోగించుకోవాలని ఒప్పందం కుదుర్చుకున్నాయి. అప్పట్నుంచి చమురు, ఆహారం, బంగారం, ఖనిజాలు, వ్యాపార సరకుల క్రయవిక్రయాలకు డాలర్లలో చెల్లింపులు జరిపే సంప్రదాయం నెలకొంది. దీంతో ప్రభుత్వాలు, కేంద్ర బ్యాంకులు డాలర్ నిల్వలను భారీగా పోగేస్తున్నాయి.



సీఆర్ సుకుమార్
సీనియర్ పాత్రికేయులు, న్యాయవాది

మార్కెట్‌కి వెళ్తే చాన్నాళ్ల తరవాత మిత్రుడు మోహన్ కలిశాడు. పక్కనే స్కూల్‌కెళ్లే వాళ్లబ్బాయి ఉన్నాడు. కుశల ప్రశ్నలడిగాక నా దృష్టి బాబు చేతిలోని సైన్స్ మోడల్‌పై పడింది. ఏమిటదీ అని అడిగితే సెలవుల్లో స్కూల్‌వాళ్లు ఇచ్చిన ప్రాజెక్ట్ అని చెప్పాడు. మర్నాడే స్కూళ్లు తెరుస్తారు కాబట్టి ఇక్కడే షాపులో కొన్నానన్నాడు. చేయకుండా అలా కొనడమేంటి అని ఆశ్చర్యపోయాను. 'నువ్వు ఏ కాలంలో ఉన్నావు, ఇవన్నీ పిల్లలు చేయలేరు. మేం చేయడానికి టైమ్ ఉండదు. ఇప్పుడు కాలేజీ పిల్లలు కూడా ప్రయోగాలు చేయట్లేదు, రికార్డులేవీ సొంతంగా రాయట్లేదు. అన్నీ బయట డబ్బులిచ్చి రాయిస్తారు' అన్నాడు మోహన్ నవ్వుతూ.

కొనిపెట్టి చెడగొట్టకండీ!



అతనొక్కడే కాదు, ఇంకొందరు తల్లిదండ్రులు కూడా ఇలాంటి పనులు చేయడం చూశాను. చూసినప్పుడల్లా చాలా బాధేస్తుంది. మార్కెట్లో కొని తామే చేసినట్లు తీసుకెళ్లి పాఠశాలల్లో సమర్పించడం... ఇదేం చదువు? ఎందుకిలా చేస్తున్నారు? పాఠశాలలకు ఈ విషయం తెలుసా? టీచర్లు అడుగుతున్నారు కాబట్టి కొనిపడేస్తే పోతుందనుకుంటున్న తల్లిదండ్రులకు అసలు ప్రాజెక్టు వర్కుకు అర్థం తెలియదా? తెలిసినా తమకు టైమూ ఓపికా లేవు కాబట్టి కొంటున్నారా? వారి బలహీనత ఒక వ్యాపారంగా మారిందా?... ఎన్నో ప్రశ్నలు.

సెలవుల్లో ప్రత్యేకమైన హోంవర్కులు, ప్రాజెక్టులు అనేవి ఎందుకిస్తారు? పిల్లల ఆలోచనని, సృజనని పెంపొందించడానికి; వారంతట వారు స్వయంగా చేయడం నేర్చుకునేందుకు ఇచ్చే పనులు అవి. అవసరమైతే పెద్దలు సాయం చేయాలి, గైడ్ చేయాలి. సెలవుల్లో పిల్లల సమయం సద్వినియోగమవ్వాలంటే వాళ్లు కొత్త విషయాలు నేర్చుకోవాలి. తమ చిట్టి చేతులతో ప్రయోగాలు చేయాలి. ప్రాజెక్టుకు కావాల్సిన సామగ్రిని తమకు తామే సమకూర్చుకోవడం, ఆలోచించి, అంచెలంచెలుగా ప్రణాళిక వేసుకుని చేయడం ఎలాగో వారికి తెలుస్తుంది. పొరపాట్లు చేస్తూ నేర్చుకుంటారు. ఒక ప్రయత్నంలో అనుకున్నట్లుగా రాకపోతే లోపాలను సవరించుకుంటూ మరోసారి చేస్తారు. అలా చేసేలా వాళ్లని ప్రోత్సహించాలి. అవసరమైన గైడెన్స్, చిన్న పిల్లలైతే కాస్త హెల్ప్... చేయడమే పెద్దల పని. పిల్లలు కష్టపడుతుంటే చూడలేమనుకునే పెద్దలు తద్వారా వాళ్లు నేర్చుకునే అవకాశాన్ని పోగొడుతున్నామని గుర్తించరు. చేస్తూ నేర్చుకుంటూ, నేర్చుకుంటూ చేసినప్పుడే టీచర్లు ఆశించిన ఫలితాలు విద్యార్థుల్లో కనబడతాయి. అదేమీ చేయకుండా రెడీమేడ్‌వి కొనేసి ఇవ్వడం పిల్లలకు షార్ట్‌కట్‌లు నేర్పడం కాదా? ఉపాధ్యాయులూ తల్లిదండ్రులూ కలిసి చర్చించుకుని పిల్లల సామర్థ్యానికి తగిన ప్రాజెక్టులు రూపొందించడం అందరికీ ఉపకరించే పరిష్కారం!

గొంగళిపురుగు సీతాకోకచిలుకగా మారి ప్యూపానుంచి బయటపడే క్రమంలో చాలా కష్టపడుతుంది. అప్పుడే దాని రెక్కలు బలంగా రూపొందుతాయి. దాని కష్టం చూడలేక ప్యూపాని కత్తిరించామనుకోండి. సీతాకోకచిలుక రెక్కలు సరిగా రూపొందవు, ఎగరలేక కిందపడిపోతుంది. పిల్లల మానసిక వికాసానికి సైతం ఆ తరహా ఎక్సర్‌సైజ్ అవసరం!

– డాక్టర్ టి.సంపత్ కుమార్

సమష్టి శ్రేయస్సుకు...

సాంకేతిక, ఆర్థిక సహకార (టీఈసీ) కార్యక్రమంలో భాగంగా ఇరుగు పొరుగు దేశాలతో పాటు ఇతర వర్ధమాన రాజ్యాలతో తన అభివృద్ధి అనుభవాలను, నైపుణ్యాలను పంచుకుంటోంది భారత్. తద్వారా ఉమ్మడిగా ఎదగడానికి, దౌత్య బంధాలను పటిష్ఠం చేసుకోవడానికి కృషి చేస్తోంది. టీఈసీలో భాగంగా విదేశాల్లో పలు ప్రాజెక్టులకు భారత్ సహకరిస్తోంది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి టీఈసీకి రూ.5,667 కోట్లు కేటాయించింది. అందులో ఆయా దేశాలకు ప్రత్యేకించిన నిధులు (శాతాల్లో)...

భూటాన్	36.50
నేపాల్	12.35
మాల్దీవులు	7.06
మారిషస్	6.53
మయన్మార్	4.41
శ్రీలంక	4.32
అఫ్గానిస్థాన్, ఆఫ్రికా	3.53
ఇతర వర్ధమాన దేశాలు	2.21
బంగ్లాదేశ్	2.12
సీషెల్స్	0.71
ఇతరాలు	16.73

(ఆధారం: కేంద్ర విదేశాంగ శాఖ వార్షిక నివేదిక-2024)


మానవాళి ప్రగతికి ఎలక్ట్రాన్ శక్తి

అత్యాధునిక ఎలక్ట్రానిక్ ఉపకరణాలు, మెడికల్ ఇమేజింగ్ పరికరాలు, శక్తిమంతమైన కంప్యూటర్లు ఎప్పటికప్పుడు కొత్తగా అందుబాటులోకి వస్తున్నాయి. సరికొత్త పదార్థాలూ వస్తువుల తయారీ, కమ్యూనికేషన్ వంటి రంగాల్లో విప్లవాత్మక మార్పులకు క్వాంటమ్ టెక్నాలజీ నాంది పలుకుతోంది. అయితే, వీటన్నింటికీ మూలశక్తి వంటిది- ఎలక్ట్రాన్! మరిక విభజించడానికి వీల్లేనంత సూక్ష్మ పరిమాణంలో ఉండే పరమాణువుల్లో కేంద్రకం చుట్టూ ఎలక్ట్రాన్ ప్రదక్షిణ చేస్తుందన్న విషయం (ఎలక్ట్రాన్ స్పిన్) వెలుగులోకి వచ్చి నేటితో సరిగ్గా వందేళ్లు!

ఆదిమకాలం నుంచీ నేటి కృత్రిమ మేధ యుగం వరకు మానవాళి సాంకేతికంగా ఎంతో ప్రగతి సాధించింది. ముఖ్యంగా భౌతిక జీవ రసాయన శాస్త్రాల్లో సాగించిన పరిశోధనలు మానవ జీవన గమనాన్ని మేలిమి మలుపు తిప్పాయి. మన చుట్టూ కనిపించే ప్రతి వస్తువూ ఏదో ఒక పదార్థంతో తయారైనదే. కానీ ప్రతి పదార్థానికీ మూలం పరమాణువనీ, కంటికి కనిపించనంత పరిమాణంలో ఉండే ఈ ఆటమ్‌ను విభజించడానికి వీలుండదని క్రీస్తుపూర్వం అయిదో శతాబ్దంలోనే గ్రీకు తత్వవేత్తలు లూసిప్పస్, డెమోక్రిటీస్ వంటివారు ప్రతిపాదించారు. కాలక్రమంలో 1897లో బ్రిటిష్ శాస్త్రవేత్త జె.జె. థామ్సన్ క్యాథోడ్ రే ట్యూబ్‌తో పరిశోధన సాగిస్తున్నప్పుడు ఎలక్ట్రాన్ వెలుగు చూసింది. ఖగోళంలో నక్షత్రాల చుట్టూ గ్రహాలు పరిభ్రమిస్తున్నట్టే... అత్యంత సూక్ష్మమైన పరమాణువుల్లోనూ కేంద్రకం(న్యూక్లియస్) చుట్టూ ఎలక్ట్రాన్లు పరిభ్రమిస్తూ ఉంటాయనీ, వాటికి అయస్కాంత ధర్మం కూడా ఉంటుందని జార్జ్ ఉలెన్‌బర్గ్, గౌడ్‌స్మిత్‌లు కనుగొన్నారు. 'ఎలక్ట్రాన్ స్పిన్' పేరిట 1925 నవంబరు 20న బాహ్య ప్రపంచానికి తెలియవచ్చిన వీరి పరిశోధన- అనంతర కాలంలో ఎన్నో ఆవిష్కరణలకు దారిదీపమైంది. రసాయన శాస్త్రంతో పాటు క్వాంటమ్ మెకానిక్స్ చరిత్రలో అపూర్వ మైలురాయిగా నిలిచిపోయింది.

ఎన్నో ఆవిష్కరణలు...


పరమాణువుల్లోని ప్రోటాన్లు, న్యూట్రాన్లు, ఎలక్ట్రాన్ల సంఖ్య ఆధారంగా పరిశోధకులు రసాయన మూలకాలను 118 రకాలుగా వర్గీకరించారు. పీరియాడిక్ టేబుల్‌గా ప్రతి విద్యార్థికీ అది సుపరిచితమే. దీనిద్వారా రకరకాల పదార్థాల మూలకాలను ఇట్టే గుర్తిస్తారు. అయితే, ఎలక్ట్రాన్ స్పిన్(స్పిన్‌ట్రానిక్స్)ను కనుగొన్న తరవాత మెటీరియల్ సైన్స్‌లో అనూహ్యమైన ఆవిష్కరణలు జరిగాయి. నేడు మనకు సెల్‌ఫోన్లు, కంప్యూటర్ల వినియోగం అత్యవసరమైపోయింది. నిత్యం అక్షరాలతో పాటు మాటలు, సంగీతం, బొమ్మలు, వీడియోల రూపంలో డేటాను ఉత్పత్తి చేసి, వాటిలో దాచుకుంటున్నాం. కానీ హార్డ్‌డిస్కులు అత్యంత తక్కువ స్థలంలో, పెద్దయెత్తున సమాచారాన్ని వేగంగా, సమర్థంగా నిల్వ చేయడానికి స్పిన్‌ట్రానిక్స్ దోహదపడుతున్న విషయం చాలామందికి తెలియదు. నేటి సంప్రదాయ ఎలక్ట్రానిక్ ఉపకరణాలతో పోలిస్తే భవిష్యత్తులో స్పిన్‌ట్రానిక్స్ ఆధారంగా తయారయ్యేవి ఎంతో సమర్థంగా, వేగంగా, శక్తిమంతంగా పనిచేస్తాయంటున్నారు శాస్త్రవేత్తలు. చాలా తక్కువ విద్యుత్తును ఉపయోగించి అత్యంత వేగంగా పనిచేసే కంప్యూటర్లు రాబోతున్నాయి. ముఖ్యంగా, కరెంటు లేకపోయినా స్టోర్ చేసుకున్న సమాచారాన్ని అందించే అధునాతన 'నాన్-వోల్టయిల్ మెమొరీ' అందుబాటులోకి రానుంది. ఇప్పటికే స్మార్ట్‌వాచ్‌లు, ఫిట్‌నెస్ ట్రాకర్లు, హెల్త్ సెన్సర్లు వంటి ధరించతగిన పరికరాల్లో ఈ మెమొరీని వాడుతున్నారు. భవిష్యత్‌తరం క్వాంటమ్ కంప్యూటర్లలో సమాచారాన్ని క్యూబిట్స్ రూపంలో నిక్షిప్తం చేయడానికి సైతం ఎలక్ట్రాన్ స్పిన్ కీలకం కానుంది.



ముమ్మరంగా పరిశోధనలు...

మానవ శరీరం ఒక బయోలాజికల్ ఇంజినీరింగ్ అద్భుతం! మన దేహంలో ఎన్నో సంక్లిష్ట వ్యవస్థలు ఉన్నాయి. అవి నిరంతరాయంగా పనిచేయడానికి అవసరమైన శక్తిని అందించడంలో ఎలక్ట్రాన్లు, ఎలక్ట్రాన్ స్పిన్ ప్రక్రియ ఎంతో అవసరం. ఒకటి పక్కన 28 సున్నాలు పెడితే వచ్చే సంఖ్య, మన శరీరంలోని ఎలక్ట్రాన్లకు సమానమని చెబుతారు. కణంకణంలోనూ శక్తిని ఉత్పత్తి చేసి నిల్వ చేయడానికీ... ఆలోచనలకు అనుగుణంగా నాడీ వ్యవస్థలో కదలికలు తీసుకురావడానికీ... దెబ్బతిన్న అవయవాలకు స్వతహాగా మరమ్మతులు చేయడానికీ ఎలక్ట్రాన్ విద్యుదావేశం(ఛార్జ్) దోహదపడుతుంది. అయితే, ఒక్కోసారి రోగుల శరీరంలో అవయవాల పరిస్థితేంటి? అవి ఎక్కడెక్కడ దెబ్బతిన్నాయి? అనేది తెలుసుకోవడానికి వైద్యులు ఎంఆర్ఐ స్కానింగ్ చేయిస్తుంటారు. ఎలక్ట్రాన్ స్పిన్ వల్ల ప్రభావితమైన పరమాణువుల మాగ్నటిక్ ప్రభావంతోనే ఈ పరీక్ష సాధ్యపడుతుంది. శరీరంలో వ్యాధులకు కారణమవుతున్న ఫ్రీరాడికల్స్‌ను గుర్తించడానికి కొన్ని వైద్య పరీక్షలు అవసరమవుతాయి. అందుకోసం సేకరించిన నమూనాలను నిశితంగా పరిశీలించి, విశ్లేషించడానికి న్యూక్లియర్ మాగ్నటిక్ రిసోనెన్స్(ఎన్ఎంఆర్), ఎలక్ట్రాన్ స్పిన్ రిసోనెన్స్(ఈఎస్ఆర్) అనే టూల్స్ ఉపయోగపడతాయి. భౌతిక, రసాయన, జీవశాస్త్ర పరిశోధనల్లోనూ వీటిని విరివిగా వాడుతున్నారు. ఎలక్ట్రాన్ స్పిన్ ఆధారంగా క్యాన్సర్ వంటి రుగ్మతలను వీలైనంత ముందుగానే గుర్తించే సాంకేతిక ఉపకరణాల తయారీ పరిశోధనలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఎప్పుడో వందేళ్ల క్రితం కనుగొన్న 'ఎలక్ట్రాన్ స్పిన్' ఇప్పుడూ, ఇంకా భవిష్యత్తులోనూ అనేక ఆవిష్కరణలకు కారణమవుతుండటమే అసలు విశేషం!

– టి.రఘుబాబు



25x7

విభాగాలు.. రోజులు

పేదలకు బాసటగా ప్రభుత్వ వైద్యం

విజయవాడ వైద్యం, న్యూస్‌టుడే

విజయవాడలోని కొత్త, పాత ప్రభుత్వ ఆసుపత్రులు ప్రజలకు చక్కని సేవలు అందిస్తున్నాయి. ఉచితం ప్రత్యేకతతో రోగులకు బాసటగా నిలుస్తున్నాయి. ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల నుంచే కాకుండా తెలంగాణ రాష్ట్ర సరిహద్దులైన ఖమ్మం, మధిర ప్రాంతాల నుంచి సైతం ఇక్కడికి వస్తున్నారు. పాత బిల్డింగ్‌లో, సూపర్ స్పెషాలిటీ (అడ్మిన్ బిల్డింగ్)లో సేవలు అందుబాటులో ఉన్నాయి. అయితే.. వారాల వారీగా ఓపీ ఉంటుంది వాటి గురించి తెలుసుకుందాం.

సూపర్ స్పెషాలిటీ బిల్డింగ్‌లో..



ప్రతి ఆదివారం ఓపీ సెలవు...

- కార్డియాలజీ, డెర్మటాలజీ, సర్జికల్ డిసీజెస్, పల్మనరి మెడిసిన్ (సోమ నుంచి శని వరకు)
- న్యూరాలజీ: మంగళ, గురు, శని
- న్యూరోసర్జరీ,అంకాలజీ: మంగళ, శుక్ర
- నెఫ్రాలజీ: సోమ, బుధ, శని
- యూరాలజీ: సోమ - గురు
- ప్లాస్టిక్ సర్జరీ: సోమ, మంగళ, గురు
- పీడియాట్రిక్ సర్జరీ: సోమ, బుధ, శుక్ర
- ప్రివెంటివ్ అంకాలజీ: మంగళ, గురు
- గ్యాస్ట్రో ఎంట్రాలజీ హ్యూమెన్ న్యూట్రిషన్ - సోమ, బుధ, శుక్ర
- కార్డియో థొరాసిక్ వాస్కులర్ సర్జరీ - సోమ, బుధ, గురు

పాత బిల్డింగ్‌లో..

- ఎమర్జెన్సీ మెడిసిన్ (క్యాజువాలిటీ), ఏఆర్‌టీ విభాగాలు అన్ని రోజులు అందుబాటులో ఉంటాయి.
- ఈఎన్‌టీ * జనరల్ మెడిసిన్ * ఆప్తమాలజీ * ఆర్థోపెడిక్స్ * అనస్థీషియా (పెయిన్ క్లినిక్) (సోమ నుంచి శని వరకు..)

పాత ప్రభుత్వ ఆసుపత్రిలో..

సోమ నుంచి శని వరకు ఓపీ సేవలు * ఓటీ/సర్జిక్ అండ్ గైనకాలజీ * పీడియాట్రిక్స్ * సైకియాట్రీ * ఫ్యామిలీ ప్లానింగ్

రెండు ప్రభుత్వ ఆసుపత్రుల్లో సేవలు..

- ★ రోజూ ఓపీ : సుమారు 5500 మంది
- ★ మొత్తం విభాగాలు : 25
- ★ పడకలు : 1680 (ఐసీయూలో 294) (సాధారణ వార్డుల్లో ఉన్నవి 1386)
- ★ శస్త్రచికిత్సల గదులు : 26+9
- ★ వైద్యులు : 146 మంది

ఎగిరే పావురమా.. వెలిగే గోపురమా..



విజయవాడ వన్‌టౌన్‌లోని పాత శివాలయంలో ప్రతి రోజూ తెల్లవారుజాము నుంచే పావురాలు సందడి చేస్తాయి. వందల సంఖ్యలో పక్షులు ఆలయ గోపురం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నట్లుగా తిరుగుతూ కనిపించే దృశ్యాలు భక్తులకు కనువిందు చేస్తున్నాయి.

–ఈనాడు, అమరావతి

వెంకన్న భూమికీ.. ఎసరెట్టారు!

- రికార్డుల్లో ఉన్న 67 సెంట్లు కనిపించడం లేదు
- ఏళ్లుగా ఫిర్యాదులు.. పట్టించుకోని యంత్రాంగం

ఈనాడు, అమరావతి



'దేవాదాయశాఖ పరిధిలో గ్రామీణంలో ఉండే ఆలయాల భూములు మాయమవుతున్నాయి. మా ఆలయ భూమి కనిపించడం లేదని.. దేవాదాయ శాఖతో ఏళ్లుగా మొత్తుకున్నా కనీస స్పందన లేదు. పమిడిముక్కల మండలం మంటాడలోని అలివేలు మంగా పద్మాసమేత వైకుంఠ వెంకటేశ్వరస్వామి దేవస్థానం భూమి కనిపించడం లేదని.. 2023లో వైకాపా జమానాలో గుర్తించారు. కొలతలు వేసి.. ఎంత మాయమైందో.. తేల్చారు. ఆ భూమి ఆలయానికి తిరిగి ఇప్పించాలని.. పలుమార్లు ఫిర్యాదు చేసినా దిక్కులేదు.'

వైకుంఠ వెంకటేశ్వరస్వామి దేవస్థానానికి భూములను కొంటామని.. 1979-80లో భక్తుల నుంచి విరాళాలు సేకరించి.. వారి పేర్లతోనే భూమి కొన్నారు. 92 మంది భక్తులు విరాళాలు ఇవ్వగా.. ఒక సెంటు నుంచి 12 సెంట్ల వరకూ ఇచ్చిన దాతలున్నారు. వీరి పేర్లతోనే.. ఎవరెవరు ఎన్ని సెంట్లు దానమిచ్చారో దేవస్థానం రికార్డుల్లో, ఆలయంలో బోర్డుపైనా వివరాలున్నాయి. మొత్తం.. 1.57 ఎకరాలు. జాతీయ రహదారి పక్కనే ఉండడంతో విలువ రూ.15 కోట్లకు పైమాటే. 2023 నవంబరులో కొలతలేయగా.. సర్వేనంబరు 15/1బి, 15/17లో 90 సెంట్లు రావడంతో గోల్‌మాల్ వెలుగుచూసింది.

రూ.7 కోట్లపైనే విలువ...

1979లో జక్కా పిచ్చయ్య నుంచి 35 సెంట్లు, 1980లో జక్కా భాస్కర్‌రావు నుంచి 45 సెంట్లు కొన్నట్లు కనిపిస్తోంది. గరికపాటి రంగారావు, తులసీదాస్ సోదరులు 12 సెంట్లు దానమిచ్చారు. మొత్తంగా 92 సెంట్లు. దేవస్థానానికి ఈ భూమి మాత్రమే.. ప్రస్తుతం కనిపిస్తోంది. మిగతా భక్తుల నుంచి సేకరించిన విరాళాలతో కొన్న భూమి ఏమైందో తెలియదు. ఈ లెక్క తేల్చి ఆలయ భూమి ఇప్పించాలని.. దేవాదాయ శాఖకు మంటాడలో సామాజిక కార్యకర్తలు, ప్రజలు ఫిర్యాదులు చేస్తూనే ఉన్నారు. 1.57 ఎకరాల్లో 90 సెంట్లే ఉందనీ, మిగతాది తేల్చాలని కోరుతున్నారు. ఈ మాయమైన భూమి విలువ రూ.7 కోట్లపైమాటే.

పాలకమండలి తీర్మానాలు చేసినా..

2023లోనే రెండుసార్లు ఆలయ ధర్మకర్తల మండలి సమావేశమై గోల్‌మాల్‌ను తేల్చాలని తీర్మానించి.. బాధ్యులపై కఠిన చర్యలకు దేవాదాయశాఖ కమిషనర్ కార్యాలయానికి ఫిర్యాదు చేసింది.


ఆ తర్వాత 2024 జనవరి నుంచి ఇప్పటి వరకు మొత్తం 18సార్లు ఫిర్యాదు చేసినా.. అటునుంచి స్పందన రాలేదని.. గ్రామానికి చెందిన పలువురు వాపోతున్నారు.

కెవ్వు కేకు!



గుణదలలోని ఓ హోటల్‌లో బుధవారం కేక్ మిక్సింగ్ కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. వివిధ రకాల ఎండు ఫలాలు, వైన్, ద్రాక్ష రసం కలిపి కేక్ తయారు చేశారు. చిన్నారులు, యువత, మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, గుణదల(పటమట)

చెట్టుచెదరని.. కోవెల!



కంకిపాడు మండలం కుందేరు గ్రామస్థులకు 40 ఏళ్ల కిందట ఓ సమస్య ఎదురైంది. దీన్ని సంప్రదింపులు, నిపుణుల సూచనలతో పరిష్కరించుకున్న విధానం మన్ననలు పొందుతోంది. స్థానిక చెరువు కూడలిలో అలనాటి వేంకటేశ్వరస్వామి గుడిలో వేపచెట్టు పెరిగింది. దేవతా వృక్షంగా భావించిన గ్రామస్థులు మహాలక్ష్మీమానుగా నామకరణం చేసి పూజిస్తుండేవారు. 1985లో గాలివానకు గుడిలో చాలా భాగం ధ్వంసమైంది. అదే స్థలంలో కొత్తగా ఆలయం నిర్మించాలని నిర్ణయించారు. పనులు చేపట్టడానికి మహాలక్ష్మీమాను అడ్డుగా ఉన్నా దాన్ని తొలగించకుండా ఆలయం నిర్మించారు. భవన నిర్మాణ నిపుణుల సూచనతో చెట్టు కాండం, కొమ్మల చుట్టూ వృత్తాకారంలో ఖాళీ ఉంచి.. గోడలు, ఆర్‌సీసీ కప్పు నిర్మించారు. ఈదురుగాలులకు చెట్టు కాండం, కొమ్మలు ఊగినా అవి కట్టడాన్ని తాకనంత ఖాళీ వదిలారు. అలాగే రంధ్రం చుట్టూ ఇనుప జల్లెడ అమర్చి సిమెంట్, ఇసుక, కంకర మిశ్రమంతో నింపారు. వాన నీరు గుడిలోకి ప్రవేశించకుండా ఇతర ఏర్పాట్లు చేశారు. నాటి నుంచి ఎన్ని తుపానులు వచ్చినా చెట్టు కారణంగా దేవాలయ కట్టడాలకు నష్టం జరగలేదు. ఇప్పటికీ చెక్కు చెదరకుండా ఉంది. – కంకిపాడు, న్యూస్‌టుడే

ప్రతీ క్లినిక్ ఏడీఎం పోర్టల్‌లో నమోదు చేసుకోవాలి

విజయవాడ పాతాసుపత్రి, న్యూస్‌టుడే : జిల్లాలో ఏడీఎం (ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్)లో భాగంగా ప్రైవేటు నర్సింగ్ హోమ్‌లు, ఆసుపత్రులు, క్లినిక్‌లు కొత్తగా ఏర్పాటు చేసుకోవాలనుకున్న ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా వైద్యులు, స్టాఫ్‌నర్స్ హెచ్‌పీఆర్- హెల్త్ కేర్ ప్రొఫెషనల్ రిజిస్ట్రీ ధ్రువపత్రం కోసం ఏడీఎం పోర్టల్ నందు నమోదు చేసుకోవాలని డీఎంహెచ్‌వో డా.ఎం.సుహాసిని బుధవారం రాత్రి విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలిపారు. హెచ్ఎఫ్ఆర్ రిజిస్ట్రీ నమోదు చేయని పక్షంలో ఏపీఎంసీఈ యాక్ట్(ఏపీ మెడికల్ కౌన్సిల్ ఎస్టాబ్లిస్మెంట్ యాక్టు) అనుసరించి ఆ రిజిస్ట్రేషన్ దరఖాస్తు చేసుకునేందుకు అనర్హులని గ్రహించి తదుపరి చర్యలుంటాయని హెచ్చరించారు. ప్రస్తుతం స్థాపించి కొనసాగుతున్న ఆసుపత్రులు వారు కూడా విధిగా రానున్న 15 రోజుల్లో తప్పనిసరిగా పోర్టల్ నందు దరఖాస్తు చేసుకోవాలని, లేని పక్షంలో ఆసుపత్రి లైసెన్స్‌ను రద్దు చేస్తామని తెలిపారు.

మాటేయడం.. మట్టుబెట్టడం!

☛ భద్రతా బలగాలపై దాడుల్లో వీరిది కీలకపాత్ర...

ఈనాడు - అమరావతి: మావోయిస్టు భావజాలానికి ఆకర్షితులైన ఆదివాసీలు.. పార్టీలో చేరారు. పోలీసులు, ఇన్ఫార్మర్లను చంపారు. పలువురు ఆదివాసీలను ఉద్యమం వైపు ఆకర్షితులను చేశారు. ఎన్టీఆర్ జిల్లా పోలీసులు మంగళవారం చేసిన ఆపరేషన్‌లో అరెస్టయిన నలుగురు మావోల చరిత్ర ఇది. వీరందరిదీ ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం.



మావోయిస్టులను జైలుకు తరలిస్తూ..


అసలు 'రంగు' ఇదీ...: కుంట జిల్లా పాలమడుగు గ్రామస్థుడు బీమా అలియాస్ రంగు.. 2003లో మావోయిస్టు పార్టీలో చేరాడు. ప్రస్తుతం ఛత్తీస్‌గఢ్ గెరిల్లా బెటాలియన్ పార్టీ కమిటీ, దక్షిణ బస్తర్ ఏరియా స్టేట్ కమిటీలో ఉన్నాడు. 20 ఏళ్లుగా మావోయిస్టు కీలక దాడుల్లో పాల్గొనగా 30 మంది పోలీసులు ప్రాణాలు కోల్పోయారు. 2017లో గుర్కాపూర్ దాడిలో 22 మంది పోలీసులు చనిపోయారు. ఈదాడిలో అతడి కాలు విరిగింది. ఈ కేసులో పట్టుబడిన మంగిని 2013లో పెళ్లిచేసుకున్నాడు. ఈమె కిస్టాపురం ఏరియా కమిటీ సభ్యురాలు. 2024లో ధర్మపురం దాడుల్లో వీరు పాలుపంచుకున్నారు.

ఇన్ఫార్మర్లను పసిగట్టి: డివిజనల్ కమిటీ సభ్యులైన లక్మ, చిన్మయ్ అలియాస్ మనీలాలు.. చిన్న వయసులోనే పలువురు ఆదివాసీలు విప్లవ బాట పట్టేలా ప్రసంగించేవారు. మనీలా సమాచారం ఆధారంగానే కోరగట్ట బీజాపూర్ జిల్లాలో బీమాను ఇన్ఫార్మర్ అనే నెపంతో చంపారు. పలు ప్రాంతాల్లో లక్మ ప్రజాదర్బార్లు పెట్టి.. మావోయిస్టులకు వ్యతిరేకంగా పనిచేస్తున్న వారిని చంపేవాడు. ఇన్ఫార్మర్ల కదలికలను మావోయిస్టు పార్టీకి సమాచారం ఇచ్చేవాడు. కేంద్రం ప్రారంభించిన ఆపరేషన్ కగార్‌కు వ్యతిరేకంగా పనిచేశాడు.

ఆస్తి ఎవరిది.. హక్కుదారు ఎవరు

వ్యవసాయ భూములు, ఇళ్ల, స్థలాలు.. కొనుగోలు చేయాలన్నా, విక్రయించాలన్నా రిజిస్ట్రేషన్ అవసరం. ఎందుకంటే ఆ భూమి రిజిస్టర్ అయి ఉంటేనే దానికి హక్కుదారులుగా చట్టం పరిగణిస్తుంది. క్రయ విక్రయాల సమయంలో అనుసరించాల్సిన విధానంపై చాలా మందికి అవగాహన లేక ఇబ్బందులు పడుతున్నారు. మచిలీపట్నంలో ఒక ఆస్తిని వేర్వేరు వ్యక్తులకు విక్రయించిన ఘటనపై రిజిస్ట్రేషన్ కార్యాలయంలోనే వివాదం చోటు చేసుకోవడం, అధికారులకు ఫిర్యాదు చేయడం క్షేత్రస్థాయిలో సమస్యలను తేటతెల్లం చేస్తున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న 24 రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో 350 నుంచి 400 వరకు రిజిస్ట్రేషన్లు జరుగుతుంటాయి. క్రయ విక్రయాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియకపోతే రూ. లక్షలు, ఒక్కోసారి రూ.కోట్లు కూడా నష్టపోవాల్సి వస్తుంది. ఆస్తి కొనుగోలుకు ముందు అనుసరించాల్సిన విధానాల గురించి తెలుసుకుందాం.

తెలుసుకుందాం



1908

కొనుగోలు చేసే భూములు 1908లోని సెక్షన్ 22ఎ ప్రకారం నిషిద్ధ జాబితాలో ఉన్నాయా లేదా అని పరిశీలించుకోవాలి.

✦ ఆస్తి కొనుగోలు సమయంలో దానికి హక్కుదారు ఎవరు, దానిపై ఏవైనా బకాయిలు, లావాదేవీలు ఉన్నాయా అన్న విషయం నిర్ధారించుకోవాలి. ✦ దస్తావేజుల కాపీలు, ఈసీ ద్వారా ఆస్తిపై హక్కు ఎవరికి ఎలా సంక్రమించిందన్న విషయం తెలుసుకునే అవకాశం ఉంటుంది. ✦ మీభూమి వెబ్‌సైట్ ద్వారా భూమి యాజమాన్య హక్కు పత్రం, అడంగల్ తనిఖీ చేసుకుని ఆస్తి అమ్మకందారు పేరిట ఉందా లేదా అన్నది తెలుసుకోవచ్చు. ✦ పురపాలక సంఘం, గ్రామ పంచాయతీల్లో ఇళ్ల స్థలాల విషయంలో అసెస్మెంట్ రిజిష్టర్‌లో నమోదు ముఖ్యం. ఆ వివరాల మదింపు రిజిష్టర్‌లో ఆస్తికి సంబంధించిన హక్కులు పరిశీలించుకోవాలి. ✦ ఆస్తిని పవర్ ఆఫ్ అటార్నీ ద్వారా పొందే సమయంలో సదరు వ్యక్తికి సరైన హక్కులు ఉన్నాయా లేవా అన్నది నిర్ధారించుకోవాలి. ✦ కొనుగోలు చేసే ఆస్తిపై వివాదాలు, ఇతరులకు హక్కులు లేవన్న విషయాన్ని ధ్రువీకరించుకోవాలి ✦ క్రయ దస్తావేజు రాసుకునే సమయానికి సదరు ఆస్తికి సంబంధించి విద్యుత్తు, నీటి, ఆస్తి పన్నులు, ఇతర బకాయిలు లేకుండా చూసుకోవాలి.

– న్యూస్‌టుడే, మచిలీపట్నం కార్పొరేషన్

అయినోళ్లకు నీడలో.. కానోళ్లకు ఎండలో..!



ఆర్టీసీలో అనర్హులకు బుకింగ్ కండక్టర్లు, ఓడీ పోస్టులు

☛ విజయవాడ పీఎన్‌బీఎస్‌లో ముందస్తుగా టిక్కెట్లు ఇచ్చేందుకు 40 మంది బుకింగ్ కండక్టర్లు ఉన్నారు. వీరిలో చాలా మంది అనర్హులే. ప్రజాప్రతినిధులు, ఆర్టీసీలో అధికారులను ప్రసన్నం చేసుకుని ఏళ్లుగా ఇక్కడే పాగా వేశారు. ఇటీవలే ఓ నాయకుడి సిఫార్సుతో ఆరుగురికి బాధ్యతలు అప్పగించడంపై దుమారం లేచింది.
☛ బందరు డిపోలో ఓడీ (ఔటాఫ్ డిజిగ్నేషన్) విధుల్లో ఉన్న 12 మందిలో చాలా మంది అనర్హులే.
☛ విజయవాడ మెయిన్ డిపోలో నలుగురు కండక్టర్లు ఉన్నతాధికారుల అండతో ఐదేళ్లుగా కొనసాగుతున్నారు.
☛ విధుల్లో కొనసాగిస్తున్న వారికి ఖరీదైన కానుకలు సమకూరుస్తూ గడిపేస్తున్నారనే విమర్శలున్నాయి.

ఉమ్మడి జిల్లా ఆర్టీసీలో అడ్డగోలుగా బాధ్యతలు ఇచ్చేస్తున్నారు. పలువురు సిబ్బంది సొమ్ములు ఎరవేసి.. నేతల సిఫార్సులతో బుకింగ్ కండక్టర్లు, ఓడీ బాధ్యతల్లో కొనసాగుతున్నారు. ఆ బాధ్యతలకు నిజంగా అర్హత ఉన్న వారు ఏళ్లు తిరుగుతున్నా ఫలితం లేక తల్లడిల్లుతున్నారు.

ఎవరికి కేటాయిస్తారంటే..

దివ్యాంగులు, దీర్ఘకాలిక అనారోగ్యంతో ఉండి సాధారణ విధులు నిర్వహించలేని వారికి బుకింగ్ కండక్టర్లు, ఓడీ బాధ్యతలు అప్పగిస్తారు. ☆ వీరి తర్వాత సీనియార్టీ ప్రాతిపదికగా.. బస్సుల్లో కాకుండా డిపోల్లో విధులు కేటాయిస్తారు. ☆ ఉన్నతాధికారులకు దరఖాస్తు చేసి అనారోగ్యం, వైకల్య ధ్రువపత్రాలు సమర్పించాలి. ☆ ఆర్టీసీ త్రిసభ్య కమిటీ పరిశీలించి, వైద్యులతో నిర్ధారించుకుని అర్హత ఉంటే అనుమతిస్తారు.

అర్హత లేకున్నా అందలం...

☆ ఉమ్మడి జిల్లాలో ఈ రెండు విభాగాల్లో ఆరోగ్య సమస్యలు, సీనియార్టీ, వైకల్యం లేని వారు దాదాపు 150 మంది మేర అనర్హులు విధుల్లో ఉన్నారు. ☆ దరఖాస్తు, అనుమతి పత్రాలు ఏమీ లేకున్నా దర్జాగా శ్రమ లేని కొలువులో గడిపేస్తున్నారు. ☆ స్త్రీశక్తి పథకంతో విధుల్లో ఉన్న సిబ్బంది ఉక్కిరిబిక్కిరి అవుతున్నా ట్రిప్పులు రద్దు చేస్తున్నారే తప్ప... వీరికి మాత్రం విధులు కేటాయించడం లేదు. ☆ కొన్ని బస్సుల్లో డ్రైవర్లతోనే టిక్కెట్ కొట్టిస్తున్నారు.* ఈ అంశంపై ఆర్టీసీ ఉన్నతాధికారుల వివరణ కోసం చరవాణిలో యత్నించగా అందుబాటులోకి రాలేదు.

– ఈనాడు, అమరావతి

లక్ష్యం 100%

వచ్చే ఏడాది మార్చిలో జరిగే పదో తరగతి తరగతి పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలనే లక్ష్యంతో జిల్లా విద్యా శాఖ కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసింది. ఈ మేరకు ఇప్పటికే ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేశారు. గతేడాది 85.68 శాతం ఉత్తీర్ణత సాధించి రాష్ట్ర స్థాయిలో 8వ ర్యాంకులో నిలిచింది. ఇంకా మెరుగైన ఫలితాలు సాధించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి పదో తరగతి పరీక్షలకు 14,184 మంది బాలురు, 13,613 మంది బాలికలు మొత్తం 27,797 మంది సిద్ధమవుతున్నారు. వీరంతా అన్ని సబ్జెక్టుల్లో శత శాతం ఉత్తీర్ణత సాధించాలనేది లక్ష్యం.

ముఖాముఖి

✪ అందులో భాగంగా ఎస్ఏ-1 పరీక్షలు అయిన తరువాత సబ్జెక్టు టీచర్లకు విజయవాడ, నందిగామ, తిరువూరు డివిజన్ల పరిధిలో జిల్లా విద్యాశాఖాధికారి పర్యవేక్షణలో తెలుగు నుంచి సాంఘిక శాస్త్రం వరకు అన్ని పాఠ్యాంశాలను సులభంగా బోధించే పద్ధతులపై శిక్షణ తరగతులు ఏర్పాటు చేయనున్నారు. ✪ డిసెంబర్ 4వ తేదీ లోపు సిలబస్ మొత్తం పూర్తి చేయాలి. ✪ డిసెంబర్ 5న విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహిస్తారు.

– విజయవాడ సిటీ, న్యూస్‌టుడే

'పది' పరీక్షల్లో రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ర్యాంకుకు కృషి



గతేడాది ఫలితాల కంటే మెరుగైన ఫలితాలు సాధించాలనేది లక్ష్యం. అందుకు అనుగుణంగా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాం. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాం. పునఃశ్చరణ తరగతులు నిర్వహించి సామర్థ్యాలను పెంచి ఉత్తీర్ణత సాధించేలా తీర్చిదిద్దుతున్నాం.

- యు.వి. సుబ్బారావు, ఎన్టీఆర్ జిల్లా విద్యాశాఖాధికారి

వంద రోజులు...

డిసెంబరు 6 నుంచి వంద రోజుల ప్రణాళిక అమలు చేస్తారు. అప్పటి నుంచి ఉదయం, సాయంత్రం సమయాల్లో గంట చొప్పున ప్రత్యేక తరగతులు నిర్వహిస్తారు. ఆయా సబ్జెక్టుల్లో వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి పెట్టాలి. వారికి పరీక్షలు నిర్వహించడం, వాటి ఫలితాల ఆధారంగా ప్రతిభ అంచనా వేస్తున్నారు. సందేహాలను నివృత్తి చేయడం, విద్యార్థులను బృందాలుగా చదివిస్తూ వారూ ఉత్తీర్ణత సాధించేలా తీర్చిదిద్దాలి. విద్యార్థులకు అల్పాహారం ఏర్పాటు చేయడం, త్వరగా స్టడీ మెటీరియల్ అందజేసేలా జడ్పీ ఛైర్‌పర్సన్, సీఈవో చర్యలు తీసుకుంటున్నారు.

ప్రాథమిక రంగాల పురోగతితో.. స్వర్ణాంధ్ర సాకారం



వ్యవసాయ పరికరాలు పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ, ఎమ్మెల్యే తాతయ్య, నెట్టెం రఘురాం తదితరులు

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే : ప్రాథమిక రంగాలను పురోగమనంలో నడిపించడం ద్వారానే సమాజ సర్వతోముఖాభివృద్ధి సాకారమై అది స్వర్ణాంధ్రకు సోపానం అవుతుందని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. మండల పరిధి బండిపాలెంలో కేడీసీసీబీ ఛైర్మన్ నెట్టెం రఘురాం, ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య ఆధ్వర్యంలో బుధవారం జరిగిన కిసాన్ పండగ సభలో ఆయన మాట్లాడారు. జిల్లాలో అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్ పండగలో భాగంగా 1,18,629 మంది రైతులకు రూ.79.72 కోట్లు నేరుగా వారి ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య మాట్లాడుతూ సాగును లాభసాటిగా మార్చేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషిని అందిపుచ్చుకోవాలని సూచించారు. నెట్టెం రఘురాం మాట్లాడుతూ రైతు సంక్షేమమే ధ్యేయంగా సాగే ప్రభుత్వం అన్నదాతలకు వరమని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం రైతులకు నమూనా చెక్కు అందజేశారు. కిసాన్ ఉపకరణాలు, మహిళా రైతులకు ఏర్పాటు చేసిన నవీన సేద్య విధానాల ప్రదర్శనలను పరిశీలించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఆర్డీవో బాలకృష్ణ, ఏడీఏ భవాని తదితరులు పాల్గొన్నారు.

ఆరని మంట.. ఆగక తంటా!



ఆటోనగర్‌లో.. ఏ దారిలో చూసినా నిత్యం చెత్త, టైర్లు, వివిధ రకాల వస్తువులను తగలబెడుతూనే ఉన్నారు. దారుల వెంట వెళ్లే వారి కళ్లలో, నోట్లో సైతం పొగచూరి ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఇలా పరిధి పారిశ్రామికవాడ కావడంతో ఎంత కాలుష్యం వెదజల్లినా అడిగేవారే లేక పోయారు. - ఈనాడు, అమరావతి

నగదు రూపంలోనే జోగికి ముట్టజెప్పాం!

సిట్, ఎక్సైజ్ విచారణలో అద్దేపల్లి సోదరుల వెల్లడి



ఈనాడు - అమరావతి: నకిలీ మద్యం కేసులో ప్రధాన నిందితుల ఆర్థిక లావాదేవీలపై సిట్ దృష్టి సారించింది. అద్దేపల్లి సోదరుల బ్యాంకు స్టేట్‌మెంట్లను సేకరించి క్షుణ్నంగా విచారిస్తోంది. మాజీ మంత్రి జోగి రమేష్, అతని సోదరుడు రాములతో ఆర్థిక బంధంపై దృష్టి పెట్టింది. అద్దేపల్లి జనార్దనరావు, జగన్మోహన్‌రావులను సిట్, ఎక్సైజ్ అధికారులు.. రెండో విడత కస్టడీకి తీసుకున్నారు. నాలుగు రోజుల కస్టడీలో భాగంగా బుధవారం తొలి రోజు... నెల్లూరు కారాగారంలో ఉన్న జనార్దనరావు (ఏ1)ను ఉదయం అదుపులోకి తీసుకుని.. అక్కడే వైద్య పరీక్షలు నిర్వహించి మధ్యాహ్నం 3 గంటలకు విజయవాడ తరలించారు. విజయవాడ జైలులోని జగన్మోహన్‌రావును కస్టడీకి తీసుకున్నారు. వీరిని తూర్పు ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించి, అక్కడ విచారించారు.

ప్రతి లావాదేవీపై ఆరా: కొన్నేళ్ల బ్యాంకు స్టేట్‌మెంట్లను తెప్పించి.. పెద్ద లావాదేవీలపై ఇద్దరినీ వేర్వేరుగా ప్రశ్నించారు. నగదు ఎందుకు డ్రా చేశారు? ఎవరికి ఇచ్చారు? ఎందుకు ఇచ్చారనే వివరాలను రాబట్టారు. జోగి సోదరులకు తాము ముడుపులను నగదు రూపంలోనే ఇచ్చామని అంగీకరించినట్లు తెలిసింది. అక్రమ మద్యం, నకిలీ మద్యం వ్యాపారం కోసమే జోగి రమేష్‌కు ఇచ్చామని వీరు విచారణలో తెలిపారు. జోగి సోదరులతో సంబంధాలపైనా ప్రశ్నించినట్లు సమాచారం. గతంలో తాము కలిసే మద్యం సిండికేట్‌లో సభ్యులుగా ఉండి వ్యాపారం చేసినట్లు ఒప్పుకొన్నారు. పలు ప్రశ్నలకు జనార్దనరావు సరైన సమాధానాలు చెప్పలేదు. స్పిరిట్, సీసాల కొనుగోలు, లేబుళ్ల ముద్రణ ఆర్డర్లకు నిధులు ఎలా సమకూరాయని ప్రశ్నించగా.. సమాధానాలు సూటిగా చెప్పలేదు.

తెలుగు రాష్ట్రాల కళాశాలల క్రికెట్లో సంచలనం.. ఈనాడు స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్ఎల్). గ్రామీణ ప్రాంతాల ప్రతిభావంతులకు వేదికగా నిలుస్తూ.. కళాశాలల స్థాయిలో ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ టోర్నీగా గిన్నిస్ బుక్ రికార్డు పుస్తకాల్లో చోటు సంపాదించిన ఈఎస్ఎల్ పండగకు సమయం ఆసన్నమైంది. డిసెంబరు 12న ప్రారంభమయ్యే ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ఈఎస్ఎల్ క్రికెట్ టోర్నీకి దరఖాస్తు ప్రక్రియ మొదలైంది.

క్రికెటోత్సవానికి వేళాయె...

● ఈనాడు స్పోర్ట్స్ లీగ్ క్రికెట్‌కు రంగం సిద్ధం ● దరఖాస్తుల ప్రక్రియ షురూ

ఈనాడు – హైదరాబాద్

కళాశాలల స్థాయిలో రికార్డులు, సంచలనాలతో చరిత్ర సృష్టించిన ఈనాడు క్రికెట్ పండగ మళ్లీ వచ్చేసింది. ఈనాడు క్రికెట్ 15వ సీజన్‌కు రంగం సిద్ధమైంది. జూనియర్ విభాగంలో ఇంటర్, పాలిటెక్నిక్, ఐటీఐ.. సీనియర్ కేటగిరీలో డిగ్రీ, ఇంజినీరింగ్, మెడికల్, పీజీ, ఫార్మా కళాశాలలు ఈఎస్ఎల్-2025లో పాల్గొనవచ్చు. జిల్లా, ప్రాంతీయ స్థాయిల మ్యాచ్‌లు నాకౌట్ పద్ధతిలో జరుగుతాయి. అమ్మాయిల క్రికెట్లో జిల్లా స్థాయి క్రికెట్ సంఘాల తరఫున మహిళల జట్లు ఈఎస్ఎల్‌లో ప్రాతినిధ్యం వహించొచ్చు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో ఉమ్మడి జిల్లాలే ప్రాతిపదిక. అనంతరం ప్రాంతీయ స్థాయిలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు ఉంటాయి. ప్రాంతీయ స్థాయి విజేతలు అమరావతిలో తుది దశ పోటీల్లో తలపడతాయి. తుది దశ పోరు లీగ్ కం నాకౌట్ పద్ధతిలో నిర్వహిస్తారు.

వయసు నిబంధన

- బాలురలో జూనియర్స్- 18 ఏళ్లలోపు (2007, ఆ తర్వాత జన్మించిన వాళ్లు).
- సీనియర్స్- 25 ఏళ్లలోపు (2000, ఆ తర్వాత జన్మించిన వాళ్లు).
- అమ్మాయిల క్రికెట్లో క్రీడాకారిణుల కనీస వయసు 16 ఏళ్లు.. గరిష్ఠ వయసు 24 ఏళ్లు (2001 నుంచి 2013 మధ్య జన్మించిన వారే అర్హులు)

ముఖ్య విషయం

మ్యాచ్ సమయంలో రెండు జట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్), వయసు ధ్రువీకరణకు పదో తరగతి మెమో (ఒరిజినల్)ను నిర్వాహకులకు తప్పనిసరిగా చూపించాలి. అమ్మాయిలు ఆధార్ కార్డు లేదా పుట్టిన రోజు ధ్రువీకరణ పత్రం తీసుకురావాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాటర్లు, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్లు, అండర్ గార్డ్స్, హ్యాండ్ గ్లోవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూ ధరించాలి. అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం.

రిజిస్ట్రేషన్ కోసం

☛ రిజిస్ట్రేషన్ కోసం www.eenadu.net వెబ్‌సైట్ నుంచి దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకుని ప్రిన్సిపల్ సంతకం, రబ్బరు స్టాంప్‌తో 'ఈనాడు' కార్యాలయంలో అందజేయాలి. ఈనాడు కార్యాలయంలో కూడా దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉంటాయి.

☛ మరిన్ని వివరాలకు www.eenadu.net లో చూడగలరు.

దరఖాస్తులకు తుది గడువు
డిసెంబరు 8

పంపాల్సిన చిరునామా
ఈనాడు స్పోర్ట్స్ లీగ్, ఈనాడు ఈవెంట్స్, ఈనాడు ఆఫీసు, గూడవల్లి విలేజ్, విజయవాడ రూరల్ మండలం, ఎన్టీఆర్ జిల్లా-521104
వివరాలకు: 9121170928, 91549 91113
(ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు) ఫోన్ నంబర్లలో సంప్రదించొచ్చు.

నాకౌట్ పద్ధతిలో.. జిల్లా, ప్రాంతీయ, తుది దశల్లో పోటీలు జరుగుతాయి. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలలో ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన పోటీలు నిర్వహిస్తారు. తెలంగాణలో హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్‌లకు ఒకే జిల్లాగా పోటీలు ఉంటాయి.

Title Sponsor: Dhanik Bharat Educational Institutions — The Lloyd Group Initiative
Regional Sponsor: City Chalapathi Institute of Technology, Autonomous, Mothadaka Campus
District Sponsor: GGU Godavari Global University, Rajamahendravaram, A.P. Call: 994 999 3483 | www.ggu.edu.in
FM Partner TV Partner Digital Partner Organised by

ఈఎస్ఎల్‌లో పాల్గొనాలన్న ఆసక్తి ఉన్న ప్రతి జట్టు ఈ కింద పేర్కొన్న డాక్యుమెంట్లను ఈనాడు కార్యాలయానికి పంపాలి.

క్రికెట్ జట్ల నమోదు ఇలా..

పురుషులు

డాక్యుమెంట్-1: కళాశాల లెటర్ హెడ్‌పై టీమ్ మెంబర్ల పేర్లు, తరగతి రాసి ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.
డాక్యుమెంట్-2: ప్లేయర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, పుట్టిన తేదీ, తరగతి వంటి వివరాలతో పాటు ఆటగాళ్ల ఫొటోలు అంటించిన లిస్ట్‌పై ఫిజికల్ డైరెక్టర్, ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.
డాక్యుమెంట్-3: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

మహిళలు

డాక్యుమెంట్-1: అసోసియేషన్ లెటర్ హెడ్‌పై టీమ్ మెంబర్ల పేర్లు, తరగతి రాసి అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం, సీల్/ స్టాంప్‌తో పంపాలి.
డాక్యుమెంట్-2: ప్లేయర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, పుట్టిన తేదీ, తరగతి వంటి వివరాలతో పాటు ప్లేయర్ ఫొటోలు అంటించిన లిస్ట్‌పై అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం సీల్/ స్టాంప్‌తో పంపాలి.
డాక్యుమెంట్-3: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర డిస్ట్రిక్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం, సీల్/ స్టాంప్‌తో పంపాలి.
డాక్యుమెంట్-4: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర తల్లిదండ్రుల సంతకం, ఫోన్ నంబరుతో పంపాలి.

తలుపులు వేయడం మరిచిపోయారంట..!



తెల్లవారుజామున తెరిచి ఉన్న సచివాలయం తలుపులు

కొండపల్లి ఐదో సచివాలయం, మెప్మా కార్యాలయానికి తలుపులు వేయడం సిబ్బంది మరిచిపోయారు. మంగళవారం సాయంత్రం వరకూ విధులు నిర్వహించిన సిబ్బంది కార్యాలయానికి తాళాలు వేయకుండా వెళ్లిపోయారు. రాత్రి సమయంలో కార్యాలయం తలుపులు తెరిచి ఉండడం చూసిన స్థానికులు విధుల నిమిత్తం సిబ్బంది ఉన్నారేమోనని భావించారు. అయితే అర్ధరాత్రి దాటిన తరువాత కూడా తలుపులు తీసి.. విద్యుత్తు దీపాలు వెలుగుతుండడంతో కొందరు స్థానికులు కార్యాలయంలోకి వెళ్లి విషయాన్ని గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. విధుల్లో ఉన్న ట్రాఫిక్ ఎస్సై, సిబ్బంది అక్కడి చేరుకొని కార్యాలయానికి తాళాలు వేసి కమిషనర్‌కు సమాచారం ఇవ్వడంతోపాటు ఉదయాన్నే తాళం చేతులను ఆమెకు అందజేశారు. ఈ భవనం కింద అంతస్తులో సచివాలయం, మొదటి అంతస్తులో మెప్మా కార్యాలయం ఉన్నాయి.

భవానీ దీక్షల విరమణ ఏర్పాట్లకు ప్రణాళిక


చర్చిస్తున్న ఈవో శీనానాయక్, ఏడీసీపీ రామకృష్ణ, ఏసీపీ దుర్గారావు, సీఐ గురుప్రకాష్

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే : భవానీ దీక్షల విరమణ ఏర్పాట్లు ముందస్తు ప్రణాళికతో చేయాలని దుర్గగుడి ఈవో శీనానాయక్ ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. పోలీసు, ఇంజినీరింగ్ అధికారులతో కలిసి ఆయన భవానీ దీక్షల విరమణ ఏర్పాట్లను బుధవారం పర్యవేక్షించారు. దీక్షల విరమణకు హోమగుండాలు, ఇరుముడి పాయింట్లు, ప్రసాదాల విక్రయ కౌంటర్లు, అన్నప్రసాద వితరణ ఏర్పాట్ల నిమిత్తం స్థల పరిశీలన చేశారు. ఈవో మాట్లాడుతూ ఈ నెల 20న సీపీ, కలెక్టర్, మున్సిపల్ కమిషనర్‌లతో దేవస్థానం అధికారుల సమావేశంలో ఏర్పాట్లపై తుది నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఏడీసీపీ రామకృష్ణ, ఏసీపీ దుర్గారావు, సీఐ గురుప్రకాష్, దేవస్థానం డీఈ రవీంద్ర, ఏఈ రామకృష్ణ పాల్గొన్నారు.

సూర్యఘర్‌పై విస్తృత ప్రచారం

సూర్యారావుపేట, న్యూస్‌టుడే : ప్రధాన మంత్రి సూర్యఘర్ పథకంపై విస్తృతంగా ప్రచారం చేయాలని ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పి.పుల్లారెడ్డి పేర్కొన్నారు. బుధవారం రాత్రి సూర్యారావుపేటలోని విద్యుత్తు సర్కిల్ కార్యాలయంలో ఎస్ఈ, ఈఈ, డీఈలు, ఏఈలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సన్న పురోగతిపై చర్చించారు. సూర్యఘర్ పథకం గురించి ఇంటింటి ప్రచారం చేయాలని, వినియోగదారులకు కలిగే లాభాలను వివరించాలని చెప్పారు. వారు ఆకర్షితులయ్యేలా చూడాలని సూచించారు. విద్యుత్తు బిల్లుల వసూళ్లు పూర్తి స్థాయిలో నూరు శాతం జరగాలని కోరారు. లోఓల్టేజీ సమస్య లేకుండా చూడాలని.. ఎక్కడైనా ఈ సమస్య ఉంటే కారణాలు గుర్తించి, పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డైరెక్టర్లు మురళీకృష్ణ, టి.వి.ఎస్.ఎన్.మూర్తి, వెంకటేశ్వర్లు, ఎస్ఈ హనుమయ్య పాల్గొన్నారు.


సమావేశంలో పుల్లారెడ్డి, వెంకటేశ్వర్లు, మూర్తి

రైతుల సంక్షేమానికి సీఎం చంద్రబాబు కృషి

నందిగామ: ఆధునిక సేద్యం లాభదాయకంగా ఉంటుందని ఎంపీ కేశినేని శివనాథ్ పేర్కొన్నారు. స్థానిక బాబు జగ్జీవన్‌రామ్ ఫంక్షన్ హాలులో బుధవారం నిర్వహించిన 'పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ' పథకం రెండో విడత సాయం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య, కమ్మ కార్పొరేషన్ ఛైర్మన్ నాదెండ్ల బ్రహ్మం చౌదరితో కలిసి ప్రకృతి సేద్యంతో పండించిన వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్‌ను పరిశీలించారు. రైతులతో ప్రత్యేకంగా మాట్లాడారు. అనంతరం 'పీఎం కిసాన్-అన్నదాత సుఖీభవ' పథకం కింద నందిగామ నియోజకవర్గంలో 30,216 మందికి సంబంధించిన రూ.20.42 కోట్ల విలువైన నమూనా చెక్కును రైతులకు అందజేశారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ.. అధిక వర్షాల దెబ్బ తిన్న పత్తిని సీసీఐ ద్వారా కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య మాట్లాడుతూ రైతులను ఆదుకునేందుకు పెట్టుబడి సాయంగా ఏటా రూ.20 వేలు ఇస్తున్నట్లు చెప్పారు. సామాజిక అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ పోతుల బాలకోటయ్య పాల్గొన్నారు.


ప్రకృతి సేద్యం ఆహార ఉత్పత్తులను పరిశీలిస్తున్న ఎంపీ శివనాథ్, విప్ సౌమ్య

కిడ్నీ బాధితులకు పోషకాహారం అందజేస్తా

ఎ.కొండూరు, గంపలగూడెం: కేశినేని ఫౌండేషన్ ద్వారా ఎ.కొండూరు మండలంలో వెయ్యి మంది కిడ్నీ బాధితులకు ఆరు నెలల పాటు పోషకాహారం అందిస్తామని ఎంపీ కేశినేని శివనాథ్ పేర్కొన్నారు. జనసేన నాయకుల ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్తిక వనసమారాధనలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ మండలంలో కిడ్నీ సమస్యలపై ఎప్పటికప్పుడు ఆరాతీస్తూ.. ఆధునిక వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మరో రెండు నెలల్లో కృష్ణా జలాలను ప్రతి ఇంటికి అందిస్తామన్నారు. తన రాజకీయ జీవితం, సేవా కార్యక్రమాలు ప్రారంభమైన తిరువూరు నియోజకవర్గం తనకు ప్రత్యేకమన్నారు. రాష్ట్ర సేంద్రియ ఉత్పత్తుల ధ్రువీకరణ సంస్థ ఛైర్మన్ దేవదత్, నాయకులు పాల్గొన్నారు.

ఒలింపిక్స్‌లో పతకమే లక్ష్యం


లెనిన్ కాంస్య విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ధీరజ్, వెంకటరమణ

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: లాస్ ఏంజిల్స్‌లో 2028లో జరిగే ఒలింపిక్స్‌లో పతకం సాధించాలనే లక్ష్యంతో సాధన చేస్తున్నానని ఆసియా ఆర్చరీ ఛాంపియన్‌షిప్ పసిడి పతక విజేత, ఒలింపియన్ బొమ్మదేవర ధీరజ్ చెప్పారు. ఢాకాలో జరిగిన ఆసియా ఛాంపియన్‌షిప్ విజయం తర్వాత విజయవాడ వచ్చిన ధీరజ్.. ఈ పతకాన్ని తన దివంగత గురువు చెరుకూరి లెనిన్‌కు అంకితం చేసినట్లు ప్రకటించారు. బుధవారం నగరంలోని చెరుకూరి వోల్గా వీఎంసీ ఆర్చరీ అకాడమీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రానున్న అంతర్జాతీయ ఈవెంట్ల కోసం భారత జట్టులో స్థానం దక్కించుకోవడానికి కృషి చేస్తున్నానన్నారు. వచ్చే నెలలో హైదరాబాద్‌లో జరిగే జాతీయ సీనియర్ ఆర్చరీ ఛాంపియన్‌షిప్, వచ్చే ఏడాది టోక్యోలో జరిగే ఏషియన్ గేమ్స్‌కు సన్నాహాలపైనే తన దృష్టి ఉందన్నారు. ఆసియా ఛాంపియన్‌షిప్ సెమీ ఫైనల్లో కొరియాపై విజయం తనలో ఆత్మవిశ్వాసాన్ని పెంచిందని, 2028లో లాస్ ఏంజిల్స్‌లో జరిగే ఒలింపిక్స్‌లో పతకాన్ని తప్పక గెలుస్తానని విశ్వాసం వ్యక్తం చేశాడు. 2027లో జరిగే ఆర్చరీ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో కూడా పాల్గొనాలని ఉందన్నారు. ఆసియా గేమ్స్‌కు భారత జట్టులో తన స్థానాన్ని భద్రపరుచుకోవడానికి దిల్లీలో జరిగే మొదటి ట్రయల్స్‌లో తలపడాల్సి ఉందన్నారు. 2024 పారిస్ ఒలింపిక్స్‌లో పాల్గొన్న భారత రికర్వ్ జట్టులో నాల్గో స్థానంలో నిలిచానన్నారు. ప్రస్తుతం ప్రపంచ రికర్వ్ ఆర్చరీలో దేశంలో నంబర్ 1వ స్థానం, ప్రపంచంలో 19వ స్థానంలో ఉన్నానన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్ నాయకత్వంలో ఆర్చరీకి మెరుగైన ప్రోత్సాహం లభిస్తోందని స్పందన వ్యక్తం చేశారు. ముందుగా తన గురువైన లెనిన్ నివాసం వద్ద అనంతరం చీఫ్ కోచ్ సత్యనారాయణ నుంచి ఆశీర్వాదాలు పొందారు. అంతర్జాతీయ యువ ఆర్చర్ డాలి శివానీ, యుక్తిశ్రీలు ధీరజ్‌కు సాదర స్వాగతం పలికారు. చీఫ్ కోచ్ సత్యనారాయణ.. ఆసియా ఛాంపియన్‌షిప్ కాంపౌండ్ ఆర్చరీలో మరో పసిడి పతక విజేత వెన్నం జ్యోతి సురేఖను అభినందించారు. రాష్ట్ర ఆర్చరీ సంఘం ప్రధాన కార్యదర్శి వెంకటరమణ, ఉపాధ్యక్షుడు శ్రావణ్‌కుమార్, జిల్లా సంఘం కోశాధికారి ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు (కిలో కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -111 రిటైల్ ధర 138 చికెన్ విత్ స్కిన్ - 200, చికెన్ స్కిన్‌లెస్ - 228.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 130, 139, 150 చికెన్ విత్ స్కిన్ - 250 చికెన్ స్కిన్‌లెస్ - 260.

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 660 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.100/-.

వెట్టిచాకిరి రహిత జిల్లాగా మారుద్దాం

పాయకాపురం, న్యూస్‌టుడే : వెట్టిచాకిరి నిర్మూలనకు జిల్లా స్థాయి నిఘా-పర్యవేక్షణ సంఘాన్ని (విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ) ఏర్పాటు చేసినట్టు కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. వెట్టిచాకిరి రహిత జిల్లాగా మారుద్దామని, దీనికి ప్రతి ఒక్కరి సహకారం అవసరమని పేర్కొన్నారు. బుధవారం నగరంలోని కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా స్థాయి కమిటీకి కలెక్టర్ ఛైర్మన్‌గా, జాయింట్ కలెక్టర్ కన్వీనర్‌గా ఉంటారని తెలిపారు. సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్, జిల్లా పంచాయతీ అధికారి, డీఆర్‌డీఏ పీడీ, డ్వామా పీడీ, లీడ్ బ్యాంకు మేనేజర్, జిల్లా న్యాయసేవల ప్రాధికార సంస్థ, పోలీసు శాఖల ప్రతినిధులు, ఇద్దరు సామాజిక కార్యకర్తలు, ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలకు చెందిన ముగ్గురు వ్యక్తులు సభ్యులుగా ఉంటారని వివరించారు. కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ నోడల్ అధికారిగా వ్యవహరిస్తారని చెప్పారు. వీరంతా గ్రామాలు, పట్టణాల్లో వెట్టిచాకిరి బాధితులను గుర్తించి, సంబంధిత వ్యక్తులపై చర్యలకు నివేదిస్తుందని తెలిపారు. బాధితుల పునరావాసానికి సూచనలు ఇస్తుందని వివరించారు. రుణం వసూలకు వేసిన కేసుల విషయంలో బాధితులకు మద్దతుగా నిలుస్తుందని తెలిపారు. వెట్టిచాకిరి చేయిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి నిఘా, పర్యవేక్షణ సంఘం నోడల్ అధికారి, కార్మికశాఖ డిప్యూటీ కమిషనర్ జి.ధనలక్ష్మి, సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రమాదేవి, డీఆర్‌డీఏ పీడీ నాంచారయ్య, డీపీవో లావణ్యకుమారి, జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ ప్రియాంక, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు కీర్తి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

స్టేడియాల ఆధునికీకరణ పనులు ప్రారంభించాలి


మాట్లాడుతున్న ఎంపీ కేశినేని శివనాథ్, చిత్రంలో శాప్ ఎండీ భరణి తదితరులు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: వచ్చే నెల 22వ తేదీ నుంచి నగరంలో జరిగే జాతీయ సీనియర్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌నకు వీలుగా నగరంలోని ఇండోర్ స్టేడియాల ఆధునికీకరణ పనులు యుద్ధ ప్రాతిపదికన ప్రారంభించాలని ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) పేర్కొన్నారు. స్థానిక ఐజీఎంసీ స్టేడియంలోని శాప్ కార్యాలయంలో బుధవారం నగరంలోని వీటిపై సమీక్ష సమావేశం నిర్వహించగా శాప్ ఎండీ ఎస్.భరణి, పలువురు డైరెక్టర్లు, అధికారులు, ఆర్కిటెక్చర్లు పాల్గొన్నారు. నగరంలోని ఐజీఎంసీ, పటమటలోని సీహెచ్ఆర్‌కే వీఎంసీ, మహాత్మాగాంధీ రోడ్డులోని డీఆర్ఆర్ఎంసీ ఇండోర్ స్టేడియం, పశ్చిమ నియోజకవర్గంలోని విద్యాధరపురం వీఎంసీ క్రీడా ప్రాంగణాలను జాతీయ, అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో అభివృద్ధి చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. స్థానిక ఐజీఎంసీ స్టేడియానికి సంబంధించి ఆధునిక సదుపాయాల ఏర్పాటు, క్రీడాకారులకు అవసరమైన వసతుల విస్తరణ, స్థానిక క్రీడా కార్యకలాపాల ప్రోత్సాహం వంటి అంశాలపై ప్రత్యేకంగా చర్చించారు. స్టేడియాల పునరుద్ధరణకు వారం రోజుల్లోగా డీపీఆర్‌లు తయారు చేయాలని ఎంపీ సంబంధిత అధికారులను ఆదేశించారు. శాప్ పరిపాలనాధికారి రమావత్ వెంకట రమణనాయక్, ఈఈ మునిశేఖర్, డీఎస్‌డీవో కాకర్ల కోటేశ్వరరావు, ఆర్కిటెక్చర్లు వడ్లమూడి శ్రీహర్ష, రామ్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకటన

నా క్లయింటు, కుమారి గెడ సాయిసాహితి, తండ్రి శరత్‌బాబు, విజయవాడ వాస్తవ్యుల నుండి సంజాయిషీ పొంది యావన్మందికీ తెలియచేయునది ఏమనగా..

నా క్లయింటు ఈ దిగువ ఉదహరించిన షెడ్యూలు దాఖలా ఆస్తిని సదరు స్థిరాస్తి యజమానులైన శ్రీ చెక్కా సత్యనారాయణ, తండ్రి శ్రీరామమూర్తి మరియు ఇతర పదిమంది యజమానుల నుండి క్రయం పొందుటకు నిశ్చయించుకొని కొంత అడ్వాన్సు చెల్లించి వారి నుండి విక్రయ ఖరారును పొందియున్నారు. శ్రీ గుంటూరు గోపాలరావు, తండ్రి సుబ్బారావు వారి జీవితకాల మునందు కుందావారి కండ్రిక గ్రామ ఆర్.ఎస్.నెం.51/1ఎరు దాఖలా సంక్రమించబడిన ఆస్తిని గ్రామ ఆర్.ఎస్.ఆర్ కాపీనందు [illegible] చేయించుకొని నిర్వివాదముగా అనుభవించుచూ, [illegible] కుమారులైన శ్రీ గుంటూరు నాగేశ్వరరావు, గుంటూరు [illegible] పరుచుకొని వారి పేరిటనే పట్టాదారు పాసుపుస్తకములు [illegible] కుటుంబ ఆస్తిగా అనుభవించుచూ, వారు మరియు [illegible] 27-07-2002న క్రయ దస్తావేజు నెం.5408/2002, జిల్లా [illegible] మున్నంగి మణిమాల, భర్త శివకుమార్ రెడ్డి క్రయం పొంది [illegible] 79 పట్టా నెం. 145రుగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము వారి [illegible] పట్టాదారు పాసుపుస్తకమును పొంది నిర్వివాదముగా [illegible] వారి నుండి శ్రీ చెక్కా సత్యనారాయణ మరియు ఇతర [illegible] వారి భాగములను నిర్దేశించుకొనుచూ, ది. 10-10-2014న [illegible] 14. సబ్ రిజిస్ట్రీ నున్నగా క్రయం పొంది జాయింటుగా [illegible] దరిమిలా క్రయదారులలో ఒకరైన శ్రీమతి గుడివాడ [illegible] -2022న పరమపదించిన దరిమిలా వారి వాటాకు [illegible]

[illegible] ఎన్టీఆర్ జిల్లా, విజయవాడ రిజిస్ట్రేషన్ జిల్లా, [illegible] పరిధిలోని, విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ ఏరియాలోని, విజయవాడ కుందావారి కండ్రిక ఆర్.ఎస్.నెం.51/1ఎరు దాఖలా చ||గ|| 4549.6లు లేక చ||మీ|| 3803.92లు ఖాళీ నివేశన స్థలమునకు **హద్దులు: తూర్పు:** మండా కోటేశ్వరమ్మ గారి భూమి, **దక్షిణం:** కాసరనేని ఆనందరావు గారి భూమి, **పడమర:** పాతపాడు పొలిమేర డొంక, **ఉత్తరం:** గుంటూరు శివ శంకరరావు గారి భూమి.

ఈ నాలుగు హద్దుల మధ్య చ||గ|| 4549.6లు లేక చ||మీ|| 3803.92లు ఖాళీ నివేశన స్థలము మరియు అందలి రివాజుగా గల హక్కులతో సహాయున్నూ.

Dr. ధారా సత్యనారాయణ, Advocate
డోర్ నెం: 36-12-13/3, డా.కిలారు బచ్చిబాబు వీధి, మొగల్‌రాజపురం, విజయవాడ – 520 010.
Cell. No. 94403 20435, Phone No. 0866-2573736.
విజయవాడ, తేది: 19-11-2025

3న అగ్రిగోల్డ్ బాధితుల ఆవేదన దీక్ష

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ డిసెంబరు 3న విజయవాడలో ఆవేదన దీక్ష చేపడుతున్నట్లు అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు తెలిపారు. సత్వర న్యాయం కోసం విజయవాడ కేంద్రంగా ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్షా సమావేశం నిర్వహించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. బుధవారం ఆయన విజయవాడలో విలేకరులతో మాట్లాడారు. అగ్రిగోల్డ్ సంస్థ రాష్ట్రంలో 19.52 లక్షల మంది ఖాతాదారులను రూ.3986 కోట్లకు మోసం చేసిందని గుర్తు చేశారు. వచ్చే జనవరి నాటికి ఉద్యమం చేపట్టి 12 సంవత్సరాలు అవుతుందన్నారు. ప్రత్యేక సిట్ ఏర్పాటు చేసి, బాధితులకు న్యాయం జరిగేలా ముఖ్యమంత్రి చొరవ తీసుకోవాలని కోరారు. డిసెంబరు 3వ తేదీలోపు సంస్థ ఆస్తులను వేలం వేసి, యజమానుల పేరుతో ఉన్న ఆస్తులను స్వాధీనం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో అసోసియేషన్ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి ఎం.వెంకటేశ్వరరావు, కృష్ణా జిల్లా అధ్యక్షుడు కె.గగన్, విజయవాడ నగర కార్యదర్శి ఎస్.కె.షరీఫ్, గుంటూరు జిల్లా కార్యదర్శి కె.భాస్కరరావు, కె.మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

సత్యనారాయణపురం(గాంధీనగర్), న్యూస్‌టుడే : లైసెన్స్డ్ ఇంజినీర్స్ అసోసియేషన్ ఎన్టీఆర్ జిల్లా నూతన కార్యవర్గాన్ని బుధవారం స్థానిక సంఘ కార్యాలయంలో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా వి.రామకృష్ణప్రసాద్, కార్యదర్శిగా అరిగెల చంద్రశేఖర్, ఉపాధ్యక్షులుగా ఎస్.సుధాకర్, కె.శ్రీహరి, సంయుక్త కార్యదర్శిగా చంద్రశేఖర్, కోశాధికారిగా పి.సుధాకర్, ఉపకోశాధికారిగా ఎం.మదన్‌మోహన్, న్యాయ సలహాదారుడిగా బాలాజీ ఎన్నికయ్యారు.

విజయ్‌భాస్కర్‌రెడ్డి బెయిల్... కస్టడీపై తీర్పు నేడు

ఈనాడు డిజిటల్, మచిలీపట్నం: మహిళలు, కూటమి నేతలు, న్యాయమూర్తులపై సామాజిక మాధ్యమాల్లో అసభ్య పోస్టులు పెట్టి అరెస్టయిన వైకాపా సోషల్ మీడియా కార్యకర్త మాలపాటి విజయ్‌భాస్కర్ రెడ్డి బెయిల్, నిందితుడిని కస్టడీకి ఇవ్వాలని దాఖలైన పిటిషన్లపై ఇరు వర్గాల వాదనలు బుధవారం ముగిశాయి. గురువారం న్యాయాధికారి వీటిపై తీర్పు వెలువరించనున్నారు. నిందితుడు విజయ్‌భాస్కర్‌రెడ్డి అనుచిత పోస్టుల కేసులో లోతైన విచారణ చేసేందుకు వారం రోజులు కస్టడీకి ఇవ్వాలని పోలీసులు కోరిన సంగతి తెలిసిందే.

అమరావతి రైతుల సమస్యలు పరిష్కరించండి

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : అమరావతి ప్రాంత రైతుల సమస్యలు సత్వరమే పరిష్కరించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబుకు లేఖ రాశారు. ప్రభుత్వం, సీఆర్‌డీఏ అధికారులు.. రైతు సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం చూపడం తగదన్నారు. పదేళ్లుగా ఎన్నికలు జరగక 15వ ఆర్థిక సంఘం నిధులు నిలిచిపోయాయని, 29 గ్రామాల అభివృద్ధి ఆగిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు రాజధానుల కేసులు, ఆర్-5 జోన్ కేసులు ఉపసంహరించుకోవాలని, రైతులకు వార్షిక కౌలు బకాయిలు చెల్లించాలని కోరారు. అమరావతిని రాజధానిగా చేస్తూ పార్లమెంటులో చట్టం చేసేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని సూచించారు. ఈ నెల 21, 22 తేదీల్లో నిర్వహించే త్రీమాన్ కమిటీలో అమరావతి రైతుల సమస్యల పరిష్కారం కోసం సీఆర్‌డీఏ స్పష్టమైన ప్రకటన చేయాలని ఆయన కోరారు.

అరుణ బెయిల్ పిటిషన్‌పై ముగిసిన వాదనలు

నేడు ఉత్తర్వులు ఇవ్వనున్న కోర్టు

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ వృద్ధుడి నుంచి రూ.24.5 లక్షలు వసూలు చేసి మోసం చేసిన కేసులో నిందితురాలు నిడిగుంట అరుణ బెయిల్ పిటిషన్‌పై వాదనలు ముగిశాయి. గత నెల 13న విజయవాడలోని సూర్యారావుపేట పోలీసులు ఆమెపై మోసం కేసు నమోదు చేసిన విషయం విదితమే. ఈ కేసులో ఆమెను పోలీసులు రెండు రోజులు కస్టడీకి తీసుకుని విచారించారు. తనకు బెయిల్ మంజూరు చేయాలంటూ అరుణ ఒకటో అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై బుధవారం ఇరుపక్షాల న్యాయవాదులు తమ తమ వాదనలు వినిపించారు. అనంతరం న్యాయమూర్తి కేసు విచారణను గురువారానికి వాయిదా వేశారు. బెయిల్ పిటిషన్‌పై నేడు (గురువారం) ఉత్తర్వులు ఇస్తామని న్యాయస్థానం ప్రకటించింది.

తిరువూరు

• తిరువూరు • మైలవరం

స్టేడియంలో అంతర్జాతీయ వసతులు కల్పించాలి

ఇబ్రహీంపట్నం గ్రామీణం: మూలపాడు క్రికెట్ స్టేడియాన్ని అంతర్జాతీయ పోటీలకు అనువుగా తీర్చిదిద్దాలని ఎంపీ, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఛైర్మన్ కేశినేని శివనాథ్ నిర్వాహకులకు సూచించారు. ఆయన బుధవారం స్టేడియాన్ని పరిశీలించారు. అక్కడ నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలు, మౌలిక వసతులు, నిర్వహణ తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ స్టేడియంలో అంతర్జాతీయ స్థాయిలో పోటీలు నిర్వహించేందుకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. అందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

వసతిగృహ నిర్మాణానికి శంకుస్థాపన

విస్సన్నపేట: విస్సన్నపేటలో సాంఘిక సంక్షేమ బాలుర వసతిగృహానికి బుధవారం ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రూ.3 కోట్లతో వసతి గృహం నిర్మిస్తున్నట్లు తెలిపారు. నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ఎంఈవో-2గా పి.ఎస్.ఎన్.రాజు

తిరువూరు టౌన్, న్యూస్‌టుడే: తిరువూరు మండల విద్యాశాఖాధికారి-2గా పి.ఎస్.ఎన్.రాజు బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల పదోన్నతుల సందర్భంగా ఆయన నియమితులయ్యారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ మండలంలో విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపరిచేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

పట్టణాన్ని శుభ్రంగా ఉంచండి

తిరువూరు టౌన్, న్యూస్‌టుడే: తిరువూరు మున్సిపల్ కార్మికులకు తోపుడు బండ్లు, రిక్షా బండ్లను ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణాన్ని శుభ్రంగా ఉంచేందుకు అందరూ కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ కె.నిర్మల, మున్సిపల్ కమిషనర్ కె.మనోజ, వార్డు కౌన్సిలర్లు, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

? ఇటీవల కృష్ణా నదికి వచ్చిన వరదల కారణంగా కోటికలపూడి మసక లంక పొలాల్లో విద్యుత్తు స్తంభాలు పడిపోయాయి. వాటిని ఇప్పటివరకు అధికారులు నిలబెట్టి విద్యుత్తు సరఫరా పునరుద్ధరించ లేదు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి. **- జయపాల్, రైతు, కోటికలపూడి**

✔ పొలాల్లో తడి ఆరిన తరువాత స్తంభాలు నిలబెట్టి విద్యుత్తు సరఫరా పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటాం.
- వెంకన్న, ఏఈ, ఇబ్రహీంపట్నం

– ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే

? కొండపల్లి పంచాయతీ కార్యాలయం రోడ్డు సైకిల్ స్వామి అపార్టుమెంటు వద్ద పారిశుద్ధ్య సిబ్బంది చెత్తను తొలగించడం లేదు. ఎందుకని ప్రశ్నిస్తే కూడలి వద్దకు వచ్చి బండిలో వేసుకోవాలని చెబుతున్నారు. **- కిరణ్, స్థానికుడు.**

✔ సిబ్బంది చేత ఆ ప్రాంతంలో పారిశుద్ధ్య పనులు చేయిస్తాను. **- మేనేజర్ వెంకటరత్నం.** –న్యూస్‌టుడే, కొండపల్లి

అన్నదాత సుఖీభవ

నిధుల జమతో హర్షం

మైలవరం, రెడ్డిగూడెం, న్యూస్‌టుడే

రైతుల పంట పెట్టుబడులకు తోడుగా ఉండేందుకు కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అన్నదాత సుఖీభవతో వారిలో ఆనందం వెల్లివిరుస్తోంది. ఈ పథకం ద్వారా రెండో విడత కింద నిధులను రైతుల ఖాతాల్లోకి జమచేయడంపై హర్షం వ్యక్తమవుతోంది. ఒడిదొడుకుల్లో ఉన్న వ్యవసాయరంగానికి ప్రభుత్వం చేస్తున్న సాయం ఊతమిస్తోందని చెబుతున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 30 వేల మందికి పైగా రైతులకు రూ.15 కోట్లకు పైగా లబ్ధి చేకూరనుంది. ఇప్పటికే తొలి విడత సాయాన్ని అందుకున్న రైతులకు బుధవారం సాయంత్రం నుంచి ఖాతాల్లో జమపై వస్తున్న సంక్షిప్త సందేశాలతో ఆనందపడుతున్నారు. రైతుల అభిప్రాయమిది.



మైలవరం మండలం మొర్సుమిల్లిలో రైతులకు పథకం నమూనా చెక్కు అందజేస్తున్న జేసీ ఇలక్కియా

సన్న, చిన్నకారు రైతులకు ఉపయోగం



అన్నదాత సుఖీభవ రెండో దశ డబ్బులు బ్యాంకు ఖాతాల్లో వేయడం సన్న, చిన్నకారు రైతులకు ఎంతగానో ఉపయోగపడుతాయి. ప్రస్తుతం మొక్కజొన్న సాగుకు సిద్ధమవుతున్న రైతులకు విత్తనాలు, మందుల కొనుగోలుకు అక్కరకు వస్తాయి. **- గుత్తి సత్యనారాయణ, కూనవరాజుపర్వ**

నిధుల విడుదల సంతోషం




రెండో విడత అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ నిధులు విడుదల చేయడం సంతోషం. ప్రస్తుతం మామిడి తోటల్లో మందు పిచికారీ చేస్తున్నాం. అందుకు ఈ డబ్బులు ఉపయోగపడతాయి. రైతులకు ఊరటనిస్తాయి. **- మాదల సూర్యప్రకాష్‌రావు, కూనవరాజుపర్వ**

కొండంత భరోసా ఇస్తోంది..



రైతుల కోసం కూటమి ప్రభుత్వం చేస్తున్న ఆర్థిక సాయం కొండంత భరోసానిస్తోంది. గతానికంటే మెరుగైన సాయం సన్న, చిన్నకారు రైతులకు ఆసరాగా ఉంటోంది. మాట నిలబెట్టుకుంటున్న ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు. **- చల్లా సుబ్బారావు, రైతు, మొర్సుమిల్లి**

పంట పెట్టుబడికి వినియోగం



ప్రభుత్వం సాయంగా అందించడం మంచి ఊరట. ఈ మొత్తం సాగు పెట్టుబడులకు ఉపయోగపడుతుంది. సేద్యంలో ముందుకు సాగటానికి దోహదపడుతుంది. **- అక్కల మధుసూదనరెడ్డి, రైతు, గణపవరం**

రైతు కష్టం తెలిసిన సీఎం చంద్రబాబు

గంపలగూడెం: రైతు విలువ, కష్టం తెలిసిన వ్యక్తి సీఎం చంద్రబాబు అని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు అన్నారు. అన్నదాతలు సంతోషంగా ఉంటేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని భావించి పంటల సాగుకు ప్రభుత్వం నుంచి తోడ్పాటు అందించాలనే చంద్రబాబు అన్నదాత సుఖీభవ పథకం అమలు చేస్తున్నారని తెలిపారు. అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకం సొమ్ములు రైతుల ఖాతాలకు బుధవారం జమ చేస్తున్న సందర్భంగా గంపలగూడెంలో ఏర్పాటు చేసిన నియోజకవర్గ స్థాయి సభలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. సభ వద్ద ప్రదర్శనగా ఏర్పాటు చేసిన ఎరువులు పిచికారీ చేసే డ్రోన్, ప్రకృతి సిద్ధంగా పండించిన పంటలను ఆయన పరిశీలించారు. నియోజకవర్గంలో అన్నదాత సుఖీభవ పథకం, పీఎం కిసాన్ యోజన ద్వారా 33,658 మంది రైతులకు రూ.22.50 కోట్ల లబ్ధి చేకూరిందన్నారు. అనంతరం రైతులకు నమూనా చెక్కు అందజేశారు.



గంపలగూడెంలో నమూనా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు, ఆర్డీవో మాధురి, అధికారులు



సేంద్రియ వ్యవసాయ చక్రం పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ తదితరులు

ఇబ్రహీంపట్నం గ్రామీణం: రైతు సంక్షేమానికి కూటమి సర్కారు అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ తెలిపారు. ఇబ్రహీంపట్నం గ్రామీణ మండలం మూలపాడు వ్యవసాయ క్షేత్రంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయన ఎంపీ కేశినేని శివనాథ్‌తో కలిసి నియోజకవర్గ స్థాయిలో పీఎం కిసాన్- అన్నదాత సుఖీభవ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో 30,241 మంది అన్నదాతలకు ఈ పథకం ద్వారా రూ.15.12 కోట్లు బ్యాంక్ ఖాతాల్లో జమ చేసినట్లు వివరించారు.

విస్సన్నపేట: మండలంలోని నరసాపురం రైతు సేవా కేంద్రంలో బుధవారం పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ నగదు జమ కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మీకల్యాణి, ఎంపీడీవో చిన్న రాట్నాలు, ఏడీఏ శశికళ పాల్గొన్నారు.

అర్హులకు నెల రోజుల్లో ఉపకరణాలు ఇస్తాం

మైలవరం, న్యూస్‌టుడే: దివ్యాంగులైన విద్యార్థులకు అర్హతల ప్రకారం నెల రోజుల్లో అవసరమైన ఉపకరణాలను పంపిణీ చేయనున్నట్లు సమగ్ర శిక్షా జిల్లా సహిత విద్య సమన్వయకర్త కె.నారాయణ తెలిపారు. ఆ శాఖ ఆధ్వర్యంలో బుధవారం దివ్యాంగులకు ఉచిత ఉపకరణాల నిర్ధారణ శిబిరాన్ని నిర్వహించారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల పరిధిలోని దివ్యాంగులను వివిధ అంశాలపై పరీక్షలు నిర్వహించారు. వారిలో వినికిడి లోపం, బుద్ధిమాంద్యం, మెదడు పక్షవాతం, శారీరక వైకల్యం, అంధత్వం తదితర సమస్యలపై నిపుణుల ఆధ్వర్యంలో పరీక్షలు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవోలు ఎల్.బాలు, రాజు పాల్గొన్నారు.

పేద మహిళలకు చీరల పంపిణీ

తిరువూరు టౌన్, న్యూస్‌టుడే: తిరువూరు సత్యసాయి బాబా మందిరంలో 100 మంది పేద మహిళలకు భక్తులు చీరలు అందజేశారు. మందిర కమిటీ సభ్యుడైన ప్రభాకరరావు మాట్లాడుతూ భగవాన్ సత్యసాయిబాబా నూరో జన్మదిన వేడుకల సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. గురువారం 100 మంది పేదలకు దుప్పట్లు అందజేస్తున్నామని వెల్లడించారు.

వృద్ధులకు దుప్పట్లు అందజేత

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: స్థానిక ఫ్రెండ్స్ సర్వీస్ సొసైటీ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఎస్సీవాడలో 100 మంది వృద్ధులు, వితంతువులకు బుధవారం దుప్పట్లు పంపిణీ చేసినట్లు సేవా సంస్థ అధ్యక్షుడు సిహెచ్.విజయ్‌కుమార్ తెలిపారు. ఓబులాపురం గ్రామానికి చెందిన నూనె రోశిరెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు, నరుకుళ్లపాడు సర్పంచి నూనె అప్పిరెడ్డి ఆర్థిక సహాయంతో వీటిని అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు జానలపాటి వేణుగోపాలరెడ్డి, ఎం.నాగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

సందడిగా గ్రంథాలయ వారోత్సవాలు

మైలవరం, న్యూస్‌టుడే: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక శాఖ గ్రంథాలయం ఆధ్వర్యంలో మహిళలకు రంగవల్లుల పోటీలు నిర్వహించగా, మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకుని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బొర్రగూడెంలోని దామర్ల త్యాగరాజు, కోమల జ్ఞానకేంద్రంలో బుధవారం నిర్వహించిన గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగేశ్వరరావు, గ్రంథాలయ నిర్వాహకులు ఎం.ప్రసన్న, ఎస్.విద్యాదీపిక తదితరులు పాల్గొన్నారు.

జి.కొండూరు, న్యూస్‌టుడే: స్థానిక శాఖ గ్రంథాలయంలో బుధవారం విద్యార్థులకు చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలు నిర్వహించినట్లు గ్రంథాలయాధికారిణి విజయకృష్ణ తెలిపారు. విజేతలకు గురువారం నిర్వహించే సమావేశంలో బహుమతులు అందజేస్తామని ఆమె తెలియజేశారు.

గంపలగూడెం, న్యూస్‌టుడే: మండలంలోని గంపలగూడెం, పెనుగొలను గ్రంథాలయాల్లో బుధవారం బాలికలకు కుర్చీలాట, ముగ్గుల పోటీలు నిర్వహించారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ, వీరనారి ఝాన్సీలక్ష్మీబాయి చిత్రపటాలకు నివాళులర్పించారు. పలువురు మహిళలను సత్కరించారు. గ్రంథాలయ నిర్వాహకులు వి.జ్యోతిర్మయి, వి.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పోటీలు ఏర్పాటు చేశారు.



మైలవరంలో రంగవల్లులు వేస్తున్న మహిళలు



జి.కొండూరు: చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులతో విజయకృష్ణ తదితరులు

అసంపూర్తి రహదారి.. నరకంగా మారి..

ఎ.కొండూరు, న్యూస్‌టుడే: కట్టుబడిపాలెం కుమ్మరిపాలెం గ్రామాల మధ్య ఆర్‌అండ్‌బీ రహదారి పనులు అసంపూర్తిగా నిలిచాయి. దీంతో ఆయా గ్రామాల మధ్య రాకపోకలకు తీవ్ర అవస్థలు పడుతున్నామని వాహనచోదకులు వాపోతున్నారు. రూ.2 కోట్ల నాబార్డు నిధులతో కట్టుబడిపాలెం నుంచి ప్రారంభించి కుమ్మరిపాలెం గ్రామం మీదుగా వైద్యురుపాడు వరకు దాదాపు 2.5 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మించాల్సి ఉంది. అయినా పనులు పూర్తి కాలేదు. జులై నెలలో రహదారి నిర్మాణం ప్రారంభించి పాత రోడ్డును తొలగించి వెట్‌మిక్స్ పరిచి పనులు నిలిపేశారు. దీంతో వెట్‌మిక్స్‌లో ఉన్న కంకర రాళ్లు పైకి తేలి వాహనాలు పాడవుతున్నాయని చోదకులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారి పనులు పూర్తి చేసి తమ అవస్థలు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.



వైభవంగా అయ్యప్పస్వామి పడిపూజ

గంపలగూడెం: పెనుగొలను సమీప మెట్టగుట్ట శేషాచల శ్రీనివాస ఆలయంలో మంగళవారం రాత్రి అయ్యప్పస్వామి పడిపూజ వైభవంగా నిర్వహించారు. గుడి అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పి.వెంకట్రావు, అయ్యప్ప దీక్ష తీసుకున్న భక్తులు పాల్గొని కర్పూర జ్యోతి వెలిగించి పూజలు చేశారు.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తత అవసరం

కంచికచర్ల, న్యూస్‌టుడే: ఆన్‌లైన్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నందిగామ గ్రామీణ సీఐ డి.చవాన్ అన్నారు. ఆ మేరకు కంచికచర్ల సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచిలో వినియోగదారులకు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

మైలవరం, న్యూస్‌టుడే: మైలవరం మండలంలోని చంద్రగూడెం రైస్‌మిల్లును జిల్లా సంయుక్త కలెక్టర్ ఇలక్కియా పరిశీలించారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీలో ధాన్యాన్ని పరిశీలించి, సకాలంలో కొనుగోలు చేసి, కాటాలు వేయాలని అధికారులకు సూచించారు. కోతలు ప్రారంభమవుతున్న తరుణంలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోళ్ల వేగవంతానికి చర్యలు తీసుకోవాలని జేసీ ఆదేశించారు.

ఆర్థిక భరోసా..పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకిచ్చే ఆర్థికసాయంతో వారికి భరోసా లభిస్తుందని జేసీ ఇలక్కియా పేర్కొన్నారు. పథకం మండలస్థాయి కార్యక్రమాన్ని బుధవారం మండలంలోని మొర్సుమిల్లిలోని రైతుసేవాకేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో 7389 మందికి గానూ రూ.5.01 కోట్లు మంజూరైనట్లు వివరించారు. ఒక్క మొర్సుమిల్లిలోనే 640 మంది రైతులకు రూ.44.80 లక్షల ప్రయోజనం కలుగుతుందని చెప్పారు. నమూనా చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ స్టాళ్లను, డ్రోన్లను పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచి మాడపాటి రమాదేవి, తహసీల్దార్ అబ్దుల్ దరియా, ఏవో సంధ్యారాణి, డీటీ మాధవి, పీఏసీఎస్ అధ్యక్షుడు కె.సత్యనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కేంద్రాల్లో రైతులకు మద్దతు ధర

ఎ.కొండూరు, న్యూస్‌టుడే: ధాన్యం పండించిన రైతులు మద్దతు ధర పొందేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలని ఆర్డీవో కె.మాధురి సూచించారు. మండలంలోని పోలిశెట్టిపాడు, రేపూడిలో నూర్పిడి చేసి ఆరబెట్టిన ధాన్యం రాశులను బుధవారం ఆమె పరిశీలించి సంబంధిత రైతులతో మాట్లాడారు. ధాన్యం విక్రయించిన 24 గంటల్లో నగదు బ్యాంకు ఖాతాలకు జమవుతుందని తెలిపారు. రేపూడిలో భూముల రీసర్వేకు సంబంధించిన జరుగుతున్న డ్రోన్ ట్రూతింగ్‌ను ఆమె తనిఖీ చేశారు. పడమర మాధవరంలో రైస్ మిల్లులో ధాన్యం దిగుబడులను పరిశీలించారు. జియో ట్యాగింగ్ ద్వారా సాగుదారులు తమ సొంత వాహనాల్లో కూడా ధాన్యాన్ని మిల్లుకు తరలించవచ్చన్నారు. తహసీల్దార్ కె.లక్ష్మి పాల్గొన్నారు.



మైలవరం యార్డులో రైతులు, అధికారులతో మాట్లాడుతున్న జేసీ ఇలక్కియా



ఎ.కొండూరు: పోలిశెట్టిపాడులో రైతులు ఆరబెట్టిన ధాన్యం పరిశీలిస్తున్న ఆర్డీవో మాధురి తదితరులు

● 24 గంటల్లో నగదు జమ

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: రంగాపురం గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ జె.సుశీలాదేవి బుధవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ 24 గంటల్లో ప్రభుత్వం నుంచి రైతులకు డబ్బులు జమవుతున్నాయన్నారు.



కార్యక్రమంలో అధికారులు, రైతులు

శివాలయాల్లో కార్తికమాసం దీపోత్సవాలు

గంపలగూడెం, తిరువూరు, ఎ.కొండూరు ఇబ్రహీంపట్నం గ్రామీణం: కార్తికమాసం సందర్భంగా శివాలయాల్లో బుధవారం భక్తులు దీపోత్సవాలు చేశారు. ఎన్టీటీపీఎస్ ఏ కాలనీ శక్తి విశ్వేశ్వరస్వామి దేవాలయంలో స్వామివారికి ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు.



ఎ.కొండూరు మండలం కంభంపాడులో.. →

తిరువూరు చంద్రమౌళేశ్వరస్వామి గుడిలో వెన్నపూసతో అలంకరించిన శివలింగం ←





గంపలగూడెం మండలం కొత్తపల్లిలో..

గోసవీడు(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని గోసవీడు భక్త బృందం ఆధ్వర్యంలో బుధవారం కార్తిక వనసమారాధన సంప్రదాయంగా నిర్వహించారు. సమీప మెట్టగుట్ట శ్రీనివాస ఆలయానికి భక్త బృందం తరలివెళ్లి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి, సామూహిక భోజనాలు చేశారు. పిరమిడ్ సేవాదళ సభ్యుల ఆధ్వర్యంలో ధ్యానంపై అవగాహన కల్పించారు.



పిరమిడ్ సేవాదళ్ సభ్యులను సత్కరిస్తున్న గోసవీడు భక్త బృందం

పేదల భూముల్ని పందేరం చేయొద్దు



మాట్లాడుతున్న సీహెచ్ కోటేశ్వరరావు

మైలవరం, న్యూస్‌టుడే: అసైన్డు, సీలింగ్, వివిధ రకాల ప్రభుత్వ భూములను దీర్ఘకాలంగా సాగుచేస్తున్న పేదల నుంచి లాక్కొని పందేరం చేయొద్దని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. 9/77 చట్టం ప్రకారం సాగుచేస్తున్న వారి నుంచి 99 సంవత్సరాల లీజు పేరిట తీసుకునేలా సవరణ చేయాలనే ప్రభుత్వ ఆలోచన సరికాదన్నారు. మండలంలోని పోరాటనగర్ 34వ వ్యవస్థాపక దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోరాటనగర్‌లో 2300 ఎకరాలతోపాటు సీపీఐ ఆధ్వర్యంలో రాష్ట్రంలో లక్షలాది ఎకరాలను పేదలు సాగు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు దుర్గ, నాయకులు డి.కన్నయ్య, భీముడు, పెదబాలు, రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

బాలికా విద్యకు అధిక ప్రాధాన్యం

మైలవరం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో బాలికా విద్యకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. పీఎంఏజేఏవై కింద మంజూరైన రూ.3 కోట్లతో నిర్మించనున్న సాంఘిక సంక్షేమ బాలికల వసతిగృహ భవన నిర్మాణ పనులకు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమ వసతిగృహాల్లో సౌకర్యాల మెరుగుకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందన్నారు. నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో కొద్దిసేపు ముచ్చటించారు. చక్కగా చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచి మంజుభార్గవి, అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



నవధాన్యాలు వేస్తున్న ఎమ్మెల్యే కృష్ణప్రసాద్

రోడ్డు పనులు ప్రారంభించకుంటే ధర్నా చేస్తాం

మైలవరం, న్యూస్‌టుడే: మైలవరం- నూజివీడు మార్గంలోని వెల్వడంలో రహదారి అభివృద్ధి పనులు వెంటనే ప్రారంభించాలని, లేకుంటే ధర్నా చేస్తామని సీపీఎం మండల కార్యదర్శి సీహెచ్ సుధాకర్ పేర్కొన్నారు. రహదారి దుస్థితి, అభివృద్ధి పనుల జాప్యంపై బుధవారం స్థానిక ర.భ. కార్యాలయంలో ఈఈ సిద్ధయ్యతో, వెల్వడం గ్రామస్థులతో కలిసి చర్చించారు. ఈదారి ప్రమాదకరంగా తయారైనా.. పనులు ప్రారంభించకపోవడం శోచనీయమన్నారు. వెల్వడం నుంచి చంద్రాల వరకు రహదారి అధ్వానంగా తయారైందని, పనులు ఎందుకు చేయడం లేదని ఈఈని అడిగారు. పనుల నిర్వహణపై చర్చిస్తున్నామని, రెండ్రోజుల్లో ప్రారంభిస్తారని ఈఈ వారికి బదులిచ్చారు. అలా జరగకపోతే గ్రామస్థులతో కలిసి ధర్నా చేస్తామని సీపీఎం నాయకులు చెప్పారు.



ర.భ. ఈఈతో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు, వెల్వడం గ్రామస్థులు

ధీర వనిత ఇందిరాగాంధీ



కొండపల్లి: ఇందిరాగాంధీ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు కిరణ్

కొండపల్లి, న్యూస్‌టుడే: ఇందిరాగాంధీ ధీర వనిత అని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొర్రాకిరణ్ అన్నారు. కొండపల్లి పార్టీ కార్యాలయంలో ఇందిరాగాంధీ జయంతిని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానిగా విప్లవాత్మక నిర్ణయాలను ఇందిర చేశారన్నారు. దేశం సమైక్యంగా ఉండాలన్న ఆకాంక్షతో.. ఉద్యమాలను అణచివేసి ప్రాణ త్యాగానికి సైతం ఆమె వెనకాడలేదని గుర్తు చేసుకొన్నారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో అక్కల ప్రసాద్, రాము, ఆనందరావు, థామస్, లింగరాజు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌టుడే బృందం: ఇందిరాగాంధీ జయంతిని వివిధ గ్రంథాలయాలు, పాఠశాలల్లో నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.



గంపలగూడెం గ్రంథాలయంలో..



చెవుటూరులో...



కొండపల్లి గ్రంథాలయంలో..

సమరయోధులను స్ఫూర్తిగా తీసుకోవాలి

మైలవరం, న్యూస్‌టుడే: స్వాతంత్ర్యం కోసం పోరాడిన యోధులను విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలని స్థానిక లీలావతి గిరిజన పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉడతా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. బిర్సాముండా, ఝాన్సీలక్ష్మీబాయి జయంతి పురస్కరించుకుని కేంద్ర గిరిజన మంత్రిత్వశాఖ ఆదేశాల మేరకు బుధవారం పాఠశాలలో వారికి నివాళులు అర్పించారు. చిన్నారులతో వేషధారణలు వేయించారు. పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు.

మావోయిస్టుల వెన్నువిరిచాం

- ఏపీలో షెల్టర్ కోసం వచ్చిన 50 మందిని అరెస్టు చేశాం
- నిఘా విభాగాధిపతి మహేష్‌చంద్ర లడ్హా



పట్టుబడిన మావోయిస్టులను చూపుతున్న అడిషనల్ డీజీ మహేష్‌చంద్ర లడ్హా, ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్, విజయవాడ పోలీస్ కమిషనర్ రాజశేఖర్‌బాబు, కృష్ణా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు, కోనసీమ ఎస్పీ రాహుల్ మీనా, కాకినాడ ఎస్పీ బిందుమాధవ్, ఏలూరు ఎస్పీ ప్రతాప్‌శివకిషోర్ తదితరులు

ఈనాడు, అమరావతి: ఛత్తీస్‌గఢ్‌లోని దండకారణ్యం, దక్షిణ బస్తర్ ప్రాంతాలకు చెందిన మావోయిస్టుల వెన్ను విరిచామని, వారిని కోలుకోలేని దెబ్బతీశామని ఆంధ్రప్రదేశ్ నిఘా విభాగాధిపతి మహేష్‌చంద్ర లడ్హా తెలిపారు. ఆ ప్రాంతానికి చెందిన స్పెషల్ జోనల్ కమిటీ సభ్యులు ముగ్గురు, డివిజనల్ కమిటీ సభ్యులు ఐదుగురు, ఏరియా కమిటీ సభ్యులు 19 మంది, దళసభ్యులు 23 మంది.. మొత్తంగా 50 మందిని ఏకకాలంలో అరెస్టుచేశామని పేర్కొన్నారు. ఛత్తీస్‌గఢ్‌లో పోలీసు ఆపరేషన్లు పెరగడంతో వీరంతా అక్కడి నుంచి తెలంగాణ మీదుగా ఏపీలోకి వచ్చారని వివరించారు. ఇక్కడ కొన్నాళ్లు షెల్టర్ తీసుకుని.. ఆపై ఏఓబీలో మావోయిస్టు పార్టీని పునర్నిర్మించాలనేది వీరి ప్రణాళికగా గుర్తించామన్నారు. ఏపీలోకి ప్రవేశించినప్పటి నుంచే వీరి కదలికలను గమనిస్తున్నామని, ఇప్పుడు అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. విజయవాడలోని పోలీసు కమాండ్ కంట్రోల్ కేంద్రంలో ఎస్ఐబీ ఐజీ పీహెచ్‌డీ రామకృష్ణ, విజయవాడ నగర పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజశేఖర్‌బాబు, ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్, ఏలూరు, కృష్ణా, కాకినాడ, డా.అంబేడ్కర్ కోనసీమ జిల్లాల ఎస్పీలు కె.ప్రతాప్ శివ కిషోర్, విద్యాసాగర్‌నాయుడు, బిందుమాధవ్ గరికపాటి, రాహుల్‌మీనాలతో కలిసి బుధవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ప్రధానాంశాలివి.

దేవ్‌జీ మాకు పట్టుబడలేదు.. లొంగిపోలేదు

★ మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి తిప్పిరి తిరుపతి ఎలియాస్ దేవ్‌జీని మేము అదుపులోకి తీసుకోలేదు. ఆయన లొంగిపోలేదు, మాకు పట్టుబడలేదు. ఆయనెక్కడున్నారో మాకు తెలీదు. ఛత్తీస్‌గఢ్ లేదా తెలంగాణ రాష్ట్రాల్లో ఉన్నట్లు భావిస్తున్నాం.

★ అరెస్టైన వారంతా ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్, సుక్మా, నారాయణపూర్ జిల్లాలకు చెందినవారే. దండకారణ్యం, దక్షిణబస్తర్‌లో వీరంతా కీలకంగా వ్యవహరిస్తున్నారు.



మావోయిస్టుల నుంచి స్వాధీనం చేసుకున్న ఆయుధాలు, ఇతర సామగ్రిని పరిశీలిస్తున్న అడిషనల్ డీజీ మహేష్‌చంద్ర లడ్హా, విజయవాడ పోలీస్ కమిషనర్ రాజశేఖరబాబు తదితరులు

ఏపీలో షెల్టర్ తీసుకుని..

★ రాష్ట్రంలో పలు ప్రాంతాలను షెల్టర్‌జోన్లుగా చేసుకుని కొన్ని రోజులుండాలని భావించారు. పరిస్థితులు అనుకూలించాక ఆయుధాలు తెప్పించుకుని ఏఓబీలో మావోయిస్టు పార్టీని నిర్మించాలనుకున్నారు. ఎన్టీఆర్, ఏలూరు, కృష్ణా, కోనసీమ, కాకినాడ జిల్లాల్లో పట్టుబడిన వారిలో దేవ్‌జీ రక్షణ బృందం సభ్యులు, హిడ్మా బెటాలియన్‌లో పనిచేసిన వారున్నారు. హిడ్మా ఎన్‌కౌంటర్ తర్వాత అనేకమంది మావోయిస్టులు లొంగిపోవడానికి సిద్ధంగా ఉన్నారు.

★ ఆంధ్రప్రదేశ్‌ను మావోయిస్టు రహిత రాష్ట్రంగా మార్చాం. ప్రస్తుతం రాష్ట్రంలో మావోయిస్టులు లేరు. ఇతర రాష్ట్రాల నుంచి ఇక్కడికి వచ్చేందుకు అవకాశమున్న మార్గాల్లో పూర్తి నిఘా పెట్టాం.

అరెస్టైన కీలక నాయకులు వీరే..

★ ఎన్టీఆర్, కృష్ణా, ఏలూరు, కాకినాడ, డా.అంబేడ్కర్ కోనసీమ జిల్లాల పరిధిలో అరెస్టైన 50 మంది దక్షిణ బస్తర్, దండకారణ్య నెట్‌వర్క్ సభ్యులే. వీరిలో మావోయిస్టు పార్టీ సీనియర్ నాయకులతో పాటు లాజిస్టిక్స్ నిపుణులు ఉన్నారు. వీరంతా హిడ్మాకు సన్నిహిత అనుచరులు. వీరినుంచి పెద్ద ఎత్తున ఆయుధాలతో పాటు సెల్‌ఫోన్లు, రూ.12.72 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నాం. అరెస్టైన వారి వివరాలివి.

★ స్పెషల్ జోనల్ కమిటీ సభ్యులు: 1. సోడె లచ్చు ఎలియాస్ గోపాల్.. దక్షిణ బస్తర్ డివిజనల్ కమిటీ. 2. పొడియం రేంగు, బీఎన్‌పీసీ బెటాలియన్ హెడ్‌క్వార్టర్స్ కంపెనీ. 3. ఉద్దె రఘు, బీఎన్‌పీసీ బెటాలియన్ హెడ్‌క్వార్టర్స్ కంపెనీ. దాడులకు ప్రణాళికలు రూపొందించడం, బెటాలియన్ స్థాయిలో పర్యవేక్షణ, క్రాస్ బోర్డర్ కోఆర్డినేషన్, ఏపీ-ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల మధ్య ప్లటూన్ల కదలికలకు ప్రణాళికలు వేయడంలో దిట్ట. ఈ ముగ్గురి అరెస్టుతో దండకారణ్యంలో మావోయిస్టు పార్టీ కుప్పకూలినట్లే.

★ డివిజనల్ కమిటీ సభ్యులు: 1. సోడె లక్మ ఎలియాస్ భీమా, జగరగొండ ఏరియా కమిటీ కార్యదర్శి, డివిజనల్ కమిటీ సభ్యుడు. సుక్మా జగరగొండ ప్రాంతాల్లో ఆర్మ్‌డ్ స్క్వాడ్ ఆపరేషన్లలో కీలకం. 2. గంగిలక్ష్మి ఎలియాస్ మాదే, కేర్లపాల్ ఏరియా కమిటీ పర్యవేక్షకురాలు. దర్భా డివిజన్ కమిటీ సభ్యురాలు. ట్రాన్సిట్ రూట్‌లు, సపోర్ట్ నోడ్స్ సిద్ధం చేయటంలో దిట్ట. 3. సోడె మనీలా: పామేడు ఏరియా కమిటీ ఇన్‌ఛార్జి. దక్షిణ బస్తర్‌లో కీలక నాయకురాలు. 4. మడకం మదన్ ఎలియాస్ మాదన్న ఎలియాస్ జగ్గు: జగరగొండ ఏరియా కమిటీ పర్యవేక్షకుడు. జగరగొండ నుంచి కిస్టారం వరకూ దాడులు చేయడంలో సిద్ధహస్తుడు. 5. మాడ్వి హుందా: కమ్యూనికేషన్, సీవైపీసీ బృందం నాయకుడు.

★ వీరితోపాటు 19 మంది ఏరియా కమిటీ సభ్యులు, 23 మంది దళసభ్యులు అరెస్టయ్యారు. దీని వల్ల ఏరియా కమిటీలన్నీ పూర్తిగా కనుమరుగయ్యాయి. ఇంటర్ డిస్ట్రిక్ట్ లింకేజి పోయింది.

ఆ ముగ్గురూ హిడ్మా రక్షణదళ సభ్యులే!

ఇద్దరు మహిళా మావోయిస్టులకు 14 రోజుల రిమాండ్

ఈనాడు, కాకినాడ; న్యూస్‌టుడే, మేడీడు సెంటర్, రావులపాలెం పట్టణం: కాకినాడ, డా.అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో పట్టుబడిన ముగ్గురు మావోయిస్టులు అగ్రనేత హిడ్మా రక్షణదళంలో కీలక సభ్యులని పోలీసులు గుర్తించారు. సామర్లకోట మండలం కొప్పవరం సమీపంలో మంగళవారం అదుపులోకి తీసుకున్న మహిళా మావోయిస్టులు పోటెమ్ క్రాంతి ఎలియాస్ అంకిత (25), మాదవి కోసీ ఎలియాస్ ఆశ (27)లు హిడ్మా రక్షణదళంలో పనిచేసినట్లు విచారణలో తేలింది. ఛత్తీస్‌గఢ్ సుక్మా జిల్లా పొటకపల్లికి చెందిన ఈ ఇద్దరూ పలు ఆపరేషన్లలో పాల్గొన్నారు. పూర్తిస్థాయిలో విచారించాక వీరికి వైద్యపరీక్షలు చేయించారు. బుధవారం సాయంత్రం కాకినాడ మూడో అదనపు జేఎఫ్‌సీఎం కోర్టులో న్యాయాధికారి ఎదుట హాజరుపర్చగా వచ్చేనెల 3వ తేదీ వరకు రిమాండ్ విధించారు. వీరిని రాజమహేంద్రవరం కేంద్ర కారాగారానికి తరలించారు.

రాయవరం చెరువులో పడేసి..: అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో పట్టుబడిన మరో కీలక సభ్యుడు సరోజ్ మండ్వి ఎలియాస్ ఓడా మావోయిస్టు అగ్రనేత హిడ్మాకు అత్యంత సన్నిహితుడు. ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లా [illegible] గ్రామానికి చెందిన సరోజ్ [illegible] రాయవరం చెరువులో పడేసినట్లు తెలిసింది. రావులపాలెం గౌతమి వంతెన వద్ద పోలీసులు అతనిని అదుపులోకి తీసుకున్నారు. కొత్తపేట కోర్టులో హాజరుపర్చగా [illegible] రిమాండ్ విధించినట్లు తెలిపారు.



సరోజ్ మండ్వి

28 మంది మావోయిస్టులకు రిమాండ్

- ఎన్టీఆర్ జిల్లాల్లో అరెస్టు చేసిన నలుగురికి వచ్చే నెల 3 వరకు రిమాండ్
- కృష్ణా జిల్లాలో అరెస్టయిన 24 మందికి 2 వరకు...

ఈనాడు, అమరావతి: ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో మంగళవారం అరెస్టు అయిన మావోయిస్టులకు కోర్టులు రిమాండ్ విధించాయి. అనంతరం వారిని నెల్లూరు, రాజమహేంద్రవరంలోని కేంద్ర కారాగారాలకు తరలించారు. విజయవాడ కమిషనరేట్ పరిధిలో అదుపులోకి తీసుకున్న ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లాకు చెందిన నలుగురు మావోయిస్టులను.. వారిని ఉంచిన టాస్క్‌ఫోర్స్ కార్యాలయంలో వైద్య పరీక్షలు చేయించారు. అనంతరం పొడియం రెంగు, అతని భార్య సోది మంగి, సోది మనీలా, మడకం మదన్‌లను విజయవాడలోని నాలుగో ఏసీఎంఎం కోర్టులో న్యాయాధికారి రామ్మోహన్‌రావు ఎదుట హాజరుపర్చారు. వీరికి వచ్చే నెల 3వ తేదీ వరకు రిమాండ్ విధించారు. వీరిని నెల్లూరు జైలుకు తరలించారు.

ఇన్‌కెమెరా ప్రొసీడింగ్స్‌లో కోర్టు విచారణ

కానూరు ఆటోనగర్, గన్నవరంలో అరెస్టుచేసిన 28 మందిని కృష్ణా జిల్లా పోలీసులు.. బుధవారం విజయవాడలోని తాలూకా కోర్టులో న్యాయాధికారి లెనిన్‌బాబు ఎదుట హాజరుపర్చారు. ఉద్దే రఘు, మడకం దివాకర్, వెట్టి నందే, ఓయం సంబట్టి, కొర్సా సోమ్లి, కుంజం రంబు, దోడి నీలేష్, మడకం గంగి, హేమ్లా రామే, మడకం హైమా, సోది అర్జున్, కర్తం బండి, మడకం బుజ్జి, మడకం నవ్య, మండవి లక్మి, మడకం పొజే, హేమ్లా హిడ్మే, పూనెం ఇస్సు, మడకం హుంగా, పుల్సు లక్ష్మణ్, మద్వి జోగి, తాటి లక్మి, సుప్పో కోసి, ఓయం జ్యోతి, కొర్సా శాంతి, కుంజం భీమే, మద్వి జోగి, మద్వి మహినిలను కోర్టులో ప్రవేశపెట్టారు. దీనికి ముందు కోర్టు హాలులోకి వచ్చిన న్యాయాధికారి.. కేసును ఇన్‌కెమెరా ప్రొసీడింగ్స్ పద్ధతిలో విచారణ చేయనున్నట్లు ప్రకటించారు. దీనికి కొందరు న్యాయవాదులు అభ్యంతరం తెలిపారు. అనంతరం 24 మంది మావోయిస్టులకు వచ్చే నెల 2వ తేదీ వరకు రిమాండ్ విధించారు. వీరిని రాజమహేంద్రవరం కారాగారానికి తరలించారు.

నలుగురి వయసుపై న్యాయాధికారి సందేహం..

కోర్టులో హాజరుపరిచిన నలుగురు మావోయిస్టుల వయసుపై న్యాయాధికారి సందేహం వ్యక్తం చేశారు. వారు చిన్న వయసు వారిలా కనిపించడంతో వివరాలు తెలుసుకున్నారు. పోలీసులు సమర్పించిన జాబితాలో వీరి వయసు 20 ఏళ్లకు పైగా ఉండడంతో.. వారినే అడిగారు. వారు కూడా జాబితాలోని వయసునే చెప్పారు. వీరికి వైద్య పరీక్షలు చేయించి, వయసు ధ్రువీకరణ పత్రం అందజేయాలని పోలీసులను ఆదేశించారు. అప్పటి వరకు ఆ నలుగురిని పోలీసుల ఆధీనంలో ఉంచాలన్నారు.

మారేడుమిల్లిలో మరో ఎన్‌కౌంటర్

(మొదటి పేజీ తరువాయి)

మృతుల్లో ఏవోబీ స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు, మావోయిస్టు పార్టీ టెక్నికల్ టీమ్‌కు ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్న కీలక నేత మెట్టూరు జోగారావు ఎలియాస్ టెక్ శంకర్ (51) ఉన్నారు. మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తూ ఈ ఏడాది మే నెలలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో హతమైన నంబాల కేశవరావు (బస్వరాజ్) వద్ద గార్డు కమాండర్‌గా పనిచేసిన జ్యోతి ఎలియాస్ సరితతో పాటు మరో ఐదుగురు ఏరియా కమిటీ సభ్యులు ఈ ఎదురుకాల్పుల ఘటనల్లో మరణించారు. వీరిలో టెక్ శంకర్‌ది శ్రీకాకుళం జిల్లా కాగా మిగిలిన ఆరుగురు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందినవారు. టెక్ శంకర్, జ్యోతి మినహా చనిపోయిన మిగతా ఐదుగురు మావోయిస్టుల పేర్లను పోలీసులు అధికారికంగా ప్రకటించలేదు. ఆ ఐదుగురూ ఛత్తీస్‌గఢ్‌లోని జగరగొండ ఏరియాలో క్రియాశీలకంగా వ్యవహరించారని తెలుస్తోంది. అక్కడ పోలీసు ఆపరేషన్లు, నిర్బంధం పెరగటంతో.. ఏవోబీలో తలదాచుకునేందుకు ఇక్కడికి వచ్చినట్లు నిఘా వర్గాలు గుర్తించాయి.

కొనసాగుతున్న కూంబింగ్

మంగళవారం జరిగిన ఎదురుకాల్పుల ఘటన నుంచి దాదాపు 19 మంది మావోయిస్టులు తప్పించుకున్నారని, వీరిలో కొందరు కీలకనేతలు ఉన్నారని భద్రతా బలగాలు గుర్తించాయి. వారి కోసం 'ఆపరేషన్ సంభవ్' పేరిట పోలీసులు, కేంద్ర బలగాలు అన్ని వైపుల నుంచి విస్తృతంగా కూంబింగ్ చేపట్టాయి. ఈ క్రమంలో మారేడుమిల్లికి 7.5 కి.మీ దూరంలోని జీఎంవలస అటవీ ప్రాంతంలో బుధవారం వేకువజామున కొందరు మావోయిస్టులు భద్రత బలగాలకు ఎదురుపడ్డారు. 5 నుంచి 5.45 గంటల మధ్య ఇరుపక్షాల మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ఏడుగురు మావోయిస్టులు మరణించారు. ఈ విషయాన్ని అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ అమిత్ బర్దార్ బుధవారం రంపచోడవరంలో ధ్రువీకరించారు. ఘటనా స్థలం నుంచి ఏకే47 రైఫిళ్లు-2, ఏకే47 మ్యాగజైన్లు-5, ఏకే47-72 రౌండ్లు, ఎస్‌బీబీఎల్ గన్లు-5, డిటోనేటర్లు, కార్డెక్స్ వైర్లు స్వాధీనం చేసుకున్నారు. మరో 12 మంది తప్పించుకున్నారని పోలీసులు భావిస్తున్నారు.



వాసు



అనిత



షమ్మి



లోకేశ్



సురేష్



జ్యోతి

ప్రాథమిక సమాచారం మేరకు మృతులు వీరే

1. మెట్టూరు జోగారావు ఎలియాస్ టెక్ శంకర్– స్వస్థలం: శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరు మండలం బాతుపురం గ్రామం
ఏవోబీ స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు. టెక్నికల్ టీమ్ ఇన్‌ఛార్జి.
2. జ్యోతి ఎలియాస్ సరిత– స్వస్థలం: కిస్టారం ప్రాంతం, సుక్మా జిల్లా, ఛత్తీస్‌గఢ్
డివిజనల్ కమిటీ సభ్యురాలు. దివంగత నంబాల కేశవరావుకు గార్డ్ కమాండర్‌గా పనిచేశారు.
3. సురేష్ ఎలియాస్ రమేష్– స్వస్థలం: ఛత్తీస్‌గఢ్
ఏరియా కమిటీ సభ్యుడు, జగరగొండ ఏరియా కమిటీలో క్రియాశీలక వ్యక్తి.
4. లోకేశ్ ఎలియాస్ గణేశ్– స్వస్థలం: ఛత్తీస్‌గఢ్
ఏరియా కమిటీ సభ్యుడు, జగరగొండ ఏరియా కమిటీ మిలీషియా కమాండర్. పార్టీ అగ్రనేత కటకం సుదర్శన్‌కు గార్డ్‌గా పనిచేశారు.
5. సైను ఎలియాస్ వాసు– స్వస్థలం: ఛత్తీస్‌గఢ్
ఏరియా కమిటీ సభ్యుడు, జగరగొండ ఏరియా డిప్యూటీ కమాండర్.
6. అనిత– స్వస్థలం: ఛత్తీస్‌గఢ్
ఏరియా కమిటీ సభ్యురాలు. జగరగొండ ఏరియాలో క్రియాశీలక సభ్యురాలు.
7. షమ్మి– స్వస్థలం: ఛత్తీస్‌గఢ్
ఏరియా కమిటీ సభ్యురాలు. జగరగొండ ఏరియాలో క్రియాశీలకంగా వ్యవహరించారు.

– ఈనాడు – అమరావతి, రాజమహేంద్రవరం, ఈనాడు డిజిటల్– పాడేరు, న్యూస్‌టుడే– రంపచోడవరం, దేవీపట్నం, చింతూరు

'ఆపరేషన్ సంభవ్' కొనసాగిస్తాం



ఛత్తీస్‌గఢ్‌లో భద్రతా బలగాల ఆపరేషన్లు, నిర్బంధం పెరిగిపోవటంతో కొన్నాళ్ల కిందట ఏవోబీలో అడుగుపెట్టిన మావోయిస్టులు.. మారేడుమిల్లి పరిసర అటవీ ప్రాంతంలో తిరుగుతున్నట్లు గుర్తించాం. వారి కోసం మూడు రోజులుగా ముమ్మరంగా కూంబింగ్ నిర్వహిస్తున్నాం. బుధవారం జరిగిన ఎదురుకాల్పుల్లో ఏడుగురు మావోయిస్టులు మరణించారు. భద్రత బలగాలకు ఎలాంటి నష్టం వాటిల్లలేదు. తప్పించుకుని పారిపోయిన మిగిలినవారి కోసం 'ఆపరేషన్ సంభవ్' కొనసాగిస్తాం. మావోయిస్టు పార్టీ సీనియర్ క్యాడర్ నాయకుల్ని కోల్పోయింది. ఏపీ నుంచి ఎలాంటి రిక్రూట్‌మెంట్లు లేవు. ఛత్తీస్‌గఢ్ నుంచి ఇక్కడకు తీసుకొస్తున్నారు. ఎన్‌కౌంటర్‌లో చనిపోయినవారి మృతదేహాలను వారి కుటుంబసభ్యులకు అప్పగిస్తాం.

– అమిత్ బర్దార్, అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ

15 మంది రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: ఏలూరులో ఓ భవనాన్ని షెల్టర్ జోన్‌గా ఏర్పాటు చేసుకున్న 15 మంది మావోయిస్టులను ఈ నెల 18న పోలీసులు అరెస్ట్ చేశారు. వారిని బుధవారం ఏలూరు మొబైల్ కోర్టులో ప్రవేశపెట్టగా.. న్యాయమూర్తి ఎన్.మేరీ వారికి 14 రోజుల రిమాండ్ విధించారు. రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించాలని పోలీసులను ఆదేశించారు. దీంతో రెండు వాహనాల్లో భారీ భద్రత నడుమ 15 మంది మావోయిస్టులను పోలీసులు రాజమహేంద్రవరం తీసుకువెళ్లారు.



ఏలూరులో మావోయిస్టులను కోర్టుకు తీసుకెళ్తున్న పోలీసులు

గిరిజనంలో భయం భయం

పేలుళ్ల శబ్దాలు విన్నామన్న జీఎంవలస గ్రామస్థులు



జీఎంవలసలో చర్చించుకుంటున్న ప్రజలు

ఈనాడు– రాజమహేంద్రవరం, న్యూస్‌టుడే– మారేడుమిల్లి: నిత్యం పర్యాటకులతో సందడిగా ఉండే మారేడుమిల్లి మన్యం రెండు రోజులుగా తుపాకీ పేలుళ్లతో దద్దరిల్లుతోంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా మారుమూల పల్లెల్లోకి భారీ ఆయుధాలతో బలగాలు వచ్చి పోతుండటంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని గిరిజనులు భయపడుతున్నారు. మారేడుమిల్లి మండలం నెల్లూరు సమీపంలోని ఇజ్జులూరు దట్టమైన అటవీ ప్రాంతంలో మంగళవారం జరిగిన ఎదురుకాల్పుల్లో హిడ్మా దంపతులు సహా ఆరుగురు నేలకొరగ్గా, బుధవారం గుజ్జుమామిడివలస (జీఎంవలస) ప్రాంతంలో ఎన్‌కౌంటర్‌లో ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. ఈ ప్రాంతంలో గతంలో ఎప్పుడూ మావోయిస్టుల కదలికలు లేవని, అకస్మాత్తుగా భారీ ఎన్‌కౌంటర్ జరిగిందంటే నమ్మలేకపోతున్నారు. బుధవారం జరిగిన ఎన్‌కౌంటర్‌పై జీఎంవలస ప్రజలు మాట్లాడుతూ.. వేకువజామున తుపాకీ కాల్చిన శబ్దాలు వినిపించాయని, పర్యాటకులెవరో వేడుకలు చేసుకుంటూ ఉంటారని భావించినట్లు తెలిపారు. తెల్లవారేసరికి ఎన్‌కౌంటర్‌లో ఏడుగురు మావోయిస్టులు మృతి చెందారంటూ వారి మృతదేహాలను భద్రతా దళాలు గ్రామం వరకు మోసుకుంటూ వచ్చి వ్యానులోకి ఎక్కించే దృశ్యాలను చూసి వణికిపోయారు. తమ గ్రామాల్లో ఎప్పుడు ఇటువంటి ఘటనలు జరగలేదని జీఎం వలసకు చెందిన బూసారపు అశోకలక్ష్మి చెప్పారు.

అతనే ఓ బాంబు

- ఐఈడీ, ల్యాండ్‌మైన్ తయారీలో దిట్ట.. టెక్ శంకర్
- దేశవ్యాప్తంగా మావోయిస్టులు వాడే బాంబులన్నింటిలోనూ ముద్ర



ఈనాడు – అమరావతి, ఈనాడు డిజిటల్– శ్రీకాకుళం: మావోయిస్టు పార్టీ ఆంధ్ర- ఒడిశా బోర్డర్ (ఏవోబీ) స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు.. పార్టీ టెక్నికల్ టీమ్‌కు ఇన్‌ఛార్జి.. ఇంప్రువైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైజ్ (ఐఈడీ)లు, మందుపాతరల తయారీలో దిట్ట. అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి అటవీ ప్రాంతంలోని జీఎంవలస వద్ద బుధవారం జరిగిన ఎదురుకాల్పుల్లో మృతి చెందిన మెట్టూరు జోగారావు ఎలియాస్ టెక్ శంకర్ ఎలియాస్ బాబు పరిచయమిది. కొన్నేళ్లలో దేశవ్యాప్తంగా మావోయిస్టులు అమర్చిన అనేక ల్యాండ్‌మైన్లు, ఐఈడీల తయారీలో కీలక భాగస్వామిగా.. మంగళవారం ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన అగ్ర నేత హిడ్మా జరిపిన దాడులు, ఆపరేషన్లు అన్నింటిలో సాంకేతిక పాత్రధారిగా శంకర్ వ్యవహరించారు. ఏవోబీలో సుదీర్ఘకాలం పనిచేసిన శంకర్ తర్వాత ఛత్తీస్‌గఢ్‌లోని మాడ్ ప్రాంతానికి వెళ్లారు. ఈ ఏడాది జూన్‌లో ఏవోబీ స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శి గాజర్ల రవి ఎలియాస్ ఉదయ్ మరణించిన తర్వాత ఏవోబీలో మావోయిస్టు పార్టీ పునర్నిర్మాణానికి టెక్ శంకర్ విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. కేంద్ర కమిటీ తరఫున ఏవోబీ బాధ్యతలు చూస్తున్నారు. అలాంటి వ్యక్తి ఎన్‌కౌంటర్‌లో మృతి చెందటం పార్టీకి కోలుకోలేని దెబ్బే.

పదో తరగతి చదివి.. పీపుల్స్‌వార్‌లో చేరి..

- మెట్టూరు జోగారావు (51) స్వస్థలం శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరు మండలం బాతుపురం గ్రామం.
- పదోతరగతి వరకూ చదువుకున్న జోగారావు 1988-89 మధ్య రాడికల్ విద్యార్థి సంఘంలో చేరారు. అప్పట్లో ఉద్దానం ప్రాంతంలో పీపుల్స్‌వార్ దళంలో కమాండర్‌గా పనిచేస్తున్న సుధ పిలుపు మేరకు ఆ పార్టీలో చేరి, అజ్ఞాతంలోకి వెళ్లారు.
- 1992లో ఎంపల్లిగర్రు ప్రాంతంలో బాంబు పేలుడులో పీపుల్స్‌వార్ దళ సభ్యులు నలుగురు గాయపడ్డారు. వారిని విశాఖపట్నంలోని కేజీహెచ్‌కి తరలించటంలో జోగారావు క్రియాశీలకంగా వ్యవహరించారు.
- ఈ వ్యవహారంలో శంకర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. జైలు నుంచి విడుదలైన తర్వాత తిరిగి దళంలో చేరి, మందస మండలం రట్టి గ్రామంలో భూస్వామి పులారి లచ్చయ్యను హత్య చేశారు.
- 30 ఏళ్ల కిందట ఒంగోలు ఎంపీ మాగుంట సుబ్బరామిరెడ్డిని కాల్చిచంపిన కేసులో జోగారావు కీలక పాత్రధారి. అరకు మాజీ ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావు, సివేరి సోమల హత్యలోనూ కీలక పాత్ర.
- 36 ఏళ్లుగా అజ్ఞాతంలో ఉన్న జోగారావు భద్రతా బలగాలపై జరిగిన అనేక దాడుల కేసుల్లో నిందితుడు.
- తొలుత మహేంద్రగిరి దళంలో పనిచేశారు. తర్వాత శ్రీకాకుళం డివిజన్ సభ్యుడిగా, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో పనిచేశారు.
- కొప్రడంగి ఎన్‌కౌంటర్ నుంచి త్రుటిలో తప్పించుకున్నారు. అనంతరం ఏవోబీకి బదిలీ అయ్యారు. అక్కడ నుంచి అంచెలంచెలుగా ఎదిగారు.

22 కేసులు.. రూ.20 లక్షల రివార్డు

జోగారావు ఎక్కువ కాలం ఏవోబీలోనే పనిచేశారు. కొన్నాళ్లపాటు ఛత్తీస్‌గఢ్‌లోని మాడ్ ప్రాంతానికి వెళ్లి అక్కడ పార్టీ బాధ్యతలు నిర్వహించారు. ఆయనపై ఏపీలో 22కు పైగా కేసులున్నాయి. వీటిలో అల్లూరి సీతారామరాజు జిల్లా పరిధిలో 19 కేసులు, శ్రీకాకుళం జిల్లా మందస పోలీస్‌స్టేషన్‌లో 3 కేసులున్నాయి. రూ.20 లక్షల రివార్డు ఉంది.

హిడ్మా దంపతుల మృతదేహాలకు పోస్టుమార్టం



హిడ్మా పోస్టుమార్టంకు హాజరైన ఆయన సోదరి

ఈనాడు, రాజమహేంద్రవరం; న్యూస్‌టుడే, రంపచోడవరం, దేవీపట్నం: మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో మంగళవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన ఆరుగురు మావోయిస్టుల మృతదేహాల్లో రెండింటికి రంపచోడవరం ప్రాంతీయ ఆసుపత్రిలో బుధవారం శవపరీక్షలు నిర్వహించారు. కేంద్ర కమిటీ సభ్యుడు మద్వి హిడ్మా, ఆయన భార్య మడకం రాజే మృతదేహాలకు రాత్రి వరకు పోస్టుమార్టం జరిగింది. సుక్మా నుంచి హిడ్మా సోదరుడు, రాజే సోదరి, కమలేష్ సోదరుడు బుధవారం మధ్యాహ్నం రంపచోడవరం ఆసుపత్రికి చేరుకున్నారు. వారినుంచి డీఎన్ఏ నమూనాలు సేకరించి, ఫలితాలు నిర్ధారించి పోస్టుమార్టం ప్రారంభించారు. శవాగారంలో ఏం జరుగుతుందో బయటికి తెలియనీయకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. కాకినాడ, రాజమహేంద్రవరం నుంచి వచ్చిన నిపుణులు, తహసీల్దారు, వీడియో కెమెరాల పర్యవేక్షణలో శవపరీక్షలను నిర్వహించినట్లు తెలిసింది. డీఎన్ఏ ఫలితాలు వచ్చేసరికి ఆలస్యం కావడంతో రాత్రి వరకు ప్రక్రియ కొనసాగింది. హిడ్మా దంపతుల మృతదేహాలు రాత్రి వరకు ఆసుపత్రి ఆవరణలోనే ఉన్నాయి. అంతకుముందు 6 ఫ్రీజర్ బాక్సులు, ఎక్స్‌రే మిషన్‌ను ఆసుపత్రికి తీసుకొచ్చారు. మిగతా మృతుల బంధువులు సాయంత్రం ఆసుపత్రికి చేరుకున్నారు.

★ మిగతా నాలుగు మృతదేహాలకు, జీఎంవలస ఎన్‌కౌంటర్ మృతులకు గురువారం పోస్టుమార్టం చేసే అవకాశం ఉంది. ★ శవపంచనామా త్వరగా చేసేందుకు వీలుగా రంపచోడవరం, దేవీపట్నం, వై.రామవరం, మారేడుమిల్లి, గంగవరం, అడ్డతీగల మండలాల నుంచి తహసీల్దార్లు, కొందరు వీఆర్వోలు, వీఆర్ఏలు, మహిళా పోలీసులను ఆసుపత్రికి రప్పించారు.



రంపచోడవరం ప్రాంతీయ ఆసుపత్రి మార్చురీ వద్ద మృతి చెందిన మావోయిస్టుల పంచనామా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న అధికారులు


ఆయుధాలు వదలండి: మల్లోజుల

ఈనాడు, హైదరాబాద్: మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా మావోయిస్టులు ఆయుధాలు వదిలి జనజీవన స్రవంతిలో కలవాలని మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ అధికార ప్రతినిధిగా వ్యవహరించిన మల్లోజుల వేణుగోపాల్ ఎలియాస్ సోనూ ఎలియాస్ అభయ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక వీడియో విడుదల చేశారు. 'ఆంధ్రప్రదేశ్‌లో పోలీసులు జరిపిన కాల్పుల్లో హిడ్మా మరణించడం బాధాకరం. ఆయుధాలతో పోరాటం చేయడం వల్ల చాలా నష్టం జరిగింది. ప్రపంచం, దేశం మారిపోయింది. ఇలాంటి పరిస్థితుల్లో ఆయుధ పోరాటాలతో ప్రయోజనం లేదు. వాటిని వదిలి ప్రజల మధ్యకు రావాలి. ఈ విషయాన్ని గ్రహించే నెలన్నర క్రితం మేము ఆయుధాలు వదిలేసి ప్రజల మధ్యకు వచ్చాం. ఇక్కడ ఉండే లక్ష్యం కోసం రాజ్యాంగబద్ధంగా పోరాడుదాం. అందుకే ఆయుధాలు వదిలేసే విషయంలో అంతా ఆలోచించాలి' అని మావోయిస్టులకు ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ విషయంలో అవసరమైతే తనను సంప్రదించవచ్చన్నారు.

ఎదురుదెబ్బలు తాత్కాలికమే..

మావోయిస్టు ఉద్యమానికి ప్రస్తుతం తగులుతున్న ఎదురుదెబ్బలు తాత్కాలికమేనని సీపీఐఎంఎల్, జనశక్తి కేంద్ర కమిటీ తరఫున చంద్ర ప్రకాశ్ పేరుతో బుధవారం ఒక ప్రకటన విడుదలైంది. హిడ్మాను కాల్చి చంపారని, మధ్య భారతంలో సాగుతున్న నూతన ప్రజాస్వామ్య విప్లవంలో ఇలాంటి వారు ఎందరో అమరులయ్యారని, ఇప్పుడు జరుగుతున్న నష్టం నుంచి కోలుకుంటామని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. పోలీసు కస్టడీలో ఉన్న తిప్పిరి తిరుపతి ఇతరులను వెంటనే న్యాయస్థానంలో హాజరుపరచాలని ఆయన డిమాండ్ చేశారు.

పట్టుబడిన మావోయిస్టుల చేతులకు రిబ్బన్లు!



వివిధ జిల్లాల్లో మావోయిస్టులను పట్టుకున్న పోలీసులు.. వారిని విజయవాడ కోర్టులో హాజరుపరిచే సమయంలో పలు జాగ్రత్తలు తీసుకున్నారు. ఒక్కో జిల్లాలో పట్టుబడిన వారికి ఒక్కో రంగు రిబ్బన్లను చేతులకు వేసి న్యాయస్థానానికి తరలించారు. కృష్ణా జిల్లా కానూరు కొత్తఆటోనగర్‌లో పట్టుకున్న 28 మంది మావోయిస్టుల చేతులకు నల్లరంగు రిబ్బన్లు వేశారు. మరో జిల్లాలో అరెస్టుచేసిన వారికి ఎర్రరంగువి వినియోగించారు.

– ఈనాడు, అమరావతి

అమ్మ నగల తాకట్టుతో 'కథక్'
కుమారుడి ప్రతిభకు.. గిన్నిస్

పశ్చిమబెంగాల్‌కు చెందిన జ్యోతి మొండల్ (30)కు కథక్ నృత్యంలో రికార్డు స్థాయి ప్రదర్శనతో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు దక్కింది. జిల్లా కేంద్రమైన అలీపుర్‌ద్వార్ వాసి జ్యోతి మొండల్‌కు చిన్నప్పటి నుంచి కథక్ నృత్యమంటే చాలా ఇష్టం. తల్లి బీనా కుమారుడి ఇష్టానికి అండగా నిలిచి ప్రోత్సహించారు. భర్త చనిపోయాక చిన్న దుకాణం నడుపుతూ కుటుంబ బాధ్యత మోసిన ఆమె తన నగలను తాకట్టు పెట్టి కుమారుడిని కథక్ నృత్య తరగతుల్లో చేర్పించారు. గుజరాత్ వంటి దూర ప్రాంతాలకు శిక్షణకు పంపారు. కథక్ నృత్యం చేస్తూ 30 సెకన్లలో 68 సార్లు తన చుట్టూ తాను (స్పిన్‌లు) తిరిగిన ప్రదర్శనకుగాను గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ వారు ఇటీవల జ్యోతి మొండల్‌కు ధ్రువపత్రం అందజేశారు.



ప్రస్తుతం చిన్న గుడి ఆర్ట్ స్కూల్లో డ్యాన్స్ టీచర్‌గా పని చేస్తున్న జ్యోతి.. భవిష్యత్తులో సొంత నృత్య అకాడమీ నిర్వహించాలనుకుంటున్నారు. కుమారుడి విజయంపై ఆనంద బాష్పాలు రాల్చిన తల్లి బీనా.. ప్రపంచ రికార్డు సృష్టిస్తాడని ఎప్పుడూ అనుకోలేదన్నారు.

గంగోత్రి నుంచి రామేశ్వరం
జల జాగరణ పాదయాత్ర

ప్రజల జలసంరక్షణపై ప్రజల్లో చైతన్యం నింపేందుకు ఉత్తర్‌ప్రదేశ్‌లోని మేరఠ్‌కు చెందిన ఒక కుటుంబం అరుదైన ప్రయత్నం ప్రారంభించింది. గంగోత్రి ధామ్ నుంచి రామేశ్వరం వరకు 3,300 కిలోమీటర్ల మేర జల జాగరణ పాదయాత్ర చేపట్టి జల సందేశం చాటాలని నిర్ణయించిన ఐదుగురు సభ్యులు... పాదయాత్ర మంగళవారం మసూరీకి చేరుకోగా.. స్థానికులు ఆత్మీయంగా స్వాగతించారు. ఈ జల జాగరణ పాదయాత్రకు రోబిన్ సింగ్ నేతృత్వం వహిస్తున్నారు. 2026 మార్చి నాటికి రామేశ్వరం చేరుకొని గంగోత్రి నుంచి తీసుకొచ్చిన గంగాజలంతో శివుడికి అభిషేకం చేయనున్నారు. మొత్తం 9 రాష్ట్రాల మీదుగా యాత్ర కొనసాగనుంది. ఈ బృందంలో రోబిన్ సింగ్ దంపతులు, ఇద్దరు చిన్నారులు, కొంతమంది మద్దతుదారులు ఉన్నారు. నీటి విలువపై దేశవ్యాప్తంగా ప్రజల్లో అవగాహన పెంచడమే తమ ప్రధాన లక్ష్యమని రోబిన్ సింగ్ తెలిపారు.



నేడు పదోసారి సీఎంగా నీతీశ్ ప్రమాణం

పట్నా: బిహార్ ముఖ్యమంత్రిగా జేడీయూ అధినేత నీతీశ్ కుమార్ గురువారం పదోసారి ప్రమాణం చేయనున్నారు. బుధవారం జరిగిన ఎన్డీయే ఎమ్మెల్యేల సమావేశంలో శాసనసభాపక్ష నేతగా ఆయనను ఎన్నుకున్నారు. తాను ఎన్నిక కాగానే సీనియర్ నేతలు వెంటరాగా నీతీశ్.. గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్ వద్దకు వెళ్లారు. రాజీనామా సమర్పించారు. కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలని విజ్ఞప్తి చేశారు. తనకు మద్దతిస్తున్న ఎమ్మెల్యేల సంతకాలతో కూడిన లేఖను ఆయనకు అందజేశారు. నీతీశ్ రాజీనామాను ఆమోదించిన గవర్నర్, కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యే వరకు ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా కొనసాగాలని సూచించారు.

■ గురువారం ఉదయం 11 గంటలకు పట్నాలోని గాంధీ మైదానంలో నీతీశ్‌తోపాటు మంత్రులు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్‌సింగ్ తదితరులు, ఎన్డీయే పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరుకానున్నారు.

■ బిహార్ భాజపా శాసనసభాపక్ష నేతగా మాజీ డిప్యూటీ సీఎం సామ్రాట్ చౌధరి, శాసనసభాపక్ష ఉప నేతగా విజయ్ కుమార్ సిన్హా ఎన్నికైనట్లు పార్టీ ఎన్నికల పరిశీలకుడు కేశవ్ ప్రసాద్ మౌర్య తెలిపారు.



గుమ్మడి విత్తనాలతో గుండె భద్రం

గుమ్మడి విత్తనాల్లో యాంటీ ఆక్సిడెంట్లు, ఐరన్, మెగ్నీషియం, జింక్ సమృద్ధిగా లభిస్తాయి. వీటిలో ఆరోగ్యకర కొవ్వులు కూడా ఉంటాయి. వీటిని తీసుకుంటే గుండె ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు రక్తపోటు అదుపులో ఉంటుంది. గుమ్మడి విత్తనాలను రోస్ట్ చేసి స్నాక్స్‌గా తీసుకోవచ్చు.

– శ్రేయా షా, న్యూట్రిషనిస్ట్

భారత్‌కు ఎస్‌యూ-57 యుద్ధ విమానాల సాంకేతికత

- ఇచ్చేందుకు రష్యా సిద్ధం
- రోస్‌టెక్ సీఈవో సెర్గీ చెమెజోవ్ వెల్లడి



ఇంటర్నెట్ డెస్క్: ఎలాంటి పరిమితులు లేకుండా ఎస్‌యూ-57 ఐదోతరం స్టెల్త్ యుద్ధ విమానాల తయారీ టెక్నాలజీని భారత్‌కు బదిలీ చేయడానికి సిద్ధమని రష్యా వెల్లడించింది. ఈ అంశంలో భారత్ నుంచి ఎలాంటి ప్రతిపాదనలు వచ్చినా తప్పకుండా అంగీకారం తెలుపుతామని ప్రకటించింది. భారత అవసరాలను తీర్చేందుకు రష్యా సదా సిద్ధంగా ఉంటుందని పేర్కొంది. రష్యా ప్రభుత్వరంగ సంస్థ రోస్‌టెక్ సీఈవో సెర్గీ చెమెజోవ్ 'దుబాయ్ ఎయిర్ షో- 2025'లో ఈ వివరాలను మీడియాకు వెల్లడించారు. రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో భారత విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్.జైశంకర్ భేటీ అయిన మరుసటి రోజే ఈ ప్రకటన వెలువడటం గమనార్హం. 'భారత్‌పై ఆంక్షలున్న సమయంలోనూ మేం ఆ దేశ భద్రత కోసం ఆయుధాలు సరఫరా చేశాం. ఇప్పుడు కూడా మేం దిల్లీ పక్షాన నిలుస్తున్నాం. ఏ సైనిక సామగ్రి అవసరమైనా అందిస్తున్నాం. ఇరుదేశాలూ పరస్పర సహకారాన్ని పెంచుకుంటూ, ఉమ్మడి ప్రయోజనాల కోసం పనిచేస్తున్నాయి. ఇకపైనా సైనిక సామగ్రిపరంగా ఏ అవసరమున్నా రష్యాను భారత్ స్వేచ్ఛగా అడగొచ్చు' అని చెమెజోవ్ చెప్పారు.

భారత్‌లోనే తయారు చేసుకోవచ్చు

'భావితరం యుద్ధ విమానాల తయారీ టెక్నాలజీని భారత్‌కు బదిలీ చేసేందుకు రష్యా సిద్ధంగా ఉంది. ఎస్‌యూ-57 ఫైటర్ జెట్ల టెక్నాలజీని కూడా విడతలవారీగా బదిలీ చేస్తాం. ఆ యుద్ధ విమానాలను భారత్‌లోనే తయారు చేసుకోవచ్చు. భారత ఆయుధ వ్యవస్థలకు సరిపోలేలా మార్పులు, చేర్పులు చేసుకోవచ్చు. ఇందుకోసం లైసెన్సులు మంజూరు చేస్తాం' అని రష్యా ప్రభుత్వ ఆయుధ ఎగుమతి సంస్థ 'రోసోబోరోన్ ఎక్స్‌పోర్ట్' అధికార ప్రతినిధి వెల్లడించారు. యుద్ధ విమానాల ఇంజిన్లు, ఆప్టిక్స్, రాడార్లు, ఏఐ ఎలిమెంట్స్, లో సిగ్నేచర్ టెక్నాలజీ వంటివి భారత్‌కు రష్యా బదిలీ చేస్తుంది. ఎస్‌యూ-57ఈ లేదా ఎఫ్‌జీఎఫ్‌ఏ పేరుతో రెండు సీట్ల విమానాల తయారీకి భారత్‌తో కలిసి పనిచేసేందుకు రష్యా సిద్ధంగా ఉంది. సరఫరా గొలుసుకు ఆంక్షలు ఆటంకంగా మారతాయనే బెంగ లేకుండా, ఈ యుద్ధ విమానాల విడిభాగాలను భారత్ నిశ్చింతగా స్వదేశంలో తయారు చేసుకోవచ్చని రష్యా అంటోంది. స్వదేశంలో ఎస్‌యూ-57 ఫైటర్ జెట్ల తయారీకి ఇచ్చే అనుమతుల స్థాయిని క్రమంగా పెంచుతామని చెబుతోంది. ఆ యుద్ధ విమానాల్లోని సాఫ్ట్‌వేర్, ఇతర వ్యవస్థల్లో చేసే సరికొత్త మార్పులపైనా ఎప్పటికప్పుడు భారత్‌కు సమాచారమిస్తామని అంటోంది.

డ్రోన్‌లు, క్షిపణులతో ఉక్రెయిన్‌పై రష్యా దాడి

- 25 మంది మృత్యువాత

కీవ్: పశ్చిమ ఉక్రెయిన్‌లోని టెర్నోపిల్ నగరంపై రష్యా డ్రోన్‌లు, క్షిపణులతో విరుచుకుపడింది. ఈ దాడుల్లో 25 మంది మరణించారని అత్యవసర సేవల విభాగం బుధవారం వెల్లడించింది. రెండు, తొమ్మిది అంతస్తుల భవనాలు లక్ష్యంగా రష్యా దాడి చేసిందని ఉక్రెయిన్ ఆంతరంగిక వ్యవహారాల మంత్రి ఐహోర్ క్లిమెంకో పేర్కొన్నారు. ఈ దాడిలో 15 మంది పిల్లలు సహా మొత్తం 73 మంది క్షతగాత్రులయ్యారు. 476 డ్రోన్‌లను, 48 క్షిపణులను రష్యా ఉపయోగించింది. రష్యా ప్రయోగించిన క్షిపణుల్లో ఆరింటిని మినహా అన్నింటినీ ధ్వంసం చేశామని ఉక్రెయిన్ వైమానిక దళ వర్గాలు తెలిపాయి.

దేశాన్ని పునర్నిర్మించిన నాయకురాలు ఇందిర

- శ్లాఘించిన సోనియా గాంధీ
- మిషెల్ బచెలెట్‌కు ఇందిరాగాంధీ శాంతి పురస్కారం

దిల్లీ: పేదరికం, సంఘర్షణలు, అసమానతలను తగ్గించేందుకు తీసుకొచ్చిన పలు పథకాలతో మాజీ ప్రధాని ఇందిరా గాంధీ దేశాన్ని పునర్నిర్మించారని కాంగ్రెస్ అగ్రనేత, పార్లమెంటరీ పార్టీ అధ్యక్షురాలు సోనియా గాంధీ శ్లాఘించారు. నిరాయుధీకరణ, అభివృద్ధిపై చేసిన సేవలకుగాను చిలీ మాజీ అధ్యక్షురాలు, ఐక్యరాజ్యసమితి మానవహక్కుల విభాగం మాజీ చీఫ్ మిషెల్ బచెలెట్‌కు ఇందిరా గాంధీ శాంతి పురస్కారం (2024)ను అందించారు. ఇందిర జయంతి సందర్భంగా దిల్లీలో బుధవారం నిర్వహించిన సోనియా ప్రసంగించారు. ఈ సందర్భంగా.."సామాజిక అభివృద్ధి, శాంతి, సుస్థిరత వంటి అంశాలపై




బచెలెట్‌కు పురస్కారం అందజేస్తున్న సోనియా

కృషి చేసిన మహిళలు, పురుషులు, సంస్థలను ఈ పురస్కారంతో సత్కరించుకోవడం ఇందిర సేవలను స్మరించుకోవడమే. కలహాల సమయంలోనూ మానవాళి అభ్యున్నతి, న్యాయం, శ్రేయస్సు కోసం పోరాడేవారున్నారని ఈ అవార్డు గుర్తుచేస్తుంది. పేదరికం, వ్యాధులు, అజ్ఞానంపై పోరాడేందుకు మనకు శాంతి అవసరమని భారతదేశ తొలి మహిళా ప్రధాని ఇందిరా గాంధీ పేర్కొనేవారు" అని సోనియా వ్యాఖ్యానించారు. బచెలెట్‌పై సోనియా ప్రశంసలు కురిపిస్తూ..ఆమెను ఓ స్ఫూర్తిదాయక నేతగా అభివర్ణించారు. ఇందిరా గాంధీ స్మారక ట్రస్టు తనను శాంతి పురస్కారానికి ఎంపిక చేయడంపై మిషెల్ బచెలెట్ కృతజ్ఞతలు తెలిపారు. 1985లో ఈ అవార్డును ఏర్పాటు చేశారు.

వివాదం లేకుండా ఉండాలంటే
వీలునామా రాయాలి

- భర్త, పిల్లలు లేని పెళ్లైన హిందూ మహిళలకు సుప్రీంకోర్టు సూచన



దిల్లీ: సొంతంగా ఆస్తులు ఆర్జించిన వివాహిత హిందూ మహిళలు.. భర్త, పిల్లలు లేకపోతే వీలునామా రాయాలని సుప్రీంకోర్టు సూచించింది. తద్వారా భవిష్యత్తులో ఎలాంటి వివాదాలు, వ్యాజ్యాలు తలెత్తకుండా ఉంటాయని పేర్కొంది. "మహిళలు సొంతంగా ఆస్తులు ఆర్జిస్తారని హిందూ వారసత్వ చట్టం-1956 రూపొందించేటప్పుడు ఊహించలేదు. గత కొన్ని దశాబ్దాలుగా మహిళలు పురోగతి సాధించారు. విద్య, ఉద్యోగ, వ్యాపార రంగాల్లో రాణిస్తూ సొంతంగా ఆస్తులు సంపాదించుకుంటున్నారు. భర్త చనిపోయి పిల్లలు లేకుండా హిందూ మహిళ మరణిస్తే ఆమె ఆస్తులు భర్త వారసులకు చెందుతున్నాయి. ఒకవేళ ఆ మహిళ తల్లిదండ్రుల కుటుంబాల్లో ఆందోళన కలిగించవచ్చు" అని జస్టిస్ బి.వి.నాగరత్న, జస్టిస్ ఆర్.మహాదేవన్‌ల ధర్మాసనం పేర్కొంది. చట్టంలోని సెక్షన్ 15(1)(బి)ని సవాల్ చేస్తూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యాన్ని విచారించింది. ఈ సెక్షన్ ప్రకారం, పెళ్లైన హిందూ మహిళ వీలునామా లేకుండా చనిపోతే తల్లిదండ్రుల కంటే ముందు భర్త వారసులకు ఆమె ఆస్తిని పంచుతారు. పిటిషన్ దాఖలు చేసిన న్యాయవాది... సెక్షన్ 15(1)(బి) ఏకపక్షంగా ఉందని, రాజ్యాంగంలోని 14, 15, 21 అధికరణాలకు వ్యతిరేకంగా ఉందని తెలిపారు. ఒకవేళ మహిళ వీలునామా రాయకుండా చనిపోతే.. సంబంధిత పక్షాలు వ్యాజ్యం దాఖలు చేసే ముందు మధ్యవర్తిత్వ ప్రక్రియ ద్వారా వివాదాన్ని పరిష్కరించుకోవాలని ధర్మాసనం సూచించింది.

27% కోటాపై తీర్పు ఇచ్చేవరకూ ఆగండి

స్థానిక ఎన్నికల నామినేషన్లపై మహారాష్ట్రకు సుప్రీం సూచన

దిల్లీ: స్థానిక సంస్థల్లో 27శాతం ఓబీసీ కోటాపై తాము తీర్పు ఇచ్చేవరకూ నామినేషన్ల ప్రక్రియను వాయిదా వేయాలని మహారాష్ట్ర ప్రభుత్వానికి సుప్రీం కోర్టు సూచించింది. 'ఈ విషయాన్ని తేల్చే వరకూ మీరు నామినేషన్ల ప్రక్రియను ఎందుకు వాయిదా వేయకూడదు?' అని బుధవారం జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల్ భుయాన్, జస్టిస్ ఎన్.కోటీశ్వర్ సింగ్‌లతో కూడిన ధర్మాసనం ప్రశ్నించింది. ఈ కోటాపై నెలకొన్న వివాదానికి సంబంధించి మరిన్ని పత్రాలు సమర్పించేందుకు వీలుగా విచారణను వాయిదా వేయాలని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోరడంతో తదుపరి విచారణను ధర్మాసనం ఈ నెల 25వ తేదీకి వాయిదా వేసింది.

ఎన్ఐఏ అదుపులో అన్మోల్ బిష్ణోయ్

11 రోజుల కస్టడీకి అప్పగించిన కోర్టు

దిల్లీ: మహారాష్ట్ర ఎన్సీపీ నేత బాబా సిద్దిఖీ హత్య కేసులో కీలక నిందితుడు, గ్యాంగ్‌స్టర్ అన్మోల్ బిష్ణోయ్‌ను జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) అరెస్టు చేసింది. అమెరికా నిర్బంధంలో ఉన్న



అతడిని భారత్‌కు రప్పించిన అధికారులు... బుధవారం మధ్యాహ్నం దిల్లీలోని ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో అదుపులోకి తీసుకున్నారు. అనంతరం భారీ భద్రత మధ్య పటియాలా హౌస్ కోర్టులో అన్మోల్‌ను హాజరుపర్చారు. నిందితుడిని 15 రోజుల కస్టడీకి ఇవ్వాలని ఎన్ఐఏ అభ్యర్థించగా... 11 రోజుల విచారణకు న్యాయమూర్తి ప్రశాంత్ శర్మ అంగీకరించారు.

15 వేల కిలోమీటర్లు ప్రయాణించి తిరిగొచ్చిన రాబందు 'మారిచ్'



విదిశా: ఈ ఏడాది మార్చిలో మధ్యప్రదేశ్‌లోని విదిశా జిల్లాలోని హలాలీ ఆనకట్ట నుంచి బయలుదేరిన యురేసియన్ గ్రిఫాన్ రాబందు 'మారిచ్' 15,000 కిలోమీటర్ల ప్రయాణాన్ని ముగించుకొని భారతదేశానికి సురక్షితంగా తిరిగి వచ్చిందని అటవీ శాఖాధికారి బుధవారం తెలిపారు. ఈ పక్షి పాకిస్థాన్, అఫ్గానిస్థాన్, ఉజ్బెకిస్థాన్, కజకస్థాన్‌ల గుండా ప్రయాణించిందని, ప్రస్తుతం రాజస్థాన్‌లోని ధోల్‌పుర్ జిల్లాలో తిరుగుతోందని విదిశా డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ హేమంత్ యాదవ్ పేర్కొన్నారు. ఉపగ్రహ రేడియో కాలర్ సహాయంతో దాని కదలికలను అటవీ శాఖ గమనిస్తోందన్నారు. జనవరి 29న సత్నా జిల్లాలోని నాగౌర్ గ్రామంలో ఈ పక్షి గాయపడిన స్థితిలో కనిపించిందని తెలిపారు. తొలుత ముకుందపుర్ జూ, తర్వాత భోపాల్ వన విహార్ జాతీయ పార్కులో దీనికి చికిత్స అందించినట్లు యాదవ్ పేర్కొన్నారు. రెండు నెలల తర్వాత హలాలీ ఆనకట్ట వద్ద దీన్ని విడుదల చేశారన్నారు. "ఇది జంతు కళేబరాలను తింటూ వ్యాధులు వ్యాప్తి చెందకుండా నిరోధిస్తుంది. నేల, నీటి నాణ్యతను మెరుగుపరుస్తుంది. ఈ రాబందు ఐరోపా, ఉత్తర ఆఫ్రికా, ఆసియాలోని పర్వత ప్రాంతాల్లో కనిపిస్తుంది. వేడి గాలి ప్రవాహాలలోనూ గంటల తరబడి ఎగురుతుంది" అని నిపుణులు తెలిపారు.

ఆత్మహత్య చేసుకుంటానని భాగస్వామిని బెదిరించడం క్రూరత్వమే

- భర్తకు విడాకులు మంజూరు చేసిన బాంబే హైకోర్టు

ముంబయి: ఆత్మహత్య చేసుకుంటానని పదేపదే జీవిత భాగస్వామిని బెదిరించడం క్రూరత్వం కిందకే వస్తుందని బాంబే హైకోర్టు వ్యాఖ్యానించింది. భర్తకు అనుకూలంగా విడాకులు మంజూరు చేసింది. ఇటువంటి ప్రవర్తన పునరావృతం అవుతుంటే వైవాహిక జీవితంలో కొనసాగడం మరో భాగస్వామికి ఇబ్బందికరంగా మారుతుందని వ్యాఖ్యానించింది. ఈ అంశంపై గతవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ శ్రీ చంద్రశేఖర్, జస్టిస్ గౌతమ్ అఖండ్‌ల నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టి తీర్పును వెలువరించింది. ఇందుకు సంబంధించిన వివరాలు బుధవారం బయటకొచ్చాయి. వీటి ప్రకారం.. పిటిషనుదారుకి 2006లో వివాహం జరిగింది. కానీ వైవాహిక విభేదాల కారణంగా 2012 నుంచి భార్యభర్తలు వేర్వేరుగా నివాసం ఉంటున్నారు. భార్యకు తనపై అనుమానాలు ఉన్నాయని, ఆత్మహత్య చేసుకుంటానని పదేపదే బెదిరిస్తోందంటూ తొలుత అతడు కుటుంబ కోర్టును ఆశ్రయించాడు. అక్కడ అభ్యర్థన తిరస్కరణకు గురికావడంతో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. బెదిరింపులకు సంబంధించిన ఆధారాలను పరిశీలించిన హైకోర్టు ధర్మాసనం.. అనుమానాలు, ఆరోపణలు భర్త పట్ల భార్య ప్రవర్తనను సూచిస్తున్నాయని వ్యాఖ్యానించింది. దశాబ్ద కాలంగా వేర్వేరుగా జీవిస్తున్న ఇద్దరిని రాజీపడి కలిసి జీవించమనడంలో అర్థం లేదని విడాకులు మంజూరు చేసింది. రూ.25లక్షలు చెల్లించి, రెండు ఫ్లాట్లను భార్య పేరుమీద మార్చాలని భర్తకు ఆదేశాలు జారీ చేసింది.

సిడ్నీలో రోడ్డు ప్రమాదం..
భారత్‌కు చెందిన 8 నెలల గర్భిణి మృతి

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియాలోని సిడ్నీలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. రోడ్డు దాటుతుండగా అతివేగంగా వస్తున్న కారు ఢీకొట్టడంతో భారత్‌కు చెందిన 8 నెలల గర్భిణి ప్రాణాలు కోల్పోయారు. గత వారాంతంలో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. భారతీయురాలు సమన్విత ధారేశ్వర్(33) కుటుంబం హార్న్స్‌బై ప్రాంతంలో నివాసముంటోంది. స్థానికంగా ఉన్న ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో టెస్ట్ అనలిస్ట్‌గా ఆమె పని చేస్తున్నారు. తన భర్త, మూడేళ్ల కుమారుడితో కలిసి సమన్విత



సమన్విత

సమీపంలోని పార్కు వద్దకు వాకింగ్‌కు వెళ్లారు. ఈ క్రమంలోనే ఫుట్‌క్రాస్ వద్ద రోడ్డు దాటుతుండగా.. అతివేగంగా వచ్చిన బీఎండబ్ల్యూ కారు ఆమెను బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్ర గాయాలపాలైన సమన్వితను స్థానిక ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. గర్భస్థ శిశువు ప్రాణాలు కూడా దక్కలేదని తెలిపారు. ఈ ప్రమాదానికి కారణమైన ఆరోన్ పపాజోగ్లు(19)ను అరెస్టు చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

నేరుగా ఉద్యోగాలు కల్పించే కోర్సులే కావాలి

విదేశాల్లో చదువులపై భారత విద్యార్థుల అభిప్రాయం

దిల్లీ: చదువు పూర్తవగానే నేరుగా ఉద్యోగాలు కల్పించే కోర్సులపై భారతీయ విద్యార్థులు ఆసక్తి చూపుతున్నట్లు తాజా అధ్యయనమొకటి తెలిపింది. విదేశాల్లో ఇలాంటి ఉన్నత చదువులు అందించే విశ్వవిద్యాలయాల వైపు వీరందరూ దృష్టి సారిస్తున్నారని పేర్కొంది. సిటీ సెయింట్ జార్జ్ యూనివర్సిటీ ఆఫ్ లండన్, ఆర్లింగ్టన్ రీసెర్చ్ సంస్థలు ఈ అధ్యయనాన్ని చేపట్టాయి. ప్రపంచవ్యాప్తంగా దాదాపు మూడు వేల మంది విద్యార్థులు, తల్లిదండ్రులు తమ అభిప్రాయాలు చెప్పారు. ఇందులో 97 శాతం మంది భారతీయ విద్యార్థులు.. తాము విదేశాల్లో ఉన్నత చదువుల విషయంలో నేరుగా ఉద్యోగాలు కల్పించే, ఉద్యోగ నైపుణ్యాలు నేర్పించే వర్సిటీలనే ఎంపిక చేసుకుంటున్నట్లు తెలిపారు. పుస్తకాలు, తరగతుల్లో చెప్పే పాఠాలను మించి అదనంగా కొత్త అంశాలను నేర్పించే ఉన్నత చదువులను విద్యార్థులు ఆశిస్తున్నారని అధ్యయనంలో పాల్గొన్న నిపుణులు వెల్లడించారు. ఈ దిశగా వర్సిటీలు కోర్సులు రూపొందించడానికి ఈ అధ్యయనం ఉపయోగపడుతుందని వారు పేర్కొన్నారు.

రష్యాలో మరో రెండు భారత కాన్సులేట్లు

మాస్కో: భారతదేశం రష్యాలో కొత్తగా రెండు కాన్సులేట్లు నెలకొల్పింది. యెకతెరింబర్గ్, కజాన్‌లలో ఇవి ఏర్పాటయ్యాయి. వాణిజ్యం, పర్యాటకం, ఆర్థిక రంగాల్లో పురోగతికి; శాస్త్ర-సాంకేతిక రంగాల్లో, విద్య-సాంస్కృతికపరమైన సంబంధాలకు ఇది దోహదం చేస్తుందని భారత విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్.జైశంకర్ బుధవారం వీటిని ప్రారంభించిన అనంతరం పేర్కొన్నారు.

కొలంబో వెళ్లాల్సిన విమానాలు తిరువనంతపురం మళ్లింపు

తిరువనంతపురం: పశ్చిమాసియా ప్రాంతం నుంచి శ్రీలంకకు బయలుదేరిన రెండు విమానాలను కొలంబోలో ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా బుధవారం కేరళ రాజధాని తిరువనంతపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి మళ్లించారు. ఒకటి ఇస్తాంబుల్ నుంచి బయలుదేరిన తుర్కిష్ ఎయిర్‌లైన్ విమానం, మరొకటి అరేబియాలోని దమ్మామ్ నుంచి బయలుదేరిన శ్రీలంకన్ ఎయిర్‌లైన్స్ విమానం. తుర్కిష్ విమానంలో 258 ప్రయాణికులు, 10మంది సిబ్బంది ఉండగా.. శ్రీలంకన్ విమానంలో 188 మంది, 10 మంది సిబ్బంది ఉన్నట్లు తిరువనంతపురం అంతర్జాతీయ విమానాశ్రయ లిమిటెడ్(టీఐఏఎల్) ఓ ప్రకటనలో తెలిపింది.

బాంబు తయారైంది కారులోనే!

- ఎర్రకోట పార్కింగ్ స్థలంలోనే పేల్చాలని యోచన
- సెలవుతో సందర్శకులు లేక వేరే ప్రాంతంపై దృష్టి
- అల్ ఫలా వర్సిటీ నుంచి 10 మంది అదృశ్యం
- భారత్‌లో ఫిదాయీ దాడులకు జైషే కుట్ర

ఇంటర్నెట్ డెస్క్: ఎర్రకోట సమీపంలో భారీ పేలుడుకు పాల్పడిన డాక్టర్ ఉమర్ నబీ ఆ బాంబును అక్కడి పార్కింగ్ ప్రదేశంలో కారులోనే తయారు చేసినట్టు తెలుస్తోంది. సీసీటీవీ దృశ్యాలను పరిశీలించగా ఈ విషయం బయటపడినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. తొలుత ఎర్రకోట పార్కింగ్ స్థలంలోనే పేలుడు జరపాలని భావించినా సందర్శకుల తాకిడి లేక.. వేరేచోట చేసినట్టు తెలుస్తోంది. దిల్లీకి వస్తున్న సమయంలోనే ఉమర్ నబీ తన సహచరులతో టచ్‌లో ఉన్నాడని, ఏ ప్రాంతాన్ని లక్ష్యంగా చేసుకోవాలనే దానిపై వారు మంతనాలు జరిపారని భావిస్తున్నారు. ఎర్రకోటకు ఉన్న ప్రాముఖ్యం దృష్ట్యా దానికి సమీపంలోని పార్కింగ్ ప్రదేశాన్ని ఎంచుకున్నట్లు తెలుస్తోంది. ఆ రోజు సోమవారం కావడం వల్ల సందర్శకులను అనుమతించరనే విషయాన్ని వారు విస్మరించడంతో మరింత భారీ ప్రాణనష్టం తప్పినట్లయింది. పేలుడు జరిగిన ప్రదేశానికి ఓవైపు ఎర్రకోట ఉండగా మరోవైపు చాందినీచౌక్ ఉంది. దీంతో నేతాజీ సుభాష్‌మార్గ్‌లో పేలుడు నిర్వహించాలని ఉమర్, అతడిని నడిపిస్తున్న వ్యక్తులు నిర్ణయించుకున్నట్లు అనుమానిస్తున్నారు. ఆరోజు మధ్యాహ్నం 3:19 గంటల నుంచి 6:28 గంటల వరకు పార్కింగ్‌లో కారులోనే ఉన్న సమయంలో ఉమర్ నబీ పేలుడు పదార్థాలను తయారుచేస్తూ ఉండిపోయాడని భావిస్తున్నారు. అది పూర్తయిన తర్వాత పార్కింగ్ నుంచి బయటకు వచ్చి, దాన్ని పేల్చేశాడని పేర్కొన్నారు. ఫరీదాబాద్ ఉగ్ర నెట్‌వర్క్ కేసులో అరెస్టయిన నిందితులకు హరియాణాలోని అల్ ఫలా విశ్వవిద్యాలయంతో సంబంధం ఉన్న నేపథ్యంలో వర్సిటీకి చెందిన దాదాపు 10 మంది కనిపించకుండా పోయారని నిఘా వర్గాలను ఉటంకిస్తూ కొన్ని మాధ్యమాల్లో కథనాలు వచ్చాయి. వీరిలో ముగ్గురు కశ్మీర్ వాసులు.

దాడులకు ఆన్‌లైన్‌లో విరాళాల సేకరణ

భారత్‌లో భీకర ఉగ్రదాడులకు పాల్పడేందుకు పాకిస్థాన్ కేంద్రంగా పనిచేస్తోన్న జైషే మహ్మద్ ఉగ్ర ముఠా భారీఎత్తున ప్రణాళికలు చేస్తున్నట్లు నిఘా వర్గాలు పసిగట్టాయి. ఫిదాయీ దళాన్ని సిద్ధం చేసేందుకు ఆన్‌లైన్ ద్వారా విరాళాలు సేకరిస్తున్నట్లు తెలుస్తోంది. ముజాహిదీన్‌ల కోసం చలికాలం కిట్లు కొనాలంటూ ఒక్కొక్కరి నుంచి 20వేల పాకిస్థాన్ రూపాయలు (భారత కరెన్సీలో దాదాపు రూ.6,300) చొప్పున సేకరిస్తున్నట్లు పేర్కొన్నాయి. ఉగ్ర విభాగాలకు వీలైనంత త్వరగా నిధులు చేరేలా ఆన్‌లైన్‌లో వీటిని సేకరిస్తున్నట్లు తెలుస్తోంది. దీనిపై భారత దర్యాప్తు బృందాలు ప్రత్యేక దృష్టి సారించాయి.

నొయిడాలోని ప్రింటింగ్ ప్రెస్‌లో సోదాలు

దిల్లీ పేలుడు కేసులో కీలక నిందితుడు డా.ఉమర్ నబీ, ఫరీదాబాద్ ఉగ్ర నెట్‌వర్క్‌కు చెందిన డా.ముజమ్మిల్ గనాయీ తదితరులు 2021లో తుర్కియేకు వెళ్లారని.. ఆ దేశంలో వారు జైషే మహమ్మద్ ప్రతినిధులను కలిసినట్లు దర్యాప్తు అధికారులు ఆరోపించిన విషయం తెలిసిందే. దర్యాప్తులో భాగంగా తుర్కియేతో సంబంధాలున్న సంస్థలపై అధికారులు నిఘా పెట్టారు. ఈ నేపథ్యంలో ఉత్తర్‌ప్రదేశ్ ఉగ్రవాద నిరోధక దళం అధికారులు గ్రేటర్ నొయిడాలోని 'ఇస్తాంబుల్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రింటింగ్ ప్రెస్'లో సోదాలు జరిపారు. మత విద్వేషాలు రెచ్చగొట్టే అంశాలను ఇక్కడ ప్రచురిస్తున్నట్లు గుర్తించామని అధికారులు పేర్కొన్నారు. కార్యాలయంలోని సీసీటీవీ ఫుటేజీ, ఇతర పత్రాలు స్వాధీనం చేసుకున్నారు.

భారత సైన్యానికి సైనిక జాకెట్‌పై మేధో ఆస్తి హక్కు

దిల్లీ: అతి శీతల వాతావరణంలో సైనికులు ధరించే సరికొత్త సైనిక జాకెట్‌ను భారత సైన్యం రూపొందించింది. డిజిటల్ ప్రింట్‌తో కూడుకున్న ఈ జాకెట్‌కు సంబంధించి మేధో ఆస్తి హక్కుల్ని భారత సైన్యం దక్కించుకుందని అధికార వర్గాలు తాజాగా వెల్లడించాయి. అతి చల్లని వాతావరణంలోనూ దీన్ని ధరించిన వారికి హాయిని ఇవ్వడంతో పాటు సాయుధ పోరులో తేలికగా పాల్గొనే వెసులుబాటు కల్పించే జాకెట్‌ను "కోట్ కంబాట్" అని పిలుస్తారు. దిల్లీలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ (ఎన్ఐఎఫ్‌టీ) దీన్ని రూపొందించిందని రక్షణ శాఖ వర్గాలు బుధవారం వెల్లడించాయి. సైన్యం ఈ జాకెట్‌ను ఈ సంవత్సరం జనవరిలో ప్రవేశపెట్టింది.





దర్శనానికి వచ్చిన భక్తులు, ఏడీజీపీ ఎస్.శ్రీజిత్

అయ్యప్ప భక్తులకు పోలీసుల చేయూత

వారి సహకారంతో దర్శనం చేసుకున్న స్వాములు

శబరిమల: మణికంఠుడి దర్శనానికి శబరిమలకు వచ్చిన భక్తుల బృందం తీవ్ర రద్దీ కారణంగా వెనుదిరగ్గా పోలీసుల సహకారంతో అయ్యప్పను కనులారా వీక్షించారు. కేరళలోని కల్లంబాలంకు చెందిన వృద్ధులు, చిన్నారులు సహా 17 మంది అయ్యప్ప దర్శనానికి శబరిమల వచ్చారు. ఆలయంలో రద్దీ నెలకొనడంతో చిన్నపిల్లలు, వృద్ధులతో సహా దర్శనం చేసుకోవడం దాదాపు అసాధ్యమని వారు భావించారు. దీంతో ఆలయం వెలుపలే స్వామికి నమస్కరించుకుని కిందకు దిగేశారు. ఈ విషయం టీవీ ఛానళ్లలో రావడంతో.. శబరిమల పోలీసు సమన్వయకర్త, ఏడీజీపీ ఎస్.శ్రీజిత్ స్పందించారు. బృందంలో ఓ వృద్ధురాలిని ఫోన్‌లో సంప్రదించారు. తిరిగి కొండపైకి రావాలని స్వామి దర్శనం చేయించే పూచీ తమదని హామీ ఇచ్చారు. అనంతరం ఆ బృందం తిరిగి కొండపైకి చేరుకుంది. బుధవారం మధ్యాహ్నం వారు కొండపైకి చేరుకోగా.. పోలీసులు దగ్గరుండి దర్శనం చేయించారు. దర్శనం చేయించినందుకు పోలీసులకు ఆ వృద్ధురాలు కృతజ్ఞతలు తెలిపారు.

కొండపైకి అంతమందిని ఎందుకు అనుమతించారు?

శబరిమలలో రద్దీపై టీడీబీని ప్రశ్నించిన కేరళ హైకోర్టు

కొచ్చిన్: అధికారుల అలసత్వం కారణంగా శబరిమలకు భక్తులు పోటెత్తడంపై కేరళ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. అధికారుల మధ్య సమన్వయలోపం కారణంగానే ఈ సమస్య నెలకొందని తప్పుపట్టింది. మంగళవారం ఒక్కరోజే అయ్యప్ప దర్శనం కోసం దాదాపు 2 లక్షల మంది కొండపైకి వచ్చిన విషయం తెలిసిందే. రద్దీ కారణంగా భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ నేపథ్యంలో అధికారుల తీరుపై హైకోర్టు మండిపడింది. భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేయడంలో ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు(టీడీబీ) విఫలమైందని చురకలు అంటించింది. ఒకేసారి అంతమందిని కొండపైకి ఎందుకు అనుమతించారని టీడీబీని హైకోర్టు ప్రశ్నించింది.

సీబీఐ అంటూ పట్టపగలే రూ.7 కోట్ల దోపిడీ

ఏటీఎంలలో నగదు నింపేందుకు వెళ్తుండగా ఘటన



నగదు చోరీకి గురైన వాహనం

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే: సీబీఐ అధికారులమంటూ కారులో వచ్చిన గుర్తుతెలియని వ్యక్తులు ఏటీఎంలలో నగదు నింపే వాహనం నుంచి పట్టపగలే రూ.7.11 కోట్లు కొట్టేశారు. అచ్చం సినిమా తరహాలోనే బెంగళూరులో ఈ ఘటన చోటుచేసుకుంది. బుధవారం మధ్యాహ్నం నగరంలోని సౌత్‌ఎండ్ సర్కిల్‌లో ఉన్న ఏటీఎంలో నగదు నింపి మిగిలిన డబ్బుతో వాహనం, సిబ్బంది బయలుదేరారు. కేంద్రప్రభుత్వ స్టిక్కర్‌తో ఉన్న కారులో వచ్చిన ఆరుగురు వ్యక్తులు ఈ వాహనాన్ని అనుసరించారు. కొంత దూరం వెళ్లాక.. 'మేం సీబీఐ అధికారులం. వాహనాన్ని తనిఖీ చేయాలి' అని చెప్పి నగదుతో వెళ్తున్న వాహనాన్ని దుండగులు ఆపేశారు. అందులోని గన్‌మన్, ఇతర సిబ్బందిని కిందకు దింపేశారు. అనంతరం తనిఖీ నిమిత్తం తమ కార్యాలయానికి రావాలంటూ డబ్బుతో ఉన్న వాహనాన్ని దాని డ్రైవర్ సాయంతోనే జయదేవ ఆసుపత్రి మీదుగా డెయిరీ కూడలి వంతెన పైకి తీసుకెళ్లారు. అక్కడ వాహనాన్ని ఆపి పిస్టల్, కత్తులతో బెదిరించి అందులోని రూ.7.11 కోట్ల నగదు కట్టలున్న పెట్టెలను తమ కారులోకి మార్చుకుని నిందితులు పరారయ్యారు. డ్రైవర్ విషయాన్ని తన కార్యాలయ అధికారుల సాయంతో పోలీసులకు చెప్పారు. వెంటనే వారు నిందితుల ఊహాచిత్రాలను సిద్ధం చేసి, అన్ని ఠాణాలకూ పంపించి దర్యాప్తు చేపట్టారు.

పార్లమెంట్ సమావేశాల హాజరుకు అనుమతించండి

ఏసీబీ కోర్టులో మిథున్‌రెడ్డి పిటిషన్

ఈనాడు, అమరావతి: పార్లమెంట్ సమావేశాలకు హాజరయ్యేందుకు తనను అనుమతించాలని వైకాపా ఎంపీ మిథున్‌రెడ్డి విజయవాడలోని ఏసీబీ కోర్టులో పిటిషన్ దాఖలుచేశారు. దీనిపై కౌంటర్ దాఖలు చేయాలని సిట్‌ను న్యాయాధికారి బుధవారం ఆదేశించారు. తదుపరి విచారణను ఈ నెల 21కి కోర్టు వాయిదా వేసింది. మద్యం కేసులో నిందితుడిగా ఉన్న ఎంపీ.. ప్రస్తుతం బెయిల్‌పై బయట ఉన్నారు. కోర్టు విధించిన బెయిల్ షరతుల దృష్ట్యా సమావేశాలకు హాజరయ్యేందుకు తనను అనుమతించాలని తాజా పిటిషన్‌లో కోరారు. ◆ జైలులో తనకు వసతులు కల్పించాలని కోరుతూ నిందితుడు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి వేసిన పిటిషన్‌పై కౌంటర్ దాఖలు చేయాలని జైలు అధికారులను కోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను గురువారానికి వాయిదా వేసింది. ◆ సిట్ సీజ్ చేసిన తమ కారును విడుదల చేయాలని సత్యం ఇస్పాత్ లిమిటెడ్ కంపెనీ వేసిన పిటిషన్‌పై విచారణను ఈ నెల 21కి న్యాయాధికారి వాయిదా వేశారు. ◆ ఇదే కేసులో ఇటీవల అరెస్టైన అనిల్ చోఖ్రాను ఏడు రోజుల కస్టడీకి అనుమతించాలని కోర్టులో సిట్ బుధవారం పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై కౌంటర్ వేయాలని నిందితుడి తరఫు న్యాయవాదులను కోర్టు ఆదేశించింది. కేసు విచారణను 21కి వాయిదా వేసింది. ◆ మద్యం కేసులోని నిందితులు బాలాజీకుమార్ యాదవ్, నవీన్ కృష్ణల బెయిల్ పిటిషన్ల విచారణను గురువారానికి కోర్టు వాయిదా వేసింది.

అనకాపల్లి జిల్లాలో పోలియో అనుమానిత కేసు

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: అనకాపల్లి జిల్లా పూడిమడకలో పోలియో అనుమానిత కేసు వెలుగు చూసింది. గ్రామానికి చెందిన ఏడేళ్ల కార్తిక్ నడవలేకపోవడంతో కుటుంబ సభ్యులు కొద్దిరోజుల క్రితం అచ్యుతాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకొచ్చారు. బాలుడిలో పోలియో లక్షణాలు కనిపించడంతో వైద్యులు అనకాపల్లి ఆసుపత్రికి తరలించారు. చిన్నపిల్లల వైద్య నిపుణుడు పోలియో కేసుగా అనుమానించి, నమూనాలను పరీక్షల నిమిత్తం ప్రయోగశాలకు పంపించినట్లు తెలిసింది.



చేతల్లో చూపని ప్రేమ వృథా

జీవిత భాగస్వామిపై ప్రేమ ఉంటే అది కేవలం మాటల్లోనే కాదు, చేతల్లోనూ కనిపించాలి. అలాగే తప్పు చేసినప్పుడు పశ్చాత్తాపంతో క్షమాపణ చెబితే సరిపోదు, ప్రవర్తనలో మార్పు రావాలి. అప్పుడే ఆ బంధం దృఢంగా ఉంటుంది.

– లెవిస్ హోవెస్, పాడ్‌కాస్టర్

కొట్టివేసిన నిబంధనలనే మళ్లీ తెచ్చారు

- ట్రైబ్యునళ్ల సంస్కరణల చట్టం (2021)పై సుప్రీంకోర్టు తీవ్ర ఆక్షేపణ
- వివాదాస్పదమైన వాటిని రద్దు చేస్తూ తీర్పు వెల్లడి
- న్యాయస్థానాలు ఎత్తిచూపిన లోపాలను సరిచేసి పార్లమెంటు చట్టాలు చేయాలి: సీజేఐ
- 4నెలల్లో జాతీయ ట్రైబ్యునళ్ల కమిషన్ ఏర్పాటు చేయాలని ఆదేశం



దిల్లీ: దేశంలోని వివిధ ట్రైబ్యునళ్ల సభ్యులు, ఛైర్‌పర్సన్ల నియామకాలు, పదవీకాలం, సర్వీస్ రూల్స్‌కు సంబంధించి ట్రైబ్యునళ్ల సంస్కరణల చట్టం(2021)లోని పలు ముఖ్యమైన నిబంధనలను సుప్రీంకోర్టు బుధవారం కొట్టివేసింది. గతంలో తాము తీవ్ర అభ్యంతరం తెలుపుతూ రద్దు చేసిన నిబంధనలను కాస్త అటుఇటు మార్చి మళ్లీ చట్టంలో చేర్చారంటూ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్ ధర్మాసనం ఆక్షేపించింది. న్యాయస్థానాల నిర్ణయాలను తిరస్కరిస్తూ పార్లమెంటు చట్టాలు చేయడం తగదంటూ ఘాటైన వ్యాఖ్యలు చేసింది. 'ఆర్డినెన్స్‌లో లోపాలను సరిదిద్దకుండా, గత తీర్పునకు విరుద్ధంగా నిబంధనలను చట్టంలో చేర్చడం వంచనే. రాజ్యాంగ వ్యతిరేకం కూడా' అని అభిప్రాయపడింది. ట్రైబ్యునళ్ల సభ్యులు, ఛైర్‌పర్సన్ల పదవీ కాలం, నియామకాలకు సంబంధించి గతంలో కోర్టు ఇచ్చిన సూచనలను పునరుద్ధరిస్తున్నట్లు తెలిపారు. అందువల్ల.. 'ఇన్‌కంట్యాక్స్ అప్పిలేట్ ట్రైబ్యునల్'; 'కస్టమ్స్, ఎక్సైజ్ అండ్ సర్వీస్ ట్యాక్స్ అప్పిలేట్ ట్రైబ్యునల్' సభ్యులు.. వారికి 62 ఏళ్ల వయసు వచ్చే వరకు, ఆయా ట్రైబ్యునళ్ల ఛైర్‌పర్సన్లు వారికి 65 ఏళ్ల వయసు వచ్చే వరకూ పదవుల్లో కొనసాగవచ్చని తీర్పు స్పష్టం చేసింది. వారి పదవీ కాలాన్ని నాలుగేళ్లకు పరిమితం చేయడాన్ని కొట్టివేసింది. నాలుగు నెలల్లోగా 'జాతీయ ట్రైబ్యునళ్ల కమిషన్' ఏర్పాటు చేయాలని కేంద్రాన్ని ఆదేశించింది. ట్రైబ్యునళ్లు పారదర్శకంగా వ్యవహరించేలా, వృత్తినిపుణులతో విలసిల్లేలా, అధికారంలో ఉన్నవారి ఒత్తిళ్లకు గురికాకుండా ట్రైబ్యునళ్లు స్వేచ్ఛగా వ్యవహరించేలా, ఈ వ్యవస్థపై ప్రజలకు విశ్వాసాన్ని పెంపొందించేలా... జాతీయ కమిషన్ నిర్మాణం ఉండాలని స్పష్టం చేసింది.

న్యాయ స్వతంత్రతకు విఘాతం

ట్రైబ్యునళ్ల సంస్కరణ చట్టం (2021)లోని వివాదాస్పద నిబంధనలు అధికార విభజన సూత్రాలను, న్యాయ వ్యవస్థ స్వతంత్రతను ఉల్లంఘిస్తున్నాయని ధర్మాసనం తన 137 పేజీల తీర్పులో స్పష్టం చేసింది. 'న్యాయస్థానం గతంలో కొట్టివేసిన నిబంధనలను పార్లమెంటు తన శాసన నిర్మాణ అధికారం ద్వారా తిరిగి చట్టంలో ప్రవేశపెట్టింది. ఆర్డినెన్స్‌లోని నిబంధనలను, 2021 చట్టంలోని నిబంధనలను మేం పోల్చి చూశాం. మేం రద్దుచేసిన నిబంధనలను కొద్దిపాటి మార్పులతో మళ్లీ ప్రవేశపెట్టినట్లు స్పష్టమవుతోంది' అని సీజేఐ తెలిపారు. ఎత్తిచూపిన లోపాలను సరిచేయకపోవడం, న్యాయస్థానాల తీర్పులను పట్టించుకోకపోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. భారీగా పెరిగిపోతున్న అపరిష్కృత కేసుల పరిష్కారం బాధ్యత ఒక్క న్యాయ వ్యవస్థది మాత్రమే కాదని, వివిధ ప్రభుత్వ విభాగాలూ ఆ భారాన్ని పంచుకోవాల్సి ఉంటుందని తెలిపారు.

తీర్పు నేపథ్యం ఇదీ

ట్రైబ్యునళ్ల సంస్కరణల చట్టం-2021 ద్వారా ఫిల్మ్ సర్టిఫికేషన్ అప్పీళ్ల ట్రైబ్యునల్ వంటివి రద్దయ్యాయి. ఈ చట్టం రాజ్యాంగబద్ధతను సవాల్ చేస్తూ మద్రాస్ బార్ అసోసియేషన్‌తో పాటు మరికొందరు సుప్రీంకోర్టులో పిటిషన్లు వేశారు. విచారణ అనంతరం సుప్రీంకోర్టు ఈ నెల 11న రిజర్వు చేసిన తీర్పును బుధవారం వెలువరించింది. అంతకుముందు కేంద్రం తీసుకొచ్చిన ఆర్డినెన్స్‌లోని వివాదాస్పద నిబంధనలపైనా న్యాయస్థానం అభ్యంతరం తెలిపింది.

బిందుసేద్యానికి ఆటోమేషన్

- సెల్‌ఫోన్ నుంచే ఆన్/ఆఫ్ నిర్వహణ
- యూనిట్ వ్యయం హెక్టారుకు రూ.40 వేలు
- ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్నకారు రైతులకు 55%.. ఇతరులకు 45% రాయితీ



బిందుసేద్యం పైపుల వాల్వ్‌లకు అమర్చిన ఆటోమేషన్ పరికరాలు

ఈనాడు, అమరావతి: బిందు, తుంపర సేద్య (మైక్రో ఇరిగేషన్) పరికరాల్ని రైతులు ఇకనుంచీ సెల్‌ఫోన్ నుంచే ఆన్/ఆఫ్ చేసుకోవచ్చు. వాల్వ్‌ల ఆన్/ఆఫ్ కూడా అరచేతిలో పనే. బిందు, తుంపరసేద్యంలో వైర్‌లెస్ ఆటోమేషన్ పరికరాలు ఏర్పాటుచేసుకునే రైతులకు ప్రభుత్వం రాయితీ ఇవ్వనుంది. యూనిట్ వ్యయం హెక్టారుకు రూ.40వేలుగా నిర్ణయించింది. గరిష్ఠంగా ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్నకారు రైతులకు 55% రాయితీ చొప్పున రూ.22వేలు మంజూరు చేస్తారు. ఇతర రైతులకు 45% రాయితీ చొప్పున రూ.18వేలు ఇస్తారు. ఆటోమేషన్ అమలుకు ప్రభుత్వం బుధవారం మార్గదర్శకాలు జారీచేసింది.

ఇప్పటికే వాడేవారికి... కొత్తవారికీ అవకాశం

కొన్నేళ్లుగా సూక్ష్మసేద్యం చేసే వారూ వైర్‌లెస్ ఆటోమేషన్‌ను అమర్చుకోవచ్చు. దరఖాస్తు చేసుకుంటే నిబంధనలకు అనుగుణంగా రాయితీ ఇస్తారు. కొత్తగా సూక్ష్మసేద్య పరికరాలకు పొందాలనుకునేవారు ఆటోమేషన్‌కు దరఖాస్తు చేయొచ్చు. స్టార్టర్లు, వాల్వ్ ఆన్/ఆఫ్‌తో పాటు ఇతర సెన్సర్ పరికరాలనూ రైతులు అమర్చుకోవచ్చు. గరిష్ఠంగా యూనిట్ విలువ రూ.40 వేలుగా పరిగణించి.. అందుకు అనుగుణంగా రాయితీ ఇస్తారు. ఆటోమేషన్ పరికరాలకు కనీసం ఏడాది వారంటీ ఉండాలని నిబంధనల్లో పేర్కొంది.

45 ఏళ్లు.. 49 మంది బలి

మావోయిస్టు ఉద్యమంలో నేలకొరిగిన శ్రీకాకుళం బిడ్డలు

ఈనాడు డిజిటల్, శ్రీకాకుళం; న్యూస్‌టుడే నేర వార్తా విభాగం: ఉద్యమాలకు పెట్టింది పేరు శ్రీకాకుళం జిల్లా. గ్రామీణ ప్రాంతాల నుంచి ఎందరో ఆయుధాలతో అడవిబాట పట్టారు. కన్నవారికి దూరంగా సాయుధ పోరాట పంథాలో నడిచారు. నాలుగున్నర దశాబ్దాలుగా సాగుతూ వచ్చిన ఉద్యమంలో సిక్కోలుకు చెందిన 49 మంది ఎదురుకాల్పుల్లో మృత్యువాత పడ్డారు.

1980లో పీపుల్స్‌వార్ ఆవిర్భావం తర్వాత జిల్లాకు సంబంధించి జీడి, గిరిజన ఉత్పత్తుల మద్దతు ధర కోసం మలివిడత ఉద్యమం మొదలైంది. ఇతర ప్రాంతాల నుంచి పెద్దఎత్తున యువకులు తరలివచ్చారు. చిత్తూరు జిల్లాకు చెందిన ప్రతాపరెడ్డి రామచంద్రారెడ్డి ఎలియాస్ సుధా (ఈ ఏడాది జూన్ 18న ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన చలపతి) ఉద్యమానికి నాయకత్వం వహించారు. ఆయన ఆధ్వర్యంలో పీపుల్స్‌వార్ గ్రూపులోకి భారీగా చేరికలు జరిగాయి. ఉద్దానం, మహేంద్రగిరి, కొండబారిడి దళాలు ఏర్పడగా సాయుధపోరాటం ఉద్ధృతమైంది. 2004లో మావోయిస్టు పార్టీగా అవతరించిన తర్వాత సిక్కోలుకు చెందిన పలువురు దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో జరిగిన ఉద్యమాలకు నాయకత్వం వహించారు. ఆ పార్టీలో కీలక స్థానాలు పొందారు. తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఉత్తర్‌ప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిశా, కర్ణాటక, బిహార్, కేరళ ప్రాంతాల్లో సుదీర్ఘ కాలం పనిచేశారు.

పల్లె నుంచి..

◆ కోటబొమ్మాళి మండలం జియ్యన్నపేటకు చెందిన నంబాల కేశవరావు(70) ఎలియాస్ బసవరాజు కేంద్ర కమిటీ కార్యదర్శిగా పనిచేశారు. 2025 మే 21న ఎన్‌కౌంటర్‌లో మృతిచెందారు.

◆ వజ్రపుకొత్తూరు మండలం బాతుపురానికి చెందిన మెట్టూరు జోగారావు (51) ఎలియాస్ టెక్ శంకర్ కేంద్ర కమిటీ సభ్యుడిగా వ్యవహరించారు.

◆ పలాస మండలం బొడ్డపాడుకు చెందిన పోతనపల్లి అరుణ సౌత్ జోన్ కమిటీ సభ్యురాలిగా పనిచేశారు. ఈ ఏడాది జూన్ 18న మారేడుమిల్లిలో జరిగిన ఎదురుకాల్పుల్లో మరణించారు.

◆ నరసన్నపేట మండలం కోమర్తికి చెందిన గంటి రమేష్ ఎలియాస్ రాజన్న ఒడిశాలోని కొప్పరిడంగి వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌లో చనిపోయారు. ఆయన రాష్ట్ర కమిటీ సభ్యుడిగా వ్యవహరించారు.

◆ వజ్రపుకొత్తూరు మండలం పల్లిసారధి గ్రామానికి చెందిన రెయ్యి బాలకృష్ణ కర్ణాటక రాష్ట్ర కమిటీ సభ్యుడిగా పనిచేశారు. ఆయన 2000లో ఆ రాష్ట్రంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో చనిపోయారు.

◆ వజ్రపుకొత్తూరు మండలం అక్కుపల్లి గ్రామానికి చెందిన మద్దు కిరీష్ ఏవోబీ జోనల్ కమిటీ సభ్యురాలిగా పని చేశారు. ఒడిశా సరిహద్దుల్లో ఎన్‌కౌంటర్‌లో ప్రాణాలు కోల్పోయారు.

◆ సోంపేట మండలం పలాసపురానికి చెందిన చొక్కరి గంగారావు ఏవోబీ జోనల్ కమిటీ సభ్యుడిగా పనిచేశారు. కొమరాడ వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరణించారు.

◆ మద్దు కమల, ఎంపల్లి దూర్వాసులు, అంబటి ఎర్రన్న, సింహాద్రి, బతకల ఆదినారాయణ, శశిరేఖ, ఇందుమతి, కదంబాల శశిభూషణ్, పోతనపల్లి సుభద్ర, రాజేశ్వరి, రామకృష్ణ, మద్దు ధనరాజ్, ఎరుపల్లి శాంతమూర్తి, మద్దు కమల, చీకటి అప్పన్న, బొడ్డూరు కుందనాలు, మమత, పోతనపల్లి చిట్టక్క, గిరిజ, అశ్విని, శారద, వేణు, సంజీవరావు, బాలరాజు, సత్తెన్న.. మరికొందరు ఉద్యమ బాట పట్టి ఎదురుకాల్పుల్లో మృతి చెందారు.

వైవిధ్యమే భారత్ ఆస్తి: పెమ్మసాని



బాకులో జరిగిన కార్యక్రమంలో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఇతర ప్రతినిధులు

ఈనాడు, దిల్లీ: 'వైవిధ్యం భారతదేశ గొప్ప ఆస్తి. అజర్‌బైజాన్‌లో ఉన్న భారతీయ సంతతి ప్రజలు భారతీయ సంస్కృతిని ప్రతిబింబిస్తూ భారత్ ఔన్నత్యాన్ని చాటిచెప్పడం సంతోషం కలిగిస్తోంది' అని కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. వరల్డ్ టెలికమ్యూనికేషన్స్ డెవలప్‌మెంట్ కాన్ఫరెన్స్‌లో పాల్గొనడానికి అజర్‌బైజాన్ రాజధాని బాకు వెళ్లిన ఆయన అక్కడి భారతీయులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. అక్కడ సుమారు 1,050 మంది ఉద్యోగులు, 380 మంది విద్యార్థులు ఉండటం చాలా సంతోషకరమని పేర్కొన్నారు. వారంతా తెలుగు, తమిళం, భారతీయ విద్యార్థిసంఘాలు ఏర్పాటుచేసుకొని భారతదేశ నాయకత్వాన్ని చాటుతున్నాయంటూ అభినందిస్తున్నట్లు చెప్పారు. ప్రవాసులు స్వదేశానికి దూరంగా ఉన్నా వారి ఆత్మ ఎప్పుడూ సొంత ప్రాంతంలోనే ఉంటుందని పేర్కొన్నారు. అందరూ అటు భారతదేశంతోపాటు, ఇటు ఉద్యోగం చేస్తున్న విదేశాల్లోనూ గుర్తింపు సంపాదించుకోవాలని పిలుపునిచ్చారు.

మధ్యాహ్న భోజన వంట ఛార్జీల పెంపు

ఈనాడు, అమరావతి: పాఠశాలల్లో మధ్యాహ్న భోజన వంట ఛార్జీలను పెంచుతూ మధ్యాహ్న భోజనం, పాఠశాల పారిశుద్ధ్య విభాగం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం 1-5 తరగతుల్లోని ఒక్కో విద్యార్థికి రూ.5.45 ఇస్తుండగా రూ.6.19కి పెంచుతున్నట్లు, 6-8 తరగతులకు రూ.8.17 ఇస్తుండగా రూ.9.29కి పెంచుతున్నట్లు తెలిపింది. ఈ సవరించిన ఛార్జీలను ఫిబ్రవరి 19 నుంచి అమలు చేయనున్నట్లు పేర్కొంది. ఇప్పటివరకు అదనపు మెనూ ఛార్జీల కింద ఇస్తున్న (1-5తరగతులు) రూ.0.43, (6-8 తరగతులు) రూ.0.40 మినహాయించనున్నట్లు తెలిపింది. తొమ్మిదోతరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఒక్కో విద్యార్థికి ప్రస్తుతం ఇస్తున్న రూ.8.17 ఛార్జీలను రూ.9.29కి పెంచినట్లు పేర్కొంది. ఈ పెంచిన ఛార్జీలు ఆగస్టు 8 నుంచి అమల్లోకి వస్తాయంది. ప్రస్తుతం ఇస్తున్న అదనపు మెనూ ఛార్జీలు రూ.0.40 మినహాయించనున్నట్లు వివరించింది.

హైదరాబాద్- బెంగళూరు మధ్య హైస్పీడ్ కారిడార్

- ఆరు వరుసలతో గ్రీన్‌ఫీల్డ్ హైవే
- ఎన్‌హెచ్-44కు సమాంతరంగా నిర్మాణం
- ఏపీలో 250 కి.మీ. మేర కొత్త మార్గం
- అంచనా విలువ రూ.13 వేల కోట్లు

ఈనాడు, అమరావతి: హైదరాబాద్ నుంచి ఏపీ మీదుగా బెంగళూరుకు హైస్పీడ్ గ్రీన్‌ఫీల్డ్ కారిడార్ నిర్మాణం జరగనుంది. ఏపీలోని కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల మీదుగా ఇది వెళ్తుంది. ఇప్పుడున్న హైదరాబాద్-బెంగళూరు జాతీయ రహదారి-44కు సమాంతరంగా దీనిని నిర్మించేలా డీపీఆర్ సిద్ధం చేస్తున్నారు. దీనికోసం మూడు ఎలైన్‌మెంట్లు తయారు చేస్తున్నారు. వీటిలో ఒకదానిని జాతీయ రహదారుల మంత్రిత్వశాఖ (మోర్త్) ఎలైన్‌మెంట్ అప్రూవల్ కమిటీ ఆమోదించనుంది.

5 గంటల్లో చేరుకునేలా..: ప్రస్తుతం ఎన్‌హెచ్-44పై ప్రయాణించి హైదరాబాద్ నుంచి బెంగళూరుకు చేరేందుకు 8-9 గంటలు పడుతోంది. కొత్తగా నిర్మించనున్న హైస్పీడ్ కారిడార్‌లో కేవలం 5 గంటల్లో చేరుకునేలా చూడనున్నారు. 120 కి.మీ. వేగంతో వాహనాలు పరుగులు పెట్టేలా డిజైన్ రూపొందిస్తున్నారు.

● వాస్తవానికి ఇప్పుడున్న ఎన్‌హెచ్-44నే నాలుగు వరుసలు నుంచి ఆరుగాని, ఎనిమిది వరుసలకుగాని విస్తరించాలని తొలుత భావించారు. అయితే ఈహైవేకి ఆనుకొని కర్నూలు, అనంతపురం నగరాలతోపాటు, అనేకచోట్ల నివాస ప్రాంతాలు ఉన్నాయి. దీంతో ఇక్కడ విస్తరణ కష్టమన్న నిర్ణయానికి వచ్చారు. కొత్తగా ఆరు వరుసలతో గ్రీన్‌ఫీల్డ్ కారిడార్ నిర్మాణానికి నిర్ణయం తీసుకున్నారు.

● హైదరాబాద్-బెంగళూరు హైవే-44 తెలంగాణలో 210 కి.మీ., ఏపీలో 260 కి.మీ., కర్ణాటకలో 106 కి.మీ. మేర కలిపి మొత్తం 576 కి.మీ.ఉంది. కొత్త హైస్పీడ్ కారిడార్ కూడా ఎన్‌హెచ్-44కు 10-15 కి.మీ. దూరంలో దాదాపు సమాంతరంగా వెళ్లనుంది.

● కొన్నిచోట్ల మాత్రమే ఈ హైవేలోకి ప్రవేశించేందుకు (ఎంట్రీ), బయటకు వచ్చేందుకు (ఎగ్జిట్) అవకాశం కల్పిస్తారు. కారిడార్ మధ్య ఎక్కడైనా ఇతర ఎన్‌హెచ్‌లను క్రాస్ చేస్తే.. అక్కడ ట్రంపెట్ ఇంటర్‌ఛేంజ్‌లు నిర్మిస్తారు. కారిడార్ మొత్తం.. నాలుగైదు మీటర్ల ఎత్తులో ఉండనుంది. దీనిపై అడ్వాన్స్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ విధానం అమలు చేయనున్నారు.

100 మీటర్ల వెడల్పుతో భూసేకరణ

● ఈ ప్రాజెక్ట్ కోసం సలహా సంస్థ ద్వారా మూడు ఎలైన్‌మెంట్లను సిద్ధం చేయిస్తున్నారు. ● 100 మీటర్ల వెడల్పుతో భూసేకరణ ఉండేలా చూడనున్నారు.

● ఏపీ పరిధిలో హైస్పీడ్ కారిడార్ నిర్మాణానికి రూ.13 వేల కోట్ల వ్యయం అవుతుందని అంచనా.

● మూడు ఎలైన్‌మెంట్లలో ఒకటి ఖరారు అయ్యాక వ్యయం ఎంత అవుతుందనేది తేలనుంది.

● ఫిబ్రవరి నాటికి డీపీఆర్ సిద్ధం చేయాలని సలహా సంస్థకు ఎన్‌హెచ్ఏఐ గడువు విధించింది.

ఎంవోయూలు, ఉద్యోగాల పేరుతో చంద్రబాబు, జగన్ రాజకీయాలు

పీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఆగ్రహం



బాండ్ పేపర్‌ను చూపిస్తున్న షర్మిల

విజయవాడ (గవర్నర్‌పేట), న్యూస్‌టుడే: ఎంవోయూలు, పెట్టుబడులు, ఉద్యోగాల పేరుతో చంద్రబాబు, జగన్ రాజకీయాలు చేశారని పీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఆగ్రహం వ్యక్తంచేశారు. చంద్రబాబు 2014-19లో మూడు సదస్సులు పెట్టి 1,761 ఎంవోయూలు కుదుర్చుకున్నారని, రూ.19 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చినట్లు చెప్పారన్నారు. వీటితో 30 లక్షల ఉద్యోగాలు ఇచ్చామని చెప్పారని. . వీటిలో కనీసం 10 శాతం ఒప్పందాలు అయినా గ్రౌండ్ అయ్యాయా? అని ప్రశ్నించారు. 2023లో విశాఖ వేదికగా జగన్ అంతర్జాతీయ సదస్సు పెట్టారని.. 387 ఎంవోయూలు, రూ.13 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయన్నారని గుర్తుచేశారు. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలని ఊదరగొట్టారని.. వాటిలో 10% కూడా అమలుకాలేదని విమర్శించారు. బుధవారం షర్మిల విజయవాడలో విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు ఎంవోయూలపై నమ్మకం లేదని, బాండ్ పేపర్‌పై 613 ఎంవోయూలు, 16.31 లక్షల ఉద్యోగాలు, రూ.13లక్షల కోట్ల పెట్టుబడులు అని రాసి సంతకం పెట్టాలని షర్మిల డిమాండ్ చేశారు. కేంద్రంతో సంబంధం లేకుండా.. 'అన్నదాత సుఖీభవ' పథకం కింద రూ.20,000 ఇస్తామని చెప్పిన చంద్రబాబు మాట తప్పారని విమర్శించారు. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని చంపే ప్రయత్నం చేస్తున్నారన్నారు.

వక్క పీచుతో శానిటరీ న్యాప్‌కిన్లు



శుభ్రం చేసిన వక్క పీచు



పీచుతో చేసిన దారం




శానిటరీ న్యాప్‌కిన్స్

వక్క కాయలను ప్రాసెస్ చేసే సమయంలో వచ్చే పీచును ఎక్కువగా వంట చెరకుగా, ఎరువుగా వాడుతున్నారు. ఈ పీచుతో శానిటరీ న్యాప్‌కిన్స్ తయారుచేస్తున్నారు. కర్ణాటక రాష్ట్రం దావణగెరెలోని బాపూజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలోని టెక్స్‌టైల్ విభాగం ఆచార్యులు, విద్యార్థులు ఈ అంశంపై ఎనిమిదేళ్లుగా పరిశోధనలు చేస్తున్నారు. తాజాగా అవి ఒక కొలిక్కి వచ్చాయి. వక్కను ఒలిచాక వచ్చే పీచుకు కొన్ని రకాల రసాయనాలు, కొంతమేర నూలు కలిపి దారాలుగా మారుస్తున్నారు. అనంతరం వాటితో వస్త్రాలు రూపొందిస్తున్నారు. మొదట్లో చొక్కాలు, కుర్తాలు, స్వెటర్లను మాత్రమే తయారుచేయగా క్రమంగా శానిటరీ న్యాప్‌కిన్స్ వైపు అడుగులు వేశారు. చివరికి గత నెలలో 10 వేల శానిటరీ న్యాప్‌కిన్స్ రూపొందించారు. త్వరలోనే వాటిని విద్యార్థినులకు అందించనున్నట్లు టెక్స్‌టైల్ విభాగాధిపతి డాక్టర్ వైఎన్ దినేశ్ వెల్లడించారు. పీచుకు నూలు కలపడం ద్వారా వస్త్రాలు మృదువుగా ఉంటాయని వివరించారు. – న్యూస్‌టుడే, దావణగెరె

దివిసీమ నా కర్మ భూమి

హరియాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ



దివిసీమ ఉప్పెన చిత్ర ప్రదర్శనను తిలకిస్తున్న బండారు దత్తాత్రేయ. చిత్రంలో తులసిరెడ్డి, శశిధర్‌రెడ్డి, కొల్లు రవీంద్ర, మండలి బుద్ధప్రసాద్

అవనిగడ్డ, న్యూస్‌టుడే: దివిసీమ తన కర్మ భూమి అని, ఇక్కడ పొందిన ప్రేరణ మరువలేనిదని హరియాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. బుధవారం కృష్ణా జిల్లా అవనిగడ్డలో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆధ్వర్యంలో 1977 దివిసీమ ఉప్పెన 48వ వార్షిక సంస్మరణ సభ, మానవతామూర్తులకు దివ్యవందనం కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దత్తాత్రేయ విచ్చేశారు. మాజీ మంత్రి మండలి వెంకట కృష్ణారావు శతజయంతి సందర్భంగా స్థానిక వంతెన కూడలిలోని ఆయన విగ్రహానికి రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్రతో కలసి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారంతా 1977 ఉప్పెన చిత్ర ప్రదర్శనను తిలకించారు. ఈ సందర్భంగా గాంధీక్షేత్రంలో ఏర్పాటుచేసిన సభలో దత్తాత్రేయ మాట్లాడుతూ.. ఉప్పెన సమయంలో నాగాయలంక మండలం పర్రచివర, దిండి, సొర్లగొంది, మూలపాలెం, కోడూరు మండలంలో చేసిన సేవల జ్ఞాపకాలు తన హృదయానికి దగ్గరగా ఉంటాయని చెప్పారు. సహాయక చర్యల కోసం 6 నెలలు గడిపిన కాలం తన జీవితంలో గొప్ప మార్పు తెచ్చిందన్నారు. ఆ ప్రేరణ మరువలేనిదన్నారు. ఎక్కడ చూసినా కుప్పలుగా ఉన్న శవాలు చూసి చలించిపోయానని, సామూహిక శవదహన కార్యక్రమం నిర్వహించానని చెప్పారు. మండలి వెంకట కృష్ణారావు మంత్రి హోదాలో ఉన్నా రోజూ ముళ్లబాటలో నడిచి, కాళ్లకు పుండ్లు పడినా లెక్కచేయకుండా సహాయక కార్యక్రమాల్లో ప్రజలకు అండగా నిలిచిన నిజమైన నాయకుడని గుర్తు చేసుకున్నారు. తండ్రి బాటలో బుద్ధప్రసాద్ చేస్తున్న కృషి అపూర్వమన్నారు. రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర, మర్రి శశిధర్‌రెడ్డి, ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు, సీపీఐ జాతీయ నేత కె.రామకృష్ణ, ఏపీసీసీ మీడియా కమిటీ ఛైర్మన్ డాక్టర్ ఎన్.తులసిరెడ్డి తదితరులు ప్రసంగించారు.

'మద్యం' సొమ్ముతో ఆస్తుల కొనుగోలు

- చెవిరెడ్డి భాస్కరరెడ్డి, ఆయన కుటుంబీకుల పేరిట కొన్న ఆస్తుల జప్తునకు చర్యలు

ఈనాడు, అమరావతి: వైకాపా హయాంలో జరిగిన రూ.వేల కోట్ల మద్యం కుంభకోణం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో నిందితుడైన వైకాపా నేత చెవిరెడ్డి భాస్కరరెడ్డి(ఏ-38), అతని భార్య లక్ష్మీకాంతమ్మ, కుమారుడు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి(ఏ-39), మరో కుమారుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి, వారు ప్రతినిధులుగా ఉన్న సంస్థల పేరిట మద్యం లంచాల సొత్తుతో కొనుగోలు చేసిన స్థిరాస్తుల జప్తునకు అనుమతి కోరుతూ ఏసీబీ కోర్టులో పిటిషన్ దాఖలుకు సిట్‌కు రాష్ట్ర ప్రభుత్వం అనుమతిచ్చింది. వీరు 2021 నుంచి 2023 మధ్య బహిరంగ మార్కెట్‌లో రూ.63.72 కోట్ల విలువైన స్థిరాస్తులు కొని... రికార్డుల్లో మాత్రం వాటి విలువను రూ.8.85 కోట్లుగా చూపించారని, నల్లధనాన్ని వైట్‌లోకి మార్చుకునే క్రమంలో రూ.54.87 కోట్ల సొత్తు లెక్కలు దాచిపెట్టినట్లు సిట్ దర్యాప్తులో గుర్తించింది. వెందుడో గ్రామంలో 263.28 ఎకరాల భూమి కొని కొద్దిరోజుల్లోనే దాన్ని అరబిందో ఫార్మాకు విక్రయించారని, కృత్రిమంగా భూముల ధరలు పెంచుకుని బ్లాక్‌మనీని వైట్‌లోకి మార్చుకున్నట్లు తేల్చింది. కేవీఎస్ ఇన్‌ఫ్రా ద్వారా ఈ డబ్బు రూటింగ్ చేసినట్లు గుర్తించింది. ఈ ఒక్క డీల్‌లోనే రూ.13.30 కోట్ల నల్లధనాన్ని వైట్‌లోకి మార్చుకుని.. ఆ సొత్తును స్థిరాస్తిలో పెట్టుబడులు పెట్టి భారీగా లబ్ధి పొందినట్లు సిట్ గుర్తించింది. ఇదంతా మద్యం ముడుపుల సొమ్ము ద్వారా పొందిన అక్రమ లబ్ధేనని తేల్చి ఆయా ఆస్తుల జప్తునకు చర్యలు చేపట్టింది. దీనికోసం ఏసీబీ కోర్టులో పిటిషన్ దాఖలుకు సిట్‌కు అనుమతినిస్తూ హోంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజిత్ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు.

సబ్‌రిజిస్ట్రార్ల నుంచి వివరాలు తెప్పించి మరీ...

చెవిరెడ్డి భాస్కరరెడ్డి, అతని భార్య లక్ష్మీకాంతమ్మ, కుమారుడు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, మరో కుమారుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి, వారు ప్రతినిధులుగా ఉన్న కేవీఎస్ ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్, సీఎంఆర్ ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్‌ల పేరిట 2019 నుంచి 2024 మధ్య జరిగిన భూముల కొనుగోలు లావాదేవీల వివరాల కోసం... చంద్రగిరి, రేణిగుంట, తొట్టంబేడు, గూడూరు, పొదలకూరు, పుత్తూరుల్లోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు సిట్ అధికారులు కొద్దిరోజుల కిందట లేఖ రాశారు. ఆయా కార్యాలయాల నుంచి అందిన సమాచారాన్ని విశ్లేషించిన అధికారులు.. ఆ ఆస్తులన్నీ మద్యం ముడుపుల సొత్తుతో కొన్నారని, అందుకే రికార్డుల్లో తక్కువ మొత్తానికి కొన్నట్లు చూపించారని గుర్తించారు. దాని రికవరీలో భాగంగా ఆస్తుల జప్తు చర్యలు చేపట్టారు.

2021 నుంచి 2023 మధ్య చెవిరెడ్డి భాస్కరరెడ్డి, ఆయన కుటుంబసభ్యులు మద్యం ముడుపుల సొత్తుతో కొన్న ఆస్తుల వివరాలు

మరిన్ని వివరాలు https://epaper.eenadu.net లో

'మద్యం' కేసులో కీలక నిందితులకు హైకోర్టులో ఎదురుదెబ్బ

(మొదటి పేజీ తరువాయి)

కోరగా న్యాయమూర్తి అంగీకరించారు. ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, బాలాజీ గోవిందప్పలకు ఏసీబీ కోర్టు ఇచ్చిన డిఫాల్ట్ బెయిల్‌ను రద్దుచేయాలని కోరుతూ సీఐడీ అధికారులు హైకోర్టులో పిటిషన్లు వేసిన సంగతి తెలిసిందే. సీఐడీ తరఫున సీనియర్ న్యాయవాదులు సిద్ధార్థ లూథ్రా, పోసాని వెంకటేశ్వర్లు, పీపీ లక్ష్మీనారాయణ వాదనలు వినిపిస్తూ.. 'మద్యం కుంభకోణం కేసులో అభియోగపత్రాలను ఏసీబీ కోర్టు ముందు ఉంచాం. వాటిని విచారణకు పరిగణనలోకి తీసుకునే వ్యవహారం ఏసీబీ కోర్టు ముందు ఉన్నప్పుడు అసంపూర్తి అభియోగపత్రాలు దాఖలుచేశారనే కారణంతో ఆ కోర్టు నిందితులకు డిఫాల్ట్ బెయిల్ ఇవ్వడం తగదు. రీతూ ఛాబ్రియా కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై ఆధారపడి ఏసీబీ కోర్టు నిందితులకు డిఫాల్ట్ బెయిలిచ్చింది. ఆ తీర్పు అమలును నిలుపుదల చేస్తూ రీకాల్ పిటిషన్లో సుప్రీంకోర్టు ఉత్తర్వులిచ్చింది. మద్యం కుంభకోణం వల్ల బాధితులుగా మారింది ప్రజలే. బెయిలు మంజూరుచేసే విషయంలో నిందితుల వ్యక్తిగత స్వేచ్ఛ కంటే బాధితులైన ప్రజల ప్రయోజనాలకే ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలి. నిందితులకు డిఫాల్ట్ బెయిలిస్తూ విజయవాడ ఏసీబీ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను రద్దుచేయండి' అని కోరారు.

◆ నిందితుల తరఫు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ.. నిర్దిష్ట సమయంలో దర్యాప్తు పూర్తికాలేదనే నిర్ణయానికి వచ్చాకే ఏసీబీ కోర్టు డిఫాల్ట్ బెయిలిచ్చిందని చెప్పారు. నిందితుల రిమాండ్‌ను పొడిగించాలని కోరే ప్రతి సందర్భంలోనూ తదుపరి దర్యాప్తు జరపాల్సి ఉందని ఏసీబీ కోర్టుకు సీఐడీ చెబుతోందన్నారు. దీన్నిబట్టి చూస్తే దర్యాప్తు పూర్తికాలేదని స్పష్టమవుతోందన్నారు. నిందితుల వ్యక్తిగత స్వేచ్ఛను దృష్టిలో ఉంచుకొని ఏసీబీ కోర్టు డిఫాల్ట్ బెయిలిచ్చిందన్నారు. సీఐడీ దాఖలు చేసిన వ్యాజ్యాలను కొట్టేయాలని కోరారు.

◆ ఇరువైపు న్యాయవాదుల వాదనలు ముగియడంతో సెప్టెంబరు 26న తీర్పును వాయిదా వేసిన న్యాయమూర్తి.. నిందితుల బెయిలును రద్దుచేస్తూ బుధవారం నిర్ణయాన్ని ప్రకటించారు.

యాపిల్‌కేర్ ప్లస్‌లో కొత్త సదుపాయాలు

ఐఫోన్ల సంరక్షణ కోసం మనదేశంలో టెక్ దిగ్గజం యాపిల్ అమలుచేస్తున్న యాపిల్‌కేర్ ప్లస్‌లో మరిన్ని సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయి. ఐఫోన్ చోరీ జరిగినా, పోగొట్టుకున్నా కూడా ఈ పథకం కింద భద్రత ఇవ్వనున్నట్లు ప్రకటించింది. ఇప్పటివరకు యాపిల్‌కేర్ ప్లస్ కింద ప్రమాదవశాత్తూ ఫోన్ పాడైతే, ఎన్నిసార్లయినా మరమ్మతు చేయించుకునే సౌలభ్యం ఉంది. ఇప్పటికే కొన్ని దేశాల్లో ఫోన్ చోరీ జరిగినా, పోగొట్టుకున్నా కంపెనీ కవరేజీ ఇస్తోంది. ఇప్పుడు మనదేశంలోనూ ఈ సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చింది. ఇందుకోసం నెలవారీ, వార్షిక చందా పథకాలను ఆవిష్కరించింది. కొత్తగా తీసుకొచ్చిన నెలకు రూ.799తో ప్రారంభమయ్యే ప్లాన్ కింద ఐఫోన్‌ను పోగొట్టుకున్నా, చోరీకి గురైనా ఏడాదిలో 2సార్లు కవరేజీ పొందొచ్చు. ఐఫోన్ 13 నుంచి ఐఫోన్ 17 వరకు, ఐఫోన్ ఎస్ఈకి కూడా ఈ భద్రత లభిస్తుంది. కొత్త ఐఫోన్ కొనుగోలు చేసిన వెంటనే లేదా 60 రోజుల్లోపు యాపిల్ కేర్ ప్లస్‌ను తీసుకోవచ్చు.



అదానీకే జైప్రకాశ్ అసోసియేట్స్

దిల్లీ: అప్పుల్లో కూరుకుపోయిన జైప్రకాశ్ అసోసియేట్స్‌ను టేకోవర్ చేసుకోవడానికి అదానీ గ్రూప్‌నకు మెజారిటీ రుణదాతల నుంచి అనుమతులు లభించాయి. జై ప్రకాశ్‌ను స్వాధీనం చేసుకునేందుకు అదానీ చేసిన ప్రతిపాదన.. పోటీ బిడ్డర్లతో పోలిస్తే అధిక అప్‌ఫ్రంట్ మొత్తం (తొలుత రూ.6,005 కోట్లు; రెండేళ్ల తర్వాత మరో రూ.6,726 కోట్లు) ఉండడం ఇందుకు కారణమని విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి. అదానీ గ్రూప్, వేదాంతా, దాల్మియా సిమెంట్ (భారత్) వంటి బిడ్డర్లు దాఖలు చేసిన ప్రతిపాదనలను పరిశీలించి, కమిటీ ఆఫ్ క్రెడిటర్స్ (సీఓసీ) ఓటు వేశారు. అదానీకి 89% ఓట్లు రాగా, తర్వాతి స్థానాల్లో దాల్మియా సిమెంట్ (భారత్), వేదాంతా నిలిచాయని సమాచారం.

ఏడబ్ల్యూఎల్ అగ్రిలో 13% వాటా అమ్మకం: ఏడబ్ల్యూఎల్ అగ్రి బిజినెస్ (అంతక్రితం అదానీ విల్మర్ లిమిటెడ్)లో ఉన్న అదనపు 13% వాటా (16.9 కోట్ల షేర్ల)ను విల్మర్ ఇంటర్నేషనల్ అనుబంధ కంపెనీ లెన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు అదానీ గ్రూప్ విక్రయించింది. అంతక్రితం వాటా విక్రయ ప్రణాళిక ప్రకారం చూస్తే ఒక్కో షేరు రూ.275 చొప్పున, ఈ లావాదేవీ విలువ రూ.4,646 కోట్లు. 13% వాటా కొనుగోలు అనంతరం, ఏడబ్ల్యూఎల్‌లో లెన్స్ వాటా 56.94 శాతానికి చేరింది.

మెట్రోకెమ్ ఏపీఐతో హెచ్‌ఆర్‌వీ ఫార్మా భాగస్వామ్యం

ఈనాడు, హైదరాబాద్: పార్మాటెక్, వర్సువల్ ఏపీఐ కంపెనీ హెచ్ఆర్‌వీ గ్లోబల్ లైఫ్ సైన్సెస్ (హెచ్ఆర్‌వీ ఫార్మా).. ఏపీఐ అభివృద్ధి, తయారీలో నిమగ్నమైన మెట్రోకెమ్ ఏపీఐతో వ్యూహాత్మక భాగస్వామ్యం కుదుర్చుకుంది. కాంట్రాక్ట్ అభివృద్ధి, తయారీ (సీడీఎంఓ) ఒప్పందం పరిధిలో భాగంగా అధిక విలువగల ఎన్‌సీఈ-1, లేట్ స్టేజ్ కాంప్లెక్స్ ఏపీఐల అభివృద్ధి, తయారీపై దృష్టి పెట్టనుంది. 50కి పైగా దేశాల్లో ఉన్న తమ మార్కెటింగ్, మెట్రోకెమ్ నైపుణ్యాలు తోడవుతాయని హెచ్ఆర్‌వీ ఫార్మా సీఈఓ హరి కిరణ్ చేరెడ్డి తెలిపారు. గత ఆర్థిక సంవత్సరంలో సంస్థ ఆదాయం రూ.417 కోట్లు కాగా, 2027 నాటికి రూ.1,000 కోట్లకు చేర్చాలనేది లక్ష్యమన్నారు. అమెరికాలో జంతు వైద్యాల విపణిలోకి అడుగు పెట్టామని, త్వరలో వెటర్నరీ ఫార్ములేషన్ విభాగంలోకి ప్రవేశించే ఆలోచన ఉందని పేర్కొన్నారు.

ఎక్స్‌యూవీ 700 పేరు-రూపు మారుతున్నాయ్



మహీంద్రా అండ్ మహీంద్రా ఈ ఏడాది డిసెంబరులో లేదా 2026 జనవరిలో ఎక్స్‌యూవీ 700లో 'ఫేస్‌లిఫ్ట్' వెర్షన్‌ను తీసుకురాబోతోంది. ఎక్స్‌యూవీ 300 పేరును ఎక్స్‌యూవీ 3ఎక్స్ఓగా మార్చినట్లే ఎక్స్‌యూవీ 700 పేరును ఎక్స్‌యూవీ 7ఎక్స్ఓగా మార్చనుంది. ఈ మేరకు ట్రేడ్‌మార్క్ కోసం దరఖాస్తు చేసుకుంది. దీంతోపాటు వాహనంలో పలు మార్పులు చేయనున్నట్లు సమాచారం. అలాగే ఎక్స్‌యూవీ 1ఎక్స్ఓ, ఎక్స్‌యూవీ 5ఎక్స్ఓ, ట్రేడ్‌మార్క్‌ల కోసం కూడా దరఖాస్తు చేసుకున్నట్లు తెలుస్తోంది.

హైదరాబాద్‌లో లోరియల్ జీసీసీ?

ఈనాడు, హైదరాబాద్: సౌందర్య సాధనాల విభాగంలో అగ్రగామి సంస్థ లోరియల్, హైదరాబాద్‌లో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ (జీసీసీ) ఏర్పాటు చేయబోతోందని తెలిసింది. ఫ్రాన్స్‌కు చెందిన ఈ సంస్థకు మనదేశంలోని ముంబయి, బెంగళూరుల్లో వ్యాపార, పరిశోధన కేంద్రాలున్నాయి. వీటితో సంబంధం లేకుండా, ఈ స్వతంత్ర సంస్థగా జీసీసీని ఏర్పాటు చేయనున్నట్లు తెలుస్తోంది. ఐటీ, డేటా అనలిటిక్స్, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్, సప్లై చైన్, షేర్డ్ సర్వీసెస్ విభాగాల్లో విస్తృత స్థాయిలో కార్యకలాపాలు ఈ కేంద్రంలో నిర్వహిస్తారు. హైదరాబాద్‌లో జీవీల అమెరికా, ఐరోపా, జపాన్ దేశాలకు చెందిన బహుళజాతి సంస్థలు తమ జీసీసీలను నెలకొల్పుతున్నాయి. ఇప్పుడు ఫ్రాన్స్‌కు చెందిన లోరియల్ కూడా ఇక్కడే ఏర్పాటు చేయడాన్ని చూస్తే, కొత్త కంపెనీలను ఇక్కడి వనరులు ఎంతగా ఆకర్షిస్తున్నాయో తెలుస్తుందని పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి.

కోడి గుడ్డు

20న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయల్లో)

హైదరాబాద్	630
వరంగల్	632
విజయవాడ	660
తూ/ప గోదావరి	630
విశాఖపట్నం	625
చిత్తూరు	663

గ్రో షేరు 10% తగ్గింది ఎందుకో?

● ఎన్ఎస్ఈ ఆక్షన్‌కు 30 లక్షల షేర్లు

● షార్ట్ సెల్లర్లు చిక్కుకుపోయారు

అది ఒక స్టాక్ బ్రోకింగ్ సేవల సంస్థ. టెక్నాలజీని అందిపుచ్చుకుంది. నాలుగైదేళ్లలోనే చాలా వేగంగా విస్తరించింది. దశాబ్దాల తరబడి కార్యకలాపాలు సాగిస్తున్న అగ్రగామి బ్రోకింగ్ సేవల సంస్థలతో పోలిస్తే ఎన్నో రెట్లు అధికంగా ఖాతాదార్లను సంపాదించుకుంది. మొబైల్‌లోని ఈ సంస్థ యాప్ ద్వారా సులభంగా షేర్లు కొని/విక్రయించే వీలుండటంతో.. స్టాక్ మార్కెట్లోకి కొత్తగా ప్రవేశిస్తున్న యువ ఇన్వెస్టర్లకు ఎంతగానో దగ్గరైంది. అదే జోరులో పబ్లిక్ ఇష్యూ (తొలి పబ్లిక్ ఇష్యూ)కు వచ్చింది. అత్యంత ఆకర్షణీయంగా స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదైంది. షేరు ట్రేడింగ్ మొదలైన 4 రోజుల్లోనే రూ.1 లక్ష కోట్ల 'మార్కెట్ విలువ' సాధించింది. కానీ బుధవారం (ఈనెల 19న) అనూహ్యంగా ఈ షేరు నేల చూపులు చూసింది. అదే 'గ్రో' బ్రోకింగ్ సేవల సంస్థ. అసలు పేరు బిలియన్‌బ్రెయిన్ గ్యారేజ్ వెంచర్స్. బుధవారం గ్రో షేరు బీఎస్ఈలో 10% పతనమై రూ.169.94 ముగింపు ధర నమోదు చేసింది. ఇదే కాదు. దాదాపు 30 లక్షల షేర్లను 'డెలివరీ' ఇవ్వలేని పరిస్థితి గ్రో షేర్ల విక్రయదార్లకు ఎదురైంది. దీంతో ఈ షేర్ల కోసం నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ ఇండియా (ఎన్ఎస్ఈ) 'ఆక్షన్' నిర్వహించాల్సిన పరిస్థితి తలెత్తింది.

ఇది కారణం

ఈ షేరు ఇష్యూ ధర రూ.100 కాగా, ఈనెల 12న స్టాక్ ఎక్స్ఛేంజీల్లో రూ.112 వద్ద నమోదైంది. బీఎస్ఈలో మంగళవారం రూ.188.82 వద్ద ముగిసింది. ఒక దశలో రూ.193.91కు చేరింది కూడా. వారం వ్యవధిలోనే గణనీయంగా పెరిగిన ఈ షేరు ధర తగ్గుతుందని, అందువల్ల 'షార్ట్' చేసి.. మళ్లీ తక్కువ ధరలో కొనుగోలు చేసి 'కవర్' చేయడం ద్వారా, లాభాలు ఆర్జించొచ్చని ఎంతో మంది ఇన్వెస్టర్లు ఆలోచించారు. దాన్నే అమల్లో పెట్టారు. కానీ వారి అంచనాలకు భిన్నంగా గ్రో షేరు ధర పెరిగింది. స్టాక్ ఎక్స్ఛేంజీల నగదు మార్కెట్లో విధించిన 'షార్ట్ పొజిషన్స్' ఏర్పడ్డాయి. ఇందువల్లే గ్రో షేరుకు ఈ పరిస్థితి ఏర్పడిందని మార్కెట్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఇన్వెస్టర్లు తమ వద్ద షేర్లు లేకుండానే విక్రయించడాన్ని షార్ట్ చేయడం లేదా షార్ట్ పొజిషన్‌ను 'బిల్డ్' చేయడం అంటారు. షేరు ధర పెరగడంతో కొనలేకపోయారు. 'డెలివరీ' విషయంలో డిఫాల్ట్ అయ్యారు. అందుకే పెద్ద సంఖ్యలో షేర్లు 'ఆక్షన్'కు వచ్చినట్లు తెలుస్తోంది.

లాభాల స్వీకరణ కూడా..

అధిక ధరల వద్ద ఈ షేరులో లాభాల స్వీకరణ (ప్రాఫిట్ బుకింగ్)కు మదుపర్లు దిగారు. ఐపీఓలో షేర్లు లభించిన మదుపర్లు, లాభాల కోసం షేర్ల విక్రయాలకు సిద్ధపడ్డారు. ఈ పరిణామాల్లోనే బుధవారం అమ్మకాల ఒత్తిడి పెరిగి గ్రో షేరు ధర 10% పడింది.

ఇంత విలువ ఇవ్వొచ్చా?

అసలు గ్రో షేరుకు ఇంత ధర లభించడమే మార్కెట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఒక బ్రోకింగ్ సేవల సంస్థకు ఇంత అధిక విలువ ఇవ్వొచ్చా? అనే ప్రశ్నలు తలెత్తాయి. ఐపీఓకు ముందు 'యాంకర్ బుక్'లో విక్రయించిన షేర్ల 'లాకిన్' గడువు పూర్తి చేసుకుని, త్వరలో మార్కెట్లోకి రాబోతున్నాయి. అప్పుడు మరింత అమ్మకాల ఒత్తిడి ఎదురవుతుందనే అనుమానాలు ఉన్నాయి. గ్రో త్రైమాసిక ఫలితాలు ఈ నెల 21న వెల్లడవుతాయి. ఫలితాలు ఆకర్షణీయంగా ఉంటే సరి.. లేకపోతే ఇంకా అమ్మకాల ఒత్తిడి ఎదురు కావొచ్చు.

- ఈనాడు, హైదరాబాద్

విదేశీ మదుపర్లకు సెబీ ఎర్రతివాచీ



● రిజిస్ట్రేషన్ ప్రక్రియ పేపరు రహితంగా రోజుల్లోనే

● 'బెస్ట్ ఇన్ క్లాస్' అనుభవాన్ని ఇస్తాం: పాండే

దిల్లీ: విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపర్ల (ఎఫ్‌పీఐ) రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తిగా డిజిటలీకరణ చేసే దిశగా మార్కెట్ నియంత్రణాధికార సంస్థ సెబీ పనిచేస్తోంది. డిజిటల్ సంతకాల ద్వారా మొత్తం ప్రక్రియను కాగితరహితంగా చేస్తున్నట్లు సెబీ ఛైర్మన్ తుహిన్ కాంత్ పాండే పేర్కొన్నారు. ఎఫ్‌పీఐలకు 'బెస్ట్ ఇన్ క్లాస్' అనుభవాన్ని అందజేయగలమని అన్నారు. ఇప్పటిదాకా వారి రిజిస్ట్రేషన్‌కు నెలల తరబడి సమయం పట్టేదని.. ఇకపై రోజుల్లోనే పూర్తవుతుందన్నారు. అదే సమయంలో డేటా భద్రతకూ ప్రాధాన్యం ఇస్తామని బుధవారమిక్కడ జరిగి ఒక కార్యక్రమంలో ఆయన పేర్కొన్నారు.

✦ ఎఫ్‌పీఐ రిజిస్ట్రేషన్లకు రెండో ప్లాట్‌ఫాంను తీసుకురావడం ద్వారా, సేవల నాణ్యతను సెబీ మరింత పెంచనుంది. భారత మార్కెట్లలో విదేశీ మదుపర్లు కీలక పాత్ర వహిస్తున్న తరుణంలో ఈ పరిణామం చోటు చేసుకోవడం విశేషం. ఈ ఏడాది సెప్టెంబరు నాటికి ఎఫ్‌పీఐలు మనదేశంలో 876 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.77 లక్షల కోట్ల) విలువైన ఆస్తులను నిర్వహిస్తున్నారు. లిస్టెడ్ కంపెనీల్లో వీరికి 17% వరకు వాటా ఉంది.

స్వాగత్-ఎఫ్‌పీఐ కింద అదనపు అనుమతులు లేకుండా, ఇతర మార్గాల్లోనూ పెట్టుబడులకు త్వరలోనే ఆమోదం లభిస్తుందని పాండే తెలిపారు.

✦ ఎఫ్‌పీఐల ట్రేడింగ్ సెటిల్‌మెంట్‌ను అదే రోజున చేసేందుకూ పరిశీలన చేపట్టినట్లు సెబీ ఛైర్మన్ తెలిపారు. ఈ సంస్కరణలను ముందుకు తీసుకెళ్లడం కోసం ఆర్‌బీఐ, ఆర్థిక శాఖలతో సెబీ పనిచేస్తోందని పాండే వివరించారు.


ఫండ్ నిబంధనలపై స్పందనలకు గడువు పొడిగింపు: మ్యూచువల్ ఫండ్ నిబంధనల సవరణ ప్రతిపాదనపై స్పందించేందుకు ఈనెల 24 వరకు గడువు పొడిగిస్తున్నట్లు సెబీ తెలిపింది. టోటల్ ఎక్స్‌పెన్స్ రేషియో(టీఈఆర్) నిర్వచనం, బ్రోకరేజీ ఛార్జీల పరిమితుల సవరణ.. తదితరాలపై స్పందించేందుకు అంతక్రితం గడువు నవంబరు 17గా ప్రకటించిన సంగతి విదితమే.

ఆన్‌లైన్ బాండ్ ప్లాట్‌ఫాం ప్రొవైడర్లతో జాగ్రత్త

సెబీ వద్ద నమోదు కాని ఆన్‌లైన్ బాండ్ ప్లాట్‌ఫాం ప్రొవైడర్ల (ఓబీపీపీలు) విషయంలో ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని సెబీ సూచించింది. వీటిపై సెబీకి నియంత్రణ ఉండదని, మదుపర్ల రక్షణకు ఎటువంటి వ్యవస్థ కూడా ఉండదని తెలిపింది. లావాదేవీకి ముందే ఓబీపీపీల రిజిస్ట్రేషన్‌ను తనిఖీ చేసుకోవాలని మదుపర్లకు తెలిపింది.

హైదరాబాద్‌లో కాగ్ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్

దిల్లీ: ఆర్థిక వ్యవహారాల ఆడిట్ కోసం కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ఆఫ్ ఇండియా (కాగ్) హైదరాబాద్‌లో సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ (సీఓఈ)ని ఏర్పాటు చేయనుంది. ఈ జాతీయ కేంద్రం ఆర్థిక ఆడిట్ రంగంలో ఆవిష్కరణలు, పరిశోధన, వృత్తిపరమైన అభివృద్ధికి తోడ్పడుతుందని డిప్యూటీ కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కమర్షియల్, రిపోర్ట్ సెంట్రల్) ఏఎం బజాజ్ వెల్లడించారు. అంతర్జాతీయంగా అమల్లో ఉన్న ఆడిట్ విధానాలు, నైపుణ్యాలు పెంచే కేంద్రంగా ఇది పనిచేస్తుందన్నారు.



సీఓఈ ఏర్పాటుతో కాగ్ తనను తాను అత్యున్నత ఆడిట్ సంస్థగా బలోపేతం చేసుకుంటోందని వివరించారు. దీంతో ఆడిట్‌లు అంతర్జాతీయ ప్రమాణాలతో ఉండటమే కాకుండా, ఈ రంగంలో ప్రపంచ బెంచ్‌మార్క్‌లను రూపొందించే స్థాయికి చేరతాయన్నారు. ఈ కేంద్రం ఏర్పాటు గురించి కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ కె.సంజయ్ మూర్తి ఇటీవల 32వ అకౌంటెంట్స్ జనరల్ సదస్సులో ప్రకటించారు. దేశీయంగా అభివృద్ధి చేస్తున్న కాగ్-ఎల్ఎల్ఎం గురించి బజాజ్ ప్రస్తావిస్తూ.. సమాచారాన్ని, ఏఐ ఆధారిత విశ్లేషణలను మిళితం చేయడం ద్వారా మరింత నిశితంగా ఆధారాల సేకరణ, అధిక ప్రభావవంతంగా ఆడిట్ నిర్వహించేందుకు వీలవుతుందన్నారు.

ఎగుమతి, దిగుమతిదార్ల కోసం ట్రేడ్ ఇంటెలిజెన్స్ పోర్టల్

దిల్లీ: మన దేశంలో ఎగుమతిదార్లు, దిగుమతిదార్లు, అంకుర సంస్థలు, ఎంఎస్ఎంఈలకు సమగ్ర వివరాలు అందించేందుకు ది ట్రేడ్ ఇంటెలిజెన్స్ అండ్ అనలిటిక్స్ పోర్టల్ (టీఐఏ) దోహదపడుతుందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయూశ్ గోయల్ వెల్లడించారు. ఈ పోర్టల్‌ను ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ.. మన దేశం అమలు చేస్తున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను ఎగుమతిదారులు మరింత మెరుగ్గా ఉపయోగించుకోవడానికి ఈ ప్లాట్‌ఫామ్ సహాయపడుతుందన్నారు. కేంద్ర వాణిజ్య శాఖ టీఐఏ పోర్టల్‌ను అభివృద్ధి చేసింది. అంతర్జాతీయ, జాతీయ డేటాబేస్‌లను స్థూల ఆర్థిక సూచికలతో ఏకీకృతం చేసి ట్రేడ్ ఇంటెలిజెన్స్, అనలిటిక్స్‌ను ఈ పోర్టల్ అందిస్తుంది. ఇందులో 270 కంటే ఎక్కువ అనలిటిక్స్ ఉన్నాయి. భారత రియల్ టైమ్, ఇంటెరాక్టివ్ ఇన్‌సైట్స్, అంతర్జాతీయ వాణిజ్యం, కమొడిటీస్, రంగాలవారీ అనలిటిక్స్, మార్కెట్ ఇంటెలిజెన్స్, ఎగుమతి అవకాశాలు, పోటీ సంస్థల విశ్లేషణ వంటి వివరాలను ఇందులో పొందొచ్చు.

బంగారం, రాగి గనుల్లో వేదాంతా భారీ పెట్టుబడులు

సౌదీ అరేబియాలో పెట్టుబడులు పెంచేందుకు అనిల్ అగర్వాల్ నేతృత్వంలోని వేదాంతా సన్నాహాలు చేస్తోంది. మార్పుల ప్రక్రియలో భాగంగా లోహ, గనుల దిగ్గజ సంస్థగా నిలవాలని వేదాంతా గ్రూప్ లక్ష్యంగా పెట్టుకుంది. రాబోయే 6-8 నెలల్లో పశ్చిమ సౌదీ అరేబియాలో రాగి, పసిడి తవ్వకాలు ప్రారంభించాలని కంపెనీ భావిస్తోంది. సౌదీలో ఖనిజాల అన్వేషణకు ఇదే మొదటి ప్రాజెక్టు కానుంది. ఇందుకోసం మంగళవారం కంపెనీ అధికారికంగా లైసెన్సు అందుకుంది. వేదాంతాతో పాటు చైనాకు చెందిన జిజిన్ మైనింగ్ గ్రూప్, ఆస్ట్రేలియా లోహాల వ్యాపారవేత్త గినా రైనహార్ట్‌కు చెందిన హాన్‌కాక్ ప్రాస్పెక్టింగ్ కూడా ఈ లైసెన్సులు తీసుకున్నాయి. మైనింగ్ నుంచి ప్రాసెసింగ్ వరకు సౌదీ సరఫరాలో వ్యవస్థను సృష్టించే ప్రయత్నంలో భాగంగా వేదాంతా మరిన్ని లైసెన్సులను పొందాలని లక్ష్యంగా పెట్టుకుందని ఒక అధికారి వెల్లడించారు. దాదాపు 100 బిలియన్ డాలర్ల (సుమారు రూ.88 లక్షల కోట్ల) పెట్టుబడి అవకాశాలను ప్రకటించిన సౌదీ అరేబియా, భారీ స్థాయిలో గనుల సంస్థలను ఆకర్షించడంలో మాత్రం వెనకబడింది. తాజా ప్రణాళికలతో ఈ రంగానికి ఊతం లభిస్తుందని ఆశిస్తున్నారు.

అద్దెల్లో దిల్లీ ఖాన్ మార్కెట్ అదుర్స్



దిల్లీ: అంతర్జాతీయంగా అత్యంత ఖరీదైన రిటెయిల్ విక్రయ ప్రాంతాల్లో దిల్లీలోని ఖాన్ మార్కెట్ 24వ స్థానంలో నిలిచింది. ఇక్కడ చదరపు అడుగు వార్షిక అద్దె 223 డాలర్లు (రూ.19,700)గా ఉందని కుష్‌మన్ అండ్ వేక్‌ఫీల్డ్ నివేదిక వెల్లడించింది. గత ఏడాది జాబితాలో ఖాన్ మార్కెట్‌కు 23వ స్థానం దక్కింది. దేశంలోనే అత్యంత ఖరీదైన వ్యాపార ప్రదేశంగా ఖాన్ మార్కెట్ కొనసాగుతోంది. లండన్‌లోని న్యూబాండ్ స్ట్రీట్ ఈ జాబితాలో అగ్రస్థానంలో నిలిచింది. అక్కడ వార్షిక అద్దె చదరపు అడుగుకు 2,231 డాలర్లు (రూ.1.97 లక్షలు)గా ఉంది. గతేడాది అగ్రస్థానంలో నిలిచిన ఇటలీలోని మిలన్‌లో ఉన్న వియా మాటే నెపోలియన్ మెయిన్ స్ట్రీట్ ఈసారి రెండో స్థానానికి పరిమితమైంది. ఇక్కడ వార్షిక అద్దె చ.అడుగుకు 2179 డాలర్లు. జాబితాలో మూడోస్థానంలో ఉన్న న్యూయార్క్‌లోని అప్పర్ ఫిఫ్త్ అవెన్యూ (49-60 స్ట్రీట్స్)లో వార్షిక అద్దె చ.అడుగుకు 2000 డాలర్లుగా ఉంది. కుష్‌మన్ అండ్ వేక్ ఫీల్డ్ మెయిన్ స్ట్రీట్స్ అక్రాస్ ది వరల్డ్ 2025 ఎడిషన్‌ను బుధవారం విడుదల చేసింది ప్రపంచవ్యాప్తంగా ఉన్న 138 ఉత్తమ పట్టణ రిటెయిల్ ప్రాంతాల్లో వార్షిక అద్దెలను పరిగణనలోకి తీసుకుని ఈ నివేదికను సంస్థ రూపొందించింది.

✦ షిమ్ షా త్సుయ్ (మెయిన్ స్ట్రీట్ షాప్స్) హాంకాంగ్ నాలుగో స్థానం దక్కించుకుంది. తర్వాతి స్థానాల్లో అవెన్యూ డెస్ చాంప్స్ ఎలెసీస్, పారిస్, గింజా (టోక్యో), బాన్‌హోఫ్‌స్ట్రాసే (జ్యూరిచ్), పిట్ స్ట్రీట్ మాల్ (సిడ్నీ), మియోంగ్‌డాంగ్ (సియోల్), కోల్ మార్క్ట్ (వియన్నా) తర్వాతి స్థానాల్లో నిలిచాయి.

✦ గురుగ్రామ్ గెలేరియా మార్కెట్ అద్దెలు 25% పెరిగాయి. దిల్లీలోని కన్నాట్ ప్లేస్‌లో అద్దె 14%, ముంబయిలోని కెంప్స్ కార్నర్‌లో అద్దెలు 10% అధికమయ్యాయి.

అదానీ గ్రూపుతో బొండాడ ఇంజినీరింగ్ ఒప్పందం

ఈనాడు, హైదరాబాద్: ప్రత్యామ్నాయ ఇంధన వనరుల విభాగంలో డిజైన్, నిర్మాణ సేవలు అందించడానికి అదానీ గ్రూపుతో హైదరాబాద్‌కు చెందిన బొండాడ ఇంజినీరింగ్ వ్యూహాత్మక ఒప్పందం కుదుర్చుకుంది. దీనిపై అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ ఎండీ, సీఈఓ వినీత్ జైన్, బొండాడ సీఎండీ రాఘవేంద్రరావు సంతకాలు చేశారు. ఇందులో భాగంగా అదానీ గ్రీన్ ఎనర్జీ 650 మెగావాట్ల సౌర విద్యుత్తు ప్రాజెక్టుకు సంబంధించిన పనులను బొండాడ ఇంజినీరింగ్‌కు అప్పగించింది. గుజరాత్ (కచ్ జిల్లా)లోని ఖావ్డా ప్రాంతంలో ఖాళీగా ఉన్న భూముల్లో సౌర విద్యుత్తు ప్రాజెక్టులను అదానీ గ్రూపు నెలకొల్పనుంది. ఈ ప్రాజెక్టులకు డిజైన్, నిర్మాణ సేవల భాగస్వామిగా బొండాడ వ్యవహరిస్తుంది.

ఇండియాబుల్స్‌పై ఎందుకు దర్యాప్తు చేయట్లేదు?

● సెబీ, ఎస్ఎఫ్ఐఓ, ఈడీతో సమావేశాలు పెట్టండి

● సీబీఐ డైరెక్టర్‌కు సుప్రీం కోర్టు సూచన



దిల్లీ: ఇండియాబుల్స్ హౌసింగ్ ఫైనాన్స్ (ప్రస్తుత సమ్మాన్ క్యాపిటల్)లో సందేహాస్పద లావాదేవీలు జరిగాయన్న ఆరోపణలపై దర్యాప్తు చేయడానికి ఎందుకు వెనకడుగు వేస్తున్నారని కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐ, మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీలను సుప్రీం కోర్టు ప్రశ్నించింది. ఈ విషయాన్ని పరిశీలించడానికి సెబీ, తీవ్ర ఆర్థిక నేరాల కార్యాలయం (ఎస్ఎఫ్ఐఓ), ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)లతో సమావేశం నిర్వహించాలని సీబీఐ డైరెక్టర్‌కు సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. చట్టవ్యతిరేక కార్యకలాపాలపై దర్యాప్తు చేసే విషయంలో వేర్వేరు కేసుల్లో సెబీ ద్వంద్వ ప్రమాణాలను పాటిస్తోందని న్యాయమూర్తులు జస్టిస్ సూర్య కాంత్, జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ ఎన్. కోటీశ్వర్ సింగ్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొంది. ఆ కంపెనీపై ఎఫ్ఐఆర్ దాఖలు చేసి, ఆరోపణలపై దర్యాప్తు చేపట్టడానికి ఏ అంశం నిలువరిస్తోందని ప్రశ్నించింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) చేసిన ఫిర్యాదుల ఒరిజినల్ రికార్డులను సమర్పించాలని దిల్లీ కమిషనర్ ఆఫ్ పోలీస్‌కు ఆదేశాలు జారీ చేసింది. ఈ ఫిర్యాదుపై దర్యాప్తు చేయడానికి దేని ఆధారంగా నిరాకరించారో, దిల్లీ పోలీస్‌కు చెందిన ఆర్థిక నేరాల విభాగం(ఈఓడబ్ల్యూ) తెలపాలని పేర్కొంది. ఈఓడబ్ల్యూ సీనియర్ అధికారి నేరుగా కోర్టుకు వచ్చి తదుపరి విచారణ తేదీ(డిసెంబరు 17) రోజున ఒరిజినల్ రికార్డులను సమర్పించాలని తెలిపింది.

వచ్చే ఏడాదికి హైదరాబాద్ ప్లాంటు సిద్ధం

బెల్జియం సంస్థ అలియాక్సిస్


నీరు, ప్లంబింగ్ ఉత్పత్తులకు సంబంధించిన బెల్జియం సంస్థ అలియాక్సిస్ భారత్‌ను అత్యంత వాస్తవిక వృద్ధి మార్కెట్‌గా అభివర్ణించింది. అమెరికా తర్వాత తమకు అతి పెద్ద రెండో మార్కెట్ భారతేనని పేర్కొంది. ముఖ్యంగా దక్షిణ భారతంలో బలమైన స్థానాన్ని సాధించినట్లు పేర్కొంది. 'ఆశీర్వాద్' బ్రాండ్ పేరుతో అలియాక్సిస్ భారత్‌లో తన ఉత్పత్తులను విక్రయిస్తోంది. అమెరికా మార్కెట్ భారత్‌కంటే 30% పెద్దది అయినప్పటికీ.. అంతర్జాతీయంగా తమకు భారతే కీలకమని సంస్థ గ్లోబల్ మేనేజింగ్ డైరెక్టర్ తియర్రీ వాన్‌లాంకర్ వెల్లడించారు. కంపెనీ మొత్తం వ్యాపారంలో అమెరికా వాటా 20%, భారత్ వాటా 15% ఉందని తెలిపారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేస్తున్న కొత్త ప్లాంటు 2026 మధ్య నాటికి సిద్ధం కానుందని పేర్కొన్నారు. దక్షిణ భారత దేశానికి సరఫరాను మరింత వేగవంతం చేయడమే దీని ప్రధాన లక్ష్యమని తెలిపారు.

2026లో రూ.1.77 లక్షల కోట్ల ఐపీఓలు!

వచ్చే ఏడాది దేశీయంగా ప్రాథమిక మార్కెట్ కళకళలాడబోతోంది. రిలయన్స్ జియో, ఎన్ఎస్ఈ, ఫోన్‌పే, ఫ్లిప్‌కార్ట్, ఓయో, ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్ తదితర దిగ్గజ సంస్థలు ఐపీఓల ద్వారా 20 బిలియన్ డాలర్ల (రూ.1.77 లక్షల కోట్ల) నిధులను సమీకరించేందుకు సిద్ధమవుతున్నాయి.

ఐటీ షేర్లలో ర్యాలీతో లాభాల్లోకి సూచీలు

ఎఫ్ఐఐ కొనుగోళ్లు: రూ.1,580.72 కోట్లు
డీఐఐ కొనుగోళ్లు: రూ.1,360.27 కోట్లు



సెన్సెక్స్ ▲513 85186 | నిఫ్టీ ▲143 26053

ఐటీ, ఆర్థిక రంగ షేర్లలో ర్యాలీతో బుధవారం దేశీయ సూచీలు లాభాల్లో ముగిశాయి. భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంపై పెరుగుతున్న ఆశావాదంతో, దేశీయ సంస్థాగత మదుపర్లు కొనుగోళ్లకు దిగడం కలిసొచ్చింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 12 పైసలు లాభపడి 88.48 వద్ద ముగిసింది. బ్యారెల్ బ్రెంట్ ముడిచమురు 0.39% నష్టపోయి 64.64 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

✦ బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.1.12 లక్షల కోట్లు పెరిగి, రూ.475.74 లక్షల కోట్ల (5.38 లక్షల కోట్ల డాలర్ల)కు చేరింది.

✦ సెన్సెక్స్ ఉదయం 84,643.78 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 84,673.02) ప్రతికూలంగా ప్రారంభమైంది. 84,525.98 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ, ఆ తర్వాత లాభాల్లోకి వచ్చి రోజంతా సానుకూలంగా కదలాడింది. ఒక దశలో 85,236.77 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని నమోదు చేసింది. చివరకు 513.45 పాయింట్లు లాభపడి 85,186.47 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ 50 సైతం 142.60 పాయింట్లు పెరిగి 26,052.65 పాయింట్ల వద్ద స్థిరపడింది.

✦ సెన్సెక్స్ 30 షేర్లలో 19 లాభపడ్డాయి. హెచ్‌సీఎల్ టెక్ 4.28%, ఇన్ఫోసిస్ 3.74%, టీసీఎస్ 1.99%, హెచ్‌యూఎల్ 1.54%, సన్ ఫార్మా 1.39%, టైటన్ 1.27%, టెక్ మహీంద్రా 1.20%, ఎస్‌బీఐ 1.02% చొప్పున పెరిగాయి. టీఎంపీవీ 2.79%, మారుతీ 1.07%, బజాజ్ ఫైనాన్స్ 0.79%, అదానీ పోర్ట్స్ 0.76% మేర నష్టపోయాయి.

సెబీ పూర్తి స్థాయి సభ్యుడిగా సందీప్ ప్రధాన్

మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ పూర్తి స్థాయి సభ్యుడిగా ఇండియన్ రెవెన్యూ సర్వీస్ అధికారి సందీప్ ప్రధాన్‌ను ప్రభుత్వం బుధవారం నియమించింది. మూడేళ్ల పాటు ఆయన పదవిలో కొనసాగనున్నారు. పూర్తి స్థాయి సభ్యుడిగా పదవీకాలం పూర్తి చేసుకున్న అశ్వనీ భాటియా స్థానాన్ని సందీప్ భర్తీ చేయనున్నారు.

ఐపీఓ సమాచారం

✦ **ఎక్సెల్‌సాఫ్ట్ టెక్** రూ.500 కోట్ల ఐపీఓకు తొలి రోజే 1.45 రెట్ల స్పందన లభించింది. కంపెనీ 3,07,01,754 షేర్లను ఆఫర్ చేయగా, 4,45,38,250 షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి. సంస్థాగతేతర మదుపర్ల విభాగంలో 2.45 రెట్లు, రిటెయిల్ మదుపర్ల విభాగంలో 1.85 రెట్లు, అర్హులైన సంస్థాగత మదుపర్ల (క్యూఐబీ) విభాగంలో 1% స్పందన దక్కింది.

✦ **టెన్నెకో క్లీన్ ఎయిర్ ఇండియా** షేరు స్టాక్ మార్కెట్‌లో శుభారంభం చేసింది. ఇష్యూ ధర రూ.397తో పోలిస్తే బీఎస్ఈలో 25.44% లాభంతో రూ.498 వద్ద నమోదైంది. ఒక దశలో 30.22% పెరిగి రూ.517 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరకు 23.72% లాభంతో రూ.491.20 వద్ద ముగిసింది.

బ్యాంకు కాల్స్ 1600 సిరీస్ నంబరు నుంచే రావాలి

- జనవరి 1 నుంచే: ట్రాయ్
- ఇతర ఆర్థిక సంస్థలకూ నిర్దేశిత గడువు

ఈనాడు వాణిజ్య విభాగం: 'బ్యాంక్ నుంచి ఫోన్ చేస్తున్నామంటూ' ఖాతాదారులను మోసగిస్తూ.. ఓటీపీ/నెట్ బ్యాంకింగ్ వివరాలు తీసుకుని, ఖాతాల్లో నగదు ఖాళీ చేస్తున్న వారికి చెక్ పెట్టేందుకు టెలికాం నియంత్రణ సంస్థ ట్రాయ్ సిద్ధమైంది. 2026 జనవరి 1 నుంచి బ్యాంకులన్నీ తమ వినియోగదారులకు చేసే ఫోన్‌కాల్స్ '1600 సిరీస్' నంబరు నుంచే రావాలని నిర్దేశించింది. ఇదేవిధంగా బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ)లు, మ్యూచువల్ ఫండ్లు కూడా '1600' నంబర్ సిరీస్‌నే వినియోగించడానికి దశలవారీ గడువులను ట్రాయ్ బుధవారం ప్రకటించింది.

★ ప్రభుత్వ రంగ బ్యాంకులు, ప్రైవేట్ రంగ బ్యాంకులు, విదేశీ బ్యాంకులు సహా వాణిజ్య బ్యాంకులన్నీ 2026 జనవరి 1 నుంచి '1600' సిరీస్ ఫోన్‌నంబర్లనే వినియోగించాలి.

★ అన్ని మ్యూచువల్ ఫండ్లు, ఎసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీలు 2026 ఫిబ్రవరి 15లోగా వీటిని అమలు చేయాలి.

★ క్వాలిఫైడ్ స్టాక్ బ్రోకర్లకు ఈ గడువు 2026 మార్చి 15గా ఉంది.

★ పెద్ద ఎన్‌బీఎఫ్‌సీలు, చెల్లింపుల బ్యాంకులు, స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులు 2026 ఫిబ్రవరి 1లోగా, మిగిలిన ఎన్‌బీఎఫ్‌సీలు, సహకార బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు, చిన్న సంస్థలు 2026 మార్చి 1లోగా ఈ నిబంధనలను అమలు చేయాలి.

★ సెంట్రల్ రికార్డ్‌కీపింగ్ ఏజెన్సీలు, పెన్షన్ ఫండ్ మేనేజర్లు 2026 ఫిబ్రవరి 15లోగా 1600 సిరీస్ ఫోన్‌నంబర్లను వినియోగించాలి.

★ బీమా రంగంలోని సంస్థలూ ఈ సిరీస్‌ను అమలు చేసేందుకు, గడువును నిర్ణయించేందుకు ఐఆర్‌డీఏఐతో చర్చిస్తున్నామని, త్వరలోనే దీన్ని ప్రకటిస్తామని ట్రాయ్ వెల్లడించింది.

★ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ), సెబీ, పీఎఫ్‌ఆర్‌డీఏ నియంత్రణలోని సంస్థలు తప్పనిసరిగా '1600' సిరీస్ నంబర్లను గడువులోగా వినియోగించాలని ట్రాయ్ పేర్కొంది. వినియోగదారుల విశ్వాసాన్ని పెంచడానికి, స్పామ్ నివారణకు, వాయిస్ కాల్స్ ద్వారా జరిగే మోసపూరిత కార్యకలాపాల నిరోధానికి ట్రాయ్ '1600' సిరీస్‌ను ప్రవేశపెట్టింది.

5 జిల్లాల్లో టెక్స్‌టైల్స్ పరిశ్రమలు

చేనేత, జౌళిశాఖ మంత్రి సవిత



ఈనాడు, అమరావతి: సీఐఐ భాగస్వామ్య సదస్సులో కుదిరిన 8 ఒప్పందాలతో ఐదు జిల్లాల్లో టెక్స్‌టైల్స్ పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయని చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత తెలిపారు. విశాఖ, చిత్తూరు, గుంటూరు, శ్రీసత్యసాయి, అనకాపల్లి జిల్లాల్లో పరిశ్రమల ఏర్పాటుకు పెట్టుబడిదారులు ముందుకొచ్చారన్నారు. వీటిద్వారా 6,460 మందికి ఉద్యోగాలొచ్చే అవకాశాలున్నట్లు బుధవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. టెక్నికల్ టెక్స్‌టైల్స్, రీసైక్లింగ్, గార్మెంట్స్, సిల్క్, అపెరల్ రంగాల్లో పెట్టుబడులు రానున్నాయన్నారు. విశాఖపట్నంలో ఫిన్లాండ్‌కు చెందిన ఇన్ఫినిటెడ్ ఫైబర్ సంస్థ రూ.4 వేల కోట్లు, ఎంవీఆర్ టెక్స్‌టైల్స్ రూ.105.38 కోట్లు, చిత్తూరు జిల్లా గంగ్రాజుపల్లిలో బెంగళూరుకు చెందిన జీనియస్ ఫిల్టర్స్ సంస్థ రూ.120 కోట్లు, శ్రీసత్యసాయి జిల్లా హిందూపురంలో అరవింద్ అపెరల్ పార్క్ సంస్థ రూ.20 కోట్లు, గుంటూరులో వామిని ఓవర్సీస్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.35 కోట్లు, అనకాపల్లిలో బీక్యూ టెక్స్‌టైల్స్ సంస్థ రూ.10 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నాయని పేర్కొన్నారు.

ప్రేమించలేదని విద్యార్థిని హత్య



షాలిని

చెన్నై(ప్యారిస్), న్యూస్‌టుడే: ప్రేమించలేదని ప్లస్‌టూ విద్యార్థినిని ఓ యువకుడు దారుణంగా హత్య చేశాడు. పోలీసుల వివరాల మేరకు.. తమిళనాడులోని రామనాథపురం జిల్లా రామేశ్వరం సమీపం సేరాంకోట్టైకి చెందిన మారియప్పన్‌కు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమార్తె షాలిని(17) రామేశ్వరం బాలికల హయ్యర్ సెకండరీ పాఠశాలలో ప్లస్ టూ చదువుతోంది. స్థానికంగా ఉంటున్న మునిరాజ్ (20) ప్రేమించాలని షాలినిని కొద్దిరోజులుగా వేధిస్తున్నాడు. విషయం షాలిని తండ్రికి చెప్పగా ఆయన మునిరాజ్‌ను మందలించారు. బుధవారం ఉదయం పాఠశాలకు వెళ్తున్న ఆమెను ప్రేమించాలంటూ మునిరాజ్ వెంటపడ్డాడు. ఆమె అంగీకరించకపోవడంతో వెంట తెచ్చుకున్న కత్తితో పొడవడంతో అక్కడికక్కడే మృతి చెందింది. పోలీసులు మునిరాజ్‌ను అరెస్టు చేశారు.



అత్యున్నత వ్యక్తిత్వానికి పంచ సూత్రాలు

1. మాటతీరు- మర్యాదపూర్వకంగా ఉండాలి.
2. ఆలోచన- సృజనాత్మకతతో ఉండాలి.
3. ప్రవర్తన- హుందాగా ఉండాలి.
4. సంపాదన- నిజాయతీగా ఉండాలి.
5. జీవితం- నిర్భయంగా జీవించాలి.

– కోడీ శాంచెజ్, రచయిత్రి



ట్రాక్‌పై ఒరిగిన స్తంభం, సమీపంలో ఆగిన రైలు



పునరుద్ధరణ పనులు చేస్తున్న సిబ్బంది

టాటానగర్ ఎక్స్‌ప్రెస్‌కు తప్పిన ప్రమాదం

- పెందుర్తి సమీపంలో ట్రాక్‌పై ఒరిగిన స్తంభం
- ముందుగానే గమనించి రైలును ఆపేసిన లోకోపైలట్

పెందుర్తి, న్యూస్‌టుడే: విశాఖ జిల్లాలో టాటానగర్ ఎక్స్‌ప్రెస్‌కు పెను ప్రమాదం తప్పింది. పెందుర్తి రైల్వే స్టేషన్ సమీపంలో పట్టాలపై విద్యుత్తు స్తంభం ఒరిగిన విషయాన్ని లోకోపైలట్ గమనించి రైలును ఆపేశారు. స్థానికులు, అధికారులు తెలిపిన వివరాల మేరకు.. పెందుర్తి రైల్వేస్టేషన్‌కు అర కిలోమీటరు దూరంలో చినముషిడివాడ శ్రమశక్తినగర్ సమీపంలోని రైల్వేట్రాక్ వద్ద రైల్వే అధికారులు బుధవారం ఓహెచ్‌ఈ (ఓవర్ హెడ్ ఎక్విప్‌మెంట్) వైరింగ్ పనులు చేపట్టారు. అందులో భాగంగా ఒక ఇనుప విద్యుత్తు స్తంభాన్ని నిలబెట్టారు. మధ్యాహ్నం 12.30 సమయంలో అది ట్రాక్‌పైకి ఒరిగిపోయింది. అదే సమయంలో విశాఖ నుంచి టాటానగర్ ఎక్స్‌ప్రెస్ రైలు వస్తోంది. దీన్ని ముందుగానే గమనించిన లోకో పైలట్ వెంటనే రైలును నిలిపివేశారు. వాస్తవానికి ఈ ట్రాక్‌పై 130 కిలోమీటర్ల వేగంతో రైళ్లు ప్రయాణించేందుకు అనుమతి ఉండగా, మరమ్మతు పనుల నేపథ్యంలో వేగాన్ని కుదించారు. ముందుజాగ్రత్తగా తీసుకున్న ఈ నిర్ణయం ఇప్పుడు పెను ప్రమాదాన్ని తప్పించింది. స్తంభం ఒరిగిపోయిన ఘటనలో విద్యుదాఘాతానికి గురై టెక్నీషియన్ ఉత్పల్‌కుమార్ దాస్(54), సహాయకుడు ఎం.సంతోష్(39), ఒప్పంద ఉద్యోగి దాస్‌ముర్ము కశ్యప్(28) గాయపడ్డారు. వీరిని పెందుర్తి సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. వీరిలో దాస్ ముర్ము కశ్యప్ పరిస్థితి విషమంగా ఉంది. ఘటన నేపథ్యంలో సుమారు గంటపాటు పెందుర్తి రైలుమార్గంలో రాకపోకలకు అంతరాయం కలిగింది. రైల్వే సాంకేతిక నిపుణులు హుటాహుటిన సహాయక చర్యలు చేపట్టి, విద్యుత్తు సరఫరాను పునరుద్ధరించారు.

వెబ్‌సైట్, యాప్‌ల కొనుగోళ్ల కేసులో మరో నిందితుడి అరెస్టు.. రిమాండ్

ఈనాడు, అమరావతి: ఐపీఎస్ అధికారి సంజయ్ అగ్నిమాపక శాఖ అధిపతిగా ఉన్నప్పుడు ఎన్వోసీల జారీకి వెబ్‌సైట్, మొబైల్ యాప్, ట్యాబ్‌ల కొనుగోళ్లలో జరిగిన అక్రమాల కేసులో మరో నిందితుడిని ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు. వెబ్‌సైట్, యాప్ రూపొందించిన కొండలరావు (ఏ4)ను బుధవారం కోర్టులో హాజరుపరిచారు. టెండర్లలో ఎల్1గా నిలవకపోయినా సౌత్రికా టెక్నాలజీస్‌ను నిబంధనలకు విరుద్ధంగా ఎంపిక చేసి కాంట్రాక్టు కట్టబెట్టారని ఏసీబీ కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. నిందితుడికి న్యాయాధికారి వచ్చే నెల 3 వరకు రిమాండ్ విధించారు. అనంతరం విజయవాడలోని జిల్లా కారాగారానికి తరలించారు. ఇదే కేసులో ఐపీఎస్ అధికారి సంజయ్ అరెస్టు అయి జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న సంగతి తెలిసిందే.

కాఫీ కొనుగోలు ధరల పెంపు

కిలోకు రూ.10 నుంచి రూ.50 వరకూ

ఈనాడు, అమరావతి: ఈ ఆర్థిక సంవత్సరాని (2025-26)కి కాఫీ కొనుగోలు ధరల్ని పెంచినట్లు గిరిజన సహకార సంస్థ ప్రకటించింది. బుధవారం విశాఖలో జరిగిన అపెక్స్ కమిటీ సమావేశంలో.. అంతర్జాతీయ కాఫీ ధరల్ని దృష్టిలో పెట్టుకొని గతేడాదితో పోలిస్తే కాఫీ రకాన్ని బట్టి కొనుగోలు ధరలను కిలోకి రూ.10 నుంచి రూ.50 వరకు పెంచారు. కిలో అరెబికా పార్చ్‌మెంట్ కాఫీ రకానికి రూ.450, అరెబికా చెర్రీకి రూ.270, రోబస్టా చెర్రీకి రూ.170 చెల్లించాలని నిర్ణయించారు. కాఫీ సేకరణకు ఏజెన్సీలోని మారుమూల ప్రాంతాలకూ తమ సిబ్బంది వెళ్తారని జీసీసీ ఎండీ కల్పనకుమారి తెలిపారు. రైతుల ఇంటి వద్దనే ఎలక్ట్రానిక్ కాటా ద్వారా కచ్చితమైన తూకంతో సేకరిస్తామని వివరించారు. కాఫీ సేకరణ నగదును రైతు బ్యాంకుఖాతాల్లో 24 గంటల్లో జమ చేస్తామని వెల్లడించారు. ప్రకటించిన ధరల కంటే తక్కువకు విక్రయించి నష్టపోవద్దని కాఫీ రైతులకు ఆమె విజ్ఞప్తి చేశారు. పెంచిన కాఫీ ధరలపై గిరిజనులకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.

ఐదురోజుల పోలీసు కస్టడీకి ఐ బొమ్మ రవి

ఈనాడు, హైదరాబాద్: సినిమా పైరసీ కేసులో ప్రధాన నిందితుడు ఇమంది రవి(40)ని ఐదురోజుల పోలీసు కస్టడీకి నాంపల్లి న్యాయస్థానం బుధవారం అనుమతినిచ్చింది. భారతీయ భాషల్లోని 21 వేల సినిమాలను పైరసీ చేసిన రవిని ఇటీవల నగర సైబర్‌క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం చంచల్‌గూడ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న ఇతడినుంచి మరింత సమాచారం సేకరించేందుకు పోలీసులు వారం రోజులు కస్టడీ కోరుతూ న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు. కరేబియన్ దీవులు కేంద్రంగా చేసుకొని ఆరేళ్లుగా 66 మిర్రర్ వెబ్‌సైట్లలో పైరసీ సినిమాలు అప్‌లోడ్ చేశాడు. 50 లక్షల మంది డేటా సేకరించి సైబర్ నేరస్థులు, గేమింగ్, బెట్టింగ్‌యాప్‌ల నిర్వాహకులకు విక్రయించి సొమ్ము చేసుకున్నాడు. అంతర్జాతీయంగా ఇతడి నెట్‌వర్క్, యాప్‌ల నిర్వాహకులతో సంబంధాల గురించి కస్టడీలో విచారించనున్నారు.



కొండ మెట్లపై భక్తజన సందోహం

అనంత కాంతుల్లో కొండంత వైభవం!

విశాఖపట్నం (పద్మనాభం), న్యూస్‌టుడే: విశాఖపట్నం జిల్లా పద్మనాభం క్షేత్రంలో 'శ్రీఅనంత పద్మనాభ స్వామి కొండ మెట్ల దీపోత్సవం' బుధవారం భక్తజన సందోహం నడుమ వైభవంగా జరిగింది. సూర్యోదయానికి ముందు నుంచే భక్తులు స్వామిని స్మరించుకుంటూ మెట్ల మార్గంలోకి చేరుకొని దేవదేవున్ని దర్శించుకున్నారు. సాయంత్రం 5 గంటలకు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తొలి పావంచా వద్ద తొలి దీపం వెలిగించాక.. భక్తులు కొండ మెట్లకు ఇరువైపులా ఉన్న దీపాలను వెలిగించారు. దీంతో కొండంతా దేదీప్యమానంగా వెలిగిపోయింది. వేడుకలో సినీ నటుడు బెల్లంకొండ సాయి శ్రీనివాస్, జేసీ మయూర్ అశోక్, ఆర్డీవో సంగీత్ మాథుర్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్దానంలో కిడ్నీ వ్యాధి మూలాలపై పరిశోధనకు ఐసీఎంఆర్ ఆమోదం

- మూడేళ్లలో ప్రక్రియ పూర్తికి రూ.6.20 కోట్లు
- పరీక్షలకు ఆంధ్ర వైద్యకళాశాలలో ప్రత్యేక ల్యాబ్

ఈనాడు, అమరావతి: శ్రీకాకుళం జిల్లా ఉద్దానంలో కిడ్నీ వ్యాధి మూలాలపై పరిశోధన చేపట్టేందుకు ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్) ఆమోదం తెలిపింది. మూడేళ్లలో పరిశోధన పూర్తిచేసేలా 3 విడతలుగా రూ.6.20 కోట్ల మంజూరుకు సుముఖత వ్యక్తం చేసింది. కిడ్నీ సమస్యతో బాధపడుతున్న వారి రక్త, మూత్ర నమూనాల పరీక్షకు విశాఖలోని ఆంధ్ర వైద్య కళాశాలలో ప్రత్యేక ల్యాబ్ ఏర్పాటుచేస్తారు. 2014-19లో తెదేపా ప్రభుత్వ హయాంలో ఆస్ట్రేలియాకు చెందిన జార్జి ఇన్‌స్టిట్యూట్‌కు బాధ్యతలు అప్పగించారు. తర్వాత వైకాపా ప్రభుత్వ నిర్వాకంతో పరిశోధన పూర్తిస్థాయిలో జరగలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక వైద్యారోగ్యశాఖ ఆదేశాలతో ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి, నెఫ్రాలజీ ప్రొఫెసర్ డాక్టర్ రవిరాజ్ నేతృత్వంలో ఆంధ్ర వైద్య కళాశాల నెఫ్రాలజీ విభాగాధిపతి జి.ప్రసాద్ ద్వారా పంపిన ప్రతిపాదనలు పరిగణనలోకి తీసుకుని పరిశోధనకు ఐసీఎంఆర్ ఆమోదం తెలిపింది.

★ ఉద్దానంలో 18 ఏళ్ల పైబడిన వారిలో 5,500 మంది నుంచి నమూనాలు సేకరించి బయోమార్కర్ విధానం ద్వారా పరీక్షించి ఒకటి, రెండేళ్లలో కిడ్నీ సమస్య ఏ స్థాయిలో రావచ్చన్న అంచనాకు వస్తారు. ★ వేర్వేరు ప్రాంతాల్లో మట్టి, నీరు, గాలి, వరి పంట, మత్స్య సంపద, కూరగాయల నమూనాలు పరీక్షిస్తారు. ★ ఫలితాల ఆధారంగా వ్యాధి కారణాలు గుర్తించి భవిష్యత్తు కార్యాచరణ చేపడతారు.

త్వరలో పరిశోధన ప్రారంభం: మంత్రి సత్యకుమార్

వైద్యారోగ్యశాఖ ఈ ఏడాది మార్చి నుంచి ఐసీఎంఆర్‌తో జరిపిన సంప్రదింపులు ఫలించాయి. డిపార్ట్‌మెంట్ ఆఫ్ హెల్త్ రీసెర్చ్ కింద ఉద్దానంలో 'శ్రీకాకుళం కిడ్నీ రీసెర్చ్ ప్రాజెక్టు' పేరుతో త్వరలో కేంద్రం ప్రారంభం అవుతుంది.

డిసెంబరు 30 నుంచి 'శ్రీనివాస హోమం' టికెట్లు రద్దు

తిరుపతి(తితిదే), న్యూస్‌టుడే: తిరుపతిలోని అలిపిరిలో రోజూ నిర్వహిస్తున్న శ్రీనివాస దివ్యానుగ్రహ విశేష హోమం టికెట్లను 10 రోజుల పాటు రద్దు చేస్తున్నట్లు తితిదే బుధవారం ఓ ప్రకటనలో తెలిపింది. వైకుంఠ ఏకాదశి సందర్భంగా డిసెంబర్ 30 నుంచి జనవరి 8 వరకు ఈ టికెట్లను రద్దు చేసింది.

EENADU Vol: 52, Issue: 100 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao

వసుంధర

vasundhara@eenadu.in



ఇద్దరు అక్కాచెల్లెళ్లు! చెట్టాపట్టాలేసుకుని బండి మీద ఊరంతా తిరుగుతోంటే... చూపులన్నీ వాళ్ల చుట్టూనే! వాళ్ల వయసు 80కి పైమాటే! తిరిగేదేమో సైడ్‌కార్ ఉన్న బండిమీద మరి. అంతేనా... అమ్మాయిల్లో స్ఫూర్తినీ నింపుతున్నారు.

బైకర్ మందాకిని!

'ఫలానా చోట పానీపూరీ బాగుంటుందట...' అని అక్క అనడం ఆలస్యం... 'వెళ్లి రుచి చూసొద్దామా?' అనేస్తారు చెల్లి. ఇంకేం ఇద్దరూ కలిసి బండి మీద చక్కా వెళ్లిపోతారు. అక్క పేరు మందాకినీ షా, 87 ఏళ్లు. చెల్లెలేమో ఉష. వీళ్లది అహ్మదాబాద్. తండ్రి స్వాతంత్ర్య సమరయోధుడు. అయిదుగురు అమ్మాయిలు, ఒకబ్బాయి. వీళ్లని పోషించడానికి తల్లి కూడా కష్టపడక తప్పని పరిస్థితి. అమ్మ కష్టం చూశాకే ప్రతి అమ్మాయీ తన కాళ్ల మీద తను నిలబడటం ఎంత ముఖ్యమో అర్థమైంది



అంటారు మందాకిని. పదహారేళ్లప్పుడు మాంటిస్సోరీలో టీచర్‌గా చేరారామె. తరవాత సోషల్ వెల్ఫేర్ ప్రాజెక్టుల్లో భాగమై... మహిళా మండళ్లతో కలిసి పనిచేయడం, గ్రామీణ మహిళలకు వాళ్ల హక్కుల గురించి చెప్పడం, ఉపాధి మార్గాలు చూపడం వంటివి చేసేవారు. దీనికోసం మోపెడ్, జీప్ వంటివి నడపడం నేర్చుకున్నారు. స్కూటీ కొనుక్కున్నాక దానికి సైడ్ కార్ ఏర్పాటు చేయించుకుని చెల్లెలితో ఇలా నచ్చిన చోటుకు వెళుతున్నారు.

'చాలామంది ఈ వయసులో బండి ఎందుకండీ అంటుంటారు. నడిపే ఓపిక, కోరిక ఉంటే చాలు. వయసుతో సంబంధమేంటి అని సమాధానం చెబుతా. బండిని నడపడం నా 62వ ఏట నేర్చుకున్నా. ఒకే జీవితం దాన్ని నచ్చినట్టుగా జీవించాలి. అందుకే స్నేహితులను రోజూ కలుస్తా. ఇప్పటికీ పనిచేస్తున్నా. నాకు తెలిసింది ఇతరులకు బోధిస్తుంటా. చెల్లితో ప్రయాణం ఈ ఆస్వాదనలో ఓ భాగం' అంటోన్న మందాకిని, ఆమె చెల్లి 'బైకర్ దాదీలు'గా నెట్టింట వైరల్ అవుతున్నారు. ఎంతోమంది 'జీవితాన్ని ఆస్వాదించడం మీ నుంచి నేర్చుకుంటున్నాం' అని మెసేజ్‌లూ పెడుతున్నారు. అన్నట్టూ ఈ మందాకినీ బామ్మకి 'బైకర్ దాదీ' పేరుతో ఇన్‌స్టా అకౌంట్ కూడా ఉంది. దానిలో వీడియోలూ పెడుతుంటారీ బామ్మ.

సీఏ పరీక్ష అంటేనే చాలామంది వెనకడుగు వేస్తారు.. అందులోనూ అమ్మాయిలంటే కుటుంబ సభ్యులు వద్దనే చెబుతారు... ఉత్తీర్ణత సాధించేసరికి కొందరికి సంవత్సరాలు పడుతుంది... కానీ ఆమె మాత్రం ఆగలేదు... కష్టమని చెప్పినా బెదరలేదు.. సకాలంలోనే పరీక్షలన్నీ పాసై... వృత్తిలో చేరారు. జాతీయస్థాయిలో నిర్వహించిన ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ ఆడిట్(ఐఎస్ఏ) అసెస్‌మెంట్ పరీక్షలో తానేంటో నిరూపించారు... తొలిస్థానం సాధించి దేశంలోనే అగ్రగామిగా నిలిచారు ఛార్టర్డ్ అకౌంటెంట్ **అన్నె వెంకట రమ్య.** ఈ క్రమంలో ఎదుర్కొన్న సవాళ్లు, విజేతగా నిలిచిన సందర్భాలను 'వసుంధర'తో పంచుకున్నారు.



రమ్య

అమ్మ కోసమే సీఏ..!

మాది కృష్ణా జిల్లా బిల్లనపల్లి. తల్లిదండ్రులు సాయిరాణి, నాగేశ్వరరావు. వ్యవసాయ కుటుంబం. మేమిద్దరం ఆడపిల్లలం. అమ్మ పదో తరగతి వరకు చదువుకుంది. టైప్‌రైటింగ్, షార్ట్‌హ్యాండ్ కూడా వచ్చు. తనకి చదువంటే చాలా ఇష్టం. అయితే, అక్కకి ఇంటర్మీడియట్ చదువుతున్నప్పుడే పెళ్లవ్వడంతో... నన్నైనా బాగా చదివించాలనుకుంది. అమ్మ బంధువుల్లో సీఏ చదివినవారు ఉండడంతో నన్ను అందులో చేర్పించాలని అనుకునేది. అందుకే పెళ్లి ప్రస్తావన తెచ్చేది కాదు. అలా ఆమె కోసమే ఛార్టర్డ్ అకౌంటెంట్ అయ్యా.

ఫైనల్‌లో ఫెయిలైనా...

చిన్నప్పటి నుంచి పోటీతత్వంతో మెలిగేదాన్ని. ప్రాథమిక విద్యంతా తెలుగు మాధ్యమంలోనే సాగింది. ఆ తర్వాత ఇంగ్లిష్ మీడియంలో చదివా. అయినప్పటికీ ఆరో తరగతి నుంచి డిప్లొమా వరకూ తరగతిలో నేనే ఫస్ట్. పాలిటెక్నిక్‌లో జిల్లాలో మూడో ర్యాంకు సాధించా. ఈక్రమంలో సీఏపై అవగాహన పెంచుకున్నా. కొందరు వద్దని చెప్పారు. పాసవ్వవు, ప్రత్యామ్నాయం చూసుకో అని సూచించారు. అయినా వెనకడుగు వేయలేదు. 2008లో చేరి, 2012 నవంబరు నాటికి ఫౌండేషన్, ఇంటర్, ఆర్టికల్‌షిప్... అన్నీ సకాలంలో పూర్తి చేశాను. ఇదే సమయంలో అమ్మమ్మ కాలం చేయడంతో ఫైనల్‌లో మాత్రం ఫెయిలయ్యా. ఓటమిని నా మనసు అంగీకరించలేదు. మళ్లీ పట్టుదలతో పరీక్ష రాశాను. ఆర్టికల్‌షిప్‌లో మా గురువు ఎంఎస్‌వీ రమణమూర్తి గైడ్ చేశారు. ఆయన సహకారంతో ఉత్తీర్ణత సాధించా. ఐపీసీసీ వరకు శిక్షణ తీసుకున్నా. ఏడాదంతా పూర్తిగా చదువుకోసమే కేటాయించా. చివరి మూడు నెలలు రోజుకు 12-14 గంటలు చదివా. ఫౌండేషన్, ఇంటర్ కోర్సుకు రోజులో 8-10 గంటలు చదివా.

భర్త సహకారంతో...

మావారు వల్లభనేని సాయిరాం కుమార్ చౌదరిది విజయనగరం. దీంతో ఇక్కడే స్థిరపడ్డాం. ఇద్దరం సీఏ వృత్తిలోనే కొనసాగుతున్నాం. ఆయన సహకారంతో ముందుకెళుతున్నా. మాకిద్దరు పిల్లలు. లక్ష్మీముక్త, రోషన్ కపర్దీ. కుటుంబ బాధ్యతలున్నా, ప్రణాళిక పెట్టుకుంటాను. కార్యాలయం, ఇంటికి నిర్దేశిత సమయం కేటాయించి, టైమ్ మేనేజ్‌మెంట్ పాటిస్తాను.

కష్టమేమీ కాదు...

సీఏ కష్టంతో కూడుకున్నదని చాలామంది అభిప్రాయం. అది అపోహ మాత్రమే. అవగాహన, ఆసక్తి ఉంటే ఎవరైనా సాధించవచ్చు. ఆర్థికరంగంలో అవకాశాలుంటాయి. అంకిత భావంతో ప్రతిరోజూ బాధ్యతగా చదవాలి. డిగ్రీ, ఇంజినీరింగ్‌లా చివరి సమయంలో పుస్తకాలు తీద్దామంటే కుదరదు. మహిళల్లో డ్రాపౌట్లు ఎక్కువగా ఉంటున్నారు. వారికి కుటుంబ సభ్యుల సహకారం అవసరం.

ఏఐపై దృష్టి...

సమాజంలో గౌరవప్రదమైనది సీఏ ఉద్యోగం. 2012 నుంచి దీనిలో కొనసాగుతున్నా. ఇందులో జీఎస్టీ, ఐటీ రంగాలకు సంబంధించి సవాళ్లుంటాయి. వాటిని ఎదుర్కోవాలి. ఇటీవల ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఛార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) నిర్వహించిన ఐఎస్ఏ పరీక్ష రాశాను. జాతీయస్థాయిలో ఉత్తమంగా నిలవడం ఆనందంగా ఉంది. అప్‌గ్రెడేషన్, స్పెషలైజేషన్ చేస్తా. మంచి ప్రొఫెషనల్ అవకాశాల కోసం ఆడిట్‌రంగంలో కొత్తగా పరిచయమవుతున్న ఏఐ(కృత్రిమ మేధ) సాఫ్ట్‌వేర్ కోర్సులు చేయాలన్నది నా భవిష్యత్తు లక్ష్యం.

– రెడ్డి గౌరీశంకర్, విజయనగరం

? మా బాబుకి 17 నెలలు. ఉదయాన్నే అల్పాహారంగా ఇడ్లీ పెడుతున్నా. చట్నీ, సాంబారు కలిపితే తినడం లేదు. దాంతో అప్పుడప్పుడూ పంచదార వేసి తినిపిస్తున్నా. బాబు ఆహారపు అలవాట్లు మార్చేదెలా? ఇడ్లీకి బదులుగా ఇంకేం పెట్టొచ్చు? –రాధ, హైదరాబాద్

అల్పాహారంగా ఇంకేం పెట్టొచ్చు?

పదిహేడు నెలలున్న పిల్లలకి మనం తినే ఆహార పదార్థాలు అన్నీ పెట్టొచ్చు. అయితే, ఇదంతా ముందునుంచీ వాళ్లకి అలవాటు చేయాలి. అంటే ఆరు నెలలప్పుడు కాంప్లిమెంటరీ ఫీడింగ్ (రాగి మాల్ట్, ఉగ్గు) పెడతాం కదా... అప్పుడే ఒక ప్రణాళికపరంగా ఒక్కో ఆహారాన్ని వాళ్లకి పరిచయం చేయాలి. దాంతో పన్నెండు నెలలు వచ్చేటప్పటికే, మన ఆహారం వాళ్లకూ అలవాటవుతుంది. శరీరం కూడా ఇందుకు అనుగుణంగా సిద్ధమవుతుంది. కానీ మీ విషయంలో అది జరగనట్లు ఉంది. అందుకే ఇప్పుడు ఒక్కసారిగా పప్పు, సాంబారు వంటివి పెడుతున్నప్పుడు బాబు తినడం లేదు. ఇకనైనా, పిల్లాడికి ఆహారంలో వివిధ పదార్థాల్ని పెట్టండి. కారం, ఉప్పులు అధికంగా ఉండే వాటిని కాకుండా, ఆవిరి మీద ఉడికించిన బ్రాకలీ, చిక్కుళ్లు, బీన్స్, బీరకాయ ... క్యారెట్, బీట్‌రూట్, గుజ్జు వంటివి తినిపించండి. దీనివల్ల భిన్నరకాలు తినడం అలవాటు అవుతుంది. దాంతో పోషకాలు మెండుగా అందుతాయి. ఇక అల్పాహారం విషయానికొస్తే, ఉడకబెట్టిన చిలగడ దుంపలు, పెసరట్టు, డోక్లా, దోశ... వంటివి బాబు ఆహారంలో భాగం చేయండి. అంతేకానీ, బాబుకి ఇడ్లీ తినడమే ఇష్టం, పెరుగన్నం, రసం కలిపితే తొందరగా తినేస్తాడు లాంటి కారణాలతో సమతులాహారానికి దూరం చేయకండి. మీరు పెట్టే ఇడ్లీ, పెరుగన్నం లాంటివి అప్పటికి కడుపు నిండిన భావనను కలిగించినా... ఎదుగుదలలో అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. కాబట్టి, మీకు కష్టమైనా నెమ్మదిగా ఇవన్నీ ఇప్పట్నుంచే అలవాటు చేస్తే.. ఆరోగ్యానికి మంచిది.

డియర్ వసుంధర



డా. జానకీ శ్రీనాథ్
పోషకాహార నిపుణులు

పిల్లల వ్యక్తిత్వానికి ఈ సూత్రాలు...

పిల్లల అవసరాలను తీర్చడం, వారికి సరైన విద్యనందించడంతోనే తల్లిదండ్రుల బాధ్యత తీరిపోదు. వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి. పౌరస్పృహ, జీవన నైపుణ్యాలు అలవరచాలి అంటున్నారు మానసిక నిపుణులు. అందుకోసమే ఈ సూత్రాల్ని సూచిస్తున్నారు.

నేర్చుకోనివ్వండి: ఏ కష్టం తెలియకూడదని పిల్లల కాళ్లదగ్గరకే అన్నీ తెచ్చిపెడుతుంటారు కొందరు తల్లిదండ్రులు. ఇలా చేస్తే వారంతట వారు ఏ పనైనా చేయాల్సి వచ్చినప్పుడు ఇతరుల మీద ఆధారపడాల్సి వస్తుంది. అందుకే, చిన్నప్పటి నుంచే సీసాలోకి నీళ్లు నింపుకోవడం, పుస్తకాలు, చెప్పులు... సర్ది పెట్టుకోవడం, ఇంటిపనుల్లో సాయం చేయడం వంటివి అలవాటు చేయండి. ఇవన్నీ మొదట కష్టంగా ఉన్నా... ఏ పనైనా సమర్థంగా చేసుకోగల సామర్థ్యం వారికి అలవడుతుంది.

సమయపాలన: వ్యక్తిగత జీవనశైలిలో క్రమశిక్షణ అవసరం. ముఖ్యంగా సమయపాలనకు ప్రాధాన్యం ఇచ్చేలా చూడండి. చదువుకోవడానికి టైం టేబుల్‌ని అనుసరించినట్లే... రోజువారీ పనుల కోసమూ టైమ్‌ని నిర్దేశించండి. టైమ్‌కి భోజనం చేయడం, రాత్రి త్వరగా నిద్రించడం, ఉదయాన్నే త్వరగా లేవడం, వ్యాయామం... వంటి అన్నింటికీ ఓ పద్ధతిని అలవరిస్తే సరి. మీరు ఇది చెయ్యి... అది చెయ్యి అంటూ వెంటపడాల్సిన అవసరం ఉండదు.



బాధ్యత: పిల్లలు ఏ పనిచేసినా దానికి సంబంధించిన బాధ్యత వారే తీసుకునేలా అలవాటు చేయాలి. అయితే, మొదట ఈ గుణాన్ని మీరు అలవరుచుకోవాలి. మిమ్మల్ని చూసి చిన్నారులు అనుసరిస్తారు. ఒకవేళ ఎందులో అయినా పొరపాటు జరిగినా అరవడమో, తిట్టడమో చేయకుండా... సరిదిద్దుకునే అవకాశం ఇవ్వండి. ఇతరుల సాయానికి కృతజ్ఞత చెప్పడం, తోటివారినీ కలుపుకొని వెళ్లడం, చేయలేని పనులకు క్షమించమని అడగడం వంటివీ చిన్నప్పటి నుంచే అలవరచాలి.

భావోద్వేగాల నియంత్రణ: తల్లిదండ్రులను చూసే పసివాళ్లు నేర్చుకుంటారు. పట్టలేని కోపం, బాధ, ఏడుపు వంటివి మనల్ని అదుపు తప్పేలా చేస్తాయి. దానివల్ల కలిగే నష్టాలూ అధికమే. అలాంటి ఉద్వేగాలు ఎదురైనప్పుడు ఆ పరిస్థితి నుంచి బయటపడటానికి అంకెలు లెక్కపెట్టడం, మౌనంగా ఉండటం, ధ్యానం, పుస్తకం రాయడం వంటి ప్రయత్నాలు... ఫలితాన్నిస్తాయి. వారిని చేసి చూడమనండి. క్రమంగా అలవరుచుకుంటారు.

బంగారం - వెండి



19న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	1,27,540	1,14,850	1,60,750
విజయవాడ	1,22,705	1,14,750	1,59,000
ప్రొద్దుటూరు	1,24,800	1,14,820	1,61,000
రాజమహేంద్రవరం	1,24,860	1,14,450	1,73,000
విశాఖపట్నం	1,24,400	1,14,450	1,60,000
తమిళనాడు	-----	1,16,000	1,76,000

" మీ కలలు మిమ్మల్ని భయపెట్టకపోతే, మీరు పెద్ద కలలు కనడంలేదని అర్థం... మా ఇంట్లో ఒక ఫలకం మీద ఇలా రాసి పెట్టుకున్నా. ప్రతిరోజూ దీన్ని చదువుతా. ఆపై సంస్థను ఎలా ఉన్నతంగా తీర్చిదిద్దాలి, అందుకు నేనేం నేర్చుకోవాలి... అన్న దిశగా ఆలోచిస్తా. న్యాయ శాస్త్రం నేపథ్యం నుంచి... ఒక టెక్ కంపెనీకి సీఈఓ అయ్యానంటే కారణం ఇదే.



- జూలీ స్వీట్, సీఈఓ, యాక్సెంచర్

అదో చిన్న గ్రామం. ఉపాధి కోసం ఇంటి యజమానులు వలసలు వెళితే... చుట్టుపక్కల గ్రామాల్లో కూలిపనులు చేసుకుంటూ కుటుంబాన్ని నెట్టుకొచ్చేవారు మహిళలు. కొవిడ్ మహమ్మారి వాళ్ల జీవితాల్ని కుదిపేసింది. దాంతో పొట్ట నింపుకోవడానికి వాళ్లు అనుసరించిన మార్గం చెరువుల పునరుద్ధరణకు కారణమైంది. వీళ్ల గురించి తెలియాలంటే...



చెరువును పునరుద్ధరించి... వ్యవసాయంలో రాణిస్తూ!

తమిళనాడులోని పుదుక్కోట్టై జిల్లాలోని కట్టుబావ పల్లివాసల్ గ్రామం ఈ మహిళలది. 200 ముస్లిం కుటుంబాలు నివసిస్తున్నాయి ఇక్కడ. వీళ్లలో 52 కుటుంబాలకు చెందిన పురుషులు కొవిడ్ మహమ్మారికి బలయ్యారు. కుటుంబ పోషణ భారం మహిళలమీద పడింది. కరోనా వల్ల ఉపాధి అవకాశాలూ తగ్గిపోయాయి. దాంతో వ్యవసాయాన్ని ఆసరాగా చేసుకున్నారు ఆ వితంతువులు. వరి పండించడం మొదలుపెట్టారు. కానీ నీటి కొరతతో ఇబ్బందులు పడేవారు. వీళ్లుండే గ్రామానికి పక్కనే ఓ మసీదు ఉంది. అదో చారిత్రక కట్టడం. దాని ఆధ్వర్యంలో సామాజిక సేవ చేస్తూ ఉంటారు. అది తెలుసుకుని అక్కడికి వెళ్లారీ మహిళలు. వాళ్లు దిల్లీలో ఉన్న 'ప్రదాన్' అనే సంస్థను సంప్రదించి విషయం చెప్పారట. గ్రామీణ, వెనకబడిన మహిళలకు అవసరమైన చేయూతను ఇస్తుందీ సంస్థ. 'మేము పెద్దలకి సమస్య చెప్పినప్పుడు వాళ్ల సహాయం చేయడానికి అంగీకరించారు. బావులు, ఆనకట్ట కట్టే అవకాశం ఉందేమో వెతకడం మొదలుపెట్టారు. అప్పుడే స్థానికంగా వినియోగానికి నోచుకోని, నిర్వహణ కరవై ఎండిపోయిన రెండు చెరువులు కనిపించాయి. వాటిని పునరుద్ధరించాలని అనుకున్నాం. ఇదే విషయాన్ని అధికారులకి చెప్పాం. వాళ్లూ మేమూ కలిసి పనులు మొదలుపెట్టాం' అంటారు మహిళలు.

మగవాళ్లు చేయాల్సిన పనుల్ని...

అనుకున్నట్లుగానే అనతి కాలంలోనే పనుల్ని పూర్తిచేశారు. దాన్ని చూసి అందరూ ఆశ్చర్యపోయారు. 'చెరువుల పునరుద్ధరణ చాలా శ్రమతో కూడుకున్నది. పూడిక తీయడం, నీటి నిర్వహణ, గుర్రపు డెక్కని తొలగించడం ఇవన్నీ మగవాళ్లు చేసే పనులు. కానీ ఇక్కడ పనులన్నీ ఈ మహిళలే చేశారు. వ్యవసాయానికి అవసరమయ్యే నీటి వనరుల్ని సమకూర్చుకున్నారు' అంటారు ఇంజినీర్ కనకవల్లి. ఈ రెండు చెరువుల ద్వారా దాదాపు 50వేల ఎకరాలకు నీళ్లు అందుతున్నాయి. నీటి లభ్యత బట్టే పంటలూ వేస్తున్నారు. ప్రస్తుతం వరి మాత్రమే పండిస్తున్న మహిళలు... భవిష్యత్తులో అన్ని రకాల పంటల్ని పండించడమే తమ లక్ష్యం అంటున్నారు.

ఈటీవీ భారత్

ఆకట్టుకునే పరిమళం, రంగు రంగుల పూలు, సులభమైన సాగు... వంటి కారణాలతో డయాంథస్‌ను పెంచుకోవడానికి ఎక్కువమంది ఇష్టపడుతుంటారు. మీరూ ఆ పని చేయాలనుకుంటే ఈ చిట్కాలు మీకోసమే...





సీతాకోకచిలుకల నేస్తం డయాంథస్!


గ్రీకు వృక్షశాస్త్రజ్ఞుడు థియోఫ్రాస్టస్... కారియోఫిలేసి కుటుంబానికి చెందిన ఈ మొక్క పూలను దైవిక పుష్పాలుగా పిలిచారట. ప్రపంచవ్యాప్తంగా స్వీట్ విలియమ్స్, గిల్లీ ఫ్లవర్... వంటి అనేక పేర్లతో దీన్ని పిలుస్తారు. డయాంథస్ పూలు లవంగం పరిమళాలను వెదజల్లుతాయి. గులాబీ, ఎరుపు, తెలుపు, ఊదా వంటి అనేక రంగుల్లో వికసిస్తాయి. పెంచుకునే ప్రదేశానికి అందాన్నీ, అద్భుతమైన సువాసననూ జోడిస్తాయి. సీజన్ అంతా తోటను రంగు రంగుల్లో అందంగా కనిపించేలా చేస్తాయి. ఈ పూలు సీతాకోక చిలుకలు, హమ్మింగ్ బర్డ్స్, తేనెటీగలు వంటి పరాగ సంపర్క కీటకాలను ఆకర్షించి తోటలో జీవవైవిధ్యాన్ని పెంచుతాయి. వీటిని బోర్డర్లు, రాక్ గార్డెన్స్, కుండీలు, కట్‌ఫ్లవర్స్‌గా ఉపయోగించొచ్చు. పైగా ఇవి ఎలాంటి కఠినమైన వాతావరణంలోనైనా సులువుగా పెరుగుతాయి. అందుకే, మొదటిసారి పెంచుకునే వారికి సరైన ఎంపిక.



సంరక్షణ ఎలా...

ఎక్కువ కాలం పాటు ఈ మొక్క పుష్పిస్తుంది. పాత పూలను తీసేస్తే మరిన్ని ఎక్కువ పూలు వస్తాయి. అయితే, తేమగా ఉండే నేలల్లో ఇది సరిగా ఎదగలేదు. కాలమేదైనా కనీసం ఆరేడు గంటలైనా డయాంథస్‌కు సూర్యకాంతి అవసరం. గాలి ప్రసరణ బాగా ఉండేలా చూసుకోవాలి. డయాంథస్‌ని నాటుకునేందుకు నీరు నిలవని మట్టిని కుండీల్లో నింపుకోవాలి. వేర్లు కుళ్లిపోకుండా నేల పైపొర కాస్త ఎండాకే తడిని అందించాలి. ప్రతి పదిహేను రోజులకోసారి పొటాషియం మోతాదు అధికంగా ఉండే ఎన్‌పీకే సమగ్ర ఎరువుని అందించాలి. సాధారణంగా ఈ మొక్కను తెల్లదోమ, జలగలు వేధిస్తుంటాయి. ఇలాంటప్పుడు సబ్బునీళ్లు, వేప నూనె... వంటివి వాడితే పరిష్కారం లభిస్తుంది. వీటిని విత్తనాల ద్వారానే కాకుండా కొమ్మ కత్తిరింపులతోనూ పెంచుకోవచ్చు.





ఆలోచనల కట్టడికి 5-5-5 సూత్రం!

ఓ చిన్న మెసేజ్, మాట, తగాదా చాలు ఆలోచనలు చుట్టుముట్టడానికి. పర్యవసానాల్ని అతిగా ఊహించుకుంటూ... ఇప్పుడే ఇలా ఉంటే భవిష్యత్తులో ఇంకెలా ఉంటుందో? తోటివాళ్ల ముందు చిన్నబోయానే! అన్న సందేహాలతో మొదలై... ఎక్కడి విషయం ఎక్కడికో వెళ్లిపోతుంది. అతిగా ఆలోచించడం... ఆ ప్రవాహంలో కొట్టుకుపోవడం అమ్మాయిలూ, మహిళలకూ సర్వసాధారణం. మనం ఎంత కాదనుకున్నా అంగీకరించాల్సిన నిజం ఇది. సమస్య ఎదురైనప్పుడు మెదడులో లాజికల్ భాగం పనిచేయకపోవడమే ఇందుకు కారణం. అలా అని సరిపెట్టుకుందాం, సర్దుకుపోదాం అనుకుంటున్నారేమో... దీనివల్ల సమస్యలూ బోలెడు. అందుకే దీనికి ఎప్పటికప్పుడు అడ్డుకట్ట వేయాల్సిందే అంటున్నారు నిపుణులు. అందుకు ఉపయోగపడేదే ఈ 5-5-5 సూత్రం. ఆలోచనలు విసిగిస్తున్నప్పుడు ఒక్కసారి ఆగి... రాబోయే 5 నిమిషాల్లో వీటివల్ల ఏమైనా ఉపయోగం ఉందా అని ఆలోచించమంటున్నారు నిపుణులు. లేదా 5 నెలలు, ఆ తరవాత 5 సంవత్సరాలకైనా ఇవి నా జీవనశైలిని ప్రభావితం చేస్తాయా అన్న దిశగా తర్కించమంటున్నారు. సమయంతో సమస్యల్ని ముడిపెడతాం కాబట్టి... తెలియకుండానే మెదడులోని లాజికల్ భాగం పనిచేయడం మొదలవుతుందట. పైగా, మనం ఆలోచించే వాటిలో 70శాతం ఆ క్షణానికి అప్రస్తుతమైనవే. కాబట్టి మొదటి 5 నిమిషాల దగ్గరే ఆలోచనలకు గండి పడుతుంది అంటున్నారు నిపుణులు. ఒక్కసారి ప్రయత్నించి చూడండి మరి!

గిరిజా ఓక్... సోషల్ మీడియాలో ఎక్కడ చూసినా నీలి రంగు చీరలోని ఈమె ఫొటోలే. 40 ఏళ్ల గిరిజ మరాఠీ, హిందీ సినిమాల్లో నటిస్తారు. ఈమధ్య ఈమెది ఒక ఇంటర్వ్యూ వచ్చింది. ఆ తర్వాత నుంచి సోషల్ మీడియా ట్రెండింగ్‌లో ఉన్నారు. దీంతో ఆమెకు కొత్త చిక్కులొచ్చాయి. దానిపై ఆమె స్పందన ఏంటంటే...

మీరూ అలా చేస్తున్నారా?

వైరల్

సోషల్ మీడియాలో ట్రెండ్, వైరల్ కావడం ఎవరికి ఇష్టం ఉండదు. కొద్దిరోజులుగా నా ఫొటోలూ, వీడియోల్ని షేర్‌చేయడం, కామెంట్ చేయడం, నా గురించి నెట్‌లో వెతకడం... ఎక్కువైంది. మీరు చూపుతున్న ఈ ఆదరాభిమానాలకు థాంక్స్. ఎందరో ప్రశంసిస్తూ మెసేజ్‌లు, డీఎమ్‌లు పెడుతున్నారు. నామీద ఎన్నో మీమ్స్ కూడా వచ్చాయి. దీనివల్ల నా సినిమాలూ, వెబ్ సిరీస్‌లకు వీక్షకులు పెరుగుతుండటం నటిగా సంతోషాన్ని కలిగించే విషయమే. దీంట్లో మరో కోణమూ ఉంది. కొందరు హద్దులుమీరి తుంటరి పనులు చేస్తున్నారు. నా ఫొటోల్ని ఏఐతో మార్ఫింగ్ చేసి, ఎడిట్ చేసి అశ్లీలతను జోడించి షేర్ చేస్తున్నారు. దీనివల్ల నాకు భయం, దిగులు ఎక్కువయ్యాయి. నాకు 12 ఏళ్ల అబ్బాయి ఉన్నాడు. వాడు ఇప్పుడు సోషల్ మీడియాలో లేడు కానీ, ఏదో ఒకరోజు వస్తాడుగా. ఈ మార్ఫింగ్ ఫొటోల్ని చూస్తే తన పరిస్థితి ఏంటి? తల్లి ఫొటోల్ని అలా చూసి ఎలా స్పందిస్తాడోనని ఆందోళన కలుగుతోంది. అది మార్ఫింగ్ ఫొటో అని వాడికి ఎలా తెలుస్తుంది? తెలిసినా ఇలా జరిగినందుకు ఎంత బాధపడతాడు. మీరు ఇలాంటి ఫొటోలు చూస్తూ, షేర్ చేస్తూ, కామెంట్‌లు పెడుతోంటే... అశ్లీలతను ప్రోత్సహిస్తున్నట్లే! కొందరు ఫేక్ అకౌంట్లు పెట్టి నేను విరాళాలు అడుగుతున్నట్టు మెసేజ్‌లు పెడుతున్నారు. దయచేసి అలాంటి పనులు చేయకండి. మీరు నిజంగా నా నటనను ఇష్టపడేవారైతే థియేటర్లో కలుద్దాం!



గిరిజ

మకరందం
makarandam@eenadu.in
గురువారం నవంబరు 20, 2025
ఈనాడు
14
మా చిరునామా: మకరందం, ఈనాడు ప్రధాన కార్యాలయం, రామోజీ ఫిలింసిటీ, హైదరాబాద్ - 501 512



నవంబరు 21 పోలిస్వర్గదీపం

నెల రోజులపాటు నదీస్నానాలు, పూజలు, వ్రతాలు, నియమనిష్ఠలతో గడుస్తుంది కార్తికమాసం. ఆ తర్వాత వచ్చేదే పోలిస్వర్గం. కార్తికమాసంలో దీపం వెలిగిస్తే పుణ్యప్రదమని, తెలిసీ తెలియక చేసిన పాపాలు తొలగుతాయని పెద్దలు చెబుతారు. కార్తికమాసంలో ఎలాంటి అవరోధాలు ఎదురైనప్పటికీ వాటిని అధిగమించి దీపం వెలిగించాలని పోలిస్వర్గం కథ తెలియజెబుతుంది.

చీకట్లే కాదు.. చింతలూ తొలగుతాయి!

ప్రచారంలో ఉన్న కథను అనుసరించి... పూర్వం పోలి అనే బాలిక ఉండేది. ఆమె చిన్నతనంలోనే దైవభక్తి అలవరచుకుని పూజలు, వ్రతాలు చేసేది. నిత్యం పూజ చేయడంతో మంచితనానికి తార్కాణంగా నిలిచింది. బంధుమిత్రులంతా పోలిని ఎంతో మెచ్చుకునేవారు. పెళ్లయ్యాక కూడా అలాగే భక్తిప్రపత్తులతో మెలిగేది. తన చిన్న కోడలైన పోలిని ఇరుగుపొరుగు ప్రశంసిస్తుంటే.. ఆమె అత్తకు నచ్చలేదు. 'తన కంటే కోడలు ఉత్తమురాలా!' అని ఉక్రోషం చెందేది. తానే పరమ భక్తురాలు, పూజలేవైనా తానే చేయాలి, అందరూ తననే పొగడాలి- అనుకునేది. ఆ సంవత్సరం కార్తికమాసం రాగానే అత్త తన ఆధిక్యతను నిరూపించుకోవాలనుకుంది. పోలిని ఇంట్లోనే ఉండమని మిగతా కోడళ్లను తనతో నదికి తీసుకువెళ్లసాగింది. వారంతా నదీస్నానాలు చేసి దీపాలు వెలిగించి వచ్చేవారు. చిన్నకోడలు పోలి ఇంట్లోనైనా దీపం వెలిగించే అవకాశం లేకుండా నూనె, ఒత్తులు అందుబాటులో లేకుండా చేసేది అత్త. కానీ పోలి నిరాశచెందలేదు. సమయస్ఫూర్తితో పెరట్లో ఉన్న పత్తిచెట్టు దూదితో ఒత్తులు చేసి, కవ్వానికి అంటుకుని ఉన్న వెన్నతో దీపం వెలిగించేది. ఆ దీపం కనిపిస్తే అత్త కోప్పడుతుందన్న భయంతో దాని మీద బుట్టను బోర్లించేది. ఇలా కార్తికమాసమంతా దీపం వెలిగించింది. చివరి రోజు కూడా కార్తికదీపాలను నదిలో వదిలేందుకు వెళ్తూ పోలికి ఇంటి పనులన్నీ అప్పగించి వెళ్లింది ఆమె అత్త. పోలి ఆ పనులన్నీ వేగంగా ముగించి దీపం వెలిగించింది.

ఎన్ని అవాంతరాలు ఎదురైనా అచంచల భక్తితో దీపారాధన చేసిన పోలిని చూసి దేవతలు సంతోషించారు. ప్రాణాలతో ఉండగానే స్వర్గానికి తీసుకువెళ్లేందుకు దేవదూతలను పంపారు. అదే సమయానికి ఇంటికి చేరుకున్న అత్త, మిగతా కోడళ్లు దేవదూతలను, విమానాన్ని చూసి.. తమ కోసమే వచ్చారని ఆనందపడ్డారు. కానీ అది పోలి కోసమని అర్థమై అవాక్కయ్యారు. ఆమెతో పాటు తాము కూడా స్వర్గానికి వస్తామని ప్రాధేయపడగా దేవదూతలు నిరాకరించారు. పోలికి మాత్రమే స్వర్గానికి వచ్చే అర్హత ఉందని చెప్పి ఆమెని తీసుకుని వెళ్లిపోయారు. మనసులో మార్పు ఉంటుంది, అసలైన భక్తిని ఎవరూ అడ్డుకోలేరు, నిరోధించలేరు- అని పోలిస్వర్గం కథ నిరూపిస్తుంది. దైవభక్తికి కావల్సింది శ్రద్ధాసక్తులు, ఆడంబరాలు కాదని, అహంకారంతో సాగే పూజలు కొరగావని సందేశం ఇస్తుంది.

ఈ రోజున ఏం చేయాలి..

అమావాస్యరోజు ఉదయాన్నే పోలిని తలుచుకుంటూ వెలిగించిన దీపాలను అరటి దొప్పల్లో ఉంచి నీటిలో వదులుతారు. కార్తికమాసంలో ఏ రోజైనా దీపాన్ని వెలిగించలేకపోయినా.. ఈ రోజున 30 ఒత్తులను వెలిగించి నీటిలో వదిలితే మాసమంతా దీపారాధన చేసిన పుణ్యం వస్తుందన్నది పెద్దల మాట. ఈ రోజున కొందరు దీపదానం చేస్తారు. కార్తిక అమావాస్య రోజున సాయంసంధ్య వేళలో దీపాలను వెలిగించి లక్ష్మీదేవిని పూజించిన వారికి చింతలు తొలగి సంపదలు కలుగుతాయని బ్రహ్మపురాణం వివరిస్తుంది. చీకటిని పారదోలడమే కాదు.. చింతలను తొలగించే చగల మహిమ కార్తిక దీపానికి ఉందని భక్తులు విశ్వసిస్తారు.


దీపదానం.. పరమార్థం!

ఏ మాసానికి ఉండే ప్రాధాన్యత ఆ మాసానికి ఉన్నప్పటికీ.. కార్తిక మాసం మరింత ప్రత్యేకమైంది, పవిత్రమైంది. అందుకే 'న కార్తిక సమో మాసః' అన్నారు. కార్తికమాసానికి సరి తూగగల మరో మాసం లేదని అర్థం. దీప ప్రజ్వలన, దీప దానం, వేకువ స్నానాలు, పూజలు, పౌర్ణమి నాటి జ్వాలాతోరణాలు, కేదారీశ్వర వ్రత కథలు, ఉసిరి, మర్రి తదితర దేవతా వృక్షాల ఆరాధనలు, వనభోజనాలు.. ఇలా కార్తిక మాస వైభవం వర్ణనాతీతం. అయితే నదీస్నానం, దీపారాధన వంటివి ఈ మాసానికే పరిమితం చేయక, తర్వాత కూడా ఆచరించాలని పెద్దలు హితవు పలుకుతారు. అలా చేయడం వల్ల మానసిక ప్రశాంతత కలుగుతుంది, ఆత్మజ్ఞానం సిద్ధిస్తుంది.

కార్తిక పౌర్ణమి నాడు చంద్రుని వెలుగు ఉంటుంది.. చివరి రోజైన అమావాస్యనాడు కూడా చంద్రలేమి లోటు తెలియని విధంగా దీపకాంతితో జగతి ప్రకాశిస్తుంది. ఆధ్యాత్మికచింతన వెల్లివిరుస్తుంది. మరుసటి రోజైన పాడ్యమి గడియల్లో దీపం వెలిగించి.. నమస్కరించుకుంటాం. కార్తికమాసం నెలరోజులూ చేసినట్టే ఈ రోజు కూడా నదీ స్నానం ఆచరిస్తారు. పితృదేవతలకు ప్రీతికరమైన పనులను ఆచరిస్తారు. వారి పేరు చెప్పి దీపదానం చేస్తారు. ఎదుటివారికి వెలుగును పంచాలన్నది దీపాన్ని కానుకగా ఇవ్వడంలో పరమార్థం. అలాగే.. దానం అంటే వదులుకోవటం. దానం ద్వారా ఎదుటివారు లబ్ధి పొందుతారు. తద్వారా వారి ఆశీస్సులను మనం అందుకోవచ్చు, ఆయురారోగ్య ఐశ్వర్యాలు చేకూరుతాయి- అనే ఆంతర్యం కూడా ఇందులో ఉంది. ఇతరులకు మేలు చేసేదే తప్ప బాధ కలిగించే, సమాజానికి హితంకాని పనులు చేయకూడదన్నది సందేశం. దేహానికి, మనసుకు చెడు చేసే విధులను త్యజించాలని ఆధ్యాత్మిక ప్రబోధాలు తెలియజేస్తాయి. దైవారాధనలో ప్రశాంతత లభిస్తుంది. దేహాభిమానం కూడదన్న భగవద్గీత సారాంశాన్ని తెలుసుకుని ఆచరణలో పెట్టాలి. అప్పుడే దైవానికి చేరువవుతామని గ్రహించాలి.



నవంబరు 26 సుబ్రహ్మణ్య షష్ఠి



శివపార్వతుల గారాల తనయుడు కార్తికేయుడు. ఆరు ముఖాల ఆ స్వామిని షణ్ముఖుడిగా అర్చించి, ఆరాధిస్తున్నాం. ఆయన ఆరు ముఖాలు- జ్ఞానం, వైరాగ్యం, బలం, శక్తి, కీర్తి, సంపదలకు ప్రతీక.

మార్గశిర శుక్ల షష్ఠిని సుబ్రహ్మణ్య షష్ఠిగా పండుగ చేసుకుంటాం. లోక కంటకుడైన తారకాసురుని సంహరించాలనే దేవతల ఆశయ సిద్ధి కోసం జన్మించి, ఆ బ్రహ్మరాక్షసుని అంతమొందించిన బాల వీరుడు కుమారస్వామి. పరమశివుడి తేజస్సును- అగ్నిదేవుడు, గంగాదేవి, భూమాత, కృత్తికలు భరించగా ఉద్భవించినవాడు సుబ్రహ్మణ్యుడు. అగ్ని వల్ల ఆగ్నేయుడిగా, గంగాదేవి వల్ల గాంగేయుడిగా, కృత్తికల వల్ల కార్తికేయుడిగా, భూమాత వల్ల భౌమ్యుడిగా, పార్వతీ పరమేశ్వరుల పుత్రుడు కనుక కుమారుడు, విశాఖుడుగా పిలుచుకుంటున్నాం. ఆరు కృత్తికల క్షీరాన్ని ఆరు ముఖాలతో ఒక్కసారే తాగినందున షణ్ముఖుడిగా స్తుతులు అందుకుంటున్నాడు.

ప్రణవమూర్తి.. సుబ్రహ్మణ్యస్వామి!

తండ్రికి తత్వం తెలియజెప్పాడు

సుబ్రహ్మణ్యస్వామి ఓంకార స్వరూపుడు. తండ్రి పరమేశ్వరుడు ఓంకార తత్వరూపుడు. ఆ పరమ శివుడికి అదే ఓంకార తత్వాన్ని కూలంకషంగా తెలియజెప్పిన ప్రణవ స్వరూపుడు స్కందుడు. ఓంకారమే పరబ్రహ్మం.

సుబ్రహ్మణ్య షష్ఠి నాడే స్వామి జన్మించాడని కొందరు, వివాహితుడయ్యాడని కొందరు భావిస్తున్నారు. ఈ రోజు శ్రీవల్లి దేవసేన అమ్మవార్లతో స్వామికి కల్యాణం నిర్వహిస్తారు. ఆ స్వామి మీది అపార భక్తితో కార్తికేయుడు, వేలాయుధుడు, పింగళుడు, దేవసేనాపతి, పళని, మురుగన్, గుహుడు, శరవణుడు - ఇలా ఆయన వివిధ పేర్లతో తమ పిల్లలకు నామకరణం చేస్తుంటారు భక్తులు.

విజయాలు చేకూర్చే స్వామి

సుబ్రహ్మణ్యస్వామికి ప్రీతికరమైనది మంగళవారం. ఆయన నామాలలో మంగళుడు ఒకటి. నవగ్రహాల్లోని కుజుడు లేదా అంగారకుడు కూడా కుమారస్వామే.

ధరణీ గర్భ సంభూతం విద్యుత్కాంతి సమప్రభం
కుమారం శక్తిహస్తం తం మంగళం ప్రణమామ్యహం

అని స్తుతిస్తాం. మార్గశిర శుక్ల షష్ఠి నాడు కుమారస్వామిని ఆరాధిస్తే- మనోశుద్ధి, శరీరశుద్ధి, ఆత్మశుద్ధి, ఆధ్యాత్మికశుద్ధి కలిగి నిర్మలత్వం సిద్ధిస్తుంది. క్రమశిక్షణ, భక్తితత్పరత చేకూరుతాయి. కాలసర్పదోషం, రాహు కేతు గ్రహ దోషాలు తొలగిపోతాయి. వివాహానికి అవరోధాలు, సంతానం కలగకపోవటం లాంటి సమస్యలు పరిష్కారమవుతాయి. మనలో చెడుభావనలేమైనా ఉంటే నశిస్తాయి. అశుభాలు తొలగి, విజయం లభిస్తుంది.

పరాశక్తి.. శక్తి ఆయుధధారి..

సుబ్రహ్మణ్యషష్ఠి నాడు ఆ స్వామికి అభిషేకాలు, అర్చనలు విశేషంగా చేస్తారు. మయూరవాహనుడైన ఆ స్వామిని కొందరు సర్పరూపంలో అర్చిస్తారు. 'సర్పమంత్రోపాసన' చేస్తారు. ఈ ప్రత్యేక దినాన కుమారస్వామి వ్రతాన్ని ఆచరించినా, కథను విన్నా వివాహం అవుతుందని, నాగప్రతిష్ఠ చేస్తే సత్సంతానం కలుగుతుందని పెద్దలు చెబుతారు. ఈ రోజు... అయిదుగురు బ్రహ్మచారులను కుమారస్వామి స్వరూపంగా భావించి, భోజన, వస్త్రాలు సమర్పించి నమస్కరిస్తారు. ఉత్తర భారతీయులు జగన్మాత నవరాత్రుల్లో చిన్నారిని బాలాత్రిపురసుందరిగా భావించి, నమస్కరిస్తారు. పిండివంటలతో భోజనం పెట్టి, కొత్తబట్టలు ఇస్తారు. ఇది పరాశక్తికి, శక్తి ఆయుధధారి అయిన కుమారస్వామికి అభేదాన్ని సూచిస్తుంది. కుమారషష్ఠి పండుగను దక్షిణ భారతంలో విశిష్టంగా నిర్వహిస్తారు.

కవి చమత్కారం

భక్తకవి నన్నెచోడుడు సుబ్రహ్మణ్యుని చమత్కార పూర్వకంగా కీర్తించాడు. పరమేశ్వరుడి పేర్లలో స్థాణువు ఒకటి. చెట్టు కాండమని అర్థం. అపర్ణ అంటే ఆకులు లేనిది, విశాఖుడంటే కొమ్మలు లేనివాడు. తండ్రి చెట్టు కాండం, తల్లి పత్రాలు లేనిది, తానేమో శాఖలు లేనివాడు. అయినప్పటికీ భక్తుల కోరికలు అనే ఫలాలను ప్రసాదిస్తున్న మహా ఉదారుడు. అలాంటి దేవదేవునికి నమస్కరిస్తున్నాను- అన్నది పద్యభావం.

ఆరు ముఖాలతో విరాజిల్లే విశిష్ట దేవుడు సుబ్రహ్మణ్యుడు. ఆ ఆరు ముఖాలు దివ్య శక్తి సంపన్నాలు. అవి కామ, క్రోధ, మోహ, లోభ, మద, మాత్సర్యాలనే ఆరు ప్రలోభాలను అరికట్టి మనల్ని మోక్షమనే సన్మార్గంలో నడిపిస్తాయి. అంతే కాదు.. ఆ ఆరు ముఖాలూ జ్ఞానం, వైరాగ్యం, బలం, శక్తి, కీర్తి, సంపదలకు సంకేతం. అష్టాదశ మహాపురాణాల్లో స్కాందపురాణం ఒకటి. పరమేశ్వరుడు స్వయంగా తన కుమారుడైన స్కందునికి చెప్పడం వల్ల స్కాందపురాణం అయ్యింది. ఇది సమస్త విషయ పరిజ్ఞానానికి ఆధారం.

'ఇచ్ఛాశక్తి జ్ఞానశక్తి క్రియాశక్తిస్వరూపిణీ' అని లలితా సహస్ర నామావళి పేర్కొంది. ఇచ్ఛాశక్తికి శ్రీవల్లీదేవి, క్రియాశక్తికి దేవసేన, జ్ఞానశక్తికి సుబ్రహ్మణ్యుడు ప్రతీకలు. ఈ త్రిశక్తి రూపిణి ఆదిపరాశక్తి. శ్రీవల్లీ దేవసేనలతో కూడిన కుమారస్వామి- త్రిశక్తి సంయుతుడు. సాక్షాత్తూ పరాశక్తి సమానుడు. కుమారస్వామి విశ్వశ్రేయస్సు కోసం దేవతల సేనానిగా నిలిచి, లోక కంటకుడైన తారకాసురుని సంహరించాడు.

హైందవంలో- శైవం (శివుణ్ణి ఆరాధించేవారు), వైష్ణవం (విష్ణువును), శాక్తేయం (శక్తిని.. అమ్మవారిని), గాణాపత్యం (గణపతిని), సౌరం (సూర్యదేవుణ్ణి), కౌమారం (కుమారస్వామిని) అని ఆరు విధాల భక్తులున్నారు. కౌమారాన్ని స్కాందం, షాణ్ముఖం అని కూడా అంటారు. కుమారస్వామిని మాత్రమే కొలిచేవారి మతమిది. ఇలా ఒక ప్రత్యేకమైన మత అనుయాయులను (అనుసరించేవారు) కలిగిన దేవుడు సుబ్రహ్మణ్యస్వామి. మతమంటే అభిమతం. అంటే.. అభిరుచి, అభిప్రాయం, ఆలోచన, ఇష్టం. స్కాందమతం తమిళనాడులో ఎక్కువ. తిరుత్తణి, పళని, తిరుచెందూరు, స్వామిమలై తదితర ప్రదేశాలు తమిళనాడులో సుబ్రహ్మణ్యేశ్వరుని పుణ్య క్షేత్రాలు. తెలుగునాట మోపిదేవి, కర్ణాటకలో కుక్కె ప్రసిద్ధమైనవి.

– డాక్టర్ పి.లలితవాణి

పాలకుండ.. పంచదారకుండ..

తమిళనాడులో సుబ్రహ్మణ్య షష్ఠి పండుగనాడు కావడి మొక్కును తీర్చుకుంటారు. ఒకవైపు పాల కుండ, మరోవైపు పంచదార కుండ ఉన్న కావడిని ఆలయం వరకూ స్వయంగా మోసుకుంటూ తీసుకెళ్లి స్వామివారికి సమర్పించుకునే ఈ ఆచారం చాలా ప్రసిద్ధి. మార్గశిర మాసం- చలి బాధకు తట్టుకోలేనిది. అందుకని ఈ పర్వదినాన ఉత్తరీయం, కంబళి, దుప్పటి మొదలైనవి దానంగా ఇస్తారు. పర్వదిన ప్రాముఖ్యం పరోపకారమే కదా!

సహవాస మహిమ

నవంబర్ 23 సత్యసాయి జయంతి



ఒకసారి సత్యసాయి విద్యార్థులతో యాత్రకు బయల్దేరారు. స్వామి తాను ప్రయాణిస్తున్న కారులోంచి దిగి పిల్లలున్న బస్సులో ఎక్కి కూర్చున్నారు. కారు ముందు వెళ్తోంటే.. బస్సు అనుసరిస్తున్నట్టుగా సాగుతోంది. సాయి చిన్నారులను కుశల ప్రశ్నలు అడుగుతూ.. కబుర్లు చెబుతున్నారు. హాస్యోక్తులు, చతురోక్తులతో విద్యార్థులను నవ్విస్తున్నారు. సందర్భోచితంగా ఆధ్యాత్మిక విషయాలను ప్రబోధిస్తున్నారు. ప్రయాణం ఉత్సాహంగా, ఉల్లాసంగా, వినోదభరితంగా, విజ్ఞానదాయకంగా సాగింది. మార్గమధ్యంలో అనేక గ్రామాల్లో దారికి రెండువైపులా భక్తులు బారులు తీరారు. స్వామి కారులో ప్రయాణిస్తున్నారని భావించి వంగి నమస్కరిస్తున్నారు. ఆ దృశ్యాన్ని చూసి సత్యసాయి నవ్వుతూ 'కారు ఎంత మర్యాద పొందుతున్నదో చూడండి! నేను అందులోనే ఉన్నాననుకుని వాళ్లంతా కారుకి దణ్ణాలు పెడుతున్నారు. మన గుర్తింపు, గౌరవం మనం వాడే వస్తువులకు కూడా వస్తుంది. బస్సులో ఉన్నానని తెలిస్తే బస్సుకే నమస్కరిస్తారు. మన సహవాసానికి ఒక గుర్తింపు ఉంటుంది. అది మంచిదీ, గౌరవప్రదమైనదీ అయ్యుండాలి. మీ వల్ల మీ చుట్టూ ఉండే వ్యక్తులకీ, సామగ్రికీ విలువ, గౌరవం పెరిగేలా చూసుకోండి' అంటూ హితవు పలికారు.

ఇస్లాం సందేశం

సత్య మార్గాన్ని.. విశ్వాసాన్ని వీడొద్దు

జీవితంలో ఎంతటి కష్టనష్టాలు, ఎన్ని సవాళ్లు ఎదురైనా నమ్మకం కోల్పోవద్దని, సత్యమార్గాన్నే అనుసరిస్తూ ధర్మానికి కట్టుబడి ఉండాలని ఇస్లాం ధర్మం బోధిస్తుంది. మనం చేసే పనులు ఇతరులను అల్లాహ్ మార్గం వైపు నడిపించేలా ఉండాలని సూచిస్తుంది.

పూర్వం ఓ రాజ్యాన్ని క్రూరుడైన రాజు పరిపాలించేవాడు. ప్రజలను అన్ని విధాలా నియంత్రించటానికి, భయపెట్టడానికి దుష్ట శక్తులు ఉన్న ఓ మాంత్రికుడు అతడికి సాయపడేవాడు. మాంత్రికుడు వృద్ధుడై పోవటంతో అతడి స్థానాన్ని భర్తీ చేసేందుకు మరో వ్యక్తికి తర్ఫీదివ్వమన్నాడు రాజు. రాజ్యంలో ఒక తెలివైన బాలుణ్ణి గుర్తించి అతడికి మంత్రవిద్యలు నేర్పించసాగాడు మాంత్రికుడు. బాలుడు రోజూ అతడి వద్దకు వెళ్లేవాడు. ఆ దారిలోనే అల్లాహ్ గురించి విశేష పరిజ్ఞానం ఉన్న ఓ సన్యాసి ఉన్నాడు. బాలుడు ఆ సన్యాసి బోధనలకు ఆకర్షితుడై నిత్యం కొంత సమయం ఆయనతో గడిపేవాడు. అందువల్ల మాంత్రికుడి వద్దకు వెళ్లటం ఆలస్యమై.. తరచూ శిక్షకు గురయ్యేవాడు.




క్రమంగా మాంత్రికుడి తాంత్రిక పాఠాలకు, సన్యాసి నీతిబోధనలకు మధ్య భేదం బాలుడికి అవగతమయ్యింది. చివరికి సన్యాసి బోధనల్లోని సత్యాన్ని గ్రహించాడు. అల్లాహ్‌పై విశ్వాసాన్ని పెంచుకున్నాడు. ఇతరులనూ సన్మార్గంలోకి రమ్మని చెప్పేవాడు. ఓసారి అతడు చేసిన దైవ ప్రార్థనతో అనారోగ్యంగా ఉన్న వ్యక్తికి స్వస్థత చేకూరింది. దీంతో ఆ వ్యక్తి అల్లాహ్‌పై నమ్మకాన్ని పెంచుకున్నాడు.

బాలుడు మంత్రవిద్యను నేర్చుకోవటానికి నిరాకరించటం, అల్లాహ్ పట్ల విశ్వాసాన్ని ప్రదర్శిస్తుండటం చూసి రాజు కోపోద్రిక్తుడయ్యాడు. బాలుణ్ణి భయపెట్టి.. తన దారికి తెచ్చుకోవాలనుకున్నాడు. అతడికి సన్మార్గాన్ని బోధించిన సన్యాసిని ఉరితీయాల్సిందిగా ఆదేశించాడు. కళ్లముందే సన్యాసి ప్రాణాలు తీసినా.. అల్లాహ్‌పై బాలుడి విశ్వాసం సడలలేదు. మరింతగా రగిలిపోయిన రాజు ఆ బాలుణ్ణి చంపటానికి అనేక రకాలుగా ప్రయత్నించాడు. కానీ ప్రతిసారీ విఫలమయ్యాడు. చివరికి ఆ బాలుడే అతడికి ఏం చేయాలో చెప్పాడు. ప్రజల సమక్షంలో 'బిస్మిల్లాహ్' (అల్లాహ్ పేరుతో) అని స్మరించి అంబులపొది నుంచి ఓ బాణం తీసి తనపై సంధించమన్నాడు. రాజు అలాగే చేయటంతో బాలుడు ప్రాణాలు కోల్పోయాడు. తన తుదిశ్వాస విడిచే సమయంలో.. 'జీవన ప్రదాత, సర్వశక్తిమంతుడు అల్లాహ్' అని పలికాడు. ఈ ఘటనను ప్రత్యక్షంగా చూసిన ప్రతి ఒక్కరూ అల్లాహ్‌ను విశ్వసించేలా చేశాడు. విశ్వాస మార్గంలో స్థిరంగా ముందుకు వెళ్లటానికి చేసే ఎలాంటి త్యాగాలనైనా తక్కువగా అంచనా వేయకూడదు. మన మనుగడకు సంబంధించి అధికారం అల్లాహ్‌దేనని గుర్తించాలి. సర్వాంతర్యామికి తప్ప మరెవరికీ తలవంచాల్సిన అవసరం లేదు. ఎంతటి ప్రతికూల స్థితి ఎదురైనప్పటికీ సన్మార్గాన్ని విడిచిపెట్టకూడదు- అన్నది ఈ కథలోని అంతరార్థం అని గ్రహించాలి.

– ఖాసిం పీరా

మీరే ఆలోచించండి!

క్రీస్తువాణి



దేవాధి దేవుడు నివసించే నగరం సీయోను. అది స్వర్గధామం. అక్కడ నివసించే ప్రజలు ప్రశాంతంగా, ఆనందంగా జీవిస్తారు. దైవాన్ని ప్రేమించేవారు సీయోనులో నివసిస్తారని (కీ. 69:36) కీర్తనకారుడు సెలవిచ్చాడు. పరలోకంలోని ఆ నగరంలో అబ్రహాం సంతతివారు దైవాన్ని ప్రస్తుతిస్తూ ఉంటారు. ఆ ప్రాంతంలో రహదారులు బంగారుమయంగా ఉంటాయి. అక్కడ దీపాలు ఉండవు. దేవుడి కాంతే వెలుగునిస్తుంది. బంగారు బాటల మీదుగానే భక్తులు రాకపోకలు సాగిస్తారు. అక్కడున్నవారికి ఆకలి దాహాలు ఉండవు. భక్తులు సదా దైవాన్ని స్తుతిస్తూ దేవదూతల వలె ఉంటారు' అని బైబిల్ పేర్కొంది.

మన చుట్టూ దైవాన్ని విశ్వసించి ప్రార్థనలు చేసే భక్తులున్నారు. వాళ్లు తోటివారికి సేవ చేయడం తమ కర్తవ్యంగా భావిస్తారు. పరలోక చింతనతో జీవితాన్ని సార్థకం చేసుకుంటారు. అలాగే ఇహలోక సౌఖ్యాలే సర్వం అనుకుంటూ వాటితోనే ఆనందిస్తూ సీయోను నగరం గురించి ఆలోచించని వాళ్లు కూడా ఉన్నారు. వారు ఇక్కడ లభించే భోగభాగ్యాలే శాశ్వతమని భావిస్తూ దేవుని ఆజ్ఞలు పాటించరు. క్షణికానందం కోసం జీవిస్తారు. మరణానంతరం నరకానికి వెళ్లాల్సివస్తుందన్న భయం లేకుండా కాలం గడుపుతారు. దేవుణ్ణి హృదయపూర్వకంగా ప్రేమించి, ఆయన ఆజ్ఞలు తు.చ.తప్పక పాటించిన భక్తులు మరణానంతరం సీయోనుకు వెళ్తారు. తోటివారు వారిని తృణీకరించినప్పటికీ చింతించాల్సిన పనిలేదు. సీయోను వాళ్లకు స్వాగతం పలుకుతుంది. సీయోను చేరాలో లేక నరకంలో ప్రవేశించాలో మీరే ఆలోచించి ఆ ప్రకారం నడుచుకోండి.



గీతలో కృష్ణుడు మాసాల్లో మార్గశిరం తానే అన్నాడు. అందువల్ల మార్గశిరం భగవంతుడి స్వరూపం. ఆధ్యాత్మిక సాధనకు ఇది అనుకూలమైంది. లక్ష్మీదేవికి ప్రియమైన మార్గశిర గురువారాల్లో లక్ష్మీ వ్రతం చేయాలని పురాణాలు చెబుతున్నాయి. దీనినే గురువార వ్రతం, మార్గశిర లక్ష్మివార వ్రతం అంటారు. ద్వాపర యుగంలో శ్రీకృష్ణుడు ఈ వ్రతం గురించి ద్రౌపదికి చెప్పగా.. ఆమె ఈ వ్రతం ఆచరించిందని తెలియజేసే కథలున్నాయి. ఈ వ్రతం ఆచరించడం వలన దారిద్ర్యం పోయి సిరిసంపదలు వృద్ధిచెందుతాయి.

ఒక్కరోజు అన్నదానం చేసినా..

మార్గశిర మాసంలో నెలంతా పర్వదినాలే. ప్రారంభ దినమైన శుద్ధ పాడ్యమి.. రాక్షసులు వేదాలను తస్కరించగా.. శ్రీమహావిష్ణువు వారిని ఓడించి వాటిని తిరిగి తెచ్చి బ్రహ్మదేవునికి ఇచ్చిన రోజని పురాణాలు చెబుతున్నాయి. ఈ రోజు నదీ స్నానం చేయాలి. అదెంతో పుణ్యప్రదం. మార్గశిర శుద్ధ తదియనాడు ఉమామహేశ్వర వ్రతం చేయాలని చతుర్వర్గ చింతామణి పేర్కొంది. ఈ రోజు ఉమామహేశ్వర వ్రతం చేయడం వల్ల అకాల మరణం దరిచేరదు. మార్గశిర శుద్ధ పంచమినాడు నాగ పూజ చేయాలని స్మృతి కౌస్తుభం తెలియజేసింది. ఈ రోజు నాగ ప్రతిమకు పాలు, నెయ్యి, తేనె, పెరుగు, పంచదారలు సమర్పించి, పరిమళభరిత పుష్పాలతో పూజించాలి.

శివ పార్వతుల తనయుడు సుబ్రహ్మణ్యస్వామి జన్మించిన తిథి మార్గశిర షష్ఠి. తారకాసురుడు అనే రాక్షసుణ్ణి సంహరించి లోకానికి శ్రేయస్సు కలిగించాడు. ఈ రోజు సుబ్రహ్మణ్య స్వామిని పూజించడంతో పాటు ఆయనను సర్పరూపునిగా భావించి పాముపుట్టను పూజిస్తారు. మార్గశిర శుద్ధ సప్తమిని భద్రాసప్తమి, నందాసప్తమి అంటారు. ఈ రోజు ఉపవాసం ఆచరించి సూర్యుణ్ణి పూజించి పెరుగన్నం నివేదనచేసి రాత్రి భుజించాలని భవిష్య పురాణం చెబుతోంది. ఈ ఆచారాన్ని పాటించడం వల్ల ఆరోగ్యం చేకూరుతుంది.

మార్గశిర శుద్ధ అష్టమిని కాలభైరవ అష్టమి అంటారు. ఈ అష్టమి రోజున శివుడు కాలభైరవుణ్ణి సృష్టించి, అతణ్ణి కాశీక్షేత్ర పాలకుడిగా నియమించాడు. కాశీక్షేత్రాన్ని దర్శించేవారంతా ముందుగా కాలభైరవుణ్ణి దర్శించిన తర్వాతే తన రూపమైన విశ్వనాథుణ్ణి దర్శించాలనే నియమాన్ని ఏర్పరిచాడు. నేటికీ కాశీయాత్ర చేసేవారంతా ముందుగా కాలభైరవుణ్ణి దర్శించుకుంటారు.

మార్గశిర శుద్ధ ఏకాదశే వైకుంఠ ఏకాదశి. శ్రీకృష్ణుడు అర్జునుడికి గీతోపదేశం చేసిన రోజు ఈ మార్గశిర శుద్ధ ఏకాదశి. ఈ రోజున భగవద్గీతను పూజించి గీతాపారాయణ చేయడం పుణ్యప్రదం. ఈ ఏకాదశినాడు శ్రీమహావిష్ణువు శ్రీదేవి, భూదేవి సమేతంగా వైకుంఠ ఉత్తర ద్వారం వద్ద దర్శనమిస్తాడు. ఆ సమయంలో దేవతలందరూ విష్ణువును సేవిస్తారు కనుక ఈ ఏకాదశిని వైకుంఠ ఏకాదశి అంటారు. ఈ రోజున ముక్కోటి దేవతలు భూమి మీదకి దిగివస్తారు కాబట్టి దీనిని 'ముక్కోటి ఏకాదశి' అని కూడా అంటారు. ఈ రోజు విష్ణువును అర్చించి దేవాలయంలో ఉత్తర ద్వారం గుండా స్వామిని దర్శిస్తే మోక్షం చేకూరుతుందని భక్తులు విశ్వసిస్తారు. ఈ రోజు ఉపవాసం ఆచరించి విష్ణువును పూజించి రాత్రి జాగరణ చేసి ఏకాదశీవ్రతం చేయాలి. ఈ వ్రతం ఆచరించినవారికి మోక్షం లభిస్తుందని పద్మపురాణం పేర్కొంది.

మార్గశిర శుద్ధ ద్వాదశి నాడు హనుమద్వ్రతం చేయడం ఆనవాయితీ. హనుమంతుణ్ణి ఈరోజు షోడశోపచారాలతో పూజించి గోధుమపిండితో చేసిన అప్పాలను నివేదిస్తారు. ఈ వ్రతం చేయడం వల్ల వాక్శుద్ధి, విద్యాభివృద్ధి కలుగుతాయి. అనుకున్న పనులు నెరవేరుతాయి. ఆరోగ్యం చేకూరుతుంది. మార్గశిర పౌర్ణమి నాడు చంద్రుణ్ణి పూజించాలి. అగ్ని పురాణ ప్రతిని దానం చేయాలి. ఇలా చేయడం వల్ల యాగాలు నిర్వహించిన ఫలితం లభిస్తుంది. మార్గశిర పౌర్ణమిని కోరల పున్నమి అని కూడా అంటారు. యమధర్మరాజు వద్ద లేఖకునిగా ఉండే చిత్రగుప్తుని సోదరి కోరల అమ్మవారు. ఈ రోజున ఈ అమ్మవారిని, యమధర్మరాజును పూజిస్తే నరక బాధలు తప్పిపోతాయని విశ్వసిస్తారు.

సూర్యుడు ధనస్సు రాశి నుంచి మకర రాశిలో ప్రవేశించడాన్ని మకర సంక్రమణం అంటారు. ధనుస్సంక్రమణం నుంచి మకర సంక్రమణం వరకూ గల కాలమే ధనుర్మాసం. ఈ ధనుర్మాసం వైష్ణవులకు ఎంతో పవిత్రమైనది. ఈ మాసంలో ప్రతిరోజూ సూర్యోదయానికి ముందే శ్రీమహావిష్ణువును పంచామృతాలతో పూజించాలి. ధనుర్మాసంలో ఒక్కరోజు అన్నదానం చేసినా.. కాశీ, రామేశ్వరం, ప్రయాగ వంటి పుణ్యక్షేత్రాల్లో వందలాది మందికి అన్నదానం చేసినంత పుణ్య ఫలం చేకూరుతుంది- అన్నది ఆర్యవాక్కు. – శివశ్రీ


ఈనాడు సినిమా

జపాన్ పయనం


ప్రభాస్

జపాన్‌లో మన సినిమాలు సత్తా చాటుతున్నాయి. అగ్ర కథానాయకుడు ప్రభాస్ నటించిన 'బాహుబలి' మొదలుకొని, 'కల్కి 2898 ఎ.డి' వరకూ జపాన్‌లో విడుదలై మంచి ఆదరణని సొంతం చేసుకొన్నాయి. అక్కడ ప్రభాస్‌కి బలమైన అభిమానగణం ఏర్పడింది. 'కల్కి' విడుదల సమయంలోనే జపాన్‌కి వెళ్లాలనుకున్నారు ప్రభాస్. అయితే అప్పుడు కాలినొప్పితో వెళ్లలేకపోయారు. అయితే త్వరలోనే కలుస్తానని ఓ వీడియో ద్వారా మాటిచ్చారు. ఆ మాట మేరకు వచ్చే నెలలోనే ఆయన తన అభిమానుల్ని పలకరించేందుకు జపాన్ వెళ్లనున్నట్టు తెలుస్తోంది. ప్రస్తుతం చేస్తున్న 'ఫౌజీ' సినిమా నుంచి కాస్త విరామం తీసుకుని, ఆయన జపాన్ పయనం కానున్నారు. ఈ నెలాఖరులో కొత్త సినిమా 'స్పిరిట్'ని కూడా ప్రారంభించనున్నారు ప్రభాస్. ఆ చిత్రం కోసమే ఆయన ప్రస్తుతం తన లుక్‌ని మార్చుకునే ప్రయత్నంలో ఉన్నట్టు సమాచారం. జపాన్ నుంచి తిరిగొచ్చాక ఆయన కొత్త సినిమాల చిత్రీకరణలతోనూ, 'రాజా సాబ్' ప్రచార కార్యక్రమాలతోనూ బిజీ కానున్నారు.

మాధవన్... హనుమాన్?


మాధవన్

పేరుతో సహా, సినిమాకి సంబంధించి ప్రేక్షకులు తెలుసుకోవాలనుకున్న చాలా విషయాలపైన స్పష్టతనిచ్చారు అగ్ర దర్శకుడు రాజమౌళి. టీజర్ అయితే సినిమా స్థాయినీ చాటి చెప్పింది. అయినా సరే, 'వారణాసి' చిత్రానికి సంబంధించి వెలుగులోకి రాని మరిన్ని విషయాలపైన సామాజిక మాధ్యమాల్లో జోరుగా చర్చ, ప్రచారం కొనసాగుతోంది. ఈ చిత్రం రామాయణంలోని ఓ ముఖ్య ఘట్టం ఆధారంగా రూపొందుతోందని దర్శకుడు రాజమౌళి స్పష్టం చేసిన విషయం తెలిసిందే. శ్రీరాముడు పాత్రలో మహేశ్‌బాబు నటిస్తున్నారు. హనుమంతుడుగా ఎవరు నటిస్తున్నారనేది మాత్రం ఇంకా వెలుగులోకి రాలేదు. ఆ పాత్రలో కథానాయకుడు మాధవన్ నటిస్తున్నారని ప్రచారం సాగుతోంది. 'వారణాసి'లో మాధవన్ ఓ కీలక పాత్రలో నటిస్తున్నారనే సంగతి ఎప్పట్నుంచో వినిపిస్తోంది. టీజర్ తర్వాత ఆయన హనుమాన్ పాత్రలోనే నటిస్తున్నారనే ప్రచారం ఊపందుకుంది. చిత్రబృందం స్పందిస్తేనే ఇందులో నిజం ఉందా లేదా అన్నది తెలుస్తుంది. గ్లోబ్‌ట్రాటర్ టీజర్ మాత్రం ప్రపంచవ్యాప్తంగా సినీ ప్రియుల దృష్టిని ఆకర్షించింది. గ్లోబ్‌ట్రాటర్ అనే పేరుకు తగ్గట్టే సినిమా స్థాయి, సాంకేతిక హంగులు ఉండబోతున్నాయనేది స్పష్టమైంది.

ఇంటికి చేరని యుద్ధ వీరుల లేఖలు

సైనికులు తమ కుటుంబ సభ్యుల కోసం రాసే లేఖలు ఏళ్ల తరబడి వారికి చేరకుండా బెటాలియన్‌లోనే ఉండిపోతే.. వాళ్లు ఎలా ఉన్నారో? అని కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతారు. ఇలాంటి ఓ వాస్తవ కథతో తెరకెక్కిన చిత్రమే 'ది సిక్స్ ట్రిపుల్ ఎయిట్'. ఏళ్ల తరబడి తమ క్షేమ సమాచారాన్ని రాస్తున్న సైనికుల లక్షల ఉత్తరాలు వారి ప్రియమైన వారికి ఓ మహిళా సైనిక బృందం ఎలా చేరవేసిందనేదే ఆసక్తికరం.



సినిమా: 'ది సిక్స్ ట్రిపుల్ ఎయిట్'
జానర్: అమెరికన్ వార్ డ్రామా
ప్లాట్‌ఫామ్: నెట్‌ఫ్లిక్స్

కథాంశం: రెండవ ప్రపంచ యుద్ధంలో దేశం కోసం పోరాడడానికి వెళ్లిన అబ్రమ్ డేవిడ్ (గ్రెగ్ సుల్కిన్) వీర మరణం పొందుతాడు. అంతేకాదు అతడు రాసిన ఎన్నో లేఖలు బెటాలియన్‌లో పోస్టల్ సమస్యల కారణంగా తన ప్రియురాలు లీనా డెర్రీకాట్(ఎబోనీ అబ్సిడియన్)కు చేరవు. ఇలా ఎన్నో సైనిక కుటుంబాలు ఈ పరిస్థితులను ఎదుర్కోవడం చూసి లీనా సైనిక దళంలో చేరుతుంది. కానీ అక్కడి సైనిక విభాగ పరిస్థితులు లింగ, వర్ణ వివక్షతలతో చాలా కఠినంగా ఉంటాయి. లీనా యుద్ధ సమయంలో 6888అనే ఏకైక మహిళా బెటాలియన్‌కు నాయకత్వం వహిస్తున్న లెఫ్టినెంట్ కల్నల్ ఛారిటీ ఆడమ్స్(కెర్రీ వాషింగ్టన్) బృందంలో సేవలను అందిస్తుంది. కఠినమైన శిక్షణ తర్వాత వీళ్లందరినీ సెంట్రల్ పోస్టల్ డైరెక్టరీ బెటాలియన్‌కు పంపుతారు. అక్కడ సైనికులు రాసిన లక్షలాది లేఖలు పంపిణీ చేయకుండా ఉంటాయి. వాటిని పంపిణీ చేసే బాధ్యతని ఛారిటీ బృందానికి అప్పగించి టీం లోని సభ్యుల సంఖ్యను తగ్గిస్తారు. అయినప్పటికీ దీనిని సవాలుగా తీసుకున్న ఛారిటీ ఆడమ్స్ అవమానాల మధ్య లక్షలాది లేఖలను రెండు నెలల్లోనే పంపిణీ చేసేలా తన బృందాన్ని ఎలా తయారుచేసిందో తెలియాలంటే ఈ సినిమాని చూడాల్సిందే.

■ ఈ సినిమాలో రెండవ ప్రపంచ యుద్ధంలో అసమానతలు ఎదుర్కొన్న మహిళా సైనికుల సేవలను అద్భుతంగా చూపారు దర్శకుడు టైలర్ పెర్రీ. లెఫ్టినెంట్ కల్నల్ మేజర్ ఛారిటీ ఆడమ్స్ పాత్రను స్ఫూర్తిదాయకంగా తీర్చిదిద్దారు. ఎన్నో ఏళ్లుగా పంపిణీ చేయని లేఖలను పంపే క్రమంలో అవమానాలు ఎదుర్కొంటున్నప్పటికీ మహిళా సైనికులు చేసే ప్రయత్నాలను ప్రేక్షకుడికి అర్థమయ్యేలా సున్నితంగా రూపొందించారు. ఛారిటీ తన బృందంలో ఆత్మవిశ్వాసాన్ని నింపే తీరు, ఆత్మాభిమానం కోసం ఉన్నతాధికారులతో పోరాడే దృశ్యాలు ప్రేక్షకుణ్ని మెప్పిస్తాయి. ఒక సైనికుడి భావోద్వేగాలతో కూడిన లేఖ తన కుటుంబానికి చేరడం ఎంత అవసరమో.. అలాంటి ఓ పనిని ఎన్నో వేల సైన్యం ఉన్నప్పటికీ మహిళా సైన్యం విజయవంతంగా పూర్తి చేయాలనుకునే ప్రయత్నాలు ఆకట్టుకుంటాయి. యుద్ధ సమయంలో సైనికులకు తమ ప్రియమైన వారి నుంచి ఉత్తరాలు అందించి.. వారిని మరింత శక్తిమంతంగా పోరాటం చేసేలా కృషి చేసిన ఈ మహిళా అధికారుల కథేంటో మీరూ తెలుసుకోండి.

– లావణ్య పంపన, ఈజేఎస్


'ది సిక్స్ ట్రిపుల్ ఎయిట్'

పాటకు జవాబుదారీ సంగీత దర్శకుడే


భీమ్స్

వైవిధ్యమైన కథలకు సంగీతం అందించే అవకాశం రావడం ఎప్పుడూ ప్రత్యేకమేననీ, '12ఏ రైల్వే కాలనీ' తనని మరో కొత్త నేపథ్యంలోని కథలకు బలంగా పరిచయం చేసిందని చెప్పారు భీమ్స్ సిసిరోలియో. కొంతకాలంగా మాస్ సినిమాలతో గట్టిగా వినిపిస్తున్న పేరు ఇది. ఇటీవల అల్లరి నరేశ్ హీరోగా నటించిన '12 ఏ రైల్వే కాలనీ' సినిమాకి సంగీతం అందించారు. ఇది ఈ నెల 21న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా భీమ్స్ బుధవారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు.

"నేను ఇప్పటివరకూ చేసిన సినిమాలతో పోలిస్తే... ఇది పూర్తిగా ఒక కొత్త నేపథ్యంలో సాగే కథ. సంగీత దర్శకుడిగా నాకే ఓ కొత్త అనుభవం కలిగింది. ఇలాంటి థ్రిల్లర్ కథలకు ఇదివరకెప్పుడూ, సంగీతం చేయకపోయినా సరే, కథానాయకుడు అల్లరి నరేశ్, నిర్మాత శ్రీనివాసా చిట్టూరి, దర్శకుడు నాని నన్ను బలంగా నమ్మారు. వాళ్ల నమ్మకమే నన్ను నడిపించింది. ధమాకా, బలగం, మ్యాడ్, టిల్లు స్క్వేర్, సంక్రాంతికి వస్తున్నాం... ఇలా ఒకే దశలోనే విభిన్నమైన కథలకు సంగీతం ఇచ్చాను. ఇప్పుడేమో థ్రిల్లర్ నేపథ్యంలో సాగే ఈ సినిమా చేశా. ఈ అనుభవం నాకెంతో ప్రత్యేకం".

◆ "కథల నుంచే సంగీతం పుడుతుందని నమ్ముతాను. దర్శకుడు రాసిన ఈ స్క్రిప్ట్‌కి తగ్గట్టుగానే నా ప్రయాణం సాగింది. థ్రిల్‌ని పంచుతూ, అక్కడక్కడా భయాన్ని కలిగించే ఈ కథకు అవసరమైన వాయిద్యాల్ని వినియోగిస్తూ కొత్త రకమైన సంగీతం అందించే ప్రయత్నం చేశా. దర్శకుడు, హీరో, నిర్మాత.. ఈ ముగ్గురితోనే మొదట ప్రయాణం మొదలవుతుంది. వాళ్లు సంతృప్తి చెందే వరకూ ఎంతో ఓపికతో, ప్రేమతో పనిచేస్తుంటా. ఈ సినిమాలో సంగీతం కొత్తగా వినిపిస్తుంది"

"జనంతోనే నాకు అనుబంధం. వాళ్లకు ఎలాంటి పాటలు నచ్చుతాయో అలాంటి పాటలే ఇవ్వాలనుకుంటా. అందుకే జనం నుంచి వచ్చిన పాటలాగే ఉంటుంది నా బాణీ. ఒక పాట సరిగ్గా రాలేదంటే దానికి జవాబుదారీ సంగీత దర్శకుడే. పాటలోని భాష ఎక్కడా నలిగిపోకూడదని, భాష ఔన్నత్యం దెబ్బ తినకూడదనే విషయాల్ని ఎప్పుడూ మనసులో పెట్టుకునే పనిచేస్తా. ప్రస్తుతం 'భర్త మహాశయులకు విజ్ఞప్తి', 'మన శంకరవరప్రసాద్ గారు', 'డెకాయిట్', 'టైసన్ నాయుడు', సంపత్ నంది దర్శకత్వంలోని 'భోగి', విశ్వక్ సేన్ కథానాయకుడిగా నటిస్తున్న 'ఫంకీ' సినిమాలకి సంగీతం అందిస్తున్నా".

బాహుబలి ప్రయాణం కొనసాగాలంటే..!


'బాహుబలి: ది ఎటర్నల్ వార్'

"బాహుబలి' ప్రయాణాన్ని కొనసాగించాలంటే యానిమేషన్ అనేది ఉత్తమమైన మార్గం అంటున్నారు ఇషాన్ శుక్లా. ప్రముఖ దర్శకుడు రాజమౌళి.. ఇషాన్ శుక్లాతో కలిసి 'బాహుబలి: ది ఎటర్నల్ వార్' అనే యానిమేషన్ చిత్రాన్ని రూపొందిస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఇషాన్ బాహుబలి యానిమేషన్ ప్రయాణం గురించి మాట్లాడుతూ... "బాహుబలి' ప్రయాణాన్ని కొనసాగించాలంటే సీక్వెల్, ప్రీక్వెల్ తీయడం కంటే యానిమేషనే మంచిది. ఇప్పుడు యానిమేషన్ చిత్రాలంటే చాలామంది ఆసక్తి చూపుతున్నారు.. అలానే ప్రతి బాహుబలి అభిమానికి ఇది కూడా ఒక గొప్ప యానిమేటెడ్ చిత్రంగా ఉండాలని కోరుకుంటున్నాను"అన్నారు.

అది నా నంబరు కాదు


శ్రియ

ఇటీవలే వాట్సప్‌లో తన పేరు, ఫొటో వినియోగిస్తూ ఓ వ్యక్తి ఫొటోగ్రాఫర్లను మోసం చేస్తున్నాడని.. అలాంటి ఫేక్ అకౌంట్‌ల నుంచి జాగ్రత్తగా ఉండాలంటూ నటి అదితిరావు హైదరి విజ్ఞప్తి చేశారు. తాజాగా మరో నటి శ్రియ శరణ్ కూడా ఈ నకిలీ వాట్సప్ బారినపడ్డారు. ఆమె ఈ విషయాన్ని ఇన్‌స్టాలో ఓ పోస్ట్ ద్వారా తెలిపారు. ఈ పోస్ట్‌కి "ఈ వ్యక్తి ఎవరో నాకు తెలియదు. దయచేసి ఇలాంటి వారితో చాట్ చేసి మీ విలువైన సమయాన్ని వృథా చేసుకోకండి. ఇలా జరగడం నాకు బాధగా ఉంది. ఇది నేను కాదు.. ఈ నంబర్ నాది కాదు. దురదృష్టం ఏంటంటే.. ఈ వ్యక్తి నా సన్నిహితులతో సహా నేను అభిమానిస్తూ కలిసి వర్క్ చేయాలనుకునే వారికి కూడా మెసేజ్‌లు చేస్తున్నాడు. చాలా వింతగా అనిపిస్తుంది. ఇలా చేయడానికి మీ సమయాన్ని ఎందుకు వృథా చేసుకుంటున్నారు?" అంటూ శ్రియ అందరూ అప్రమత్తంగా ఉండాలనే వ్యాఖ్యల్ని జోడించారు.

టికెట్ ధర రూ.99 మాత్రమే


అఖిల్, తేజస్వి

పైరసీపై పోరాటంలో భాగంగా ప్రముఖ ఓటీటీ సంస్థ ఈటీవీ విన్ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ సంస్థలో రూపొందిన 'రాజు వెడ్స్ రాంబాయి' సినిమా టికెట్ ధరను రూ.99కి తగ్గించింది. సింగిల్ థియేటర్లలో ఈ ధర అందుబాటులో ఉంటుందని, మల్టీప్లెక్స్ థియేటర్లలో రూ.105గా నిర్ణయించినట్టు ఈటీవీ విన్ బిజినెస్ హెడ్ సాయికృష్ణ తెలిపారు. బుధవారం రాత్రి హైదరాబాద్‌లో 'రాజు వెడ్స్ రాంబాయి' విడుదలకు ముందస్తు వేడుక జరిగింది. ప్రముఖ కథానాయకుడు కిరణ్ అబ్బవరం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అఖిల్, తేజస్విని జంటగా సాయిలు కంపాటి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రమిది. వేణు ఊడుగుల నిర్మాత. బన్నీ వాసు, వంశీ నందిపాటి ఈ నెల 21న చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. ఈ వేడుకని ఉద్దేశించి సాయికృష్ణ మాట్లాడుతూ "పైరసీపై ఈటీవీ విన్ మొదట్నుంచీ పోరాటం కొనసాగిస్తూనే ఉంది. మా వేదిక నుంచే విడుదలైన 'క' సినిమా వెంటనే పైరసీ కాకుండా చేయగలిగాం. అప్పట్లో దాని గురించి చాలా మంది మాట్లాడుకున్నారు. ఇటీవల ఐ బొమ్మ రవి అరెస్టు తర్వాత దాని గురించి మాట్లాడుకుంటున్నారు. అరెస్ట్ చేసిన తెలంగాణ పోలీసు అధికారులకు శుభాకాంక్షలు. అయితే ఈ అరెస్ట్ తర్వాత సినిమా టికెట్ ధరలు, థియేటర్లలో పాప్‌కార్న్ ధరలు పెరిగిపోయాయని, అవి తగ్గితే థియేటర్లకు వస్తాం కదా అనే అభిప్రాయాలు చాలా మంది నుంచి వినిపిస్తున్నాయి. అది దృష్టిలో పెట్టుకునే మా సినిమా టికెట్ ధరల్ని తగ్గించాలని నిర్ణయం తీసుకున్నాం. మనం ఒక్కటే సినిమాని థియేటర్‌లో చూస్తే పైరసీ ఆగుతుందా అని ఎవ్వరూ అనుకోవద్దు. మన నుంచే మొదలైన పైరసీని ఆపే బాధ్యత కూడా మనదే అనుకోవాలి ప్రతి ఒక్కరం. ఒక గొప్ప ప్రేమకథని ప్రేక్షకులకు చేరువ చేయబోతున్నాం. రాజు, రాంబాయి పెళ్లి ప్రతి ఊరిలో ప్రేక్షకుల మధ్యలో జరగబోతోంది' అన్నారు. ఈ కార్యక్రమంలో చిత్రబృందం పాల్గొంది.

డిజిటల్ కంటెంట్ ప్రొవైడర్లకు అధిక ధరలు ఎందుకు చెల్లించాలి?

టీఎఫ్‌సీసీ ఆధ్వర్యంలో ధర్నా

డిజిటల్ కంటెంట్ ప్రొవైడర్లు క్యూబ్, యూఎఫ్‌ఓ, పీఎక్స్‌డీలు అధిక యూజర్ ఛార్జీలు వసూలు చేస్తున్నాయంటూ తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని తెలుగు ఫిల్మ్ ఛాంబర్ కార్యాలయం దగ్గర బుధవారం ధర్నా నిర్వహించారు. అధిక యూజర్ ఛార్జీలు, సినిమా థియేటర్స్‌లో తినుబండారాల ధరలు, సినిమా పైరసీకి వ్యతిరేకంగా దీనిని చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా టీఎఫ్‌సీసీ ఛైర్మన్ ప్రతాని రామకృష్ణ గౌడ్ మాట్లాడుతూ.. 'తెలుగు సినిమా పరిశ్రమలోని ముగ్గురు నిర్మాతలు తమ స్వార్థంతో చేస్తున్న నిర్వాకాల వల్ల చిన్న సినిమా మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. సినిమాను థియేటర్స్‌లో ప్రదర్శించే డిజిటల్ కంటెంట్ ప్రొవైడర్లు తెలుగు నిర్మాతల నుంచి వారానికి రూ.పదివేలు వసూలు చేస్తున్నారు. దీంతో ఒక్కో సినిమా రిలీజ్‌కు కనీసం రూ.10లక్షల భారాన్ని నిర్మాతలు మోయాల్సి వస్తోంది. మల్టీప్లెక్స్‌లో అయితే వారానికి రూ.15వేలు నిర్మాత చెల్లించాలి. ఇదే పక్క రాష్ట్రాల్లో అయితే రూ.2500 నుంచి రూ.3వేలు మాత్రమే ఛార్జీలు ఉన్నాయి. మన దగ్గర మాత్రం ఇంత అధిక ధరలు ఎందుకు చెల్లించాలి. ఈ సమస్యలపై ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోవాలి. టీఎఫ్‌సీసీ తరఫున మా పోరాటం కొనసాగిస్తామ''న్నారు. ఈ ధర్నాలో నిర్మాతలు సాయి వెంకట్, గురురాజ్, డీఎస్ రెడ్డి, రవి, నటుడు సన్నీ, దర్శకుడు సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

రామ్‌చరణ్‌కు ఇష్టమైన చిత్రం... కొదమసింహం


సత్యానంద్, మురళీమోహన్‌రావు, కైకాల నాగేశ్వరరావు, కోటి, పరుచూరి గోపాలకృష్ణ, చినబాబు

"నాకు కౌబాయ్ సినిమాలంటే ఎంతో ఇష్టం. కానీ నటుడయ్యాక అలాంటి ఒక సినిమాని నేను చేస్తానని ఊహించలేదు. నాతో ఓ కొత్త తరహా సినిమా చేయాలని దర్శకనిర్మాతలు అప్పట్లో 'కొదమసింహం' కథతో వచ్చారు. చాలా నచ్చింది. అలా కెరీర్‌లో ఒకే ఒక్క కౌబాయ్ చిత్రం చేసే అవకాశం దక్కింది. ఈ సినిమా అంటే నాకెంతో ఇష్టం. నాకంటే కూడా రామ్‌చరణ్‌కి ఇంకా ఇష్టం" అన్నారు చిరంజీవి. ఆయన కథానాయకుడిగా మురళీమోహన్‌రావు దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'కొదమసింహం'. మోహన్‌బాబు, ప్రాణ్ కీలక పాత్రలు పోషించారు. కైకాల నాగేశ్వరరావు నిర్మాత. 35 ఏళ్ల కిందట ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ చిత్రం, 4కే విజువల్స్, 5.1 డిజిటల్ సౌండింగ్‌తో సరికొత్తగా ముస్తాబై ఈ నెల 21న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా చిత్రబృందం బుధవారం హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా కథానాయకుడు చిరంజీవి ఓ ప్రత్యేక వీడియోతో ఈ సినిమా ప్రయాణాన్ని గుర్తు చేసుకున్నారు. "తొలిసారి నేను గడ్డం పెంచి నటించిన చిత్రమిది. ఇందులో నాకు నచ్చిన మరో పాత్ర మోహన్‌బాబు పోషించిన... సుడిగాలి. బాలీవుడ్ నటుడు ప్రాణ్‌తోనూ కలిసి నటించే అదృష్టం ఈ సినిమాతో దక్కింది. ఇందులోని ప్రతి పాట, ప్రతి యాక్షన్ ఘట్టం, గుర్రపుస్వారీ ఇలా ప్రతిదీ ఆకర్షణీయమైన అంశమే. రాజ్‌కోటి సమకూర్చిన పాటలు ఎంతో ఆదరణ పొందాయి. హాలీవుడ్ చిత్రం 'ఇన్సెప్షన్'లో చేసినట్టుగా ఇందులో ప్రభుదేవా నృత్య దర్శకత్వంలో ఓ స్టెప్‌ని చిత్రీకరించాం. రామ్‌చరణ్ చిన్నప్పుడు ఈ సినిమా క్యాసెట్ పెడితే కానీ భోజనం చేసేవాడు కాదు. నేటి తరానికి కూడా మన కౌబాయ్ సినిమాని, అందులో సాంకేతికతని, పాత్రల్ని చూపిస్తూ ఎలా తీశారో తెలియజేసే ప్రయత్నమిది. ప్రేక్షకులు తప్పకుండా ఆస్వాదిస్తార"ని చెప్పారు చిరంజీవి. ఈ సినిమా తామందరికీ ఒక గొప్ప జ్ఞాపకమన్నారు దర్శకుడు. కథానాయకుడు చిరంజీవి ఒకవైపు 'జగదేకవీరుడు అతిలోక సుందరి' చేస్తూనే, మరోవైపు ఈ సినిమాలో నటించారని, అప్పట్లో ఐదు రాష్ట్రాల్లో ఈ సినిమా చిత్రీకరణ సాగిందని చెప్పారు నిర్మాత కైకాల నాగేశ్వరరావు. ఈ కార్యక్రమంలో రచయితలు పరుచూరి గోపాలకృష్ణ, సత్యానంద్, సంగీత దర్శకుడు కోటి, చినబాబు పాల్గొన్నారు.

గోట్ ప్రేమపాట


సుధీర్, దివ్యభారతి

సుడిగాలి సుధీర్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న చిత్రం 'జి.ఓ.ఎ.టి' (గోట్). దివ్యభారతి కథానాయిక. చంద్రశేఖర్ స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్నారు. త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుందీ చిత్రం. 'ఒడియమ్మ...' అంటూ సాగే ఇందులోని ప్రేమగీతాన్ని ప్రముఖ సంగీత దర్శకుడు జి.వి.ప్రకాశ్ కుమార్ విడుదల చేశారు. లియోన్ జేమ్స్ స్వరపరిచిన ఈ పాటని అనురాగ్ కులకర్ణి ఆలపించారు. సురేశ్ బనిశెట్టి సాహిత్యం సమకూర్చారు.

దర్శకుడు హద్దులు దాటాడు: ఈ సినిమా ప్రారంభంలో దర్శకుడిగా బాధ్యతలు చేపట్టి, మధ్యలో వైదొలిగిన నరేశ్ ఎక్స్‌లో చేసిన వ్యాఖ్యలపై కథానాయిక దివ్యభారతి అసంతృప్తి వ్యక్తం చేసింది. తనని ఉద్దేశించి చిలక అని వ్యాఖ్యలు చేయడాన్ని ఆమె అదే వేదికలో తీవ్రంగా ఖండించింది. తాను తమిళ సినిమాల్లో నటిస్తున్నప్పుడు ఎప్పుడూ ఇలాంటి సమస్యల్ని ఎదుర్కోలేదని, కానీ ఈ దర్శకుడు హద్దులు దాటి అగౌరవంగా వ్యాఖ్యలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేసింది.

పదేళ్ల తర్వాతైనా ఇలానే ప్రశ్నించుకుంటానేమో!


దీపిక పదుకొణె

"కొన్నిసార్లు నా గత చిత్రాల గురించి తలచుకున్నప్పుడు కొన్నింటి విషయంలో కాస్త బాధ కలిగేది. కథల ఎంపికలో నేను చేసిన తప్పులు ఇబ్బంది పెట్టేవి. కానీ ఇప్పుడు ఈ విషయంలో నా ఆలోచనలు చాలా స్పష్టంగా ఉన్నాయి" అంటోంది అగ్ర కథానాయిక దీపికా పదుకొణె. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె 'ఓం శాంతి ఓం' నుంచి 'కల్కి 2898 ఏడీ' వరకూ ఎన్నో బ్లాక్‌బస్టర్ చిత్రాలలో నటించినా.. కొన్ని సార్లు స్క్రిప్ట్ ఎంపికల్లో తప్పులు చేసినట్లు పేర్కొంది. "నేను ఎంపిక చేసుకున్న ప్రతి ప్రాజెక్ట్ విజయవంతం కాలేదు. కొన్ని విచారాన్ని కలిగించాయి. అలానే కొన్ని సార్లు డబ్బుకి మాత్రమే ప్రాధాన్యత అనుకుంటారు. కానీ అది ముఖ్యం కాదు. కొన్ని ప్రాజెక్ట్‌లు వాణిజ్యపరంగా హిట్ కాకపోవచ్చు.. అవి పెద్ద సినిమాలు కూడా కాకపోవచ్చు. కానీ నేను ఆ వ్యక్తులను, కథలోని సందేశాన్ని నమ్మి వాటిని అంగీకరిస్తాను. దానికి కట్టుబడి నిలబడతాను. గతంలో ఇంతలా ఆలోచించలేకపోయాను. కానీ ఇప్పుడు నాకు ఆ స్పష్టత వచ్చింది. ప్రతి విషయాన్ని లోతుగా పరిశీలిస్తున్నాను. కొన్నిసార్లు వెనక్కి తిరిగి చూసుకున్నప్పుడు 'అప్పుడు ఏం ఆలోచించాన'ని ఇప్పుడు అనిపిస్తుంది. బహుశా 10 సంవత్సరాల తర్వాత కూడా నేను ప్రస్తుతం ఎంపిక చేసుకున్న వాటి విషయంలోనూ ఇలానే ప్రశ్నించుకుంటానేమో. ఎందుకంటే ఇదంతా నేర్చుకోవడంలో భాగమే" అని చెప్పుకొచ్చింది. ప్రస్తుతం దీపిక ఖాతాలో రెండు చిత్రాలున్నాయి. సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'కింగ్' చిత్రంలో షారుక్ ఖాన్ సరసన, అల్లు అర్జున్ హీరోగా అట్లీ రూపొందిస్తున్న సినిమాలోనూ దీపిక నటిస్తోంది.

ప్రాక్టీస్ బిట్స్

అరిథ్‌మెటిక్

1. ఒక పనిని 20 మంది పురుషులు 16 రోజుల్లో చేస్తారు. అదే పనిని 20 మంది స్త్రీలు 18 రోజుల్లో చేస్తారు. అయితే ఈ పురుషులు, స్త్రీలు కలిసి పనిచేస్తే ఆ పని ఎన్ని రోజుల్లో పూర్తవుతుంది?
   1) $10\frac{1}{3}$ 2) $9\frac{8}{17}$
   3) $9\frac{1}{15}$ 4) $8\frac{8}{17}$
2. A ఒక పనిని 10 రోజుల్లో పూర్తి చేయగలడు. B అదే పనిని 15 రోజుల్లో, C 20 రోజుల్లోనూ పూర్తి చేయగలరు. వారు ఆ పనిని నాలుగో వంతు D తో కలిసి నాలుగు రోజుల్లో పూర్తి చేశారు. ఆ మొత్తం పనికి రూ.30,000 తీసుకున్నారు. అయితే D వాటా ఎంత?
   1) రూ.4,000 2) రూ.16,000
   3) రూ.7,500 4) రూ.1,000
3. A, B లు కలిసి ఒక పనిని 36 రోజుల్లో చేయగలరు. B, C లు కలిసి ఆ పనిని 45 రోజుల్లో చేయగలరు. C కంటే A రెట్టింపు పనిమంతుడు అయితే అప్పుడు వరుసగా A, B, C ల సామర్థ్యాల నిష్పత్తి?
   1) 3 : 2 : 6 2) 6 : 5 : 3
   3) 2 : 3 : 1 4) 1 : 3 : 2

సమాధానాలు
1-4, 2-1, 3-3.



దరఖాస్తు చేశారా?

- ఏవీఎన్ఎల్‌లో జూనియర్ టెక్నీషియన్ ఖాళీలు (133)
  చివరి తేదీ: 2025, నవంబరు 21
- ఎయిమ్స్ మంగళగిరిలో అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగాలు
  చివరి తేదీ: 2025, నవంబరు 22

జనరల్ స్టడీస్ సైన్స్ అండ్ టెక్నాలజీ


దేశ పురోగతిలో అద్భుత ఆవిష్కర్తలు!

దేశ ప్రగతి, స్వయంసమృద్ధిలో శాస్త్రవేత్తల పాత్ర అత్యంత కీలకం. స్వాతంత్ర్యానంతరం భారత్ శాస్త్ర, సాంకేతిక రంగాల్లో సాధించిన పురోగతికి వారే ప్రధాన కారకులు. వ్యవసాయం, రక్షణ, అంతరిక్షం, పరిశోధన, వైద్యం, పరిశ్రమలు మొదలైన రంగాల్లో అద్భుత ఆవిష్కరణలు చేసి, దేశాన్ని బలోపేతం చేశారు. ఆర్థికాభివృద్ధికి, ప్రజల జీవన ప్రమాణాలను పెంచేందుకు, పర్యావరణ పరిరక్షణకు దోహదపడ్డారు. విద్యారంగాన్ని మెరుగ్గా మార్చేందుకు, ప్రభుత్వ విధానాలను ప్రయోజనకరంగా రూపొందించేందుకు సాయపడ్డారు. గణితం, భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రం, వైద్యం, ఇంజినీరింగ్, జీవశాస్త్రం తదితర రంగాల్లో విశేష సేవలందించి, దేశ అభివృద్ధిలో భాగస్వాములైన ప్రసిద్ధ శాస్త్రవేత్తల గురించి పోటీ పరీక్షార్థులు తెలుసుకోవాలి. వారి ఆవిష్కరణలు, వాటితో కలిగిన ఆర్థిక, సామాజిక ప్రయోజనాలు; నెలకొల్పిన సంస్థలు, అందుకున్న అవార్డులు, బిరుదులపై అవగాహన కలిగి ఉండాలి.





సతీష్ ధావన్ (1920-2002)




ఈయన ఏరోస్పేస్ ఇంజినీర్‌గా పనిచేశారు. ఎక్స్‌పరిమెంటల్ ఫ్లూయిడ్ డైనమిక్స్‌పై పరిశోధన చేశారు. బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్సీ)కు డైరెక్టర్‌గా, ఇస్రో ఛైర్మన్‌గా వ్యవహరించారు. స్పేస్ కమిషన్ ఛైర్మన్‌గా ఉన్నారు. భారత దేశ మొదటి సూపర్‌సోనిక్ విండ్ టన్నెల్‌ను ఐఐఎస్సీలో ఏర్పాటు చేశారు. ఈయన సేవలకు గుర్తుగా భారతదేశ రాకెట్ లాంచింగ్ స్టేషన్ అయిన శ్రీహరికోట హైఆల్టిట్యూడ్ రేంజ్‌ను 'సతీష్ ధావన్ స్పేస్ సెంటర్'గా నామకరణం చేశారు.

సుబ్రహ్మణ్యం చంద్రశేఖర్ (1910-1995)



ఖగోళ భౌతిక శాస్త్రవేత్త. బ్లాక్‌హోల్స్‌పై పరిశోధన చేశారు. నక్షత్రాల పుట్టుక, వాటిలో జరిగే మార్పులకు సిద్ధాంతాలను ప్రతిపాదించారు. ఈయన సేవలకు 1983లో భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతి వచ్చింది. చంద్రశేఖర్ లిమిట్ అనే సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు.

విక్రమ్ సారాభాయ్ (1912-1971)




భారత అంతరిక్ష పితామహుడు. కాస్మిక్ కిరణాలపై పరిశోధన చేశారు. భారత అంతరిక్ష పరిశోధన కేంద్రం(ఇస్రో) ఏర్పాటుకు కృషి చేశారు. వాతావరణ పరిశోధన, విద్యకు ఉపయోగపడే అనేక రకాల ఉపగ్రహాల అభివృద్ధికి సేవలందించారు. తుంబా రాకెట్ లాంచింగ్ స్టేషన్, శ్రీహరికోట హైఆల్టిట్యూడ్ రేంజ్ ఏర్పాటుకు కృషి చేశారు. అటామిక్ ఎనర్జీ కమిషన్‌కు ఛైర్మన్‌గా వ్యవహరించారు.

హోమీ జహంగీర్ బాబా(1909-1966)



భారత అణుశాస్త్ర పితామహుడిగా ప్రసిద్ధి. ఈయన కనుక్కున్న ఎలక్ట్రాన్ - పాజిట్రాన్ స్కాటరింగ్‌ను 'బాబా స్కాటరింగ్' అంటారు. భారత అటామిక్ ఎనర్జీ కమిషన్‌కు మొదటి ఛైర్మన్‌గా చేశారు. టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రిసెర్చ్ ఏర్పాటుకు కృషి చేశారు. భారతదేశ మూడు దశల అణువిద్యుచ్ఛక్తికి పునాది వేశారు. దేశ అవసరాలకు అణువిద్యుచ్ఛక్తి అవసరమని భావించారు. అప్సర మొదలైన పరిశోధన రియాక్టర్ ఏర్పాటులో ఈయన కృషి ఉంది.


ప్రొఫెసర్ సి.ఆర్.రావు (1920-2023)



ప్రఖ్యాత గణిత, సాంఖ్యక శాస్త్రవేత్త. ఆధునిక సాంఖ్యకశాస్త్ర అభివృద్ధికి కృషి చేశారు. ఈయన పరిశోధనలు వివిధ రంగాల్లో, పరిశ్రమల్లో ఉపయోగపడ్డాయి. 40 ఏళ్ల పాటు ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్ (ఐఎస్ఐ)లో పని చేశారు. సి.ఆర్.రావు అడ్వాన్స్‌డ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మ్యాథమెటిక్స్, స్టాటిస్టిక్స్ అండ్ కంప్యూటర్ సైన్సెస్ (ఏఐఎంఎస్‌సీఎస్)ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేశారు.

ఎం.ఎస్.స్వామినాథన్ (1925-2023)





భారత హరితవిప్లవ పితామహుడు. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రిసెర్చ్ (ఐసీఏఆర్) డైరెక్టర్ జనరల్‌గా పనిచేశారు. అధిక దిగుబడినిచ్చే పొట్టి గోధుమ రకమైన షర్బతిసొనారాను అభివృద్ధి చేశారు. నేషనల్ బ్యూరో ఆఫ్ ప్లాంట్ జెనెటిక్ రిసోర్సెస్ (ఎన్‌బీపీజీఆర్) తదితర సంస్థల ఏర్పాటుకు సహకారాన్ని అందించారు.

డాక్టర్ ఎల్లాప్రగడ సుబ్బారావు (1895-1948)




ఆంధ్రప్రదేశ్‌లోని భీమవరంలో జన్మించారు. అమెరికాలో పరిశోధనలు చేశారు. ఈయనను 'అద్భుత ఔషధ సృష్టి మంత్రగాడు' అంటారు. ఈయన పరిశోధన 'టెట్రాసైక్లిన్' అనే యాంటీబయాటిక్ అభివృద్ధికి తోడ్పడింది. ఫోలిక్ ఆమ్లాన్ని తయారుచేశారు. కాలేయం నుంచి విటమిన్-బి12ను వేరుచేశారు. క్యాన్సర్ వ్యాధికి కీమోథెరపీలో ఉపయోగించే మెథోట్రిక్సేట్‌ను కనుక్కున్నారు. అందుకే ఈయనను 'ఫాదర్ ఆఫ్ కీమోథెరపీ' అంటారు.

శాంతిస్వరూప్ భట్నాగర్ (1894-1955)




ప్రముఖ రసాయన శాస్త్రవేత్త. కొల్లాయిడల్, మాగ్నెటో కెమిస్ట్రీలో ప్రసిద్ధుడు. అనేక సాంకేతిక పరిశోధనా సంస్థల ఏర్పాటు, అభివృద్ధికి కృషి చేయడంతో ఈయనను 'భారతదేశ పరిశోధనాశాలల పితామహుడు' అంటారు. కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రిసెర్చ్ స్థాపనకు కృషి చేసి దానికి మొదటి డైరెక్టర్‌గా వ్యవహరించారు. అటామిక్ ఎనర్జీ కమిషన్ సెక్రటరీగా, యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ ఛైర్మన్‌గా సేవలందించారు. పంజాబ్ యూనివర్సిటీలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ పెట్రోలియం రిసెర్చ్ స్థాపించారు. ఇండియన్ రేర్‌ఎర్త్ లిమిటెడ్ స్థాపనకు కృషిచేశారు. దేశ ఆర్థికాభివృద్ధికి సాంకేతికత అనువర్తనాలు అవసరమని భావించారు. ఈయన పేరు మీదగానే భారతదేశ నోబెల్‌గా పిలిచే భట్నాగర్ అవార్డులను దేశంలో శాస్త్ర సాంకేతిక రంగాల్లో కృషి చేసిన శాస్త్రవేత్తలకు ఇస్తున్నారు.

ఎ.పి.జె.అబ్దుల్ కలాం



భారత క్షిపణి పితామహుడు. క్షిపణుల తయారీకి ఉపయోగపడే ఇంటిగ్రేటెడ్ గైడెడ్ మిస్సైల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంకు డైరెక్టర్‌గా వ్యవహరించారు. 1985లో పోఖ్రాన్‌లో జరిగిన పోఖ్రాన్-2 అణుపరీక్షల్లో కీలక పాత్ర పోషించారు. నాటి ప్రధాన మంత్రికి ముఖ్య సాంకేతిక సలహాదారుగానూ ఉన్నారు. భారతదేశం అభివృద్ధి చెందిన దేశంగా ఉండాలని కోరుకున్నారు. ప్రముఖ హృద్రోగ నిపుణుడైన సోమరాజుతో కలిసి తక్కువ ధరకు, స్వదేశీ కరోనరి స్టంట్‌ను అభివృద్ధి చేశారు. 2002-2007 వరకు రాష్ట్రపతిగా పనిచేశారు.



రచయిత: డాక్టర్ బి.నరేశ్

సత్యేంద్రనాథ్ బోస్ (1894-1974)




ప్రముఖ భౌతిక శాస్త్రవేత్త. గణాంక భౌతిక శాస్త్రంలో ప్రసిద్ధుడు. క్వాంటం మెకానిక్స్‌కు సంబంధించి 'బోస్-ఐన్‌స్టీన్ స్టాటిస్టిక్స్'ను అభివృద్ధి చేశారు. ప్రఖ్యాత భౌతిక శాస్త్రవేత్తలైన ఐన్‌స్టీన్, బోస్‌ల పేరు మీదుగా పదార్థ ఐదో రూపానికి 'బోస్-ఐన్‌స్టీన్ కన్‌డెన్‌సేట్' అని పేరు పెట్టారు. (పదార్థానికి మిగతా నాలుగు రూపాలు: ఘన, ద్రవ, వాయువు, ప్లాస్మా) బోస్ పేరు మీదుగానే ఒక ఉపపరమాణు కణానికి 'బోసాన్' అని నామకరణం చేశారు. ఈయనను కేంద్ర ప్రభుత్వం పద్మవిభూషణ్‌తో సత్కరించింది.

కస్తూరి రంగన్ (1940-2025 ఏప్రిల్ 25)



ఖగోళ భౌతిక శాస్త్రవేత్త. అధిక శక్తిమంతమైన ఎక్స్ కిరణాలు, గామా కిరణాల ఆస్ట్రానమీపై పరిశోధన చేశారు. ఇస్రో ఛైర్మన్‌గా పనిచేశారు. భాస్కర-I, భాస్కర-II మొదలైన ఉపగ్రహాల ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా వ్యవహరించారు. జీఎస్ఎల్‌వీ అభివృద్ధికి కృషి చేశారు. ఈయన సలహాతో ఇస్రో ఐఎన్ఎస్ఏటీ, ఐఆర్ఎస్ ఉపగ్రహాలను అభివృద్ధి చేసింది. నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ-2020పై ఏర్పాటైన కమిటీకి ఛైర్మన్‌గా వ్యవహరించారు. ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్‌కు ఉపాధ్యక్షుడిగా వ్యవహరించారు.

డాక్టర్ సలీం అలీ (1896-1987)




ఈయనను 'బర్డ్ మ్యాన్ ఆఫ్ ఇండియా', 'భారత ఆర్నిథాలజీ పితామహుడు' అంటారు. అనేక రకాల పక్షుల ప్రవర్తన, ప్రత్యుత్పత్తులపై అధ్యయనం చేశారు. దేశంలో ఉన్న పక్షుల రకాలపై సర్వే నిర్వహించారు. కీయోలాడియో నేషనల్ పార్కు, భరత్‌పూర్ బర్డ్ శాంక్చ్యుయరీ ఏర్పాటుకు, వన్యప్రాణుల సంరక్షణకు కృషిచేశారు. ఈయన పేరు మీదుగా కోయంబత్తూర్‌లో 'సలీం అలీ సెంటర్ ఫర్ ఆర్నిథాలజీ అండ్ నేచురల్ హిస్టరీ' ఏర్పాటైంది.

చిన్న చిన్న మార్పులతో పెద్ద లక్ష్యాల సాధన! — స్టడీ స్కిల్స్



కోర్సులో చేరగానే పెద్ద లక్ష్యాన్ని నిర్దేశించుకుని విద్యా సంవత్సరం చివరిలోగా దానిని సాధించాలని అనుకుంటే సరిపోదు. గమ్యాన్ని చేరుకునే ప్రయత్నంలో మరికొన్ని చిన్న లక్ష్యాలూ పెట్టుకోవాలి. మంచి మార్కులు సంపాదించాలనే లక్ష్యాన్ని చేరుకోవాలంటే చక్కటి స్టడీ ప్రణాళికతో పాటు దాని అమలు కూడా కీలకమే. అలాగే పాఠాలు శ్రద్ధగా వినడం, అర్థం కాకపోతే సందేహాలను నివృత్తి చేసుకోవడం, రోజూ కాలేజీకి సమయానికి చేరుకోవడం, ఉదయాన్నే త్వరగా నిద్ర లేవడం లాంటివన్నీ పెద్ద లక్ష్య సాధనలో సాయపడతాయి. అలాంటి మార్పులు, వాటి ప్రయోజనాలు, అందుకు పాటించాల్సిన విధానాలను తెలుసుకోవాలంటే **క్యూఆర్ కోడ్** స్కాన్ చేయండి.



సంతోషానికి ముంబయి.. సందర్శనకు కొచ్చిన్!




ప్రపంచంలో తొలి నగదు రహిత దేశంగా స్వీడన్ అవతరించింది. బహు భార్యత్వ నిషేధ బిల్లుకు అస్సాం ఆమోదాన్ని తెలియజేసింది. భారత్ నెట్ పథకాన్ని పూర్తిగా అమలు చేసిన రాష్ట్రంగా పంజాబ్ నిలిచింది. హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ వ్యవస్థాపకులు శివ్ నాడార్ దాతృత్వంలో దేశంలోనే అగ్రగామిగా ఉన్నారు. భారత్ సహకారంతో భూటాన్‌లో జలవిద్యుత్తు ప్రాజెక్టు నిర్మాణానికి శంకుస్థాపన జరిగింది. మాల్దీవుల్లో ఒక అంతర్జాతీయ విమానాశ్రయాన్ని భారత్ నిర్మించి బహుమతిగా ఇచ్చింది. అమెరికాకు పోటీగా అత్యాధునిక సాంకేతిక సామర్థ్యంతో పనిచేసే నిఘా నౌకను చైనా రంగంలోకి దించింది. ఈ విధంగా రాష్ట్రీయ, జాతీయ, అంతర్జాతీయ వర్తమాన వ్యవహారాలను, ముఖ్యమైన వార్తలను పోటీ పరీక్షార్థులు నిరంతరం తెలుసుకోవాలి. రాష్ట్రపతి ఇటీవలి విదేశీ పర్యటన విశేషాలు, ప్రఖ్యాత నివేదికలు, సర్వేల సంగతులు, బుకర్‌ప్రైజ్ విజేతల వివరాలు, ప్రసిద్ధ రచయితల తాజా పుస్తకాలు, క్రీడా పోటీల విజేతలు, ప్రాధాన్యం ఉన్న పురస్కారాల గ్రహీతలనూ గుర్తుంచుకోవాలి.



కరెంట్ అఫైర్స్

మాదిరి ప్రశ్నలు

1. 2025 బుకర్‌ప్రైజ్‌కు సంబంధించి సరైంది?



   ఎ) 2025 బుకర్‌ప్రైజ్ విజేత డేవిడ్ సలాయ్.
   బి) డేవిడ్ సలాయ్ బుక్ - 'ది లోన్లీనెస్ ఆఫ్ సోనియా అండ్ సన్నీ'
   సి) డేవిడ్ సలాయ్ బ్రిటన్ - హంగేరీ రచయిత
   డి) బుకర్ ప్రైజ్ పొందిన మొదటి బ్రిటన్ - హంగేరీ రచయిత
   1) ఎ, బి, సి 2) ఎ, బి, సి, డి
   3) ఎ, సి, డి 4) ఎ, బి, డి

   నోట్: * డేవిడ్ సలాయ్ పుస్తకం 'ఫ్లెష్'.
   * 'ది లోన్లీనెస్ ఆఫ్ సోనియా అండ్ సన్నీ బుక్' రచయిత కిరణ్ దేశాయ్.
   * 2025 - ఇంటర్నేషనల్ బుకర్ ప్రైజ్ విజేతలు బాను ముష్తాక్ (కన్నడ రచయిత్రి), దీపాభాష్తి (అనువాదకురాలు) పుస్తకం - హార్ట్ ల్యాంప్.
2. ఫిక్షన్ రచనలకు 2022 నుంచి ఇస్తున్న ఉర్సులా గుయిన్ ప్రైజ్ ఫర్ ఫిక్షన్ అవార్డు 2025కు వజ్ర చంద్రశేఖరకు వచ్చింది. ఆయన ఏ దేశ రచయిత?
   1) ఇండియా 2) భూటాన్
   3) శ్రీలంక 4) బంగ్లాదేశ్
3. ఇటీవల ప్రధాని మోదీ ఏ దేశంలో 1020 మెగావాట్ల సామర్థ్యంతో చేపట్టిన పునత్సంగచ్చు-2 జల విద్యుత్తు ప్రాజెక్టు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు?
   1) నేపాల్ 2) భూటాన్
   3) బంగ్లాదేశ్ 4) మయన్మార్
4. ప్రసిద్ధ ట్రావెల్ వేదిక బుకింగ్.కామ్ ప్రకారం 2026 ఏడాదికి తప్పక సందర్శించాల్సిన టాప్-10 ట్రెండింగ్ డెస్టినేషన్లలో ఒకటిగా ఇండియా నుంచి నిలిచింది ఏది?
   1) ముంబయి 2) కొచ్చిన్
   3) విశాఖపట్నం 4) సిమ్లా
5. కింది వాటిలో సరైంది?
   ఎ) ద్రౌపది ముర్ము ఇటీవల ఆరు రోజుల పాటు అంగోలా బోట్స్‌వానా దేశ పర్యటనకు వెళ్లారు (నవంబరు 8-13).
   బి) బోట్స్‌వానా అధ్యక్షుడు డ్యుమా గిడియోన్ బోకో. అంగోలా అధ్యక్షుడు జోవో మాన్యుయెల్.
   సి) భారత రాష్ట్రపతి బోట్స్‌వానాలో పర్యటించడం ఇదే మొదటిసారి.
   డి) 2026తో బోట్స్‌వానా భారత్‌ల మధ్య దౌత్య సంబంధాలకు 60 సంవత్సరాలు పూర్తవుతాయి.
   ఇ) బోట్స్‌వానా నుంచి ఎనిమిది చీతాలు ఇండియాకు అప్పగించేందుకు ఒప్పందం జరిగింది.
   1) ఎ, బి, సి 2) బి, సి, డి
   3) ఎ, బి, సి, డి 4) ఎ, బి, సి, డి, ఇ

   నోట్: * అంగోలా 50వ స్వాతంత్ర్య వేడుకల్లో రాష్ట్రపతి పాల్గొన్నారు.
   * బోట్స్‌వానా రాజధాని గాబోరోన్, కరెన్సీ బోట్స్‌వానా పుల
   * అంగోలా రాజధాని లువాండా, కరెన్సీ అంగోలాన్ క్వాంజా
6. బహుభార్యత్వం నిషేధించే బిల్లుకు ఇటీవల ఏ రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది?
   1) కేరళ 2) అస్సాం
   3) కర్ణాటక 4) అరుణాచల్‌ప్రదేశ్
7. భారత్ సహాయంతో ఏ దేశంలో హనిమాధూ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని నిర్మించారు?
   1) మాల్దీవులు 2) భూటాన్
   3) నేపాల్ 4) బంగ్లాదేశ్

   నోట్: * 2025, నవంబరు 10న మాల్దీవుల అధ్యక్షుడు మయిజ్జు, భారత పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు దీన్ని ప్రారంభించారు.
   * 2007, జనవరి 1 తర్వాత జన్మించిన వారికి పొగాకు ఉత్పత్తులు కొనడం, ఉపయోగించడం నిషేధించిన దేశం మాల్దీవులు. 2025, నవంబరు 1న చట్టం అమల్లోకి వచ్చింది.
8. కింది వాటిలో సరైంది?
   ఎ) అంబుజ్‌నాథ్ బోస్ పురస్కారం 2025 డాక్టర్ నాగేశ్వర రెడ్డికి ప్రదానం చేశారు.
   బి) యూఏఈకి చెందిన షైఖానాజర్ అల్‌నోవైస్ యూఎన్‌టీ టూరిజం సెక్రటరీ జనరల్‌గా నియమితులయ్యారు. (2026, జనవరి నుంచి నాలుగేళ్లు ఉంటారు.)
   సి) డేటన్ పీస్ ప్రైజ్ - లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు 2025 సల్మాన్ రష్దీకి వచ్చింది.
   డి) ఎడెల్‌గివ్ హురున్ ఇండియా ఫిలాంత్రఫి - 2025 జాబితా ప్రకారం శివ్ నాడార్ దాతృత్వంలో మొదటి స్థానంలో ఉన్నారు.
   1) బి, సి, డి 2) ఎ, బి, సి
   3) ఎ, బి, సి, డి 4) ఎ, బి, డి



సల్మాన్ రష్దీ

9. రైళ్లలో మహిళా ప్రయాణికుల భద్రత కోసం 'ఆపరేషన్ రక్షిత' కార్యక్రమాన్ని ఏ రాష్ట్రం ప్రారంభించింది?
   1) మహారాష్ట్ర 2) గుజరాత్
   3) మధ్యప్రదేశ్ 4) కేరళ
10. ఇటీవల 'ఫంగ్-వాంగ్' తుపాను ఏ దేశంలో వచ్చింది?
   1) మయన్మార్ 2) బంగ్లాదేశ్
   3) ఫిలిప్పీన్స్ 4) ఖతార్
11. హురాన్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ప్రకారం ప్రపంచంలో ఎక్కువమంది బిలియనీర్లు ఉన్న నగరాలు-2025లో ముంబయి ఏ స్థానంలో ఉంది?
   1) 3వ 2) 6వ 3) 8వ 4) 4వ

   నోట్: * 119 బిలియనీర్లతో న్యూయార్క్ మొదటి స్థానం.
   * 97 బిలియనీర్లతో లండన్ రెండో స్థానం.
   * 92 బిలియనీర్లతో ముంబయి మూడో స్థానం.
   * 91 బిలియనీర్లతో బీజింగ్ నాలుగో స్థానం.
12. ప్రపంచంలోనే మొదటి నగదు రహిత దేశంగా అవతరించిన దేశం?
   1) ఐస్‌లాండ్ 2) నార్వే
   3) స్వీడన్ 4) డెన్మార్క్

   నోట్: * డెన్మార్క్ ప్రభుత్వం 15 ఏళ్ల కంటే తక్కువ వయసున్న వారు సోషల్ మీడియా వాడకుండా నిషేధం విధించింది.
13. వందేమాతరం గేయాన్ని రచించి ఎప్పటికి 150 ఏళ్లు పూర్తయింది?
   1) నవంబరు 8, 2025
   2) నవంబరు 6, 2025
   3) నవంబరు 7, 2025
   4) నవంబరు 9, 2025



   నోట్: * భారత హాకీ సమాఖ్య నవంబరు 7, 2025కి 100 ఏళ్లు పూర్తి చేసుకుంది.
14. ఇటీవల చైనా నావికాదళంలో చేరిన 'ఫుజియాన్' అనేది?
   1) సబ్‌మెరైన్ 2) నిఘా నౌక
   3) విమాన వాహక నౌక 4) రవాణా నౌక
15. జాతీయ విద్యాదినోత్సవం ఏ రోజున నిర్వహిస్తారు?
   1) నవంబరు 15 2) నవంబరు 10
   3) నవంబరు 11 4) నవంబరు 12
16. స్టార్‌లింక్‌తో భాగస్వామ్యం కుదుర్చుకున్న తొలి భారతీయ రాష్ట్రం?
   1) కేరళ 2) గుజరాత్
   3) ఆంధ్రప్రదేశ్ 4) మహారాష్ట్ర
17. ప్రపంచ ఆక్వాకల్చర్ సదస్సు - 2025లో ఎక్కడ జరిగింది?



   1) కొచ్చిన్ 2) హైదరాబాద్
   3) విశాఖపట్నం 4) కాకినాడ
18. 'ఇక్షాక్'కు సంబంధించి సరైంది?
   ఎ) ఇక్షాక్ నౌకను కోల్‌కతాలోని గార్డెన్ రిచ్ షిప్ బిల్డర్స్ అండ్ ఇంజినీర్ లిమిటెడ్ నిర్మించింది.
   బి) 2025, నవంబరు 6 కొచ్చిన్ నౌకా స్థావరంలో 'ఇక్షాక్' నౌకను ప్రారంభించారు.
   సి) 'ఇక్షాక్' హైడ్రోగ్రాఫిక్ సర్వే నౌక.
   1) ఎ, బి 2) బి, సి 3) ఎ, సి 4) ఎ, బి, సి
19. 'ఎ సిక్స్ ఆఫ్ హ్యూమానిటీ - ఇండిపెండెంట్ ఇండియాస్ డెవలప్‌మెంట్ ఒడిస్సీ' పుస్తక రచయిత?
   1) దివేష్ కపూర్ 2) అరవింద్ సుబ్రహ్మణియన్
   3) గౌరీశంకర్ 4) 1, 2
20. ఆసియాలో అత్యంత సంతోషకరమైన నగరాలు - 2025లో మొదటి స్థానంలో ఏది నిలిచింది?
   1) ముంబయి 2) బీజింగ్
   3) సింగపూర్ 4) ఢాకా
21. కాప్-30 సమావేశం నవంబరు 10 నుంచి 21 వరకు (2025) ఎక్కడ జరిగింది?
   1) ప్యారిస్ (ఫ్రాన్స్) 2) బెలెం (బ్రెజిల్)
   3) ముంబయి (ఇండియా) 4) లండన్ (ఇంగ్లండ్)
22. మహిళల ప్రపంచ స్నూకర్ టైటిల్ -2025ను నెగ్గిన మహిళను గుర్తించండి.
   1) అనుపమా రామచంద్రన్ 2) ఆన్‌యా
   3) బైయులాలు 4) రెయాన్ ఎవాన్స్
23. బిమ్‌స్టెక్ - ఇండియా మారిటైమ్ రిసెర్చ్ నెట్‌వర్క్ మొదటి ద్వైవార్షిక సమావేశం ఇటీవల ఎక్కడ జరిగింది?
   1) కొచ్చిన్ 2) కోల్‌కతా
   3) కాకినాడ 4) ముంబయి
24. ఏ దేశాల మధ్య జరిగే 11వ 'మిత్రశక్తి' సైనిక విన్యాసాలు ఇటీవల కర్ణాటకలోని బెళగావిలో ప్రారంభమయ్యాయి (నవంబరు 10 నుంచి 23 వరకు జరుగుతాయి)?



   1) ఇండియా - మాల్దీవులు 2) ఇండియా - శ్రీలంక
   3) ఇండియా - థాయ్‌లాండ్
   4) ఇండియా - సింగపూర్
25. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఇటీవల ఎవరు ఛైర్‌పర్సన్‌గా సంయుక్త పార్లమెంటు కమిటీని నియమించారు?
   1) అమిత్ షా 2) ఉదయ్ శ్రీనివాస్
   3) రాజ్‌నాథ్ సింగ్ 4) అపరాజిత సారంగి

   నోట్: * భారత రాజ్యాంగ 130వ సవరణ బిల్లు 2025, జమ్మూ-కశ్మీర్ పునర్వ్యవస్థీకరణ సవరణ బిల్లు 2025, కేంద్ర పాలిత ప్రాంతాల పరిపాలన సవరణ బిల్లు 2025 పరిశీలనకు..
26. భారత్ నెట్ పథకం పూర్తిగా అమలు చేసిన తొలి రాష్ట్రం?
   1) మహారాష్ట్ర 2) రాజస్థాన్
   3) పంజాబ్ 4) మధ్యప్రదేశ్

   నోట్: * దేశంలో అన్ని గ్రామ పంచాయతీలకు బ్రాడ్‌బ్యాండ్ కనెక్టివిటీ కల్పించడం కోసం 2011లో భారత్ నెట్ పథకం ప్రారంభమైంది.
27. ఇటీవల మరణించిన డిక్ చెనీ ఏ దేశ ఉపాధ్యక్షుడు?
   1) కెనడా 2) అమెరికా 3) చైనా 4) రష్యా
28. ఇటీవల ట్రంప్‌తో భేటీ అయిన సిరియా అధ్యక్షుడు ఎవరు?
   1) హాఫీజ్ అల్-అసద్
   2) అహ్మద్ అల్ షరా
   3) బషర్-అల్-అసద్
   4) అబ్దుల్ హాలీమ్ ఖద్దం



రచయిత: బి.ధన్ మోహన్ రెడ్డి

సమాధానాలు

1-3, 2-3, 3-2, 4-2, 5-4, 6-2, 7-1, 8-3, 9-4, 10-3, 11-1, 12-3, 13-3, 14-2, 15-3, 16-4, 17-2, 18-4, 19-4, 20-1, 21-2; 22-1; 23-1; 24-2; 25-4; 26-3; 27-2; 28-2.

భారత ఆర్థిక సమస్యలు - వలస

రకాలు

ఒకే పట్టణంలో ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి నివాసం మారిస్తే అది వలస కాదు. ఇవి ప్రధానంగా గ్రామం నుంచి గ్రామానికి, గ్రామం నుంచి పట్టణానికి, పట్టణం నుంచి పట్టణానికి, పట్టణం నుంచి గ్రామానికి ఇలా వివిధ రూపాల్లో జరుగుతాయి. అందులోని ముఖ్య విషయాలను పరిశీలిస్తే..

ట్రాన్స్ లోకేటరీ (Trans Locatory) వలస: గ్రామాల నుంచి పట్టణాలకు శాశ్వతంగా వలస వెళ్తే దాన్ని ట్రాన్స్ లోకేటరీ వలస అంటారు.

చక్రీయ వలస (Circulatory Migration): ఒక ప్రాంతంలో స్థిర నివాసాన్ని ఏర్పాటు చేసుకుని.. ఉపాధి కోసం కొన్ని రోజులు బయటి ప్రదేశాలకు వెళ్లడాన్ని చక్రీయ వలస అంటారు.

ఉదా: బిహార్, ఒడిశా నుంచి నిర్మాణ కార్మికులు హైదరాబాద్, బెంగళూరు లాంటి నగరాలకు వలస రావడం.

సోపాన/ దశలవారీ వలస (Step Migration): గ్రామీణ ప్రాంతాల నుంచి చిన్న పట్టణాలకు తర్వాత పెద్ద నగరాలకు దశలవారీగా మెరుగైన అవకాశాల కోసం తరలివెళ్లే ప్రక్రియ. ఇందులో వలస శ్రేణీకరణ పద్ధతి (Graded Steps)లో జరుగుతుంది. నేరుగా పెద్ద నగరాలకు ఒకేసారి వలస వెళ్లడం ఉండదు.

ఉదా: ఒక వ్యక్తి చదువు కోసం దగ్గర్లో ఉండే టౌన్‌కి వెళ్లి.. ఉద్యోగం/ ఉపాధి నిమిత్తం చిన్న పట్టణాలను ఎంచుకుని.. మరిన్ని అవకాశాలను అందిపుచ్చుకునేందుకు పెద్ద నగరాలకు వలస వెళ్లడం.

అంతర్గత వలస/ జాతీయ వలస: ఒక రాష్ట్రం నుంచి మరొక రాష్ట్రానికి వలస వెళ్లడాన్ని అంతర్గత వలస లేదా జాతీయ వలస అంటారు.

ఎమిగ్రేషన్ (Emmigration): ఒక దేశం నుంచి మరో దేశానికి వలస వెళ్లడం.

ఇమిగ్రేషన్ (Immigration): మరొక దేశం నుంచి ఒక దేశానికి వలస వెళ్లడం.

గణనలో వాడే పదాలు

వలస జనాభాను లెక్కించేటప్పుడు కింది పదాలు వాడతారు.

స్థూల వలస (Gross Migration): ఏడాది కాలంలో నిర్ణీత ప్రాంతానికి వలస వచ్చినవారిని, అక్కడి నుంచి మరొక ప్రదేశానికి వలస వెళ్లిన వారిని కలిపితే వచ్చే మొత్తాన్ని స్థూల వలస అంటారు.

నికర వలస (Net Migration): సంవత్సరంలో ఒక నిర్ణీత స్థలానికి వలస వచ్చిన వారి నుంచి మరో ప్రాంతానికి వలస వెళ్లిన వారిని తీసివేస్తే మిగిలిన మొత్తం నికర వలస అవుతుంది.

కారణాలు - సిద్ధాంతాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ కారణాల వల్ల వలస జరుగుతుంది.

ఉదా: వివాహం, ఉద్యోగం, విద్య, అభద్రత మొదలైనవి.

✦ అనేక మంది ప్రముఖులు వలసలకు గల కారణాలను విశ్లేషించి, సిద్ధాంతాలను ప్రతిపాదించారు. 1885, 1889 సంవత్సరాల్లో ఈజీ రావెన్‌స్టెయిన్ ప్రచురించిన వ్యాసాలు వలస సిద్ధాంతాలకు పునాదిగా నిలిచాయి. తర్వాత లెనిన్, రెవిస్, ఎవరెట్ లీ, థామల్సన్, హారిస్ టొడారో మొదలైనవారు వలస సిద్ధాంతాలు ప్రతిపాదించారు.

✦ భారతదేశంలో వలస ప్రక్రియను డొనాల్డ్ బోగ్ విశేషంగా అధ్యయనం చేశారు.

రావెన్‌స్టెయిన్:


ఈయన 1885లో 'Laws of Migration' అనే వ్యాసం రాశారు.

◆ ప్రయాణించే దూరానికి, వలసకు విలోమ సంబంధం ఉంటుందని.. గ్రామీణుల్లో వలసలు ఎక్కువని, పట్టణ ప్రజల్లో ఇవి తక్కువని పేర్కొన్నారు. తక్కువ దూరం ప్రయాణించే వలసల్లో స్త్రీలు ఎక్కువగా ఉంటారని రావెన్ వెల్లడించారు.

> "ఒకే ప్రాంతంలోకి వలసలు ఎక్కువైతే అక్కడ జనాభా నాణ్యత తగ్గుతుంది." - ఎవరెట్ లీ

> "అధిక ఆదాయం పొందాలనే ఉద్దేశంతో ప్రజలు వలస నిర్ణయాన్ని తీసుకుంటారు." - హారిస్ టొడారో

వ్యక్తులు ఒంటరిగా లేదా కుటుంబంతో సహా ఒక ప్రాంతం నుంచి మరొక ప్రదేశానికి వెళ్లడాన్ని వలస అంటారు. దీన్నే స్థానచలనంగా పేర్కొంటారు. రాష్ట్రాలు, దేశాలతోపాటు ప్రపంచవ్యాప్తంగా ఇవి కొనసాగుతున్నాయి. వీటిని ఆధునిక జనాభా సామాజిక పరివర్తన రూపంగా భావిస్తారు. ఉన్నత చదువులు, ఉద్యోగం, ఉపాధి, మెరుగైన జీవితం మొదలైన అవకాశాలను వెతుక్కుంటూ ప్రజలు తాత్కాలిక లేదా శాశ్వత ప్రాతిపదికన కొత్త ప్రాంతాల్లో నివాసాన్ని ఏర్పాటు చేసుకుంటారు. సమాజ స్థితిగతులను వలసలు ప్రభావితం చేయగలవు. వలసల రకాలు, అందుకు గల కారణాలు - సిద్ధాంతాలు మొదలైనవాటిపై పోటీపరీక్షార్థికి అవగాహన ఉండాలి.



ఉన్న చోటును వదిలేస్తూ.. ఉపాధి కోసం అడుగేస్తూ!

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
ఇండియన్ ఎకానమీ

◆ ప్రజల్లో తమ జీవన పరిస్థితులను మెరుగుపరుచుకోవాలనే కోరిక, సాంకేతిక ప్రగతి లాంటి కారణాల వల్ల వలస రేటు పెరుగుతుందని ఈయన వివరించారు.

డొనాల్డ్ బోగ్:

ఈయన గ్రామీణ - నగర వలసను పుష్ (push), పుల్ (pull) కారకాల ఆధారంగా విశ్లేషించారు. పుష్ అంటే ప్రోత్సాహక కారకం, పుల్‌ను ఆకర్షక కారకంగా తీసుకున్నారు.

▮ బోగ్ అభిప్రాయంలో గ్రామాల్లో పుష్ కారకాలు, నగరాల్లో పుల్ కారకాలు ఉంటాయి.

▮ పట్టణాలకు ప్రజలను ఆకర్షించేవి (లాక్కునే అంశాలు) - పుల్ కారకాలు. గ్రామాల నుంచి పట్టణాలకు వలసను ప్రోత్సహించేవి (నెట్టివేసే) పుష్ కారకాలు.

పుష్ కారకాలు: గ్రామాల్లో కింది అంశాలు పట్టణానికి వలస వెళ్లేవిధంగా పుష్ కారకాలుగా పని చేస్తాయని బోగ్ పేర్కొన్నారు.

- ప్రకృతి విపత్తులు - వరదలు, కరవులు, భూకంపాలు, సునామీ.
- కుటీర పరిశ్రమలు, చేనేత పరిశ్రమలు మూతపడటం.
- అధిక జనాభా.
- వ్యవసాయ యాంత్రికీకరణ, వ్యవసాయ కార్మికుల నిరుద్యోగిత.
- వృత్తిశిక్షణ, ఉన్నత విద్య అవకాశాలు లేకపోవటం.
- సరైన వైద్య, ఆరోగ్య సదుపాయాలు లేకపోవటం.
- అగ్రకులాల ఆధిపత్యం, ఆర్థిక, సాంఘిక అసమానతలు.
- కులం, మతం, రాజకీయ, ప్రాంతీయ ఘర్షణలు.

పుల్ కారకాలు: నగరాల్లో ఉండే కింది పరిస్థితులు గ్రామాల నుంచి వలసలను ప్రోత్సహిస్తాయని బోగ్ పేర్కొన్నారు.

- పరిశ్రమలు, వర్తక వాణిజ్యాలు, సేవారంగాల్లో ఉపాధి అవకాశాలు ఎక్కువగా లభించడం.
- సామాజిక, ఆర్థిక గమన శీలతకు అవకాశాలు ఎక్కువగా ఉండటం.
- ఉన్నత విద్య, వృత్తిపరమైన శిక్షణకు అవకాశాలు మెండుగా ఉండటం.
- వైద్య, ఆరోగ్య సేవలు ఎక్కువగా లభించడం.
- క్రీడ, వినోదం, విరామాలకు అవకాశాలు అందుబాటులో ఉండటం.
- నగరాల్లో భూమి, గృహాలు మొదలైన ఆస్తుల్లో పెట్టుబడులు లాభసాటిగా ఉండటం.
- నగరాల్లో జీవితం ఆకర్షణీయంగా ఉండటం.
- కులమత సహనం, వివిధ భాషలు, కులాలు, మతాల మధ్య విలీనానికి అవకాశాలు ఎక్కువగా ఉండటం.

బోగ్ విశ్లేషణపై అభ్యంతరాలు:

గ్రామాల నుంచి పట్టణాలకు మాత్రమే వలస జరగదు. గ్రామాల నుంచి గ్రామాలకూ వలస ఉంటుంది.

● నగరాల్లో కూడా పుష్ కారకాలుంటాయి.

ఉదా: మురికివాడలు, వాతావరణ కాలుష్యం, పెరుగుతున్న నేరాలు, హింసా ప్రవృత్తి, అధిక ధరలు మొదలైనవి.

● నగరాల్లో బోగ్ చెప్పిన పుల్ కారకాల్లో కొన్ని వాస్తవం కాదు.

ఉదా: పట్టణాల్లో కూడా నిరుద్యోగిత, పేదరికం ఉన్నాయి. గ్రామాల నుంచి వలస వచ్చిన వారందరికీ ఉపాధి అవకాశాలు దక్కవు.

● అందువల్ల గ్రామీణ నిరుద్యోగిత, పేదరికాన్ని అధిగమించేందుకు పట్టణాలకు వలస వెళ్లడం సరైన పరిష్కారం కాదు.

● వలసలు పెరిగి పట్టణీకరణ ఎక్కువగా జరిగితే పారిశుద్ధ్యం, రవాణా, తాగునీరు, విద్యుత్తు, ఆరోగ్యం, విద్య సౌకర్యాల కోసం ఒత్తిడి అధికమవుతుంది.



రచయిత
బండారి ధనుంజయ
విషయ నిపుణులు

Word of the Day 836

Notoriety

Telugu meaning: అప్రతిష్ఠ, అపకీర్తి

English meaning: Notoriety (నోటొరైటీ) means the state of being famous or well-known for something bad or negative.

Synonyms: Infamy, Disrepute; **Antonyms:** Honor, Respect

Usage: 1. The criminal gained sudden notoriety after the sensational case was broadcast nationwide.

2. Her controversial opinions brought her notoriety rather than the admiration she had expected.

Current Affairs



President Droupadi Murmu presented the 6th National Water Awards, 2024 along with the Jal Sanchay Jan Bhagidari Awards at Vigyan Bhawan in New Delhi on 18 November 2025. A total of 46 winners across 10 categories, including joint awardees, were honoured for their contributions to water conservation and management.

The Ministry of Statistics & Programme Implementation (MoSPI) unveiled the new National Industrial Classification (NIC) 2025 on 18 November 2025 at the culmination ceremony of the 75th anniversary of the National Sample Survey Office (NSS) and World Statistics Day in Udaipur.

✦ The classification system, first introduced in 1962 and subsequently updated in 1970, 1987, 1990, 1998, 2004 and 2008, has now been overhauled to reflect the changing economic landscape of India.



The International Hockey Federation (FIH) has awarded India's Raghu Prasad the title of FIH Male Umpire of the Year 2025 for his "professionalism, dedication, and excellence" in officiating matches.

✦ The Female Umpire of the Year Award was given to Argentina's Irene Presenqui.

London-based QS Quacquarelli Symonds on 18 November 2025 released its QS World University Rankings for Sustainability 2026. A total of 103 Indian universities featured in the rankings. Also, India had the fourth-highest number of institutions in the list, behind the United States (240), China (163), and the United Kingdom (109).

A Memorandum of Understanding between Gati Shakti Vishwavidyalaya (GSV) and Defence Research and Development Organisation (DRDO) was signed in New Delhi. GSV and DRDO joined hands to develop smart technological solutions for national security.

For more Current Affairs: Scan QR code

అంతర్జాతీయ బాలల హక్కుల దినోత్సవం

నవంబరు 20
చరిత్రలో ఈనాడు

చిన్నారులు సమాజానికి, దేశానికి విలువైన సంపద. భావి పౌరులైన వీరి భద్రత, సంరక్షణ, అభివృద్ధికి అన్ని దేశాలూ ప్రాధాన్యం ఇవ్వాలి. బాల్యం ఆనందంగా సాగేలా చర్యలు తీసుకోవడంతోపాటు వారిలో నేర్చుకోవాలి, ఎదగాలనే తపన కలిగించే వాతావరణాన్ని కల్పించాలి. ప్రభుత్వాలతో సహా ప్రతి ఒక్కరూ బాలల సంక్షేమానికి పెద్దపీట వేయాలనే లక్ష్యంతో ఏటా నవంబరు 20న 'అంతర్జాతీయ బాలల హక్కుల దినోత్సవం'గా (International Day Of Child Rights) నిర్వహిస్తారు. ప్రపంచవ్యాప్తంగా పిల్లలు ఎదుర్కొంటోన్న సమస్యల పరిష్కారానికి కృషి చేయడం, వారికి ఉన్న హక్కుల గురించి సమాజానికి తెలియజేయడం ఈ రోజు ముఖ్య ఉద్దేశం.

యునిసెఫ్ గణాంకాలు

ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది పిల్లలు నేటికీ విద్య, ఆరోగ్యం, ఆనందమయ జీవితాన్ని పొందడంలో తమ హక్కులను కోల్పోతున్నట్లు యునైటెడ్ నేషన్స్ చిల్డ్రన్స్ ఫండ్ (యునిసెఫ్) వెల్లడించింది. ముఖ్యంగా బాలికలు తమ హక్కులను పొందలేకపోతున్నారని పేర్కొంది. పిల్లలపై జరుగుతున్న అకృత్యాల గురించి 2024, నవంబరులో ఇది గణాంకాలను విడుదల చేసింది.

❖ ప్రపంచవ్యాప్తంగా ఏదో ఒక ప్రదేశంలో ప్రతి 4 నిమిషాలకు హింసాత్మక చర్య కారణంగా ఒక చిన్నారి మరణిస్తోంది.

మన దేశంలో బాలల సంక్షేమ చట్టాలు

మన రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 14, 15(3), 21, 21A, 23, 24, 25-28, 39E, 39F, 40 మొదలైనవన్నీ బాలల రక్షణకు సంబంధించిన మార్గదర్శకాలను తెలుపుతున్నాయి.

చారిత్రక నేపథ్యం

ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ 1954, డిసెంబరు 14న చిన్నారుల సంక్షేమం, హక్కులను ప్రోత్సహించేందుకు ఒక తేదీని ఏర్పాటు చేయాలని భావించింది. పిల్లలకు రక్షణ, విద్య, ఆరోగ్య సంరక్షణ హక్కులు ఉన్నాయని పేర్కొంటూ యూఎన్‌ఓ 1959, నవంబరు 20న బాలల హక్కుల ప్రకటనను ఆమోదించింది. దీనికి కొనసాగింపుగా 1989 నవంబరు 20న బాలల హక్కుల ఒడంబడిక (చిల్డ్రన్ రైట్స్ కన్వెన్షన్ - సీఆర్‌సీ)ను ఐరాస ఆమోదించింది.



● బాలల హక్కుల ప్రకటన, సీఆర్‌సీ ఆమోదం పొందిన నవంబరు 20న 'అంతర్జాతీయ బాలల హక్కుల దినోత్సవం'గా జరుపుకోవాలని ఐరాస తీర్మానించింది. 1990 నుంచి ఏటా దీన్ని నిర్వహిస్తున్నారు.

మన దేశంలో బాలల సంక్షేమ చట్టాలు, గత పరీక్షల్లో అడిగిన ప్రశ్నల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

జనరల్ స్టడీస్ - భౌతికశాస్త్రం


ఉష్ణం - ఉష్ణోగ్రత

శక్తి స్వరూపం

ఉష్ణం శక్తి స్వరూపం. ఇది పదార్థం లేదా వస్తువు చల్లగా లేదా వేడిగా ఉండటాన్ని తెలియజేస్తుంది. ఉష్ణశక్తి నిరంతరం అధిక ఉష్ణోగ్రత నుంచి అల్ప ఉష్ణోగ్రత వైపు ప్రసరిస్తుంది. పదార్థం లేదా వ్యవస్థలోని పరమాణువులు, అణువులు, ఇతర సూక్ష్మ కణాల యాదృచ్ఛిక (Random) చలనం వల్ల కలిగే గతిజ, స్థితిజ శక్తుల మొత్తమే దాని ఉష్ణశక్తి.

ఉష్ణోగ్రత

వస్తువు చల్లదనం లేదా వెచ్చదన తీవ్రతను నిర్ణయించే ఒక సాపేక్ష ఉష్ణీయ స్థితిని ఉష్ణోగ్రత (Temperature) అంటారు. దీన్ని థర్మామీటర్ లేదా ఉష్ణోగ్రతా మాపకంతో కొలుస్తారు. ఉష్ణోగ్రతను కొలిచే శాస్త్రాన్ని థర్మోమెట్రి (Thermometry) అంటారు. ఉష్ణోగ్రతకు SI ప్రమాణం కెల్విన్ (K), వాడుకలో ఉన్న ఇతర ప్రమాణాలు సెల్సియస్, ఫారెన్‌హీట్.



కెలోరిఫిక్ విలువ, సెల్సియస్ - ఫారెన్‌హీట్ ఉష్ణోగ్రతామానాల మధ్య సంబంధం, ఉష్ణ ప్రసారం/ ఉష్ణ బదిలీ, ఉష్ణ ప్రభావం మొదలైన అంశాలతో సహా పూర్తి సమాచారం ఈనాడు ఈప్రతిభ వెబ్‌సైట్‌లో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో ఈ-బుక్ రూపంలో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Latest Updates

Professor Jobs

Government Medical College (GMC), Rajanna Sircilla District, is inviting applications for the positions of Professor, Associate Professor, Assistant Professor, and Senior Resident in various departments on a contractual basis. The total no. of posts is 77. Eligible candidates can apply online before 22 November 2025.

Apprentice Posts

The General Insurance Corporation of India, India's national reinsurer, located in Mumbai, is inviting applications for the recruitment of Actuarial Apprentices (Life and Non-Life Business) posts. The total no. of posts is 20. The last date for online applications is 7 December 2025.

Project Scientist Posts

Newspace India Limited (NSIL), Bengaluru, is inviting applications for the recruitment of Project Assistant posts in Hyderabad, Bangalore, Pune, and Ahmedabad on a contractual basis. The total no. of posts is 47. The last date for online applications is 30 November 2025.

Did You Apply..?

Today (November 20) is the last date for the following Jobs

- RRB NTPC - 5,810 Graduate Posts. ***Qualification:*** Degree.
- 87 Engineer posts in Projects and Development India Limited. ***Qualification:*** Degree.
- 16 Sports Quota Posts in RRC South Western Railway. ***Eligibility:*** Tenth, Intermediate, ITI, B.Sc.

For more information and other notifications - scan QR code

Bank Exams
Reasoning

Multi-Tier Sequential Series

Directions (Qs. 1 - 23): *In the following questions, compare the sequences in each tier and find out the elements which will replace the question marks (?) out of the answer choices given.*

1. a b c _ a _ d _ a d _ _ ? ? ? ?
2 _ 4 5 2 3 5 5 _ _ 5 5 _ _ _ 5
A) abcd B) cddd C) dddd
D) ddcd E) None of these

2. o n _ _ p _ n m n p p n
_ _ A B A D _ _ ? ? ? ?
_ _ 1 2 _ 4 3 _ 3 _ _ _
A) CAAC B) ABDC C) BACD
D) CBCB E) None of these

3. _ _ 3 _ 1 _ _ 4 _ _ 2 _ _ _ 3 _ _ _ _ _ 4 _ _ _ 3
_ _ c _ a _ _ _ a _ b _ _ _ _ _ d a _ _ _ ? ? ? ?
A) adbc B) addc C) addd
D) abdb E) None of these

4. w x _ _ _ _ z y _ _ x w _ _ _ ? ? ? ?
0 _ 2 _ 0 _ 2 _ _ 1 0 _ 2 _ _ 2 _ _ _
A) wxwx B) xzwz C) wxyz
D) yzyy E) None of these

5. e _ _ _ f e _ g _ _ g h _ _ h g
2 _ 6 84 _ _ 6 _ 4 _ _ ? ? ? ?
A) 4222 B) 4288 C) 4286
D) 4226 E) None of these

6. p _ _ s _ _ s _ _ q r s ? ? ? ?
_ 6 _ 8 5 6 _ 7 5 6 7 _ _ 6 8 _
A) p q s r B) p q r s C) p q q s
D) p r r s E) None of these

7. 1 _ 3 _ 2 _ 4 5 3 _ _ 6 ? ? ? ?
m _ _ p n _ p q o _ q r p q _ s
A) 1234 B) 2345 C) 3456
D) 4567 E) None of these

8. _ b _ c _ a a _ c _ b a _ b c c _ _
8 9 _ _ 9 8 _ _ 0 0 _ _ 8 _ _ ? ? ? ?
A) 8908 B) 0098 C) 8898
D) 8889 E) 9989

9. m _ _ p _ _ _ n _ _ p m _ n o _ _
2 _ 6 _ 8 _ 4 _ 6 8 _ 4 ? ? ? ?
A) 2468 B) 4682 C) 2242
D) 2682 E) None of these

10. pq _ r _ q _ _ p _ _ r ? ? ? ?
3 _ 9 _ _ 6 _ 9 3 _ 6 9 9 3 _ 6
A) p q r p B) p q q r C) p r r q
D) r p q q E) p p q q

11. A _ B A _ _ B _ A B _ A ? ? ? ?
_ 2 2 1 1 _ _ 1 _ _ 2 1 _ 2 2 _
A) A A B B B) A B B A C) A B B B
D) B B B B E) None of these

12. _ B D C _ P _ D P _ D C ? ? ? ?
0 9 _ 2 9 0 _ 8 _ 9 _ _ 9 _ _ 8
A) B P C D B) B C C D
C) B P P D D) B C P D
E) B B P C

13. a _ _ o u _ e _ _ u a _ i _ u a e _
_ 4 _ 2 1 5 _ 3 2 _ 5 _ 3 2 ? ? ? ?
A) 1544 B) 1543 C) 1533
D) 1555 E) None of these

14. a _ _ d e _ b _ _ e _ b e e _ a ? ? ? ?
_ 6 8 2 _ 4 6 8 _ 0 _ _ _ 0 _ 4 _ _ 0 0
A) b c d e B) b c e e C) b e c e
D) e e e e E) None of these

15. N _ _ N _ M N _ O _ M P _ _ _ _ ? ? ? ?
_ 6 _ 8 9 _ 7 9 8 _ _ 6 9 _ _ _ _ 8 9
A) MMOP B) NMOP C) MNOP
D) NNOP E) None of these

16. a _ _ c _ _ b c a _ _ _ c a a _ _ _ _
1 _ _ 5 1 1 3 _ _ _ _ 1 3 ? ? ? ?
A) 3113 B) 3115 C) 5113
D) 5115 E) None of these

17. a a _ b _ a _ c _ _ a d _ a a e _ a a
0 _ 0 1 _ _ 0 2 _ 0 _ 3 _ _ 0 4 ? ? ?
A) 000 B) 001 C) 101
D) 105 E) None of these

18. m _ n m m _ _ m _ n n _ ? ? ? ?
_ 8 8 _ _ _ 8 7 _ _ _ 7 7 _ 8 _
A) mmmm B) mnnn C) mmnn
D) mnnm E) None of these

19. X Y _ _ Y _ _ X Y _ _ _ _ Y ? ? ? ?
_ _ 8 _ 3 8 8 8 _ _ _ 8 _ _ _ 8 _ 8
A) XXXX B) YXYX
C) YXXX D) YYXX
E) None of these

20. A _ A B _ _ BB _ _ BB _ _ A B
0 _ _ 1 _ 0 _ _ 1 0 _ _ ? ? ? ?
A) 1001 B) 1101 C) 0001
D) 1000 E) None of these

21. a _ ba _ aa _ ac _ _ b ? ? ? ?
11 _ _ 6 _ _ 5 _61 _ _16 _ _
A) bcaa B) bcab C) acaa
D) acba E) None of these

22. R _ T _ S _ _ _ T _ U U ? ? ? ?
1 2 _ 4 2 _ 4 4 3 _ _ _ 4 _ 4 _ 4
A) RUSU B) RUTU
C) TUTU D) UUUU
E) None of these

23. Y X _ _ Z _ X W X Y Y X
_ _ 6 7 9 8 _ _ ? ? ? ?
w _ w x _ y _ x _ _ _ _
A) 8778 B) 8668
C) 8888 D) 8998
E) None of these

Scan the QR code for Key

These model questions were prepared by
Rajesh Madhu
Asst. Prof. of Mathematics.

క్వాంటం కంప్యూటింగ్‌లో..

మా అబ్బాయి ఇంటర్మీడియట్ (ఎంపీసీ) ద్వితీయ సంవత్సరం కోర్సులో ఉన్నాడు. అది పూర్తయిన తర్వాత క్వాంటం కంప్యూటింగ్‌లో చేర్చాలనుంది. ఇందులో భవిష్యత్తు ఎలా ఉంటుంది? నాది సరైన నిర్ణయమేనా? **- రాంబాబు, హైదరాబాద్**

■ క్వాంటం కంప్యూటింగ్ ప్రపంచవ్యాప్తంగా చాలా వేగంగా అభివృద్ధి చెందుతున్న రంగం. రాబోయే దశాబ్దంలో ఇది అన్ని రంగాలనూ మార్చేస్తుందని నిపుణులు భావిస్తున్నారు. భవిష్యత్ కంప్యూటింగ్ వ్యవస్థలను అభివృద్ధి చేయాలనుకునే విద్యార్థులకు క్వాంటం కంప్యూటింగ్ ఒక శక్తిమంతమైన ఆయుధం లాంటిది. సాధారణ కంప్యూటర్ల కంటే లక్షల రెట్లు వేగంగా క్వాంటం కంప్యూటర్లు ఎలా ఆలోచిస్తాయో, ఎలా పనిచేస్తాయో క్వాంటం కంప్యూటింగ్ ద్వారా తెలుసుకోవచ్చు. ఈ సబ్జెక్ట్ ఇప్పుడిప్పుడే ప్రాచుర్యంలోకి వస్తోంది. గతంలో ఈ రంగంలో పీహెచ్‌డీ స్థాయిలో పరిశోధనలు మాత్రమే జరిగేవి. కొద్దిమంది పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో దీన్ని ఒక ఆప్షనల్‌గా ఎంచుకునేవారు. కొన్ని ఐఐటీలూ, ప్రైవేట్/ పబ్లిక్ యూనివర్సిటీలూ క్వాంటం కంప్యూటింగ్‌లో బీటెక్ డిగ్రీని కూడా ప్రారంభించాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం డిగ్రీ/ఇంజనీరింగ్ చదువుతున్న విద్యార్థులకు ఆన్‌లైన్ విధానంలో క్వాంటం కంప్యూటింగ్ సబ్జెక్ట్ చదివే అవకాశాన్ని కల్పిస్తోంది. మీ అబ్బాయి ఇంటర్మీడియట్‌లో మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ చదువుతున్నాడు కాబట్టి, భవిష్యత్తులో క్వాంటం కంప్యూటింగ్ కోర్సులో చేరడానికి అవసరమైన ప్రాథమిక అంశాల పట్ల అవగాహన ఉంటుంది.



క్వాంటం కంప్యూటింగ్ రంగంలో రాణించాలంటే.. మ్యాథ్స్‌లో ఆసక్తి బాగా ఉండాలి. ముఖ్యంగా లీనియర్ ఆల్జీబ్రా, కాలిక్యులస్, స్టాటిస్టిక్స్, ప్రాబబిలిటీలపై గట్టి పట్టు అవసరం. కంప్యూటర్ ప్రోగ్రామింగ్‌లో కూడా నైపుణ్యం ఉండాలి. పైతాన్ ప్రోగ్రామింగ్‌ను బాగా నేర్చుకోవాలి.


ఈ రంగంలోకి ప్రవేశించాలంటే.. ఇంటర్మీడియట్ తర్వాత కంప్యూటర్ సైన్స్/ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్/ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్/ ఏఐ అండ్ ఎంఎల్‌లో బీటెక్ చదవాలి. అలా వీలుకాని పక్షంలో.. బీఎస్సీలో మ్యాథ్స్, ఫిజిక్స్‌లు మేజర్‌గా తీసుకొని, ఎమ్మెస్సీలో క్వాంటం కంప్యూటింగ్ స్పెషలైజేషన్‌ను ఎంచుకోవాలి. ఆ తర్వాత ఆసక్తి ఉంటే ఎంటెక్‌లోనూ క్వాంటం కంప్యూటింగ్ చేయొచ్చు లేదా ఎమ్మెస్సీ పూర్తయిన వెంటనే క్వాంటం కంప్యూటింగ్‌లోనే పీహెచ్‌డీ చేయడానికి ప్రయత్నించవచ్చు.

ఉద్యోగాల విషయానికి వస్తే.. ఈ రంగంలో క్వాంటం ప్రోగ్రామర్/ క్వాంటం డెవలపర్, క్వాంటం రిసెర్చ్ సైంటిస్ట్, క్వాంటం హార్డ్‌వేర్ ఇంజినీర్, క్వాంటం సైబర్ సెక్యూరిటీ ఎక్స్‌పర్ట్, డేటా సైంటిస్ట్ (క్వాంటం స్పెషలైజేషన్) లాంటి హోదాలు అందుబాటులో ఉంటాయి. చివరగా.. ఏ రంగంలో రాణించాలన్నా, అందులో విపరీతమైన ఇష్టం, విషయ పరిజ్ఞానం, నైపుణ్యాలు ఎంతో ముఖ్యం.

– ప్రొ.బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

ఎదగాలంటే.. ఎక్కాలి ఈ మెట్లు!

సాంకేతిక నైపుణ్యాలు, విద్యార్హతలు కార్పొరేట్ సంస్థలో ఉద్యోగం పొందేందుకు అవసరమైన కీలకమైన నైపుణ్యాలు. అయితే కొలువులో ఉన్నత స్థాయికి ఎదిగేందుకు.. వృత్తి నైతికత, నిబద్ధత, నమ్మకం, పారదర్శకత ఎంతో ముఖ్యం. కార్పొరేట్ సంస్థల్లో ఉద్యోగం ఆశించే యువ ఉద్యోగార్థులకు వీటిపై స్పష్టమైన అవగాహన అవసరం. వీటి గురించి కళాశాలల్లో చెప్పరు. ఇవి ప్రతి ఉద్యోగార్థీ తప్పక తెలుసుకోవాల్సిన జీవన సూత్రాలు.



ఇండక్షన్‌లో భాగంగా వ్యాపార వ్యవహారాలకు సంబంధించిన మేరకు కార్పొరేట్ సంస్థలు ఉద్యోగులకు శిక్షణ ఇస్తుంటాయి. కెరియర్‌ను మలుపు తిప్పగల బలమైన అంశాల గురించి ఉద్యోగార్థులు, ఉద్యోగులు స్పష్టంగా తెలుసుకోవడం ఎంతో ముఖ్యం. ఈ అంశాలను అర్థం చేసుకుంటే కార్పొరేట్ సంస్థల్లో అత్యున్నత విజయాలను అందుకోవచ్చు.

వృత్తి నైతికత

ఉద్యోగులు సంస్థలో చేరాక, లక్ష్య సాధనపై ఎక్కువగా దృష్టి సారిస్తుంటారు. ఈ క్రమంలో ఎవరూ తనను గమనించడం లేదని, విలువలు త్యజించి పని చేయడం ప్రమాదకరం.

ఒక సంస్థలో సేల్స్ ట్రెయినీగా చేరిన రాహుల్ నెలవారీ లక్ష్యాలు సాధించే క్రమంలో తన ప్రొడక్ట్‌కు సంబంధించిన కొంత సమాచారం దాచి కస్టమర్ల నుంచి ఆర్డర్లు పొందాడు. అతడు తీసుకువచ్చిన ఆర్డర్లకు సంస్థ సరఫరా చేసిన ప్రొడక్ట్ మ్యాచ్ కాలేదని, కస్టమర్లను తప్పుదోవ పట్టించి, ఆర్డర్లు పొందాడని, సోషల్ మీడియాలో సంస్థపై నెగటివ్ రివ్యూలు వెల్లువెత్తి సంస్థ ప్రతిష్ఠ (గుడ్ విల్) దెబ్బతింది. రాహుల్‌ను మార్కెటింగ్ హెడ్ సంజాయిషీ కోరగా సంబంధం లేని వివరణ ఇచ్చాడు. అతడిలో వృత్తిపరమైన నైతిక విలువలు లేని కారణంగా ఉద్యోగం నుంచి తొలగించారు.

కార్పొరేట్ సంస్థలలో ఉద్యోగాలు ఆశించే చాలా మంది.. సాంకేతిక నైపుణ్యాలు, కమ్యూనికేషన్ నైపుణ్యాలలో శిక్షణ పొందుతున్నారు. కానీ, సున్నితమైన వృత్తి నైతికత లాంటి అంశాలలో వీరికి తగిన అవగాహన ఉండటం లేదు. ఇది ఎవరూ నేరుగా తెలియజేయనప్పటికీ కెరియర్‌పై ప్రభావం చూపే అంశం.

నిబద్ధత

ప్రదీప్ ఒక ఐటీ సంస్థలో జూనియర్ డెవలపర్‌గా చేరాడు. కస్టమర్‌కు డెలివరీ ఇవ్వవలసిన ప్రాజెక్ట్‌లో ఒక క్రిటికల్ సమస్య ఎదురైంది. ఈ సమస్యను పరిష్కరించడానికి ఎవరూ ముందుకు రాకపోయేసరికి ఈ బాధ్యతను అతడికి టీమ్ లీడర్ అప్పగించాడు. ఎలాంటి సందేహం లేకుండా ప్రాజెక్టు తీసుకున్నాడు. 'ఈ ప్రాజెక్టుతో ప్రదీప్ పని ఫినిష్' అన్నారు టీమ్ సభ్యులు. అతడు నిబద్ధతతో పనిచేసి, ప్రాజెక్టును పూర్తి డాక్యుమెంటేషన్‌తో సమయానికి కస్టమర్‌కు అందించాడు. ఫలితంగా ప్రాజెక్ట్ విజయం సాధించి సంస్థ ప్రతిష్ఠ పెరిగింది. మేనేజ్‌మెంట్ ప్రదీప్‌ను అభినందించి, టీమ్ లీడర్‌గా ప్రమోట్ చేసింది. నిజాయతీ, నిబద్ధత, బాధ్యతాయుతమైన ప్రవర్తనతో పాటూ నమ్మకాన్ని నిలబెట్ట గల లక్షణం ఉన్నవారు ఉద్యోగంలో విజయం సాధించి, ఉన్నత స్థాయికి చేరుకోగలరు.

బాధ్యత

కార్పొరేట్ ఉద్యోగాలలో ఉద్యోగి తన బాధ్యతాయుత ప్రవర్తనతో మేనేజ్‌మెంట్ విశ్వాసం పొందగలిగితే ఉద్యోగంలో ఉన్నత స్థాయికి ఎదిగేందుకు వీలవుతుంది.

వికాస్ ఒక తయారీరంగ సంస్థ ఐటీ శాఖలో ట్రెయినీగా చేరాడు. ఒక రాత్రి సమయంలో 'సర్వర్ డౌన్' అయింది. షిఫ్ట్‌లో పనిచేసే ఉద్యోగుల పనికి అంతరాయం కలుగుతుందని అర్థం చేసుకుని.. వెంటనే సమస్యను పరిష్కరించాడు. ఇదే విషయాన్ని ఉన్నతాధికారులకూ తెలియజేశాడు. వికాస్ స్వచ్ఛందంగా, సమయానుకూలంగా, బాధ్యతతో స్పందించడం వల్ల సంస్థకు భారీ నష్టం తప్పింది. అతడిని యాజమాన్యం గుర్తించి, ప్రశంసించింది.

యువ ఉద్యోగార్థులు బాధ్యతగా వ్యవహరిస్తే నమ్మకమైన, స్థిరమైన, విజయవంతమైన వృత్తి జీవితాన్ని గడపగలుగుతారు. వ్యక్తిగత నైతికతను జీవన విధానంగా భావించే వారిని తమ సంస్థలో ఉన్నతస్థాయి ఉద్యోగులుగా కార్పొరేట్ యాజమాన్యాలు కోరుకుంటాయి.

నమ్మకం

అరుణ్ ఒక సంస్థలో అనలిస్ట్‌గా చేరాడు. క్లయింట్‌కు నిర్దిష్ట సమయానికి పంపాల్సిన రిపోర్టు తయారు చేయలేకపోయాడు. ఈ విషయాన్ని దాచి పెట్టి, తప్పుడు సమాచారంతో రిపోర్ట్ తయారు చేశాడు. కమిట్ అయిన సమయానికే నివేదిక పంపేశానని టీమ్ లీడర్‌కు సమాచారం ఇచ్చాడు. అయితే రిసీవ్ చేసుకున్న నివేదిక సరైంది కాదని తమ టెక్నికల్ మీటింగ్‌లో కస్టమర్ గుర్తించి, మేనేజ్‌మెంట్‌కు ఫిర్యాదు చేశాడు. విచారణలో తన తప్పును దాచిపెట్టేందుకు అరుణ్ ప్రయత్నించాడు. అతడు ఉద్దేశపూర్వకంగానే పొరబాటు చేసినట్లు దర్యాప్తులో తేలడంతో, క్రమశిక్షణ చర్య తీసుకున్నారు.

కార్పొరేట్ రంగంలో స్థిరమైన, విజయవంతమైన కెరియర్ కోసం యువత ఈ విలువలను జీవన విధానంగా స్వీకరించాలి. ఉద్యోగానికే కాకుండా.. వ్యక్తిగత నైతికతకూ ప్రాధాన్యమిచ్చే ఉద్యోగులను సంస్థలు ఎప్పుడూ కాపాడుకుంటాయి.



దొరైరాజ్, సీనియర్ జనరల్ మేనేజర్, ఎలక్ట్రోస్టీల్ కాస్టింగ్స్ లిమిటెడ్

నో టీ స్ బో ర్డు

టీసీఐఎల్‌లో కొలువులు

టెలి కమ్యూనికేషన్స్ కన్సల్టెంట్స్ ఇండియా లిమిటెడ్.. ఒప్పంద ప్రాతిపదికన 150 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

▶ టీమ్ లీడ్: 16 ▶ మైక్రోవేవ్/వైర్‌లెస్ టెక్నీషియన్: 16 ▶ రిగ్గర్: 32 ▶ ఐబీఎస్ డిజైనర్/ఇంజినీర్: 02 ▶ ఐబీఎస్ టెక్నీషియన్: 05 ▶ ఐబీఎస్ హెల్పర్: 15 ▶ సివిల్ ఇంజినీర్: 02 ▶ సివిల్ సూపర్‌వైజర్: 05 ▶ సివిల్ హెల్పర్: 20 ▶ ఐపీ ఇంజినీర్: 02 ▶ సీనియర్ ఆప్టికల్ ఫైబర్ టెక్నీషియన్: 11 ▶ జూనియర్ ఆప్టికల్ ఫైబర్ టెక్నీషియన్: 09 ▶ సివిల్ టీమ్ లీడ్: 06 ▶ సివిల్ హెల్పర్: 08 ▶ సీనియర్ ఇంజినీర్: 01

అర్హత: పోస్టులను అనుసరించి సంబంధిత విభాగంలో టెన్త్, డిప్లొమా/ఐటీఐ, డిగ్రీతో పాటు పని అనుభవం ఉండాలి.
వయసు: పోస్టుల ప్రకారం 35 ఏళ్ల నుంచి 50 ఏళ్లు ఉండాలి.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: డిసెంబరు 9.
ఎంపిక: ఇంటర్వ్యూతో.
వెబ్‌సైట్: https://www.tcil.net.in/current_opening.php

ఫిల్మ్ అండ్ టీవీ ఇన్‌స్టిట్యూట్‌లో..

సత్యజిత్ రే ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇన్‌స్టిట్యూట్.. ఒప్పంద ప్రాతిపదికన 14 టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

▶ ప్రొఫెసర్: 04 ▶ అసోసియేట్ ప్రొఫెసర్: 04 ▶ అసిస్టెంట్ ప్రొఫెసర్: 06

విభాగాలు: ఆర్ట్ డైరెక్షన్, డైరెక్షన్, థియేటర్ ఆర్ట్స్, స్క్రీనింగ్, యాక్షన్, యానిమేషన్, స్క్రీన్‌ప్లే రైటింగ్, స్క్రీన్ యాక్టింగ్, పీఎఫ్‌టీ, సౌండ్ రికార్డింగ్ అండ్ డిజైన్, సినిమాటోగ్రఫీ. **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ, పీజీ డిప్లొమాతో పాటు పని అనుభవం ఉండాలి. **వేతనం:** నెలకు ప్రొఫెసర్‌కు రూ.1,38,072; అసోసియేట్ ప్రొఫెసర్‌కు రూ.1,19,424; అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు రూ.99,936.
వయసు: దరఖాస్తు గడువు తేదీ నాటికి 63 ఏళ్లు మించకూడదు.
ఎంపిక: షార్ట్‌లిస్ట్, ట్రేడ్ టెస్ట్/ఇంటర్వ్యూలతో.
దరఖాస్తు ఫీజు: రూ.1200; ఎస్సీ/ఎస్టీ, పీడబ్ల్యూడీ, మహిళలకు ఫీజు లేదు. **దరఖాస్తు చివరి తేదీ:** 05.12.2025.
వెబ్‌సైట్: https://srfti.ac.in/Vacancy/

నిట్‌లో నాన్ టీచింగ్ పోస్టులు

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, దుర్గాపూర్.. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన 118 నాన్ టీచింగ్ గ్రూప్-ఏ, బీ, సీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

గ్రూప్-ఏ: ▶ ప్రిన్సిపల్ సైంటిఫిక్/ ప్రిన్సిపల్ టెక్నికల్ ఆఫీసర్: 02 ▶ సూపరింటెండెంట్ ఇంజినీర్: 01 ▶ డిప్యూటీ లైబ్రేరియన్: 01 ▶ సీనియర్ ఎస్ఏఎస్ ఆఫీసర్: 01 ▶ మెడికల్ ఆఫీసర్: 01 ▶ అసిస్టెంట్ రిజిస్ట్రార్: 02 ▶ అసిస్టెంట్ లైబ్రేరియన్: 01 ▶ సైంటిఫిక్/టెక్నికల్ ఆఫీసర్: 01
గ్రూప్-బీ: ▶ టెక్నికల్ అసిస్టెంట్/జూనియర్ ఇంజినీర్: 25 ▶ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ అసిస్టెంట్: 01 ▶ సూపరింటెండెంట్: 05
గ్రూప్-సీ: ▶ టెక్నీషియన్: 26 ▶ సీనియర్ అసిస్టెంట్: 07 ▶ సీనియర్ టెక్నీషియన్: 13 ▶ జూనియర్ అసిస్టెంట్: 14 ▶ ల్యాబ్ అటెండెంట్/ ఆఫీస్ అటెండెంట్: 17

అర్హతలు: పోస్టును అనుసరించి ఇంటర్మీడియట్, సంబంధిత విభాగంలో డిప్లొమా, బీఈ/బీటెక్ లేదా ఎమ్మెస్సీ/ఎంసీఏ, మాస్టర్స్ డిగ్రీ, ఎంబీబీఎస్, పీజీ డిప్లొమా, ఉద్యోగానుభవం ఉండాలి.
ఎంపిక: స్కిల్ టెస్ట్/రాత పరీక్ష, ఇంటర్వ్యూలతో.
దరఖాస్తు ఫీజు: గ్రూప్-ఏ జనరల్/ ఓబీసీ/ ఈడబ్ల్యూఎస్‌కు రూ.1500; గ్రూప్ బీ, సీ పోస్టులకు రూ.1000; ఎస్సీ/ఎస్టీ, దివ్యాంగులు, ఎక్స్‌సర్వీస్‌మెన్, మహిళలకు ఫీజు లేదు.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ప్రకటన వెలువడిన తేదీ 12.11.2025 నుంచి 21 రోజుల్లోగా దరఖాస్తు చేసుకోవాలి.
వెబ్‌సైట్: https://nitdgp.ac.in/p/careers

ఏవియేషన్ సంస్థలో పీహెచ్‌డీ

రాజీవ్ గాంధీ నేషనల్ ఏవియేషన్ యూనివర్సిటీ, అమేథీ... పీహెచ్‌డీ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.

▶ పీహెచ్‌డీ ప్రవేశాలు 2025-26 **మొత్తం సీట్లు:** 25

విభాగాలు: ఏరోస్పేస్ ఇంజినీరింగ్ అండ్ ఏవియేషన్ సైన్సెస్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్-ఏవియానిక్స్, మేనేజ్‌మెంట్ స్టడీస్, ఏవియేషన్ మేనేజ్‌మెంట్. **అర్హత:** సంబంధిత విభాగాల్లో కనీసం 55% మార్కులతో ఎంటెక్ /ఎంఎస్ (రిసెర్చ్) /మాస్టర్స్ డిగ్రీతో పాటు గేట్ స్కోరు లేదా సంబంధిత విభాగంలో 75 శాతం మార్కులతో బీఈ/బీటెక్/ నాలుగేళ్ల బ్యాచిలర్ డిగ్రీతో పాటు గేట్ స్కోరు ఉండాలి.
ఎంపిక: విద్యార్హతల మార్కులు, రాత పరీక్ష, ఇంటర్వ్యూలతో.
దరఖాస్తు ఫీజు: జనరల్/ ఓబీసీ, ఈడబ్ల్యూఎస్‌కు రూ.500; మహిళలు/ ఎస్సీ/ ఎస్టీ/ పీడబ్ల్యూడీలకు ఫీజు లేదు.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 30-11-2025.
వెబ్‌సైట్: https://www.rgnau.ac.in/

తెహ్రీ హైడ్రో సంస్థలో అసిస్టెంట్ మేనేజర్లు

తెహ్రీ హైడ్రో డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఇండియా లిమిటెడ్ (టీహెచ్‌డీసీఎల్).. 40 అసిస్టెంట్ మేనేజర్, సీనియర్ మెడికల్ ఆఫీసర్ ఉద్యోగాలను భర్తీచేయనుంది. స్క్రీనింగ్/ పర్సనల్ ఇంటర్వ్యూలతో నియామకాలుంటాయి.



మొత్తం ఉద్యోగాల్లో అన్‌రిజర్వ్‌డ్‌కు 15, ఈడబ్ల్యూఎస్‌కు 5, ఓబీసీ - ఎన్‌సీఎల్‌కు 11, ఎస్సీకి 6, ఎస్టీకి 3 కేటాయించారు. ముందుగా ఏడాది కాలానికి నియమించినప్పటికీ నాలుగేళ్ల వరకూ పొడిగించే అవకాశం ఉంటుంది.

ఎంపిక: స్క్రీనింగ్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూలతో ఎంపిక చేస్తారు. స్క్రీనింగ్‌టెస్ట్‌లో అన్‌రిజర్వ్‌డ్/ ఈడబ్ల్యూఎస్/ ఓబీసీ (ఎన్‌సీఎల్) 50 శాతం, ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులు 40 శాతం కనీసార్హత మార్కులు సాధించాలి. వీటితో పర్సనల్ ఇంటర్వ్యూకు ఎంపిక చేస్తారు. దీనికి 100 శాతం వెయిటేజీ ఉంటుంది. తుది ఎంపికలో ఇంటర్వ్యూ మార్కులనే పరిగణనలోకి తీసుకుంటారు.

సీనియర్ మెడికల్ ఆఫీసర్ పోస్టుకు పర్సనల్ ఇంటర్వ్యూ మాత్రమే నిర్వహిస్తారు. ఇందులో జనరల్ అభ్యర్థులు 50 శాతం, ప్రత్యేక వర్గాలకు చెందినవారు 40 శాతం కనీసార్హత మార్కులు సంపాదించాలి. వైద్య పరీక్షల అనంతరం కేటగిరీలవారీగా తుది ఎంపిక చేస్తారు. ఎంపికైనవారు ఏడాదిపాటు ప్రొబేషన్‌లో పనిచేయాలి. నాలుగేళ్లకు పదోన్నతికి అవకాశం ఉంటుంది. ఆ తర్వాత ఆకర్షణీయమైన వేతనాలనూ అందుకోవచ్చు.

స్క్రీనింగ్ పరీక్ష కేంద్రాలు: దిల్లీ/ నోయిడా, డెహ్రాడూన్, లఖ్‌నవు, చండీగఢ్, చెన్నై, హైదరాబాద్, రాంచీ, కోల్‌కతా.

అర్హతలు:

అసిస్టెంట్ మేనేజర్: సివిల్/ ఎలక్ట్రికల్/ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్/ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్/ మెకానికల్/ ప్రొడక్షన్ అండ్ ఇండస్ట్రియల్/ మెకానికల్ అండ్ ఆటోమేషన్/ బ్రాంచ్‌తో బీఈ/ బీటెక్/ బీఎస్సీ (ఇంజినీరింగ్) 60 శాతంతో పూర్తిచేయాలి. సంబంధిత రంగంలో నాలుగేళ్ల అనుభవం ఉండాలి.
సీనియర్ మెడికల్ ఆఫీసర్: ఎంబీబీఎస్, మెడికల్ కౌన్సిల్‌లో నమోదైవుండాలి. ఐదేళ్ల అనుభవం.
వయసు: 01.07 2025 నాటికి అసిస్టెంట్ మేనేజర్‌కు 35 సంవత్సరాలు, సీనియర్ మెడికల్ ఆఫీసర్‌కు 37 ఏళ్లు మించకూడదు.
దరఖాస్తు ఫీజు: జనరల్/ ఓబీసీ/ ఈడబ్ల్యూఎస్‌లకు రూ.600. ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులు/ మాజీ సైనికోద్యోగులకు ఫీజు లేదు.
వేతన శ్రేణి: రూ.50,000-1,80,000. మూలవేతనానికి అదనంగా హెచ్ఆర్ఏ, టీఏ, డీఏ, లోన్, అడ్వాన్స్, పీఎఫ్, గ్రాట్యుటీ, పెన్షన్, పోస్ట్ రిటైర్‌మెంట్ మెడికల్ సదుపాయాలు ఉంటాయి.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 06.12.2025
వెబ్‌సైట్: www.thdc.co.in

600 బీ స్కూళ్లకు మ్యాట్ మార్గం!

దేశంలోని బిజినెస్ స్కూళ్లలో ఎంబీఏ కోర్సులో చేరడానికి నిర్వహిస్తోన్న పరీక్షల్లో మేనేజ్‌మెంట్ ఆప్టిట్యూడ్ టెస్టు (మ్యాట్) ఒకటి. దీన్ని ఆల్ ఇండియా మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (ఏఐఎంఏ) ఏడాదికి నాలుగు సార్లు నిర్వహిస్తోంది. ఇటీవలే డిసెంబరులో నిర్వహించే పరీక్షలకు ప్రకటన వెలువడింది. డిగ్రీ పూర్తిచేసుకున్నవారు, చివరి ఏడాది కోర్సులు చదువుతున్నవాళ్లు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ పరీక్ష స్కోరుతో తెలుగు రాష్ట్రాల్లోని పలు సంస్థల్లో ఎంబీఏ కోర్సుల్లో ప్రవేశం పొందవచ్చు.



మూడు విధాలుగా..

పేపర్ బేస్డ్ టెస్టు(పీబీటీ), కంప్యూటర్ బేస్డ్ టెస్టు(సీబీటీ), పీబీటీ+సీబీటీ ఇలా 3 రకాలుగా మ్యాట్ నిర్వహిస్తారు. వీటిలో నచ్చిన విధానంలో రాసుకోవచ్చు. తెలుగు రాష్ట్రాల్లో.. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం, అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా, బద్రుక, ధ్రువ, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజ్ (ఐపీఈ), ఐసీబీఎం, ఐఐఆర్ఎం, విజ్ఞాన జ్యోతి, శివశివానీ, విశ్వవిశ్వానీ, ఆదిత్య యూనివర్సిటీ, వీవీఐటీ.. తదితర సంస్థలు మ్యాట్ స్కోరుతో ప్రవేశం కల్పిస్తున్నాయి. దేశవ్యాప్తంగా సుమారు 600 సంస్థల్లో మేనేజ్‌మెంట్ కోర్సుల్లో చేరడానికి ఈ స్కోరు ఉపయోగపడుతుంది. పరీక్ష స్కోరు ఏడాది పాటు చెల్లుతుంది.

పరీక్ష ఇలా...

ఐదు విభాగాల నుంచి 150 ప్రశ్నలు వస్తాయి. వ్యవధి 2 గంటలు. ప్రతి విభాగంలోనూ 30 చొప్పున ప్రశ్నలు ఉంటాయి. లాంగ్వేజ్ కాంప్రహెన్షన్, ఇంటెలిజెన్స్ అండ్ క్రిటికల్ రీజనింగ్, మ్యాథమెటికల్ స్కిల్స్, డేటా అనాలసిస్ అండ్ సఫిషియన్సీ, ఎకనామిక్ అండ్ బిజినెస్ ఎన్విరాన్‌మెంట్ అంశాల్లో వీటిని అడుగుతారు. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు. తప్పు సమాధానానికి పావు మార్కు తగ్గిస్తారు.

సన్నద్ధత..

వెబ్‌సైట్‌లో మాదిరి ప్రశ్నలు ఉంచారు. వాటిని పరిశీలించాలి. ఐసెట్ సన్నద్ధతతోనే మ్యాట్ ఎదుర్కోవచ్చు. ప్రశ్నలు క్యాట్ అంత కష్టంగా ఉండవు. గత ప్రశ్నపత్రాలు పరిశీలిస్తే పరీక్షపై పూర్తి అవగాహన వస్తుంది. విభాగాల్లోని అంశాల వారీ మాదిరి ప్రశ్నలు సాధన చేయాలి. ఆ తర్వాత వీలైనన్ని మాక్ టెస్టులు రాయాలి. ఫలితాలు విశ్లేషించుకుని, చేసిన తప్పులు పునరావృతం కాకుండా చూసుకోవాలి. వెనుకబడుతోన్న విభాగాలకు సమయం కేటాయించి, సాధన చేస్తే స్కోరు మెరుగవుతుంది. రుణాత్మక మార్కులు కారణంగా ఏ మాత్రం అవగాహన లేని ప్రశ్నలను వదిలేయడమే మంచిది.

అర్హత: డిగ్రీ పూర్తిచేసినవాళ్లు, ప్రస్తుతం చివరి ఏడాది కోర్సులు చదువుతున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. **దరఖాస్తు:** ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ద్వారా. **ఫీజు:** పేపర్ బేస్డ్/ కంప్యూటర్ బేస్డ్ ఏదో ఒక దానికి రూ.2200. రెండు విధాల్లో రాయడానికి రూ.3800.
పీబీటీ రిజిస్ట్రేషన్ చివరి తేదీ: 07.12.2025
సీబీటీ రిజిస్ట్రేషన్ చివరి తేదీ: 15.12.2025
పేపర్ ఆధారిత పరీక్ష తేదీ: 13.12.2025
కంప్యూటర్ ఆధారిత పరీక్ష తేదీ: 21.12.2025
తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: పేపర్ బేస్డ్.. హైదరాబాద్, విశాఖపట్నం. కంప్యూటర్ బేస్డ్.. హైదరాబాద్, విజయవాడ.
వెబ్‌సైట్: https://mat.aima.in/

ఇంటర్న్‌షిప్స్

హైదరాబాద్‌లో..

బిజినెస్ డెవలప్‌మెంట్ (సేల్స్)

సంస్థ: ఎక్స్‌ట్రాలివింగ్ ప్రై.లి.
నైపుణ్యాలు: ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, సేల్స్, సేల్స్ మేనేజ్‌మెంట్, సేల్స్ స్ట్రాటజీ అండ్ సపోర్ట్ **స్టైపెండ్:** రూ.7,500
దరఖాస్తు గడువు: డిసెంబరు 11
☛ https://tinyurl.com/bdhpcy4b

కంటెంట్ అండ్ సోషల్‌మీడియా మార్కెటింగ్

సంస్థ: కాగ్నిబీ మీడియా ప్రై.లి.
నైపుణ్యాలు: బ్లాగింగ్, కేన్వా, కంటెంట్ మార్కెటింగ్, కాపీరైటింగ్, గ్రాఫిక్ డిజైన్, వీడియో ఎడిటింగ్, వీడియో మేకింగ్
స్టైపెండ్: రూ.10,000-20,000
దరఖాస్తు గడువు: డిసెంబరు 12
☛ https://tinyurl.com/2ukv3mjw

ఫీల్డ్ సేల్స్

సంస్థ: హ్యాక్ టెక్నాలజీస్
నైపుణ్యాలు: అనలిటికల్ థింకింగ్, క్లయింట్ రిలేషన్‌షిప్, కోల్డ్ కాలింగ్, ఈకామర్స్, ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ఇంగ్లిష్, హిందీ మాట్లాడటం, ఫీల్డ్ వర్క్, మార్కెట్ రిసెర్చ్, నెగోషియేషన్, ప్రజెంటేషన్, స్కిల్స్, ప్రాబ్లమ్ సాల్వింగ్, సేల్స్ **స్టైపెండ్:** రూ.12,000-19,000
దరఖాస్తు గడువు: డిసెంబరు 11
☛ https://shorturl.at/E2GcU

సేల్స్

సంస్థ: సునన్ మాడ్యులర్ ఇండియా ప్రై.లి.
నైపుణ్యాలు: అడాప్టబిలిటీ, కంప్యూటర్ స్కిల్స్, ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ప్రజెంటేషన్ స్కిల్స్
స్టైపెండ్: రూ.15,000-16,000
దరఖాస్తు గడువు: డిసెంబరు 11
☛ https://shorturl.at/CVWFD

ఏఐ ఏజెంట్ డెవలప్‌మెంట్

సంస్థ: ఎంటర్‌సాఫ్ట్ సెక్యూరిటీ
నైపుణ్యాలు: సీఐ/సీడీ, డాకర్, ఫాస్ట్‌ఏపీఐ, గిట్, గిట్‌ల్యాబ్ జేసన్, ఎల్ఎల్ఎంటెక్స్, మెషిన్ లెర్నింగ్, పాండాస్, ప్రాంప్ట్ ఇంజినీరింగ్, పైతాన్, రెస్ట్ ఏపీఐ
స్టైపెండ్: రూ.30,000-35,000
దరఖాస్తు గడువు: డిసెంబరు 12
☛ https://shorturl.at/9Tapz

సోషల్‌మీడియా అండ్ కంటెంట్ (ఇన్‌స్టాగ్రామ్ స్ట్రాటజీ)

సంస్థ: ఇంటర్వ్యూబడ్డీ
నైపుణ్యాలు: కంటెంట్ రైటింగ్, కోఆర్డినేషన్, ఇన్‌స్టాగ్రామ్ మార్కెటింగ్, స్ట్రాటజీ, వీడియో ఎడిటింగ్, వీడియో మేకింగ్
స్టైపెండ్: రూ.5,000
దరఖాస్తు గడువు: నవంబరు 30
☛ https://shorturl.at/Ruphj

విశాఖపట్నంలో..

డేటా సైన్స్

సంస్థ: వెబ్ టెక్నాలజీస్ ఇండియా ప్రై.లి.
నైపుణ్యాలు: అనలిటిక్ థింకింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా అనలిటిక్స్, డేటా సైన్స్, డీప్ లెర్నింగ్, మెషిన్ లెర్నింగ్, నాచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్ (ఎన్ఎల్‌పీ), పైతాన్, రిసెర్చ్ అండ్ అనలిటిక్స్
స్టైపెండ్: రూ.10,000
దరఖాస్తు గడువు: నవంబరు 26
☛ https://tinyurl.com/yc6p57h2

గ్రాఫిక్ డిజైన్

సంస్థ: ఎక్సెలా పబ్లిషింగ్ హౌస్
నైపుణ్యాలు: అడోబ్ ఇలస్ట్రేటర్, ఫొటోషాప్
స్టైపెండ్: రూ.15,000-25,000 (ఒకేసారి)
దరఖాస్తు గడువు: డిసెంబరు 7
☛ https://tinyurl.com/yrmxtt7m

చదువు

ఉన్నతవిద్య, కెరియర్ ఎంపికలకు సంబంధించి విద్యార్థులకూ, ఉద్యోగార్థులకూ అనుమానాలు, ఊగిసలాట సహజం. సంబంధిత సందేహాలను సకాలంలో నివృత్తి చేసుకోవాలనుకుంటున్నారా? మీ ప్రశ్నలను మాకు పంపండి. అనుభవజ్ఞులైన నిపుణులు సమాధానాలు ఇస్తారు.

మా చిరునామా: **చదువు,** ఈనాడు కార్యాలయం, అనాజ్‌పూర్, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, రామోజీ ఫిల్మ్‌సిటీ – 501 512
edc@eenadu.in



'ఎలిజబెత్ లెడరర్' చిత్రం ఖరీదు రూ.2,087 కోట్లు

ఇంటర్నెట్ డెస్క్: ఆస్ట్రియన్ కళాకారుడు గుస్తావ్ క్లిమ్ట్ గీసిన ఓ కళాఖండం వేలంలో రికార్డు స్థాయి ధర పలికింది. న్యూయార్క్‌లో నిర్వహించిన వేలంలో 'ఎలిజబెత్ లెడరర్' చిత్రం 236.4 మిలియన్ డాలర్లు (రూ.2087 కోట్లు) పలికింది. కేవలం 20 నిమిషాల్లోనే అమ్ముడై.. అత్యంత ఖరీదైన ఆధునిక కళాఖండంగా నిలిచింది. క్లిమ్ట్ పెయింటింగులకు అంతర్జాతీయ మార్కెట్‌లో చాలా డిమాండ్ ఉంది. వియన్నాలో అత్యంత సంపన్న కుటుంబాన్ని వర్ణిస్తూ.. ఆయన గీసిన 'ఎలిజబెత్ లెడరర్' చిత్రం ప్రపంచవ్యాప్తంగా ఆదరణ పొందింది. ఆరు అడుగుల పొడవున్న ఈ పెయింటింగ్‌ను గీసేందుకు ఆయనకు దాదాపు మూడేళ్లు (1914-1916) పట్టినట్లు సమాచారం. ప్రస్తుతం ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో ఉన్న ఆ కళాఖండం కొన్నేళ్లు కనిపించకుండా పోగా, ఇటీవలే లభ్యమైంది.

బ్యాంకు ముందు మళ్లీ బారులు!

ఇంటర్నెట్ డెస్క్: కేంద్ర ప్రభుత్వం పెద్ద నోట్లను రద్దు చేశాక దేశవ్యాప్తంగా బ్యాంకుల ముందు జనాలు బారులు తీరిన దృశ్యాలు ఇప్పటికీ చాలామందికి గుర్తే. అప్పుడు అలాంటి సన్నివేశమే గుజరాత్‌లోని మెహసానాలో కనిపించింది. స్థానిక అర్బన్ కోఆపరేటివ్ బ్యాంకు ఒక శిబిరాన్ని ఏర్పాటుచేసి, కొత్తగా ముద్రించిన రూ.10 నోట్లు, నాణేలను జారీ చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ విషయం తెలుసుకున్న వందలాది స్థానికులు ఉదయం నుంచే బ్యాంకు ముందు బారులు తీరారు. తక్కువ విలువ కలిగిన కరెన్సీ కొరతను పరిష్కరించే ఉద్దేశంతో బ్యాంకు ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసింది. రూ.14 లక్షల విలువైన రూ.10 నోట్లు, కొన్ని రూ.20 నోట్ల కట్టలు.. రూ.3 లక్షల విలువైన రూ.2, రూ.5 నాణేలను బ్యాంకు అధికారులు జారీ చేశారు. ఉదయం పది గంటలకు మొదలైన ఈ కార్యక్రమం సాయంత్రం వరకు కొనసాగింది. ప్రజలకు నగదు లభ్యతను అందుబాటులో ఉంచేందుకు ఆర్బీఐ ఆదేశాలు అనుగుణంగా ఈ శిబిరం ఏర్పాటు చేసినట్లు బ్యాంకు మేనేజరు ముకేశ్ భాయ్ పటేల్ మీడియాకు తెలిపారు.



ఎప్‌స్టీన్ ఈమెయిళ్ల చిచ్చు

- ఓపెన్ ఏఐ బోర్డుకు లారీ సమ్మర్స్ రాజీనామా
- ఆయన మాజీ ఆర్థిక మంత్రి

న్యూయార్క్: ఎప్‌స్టీన్ ఈమెయిళ్లు వెలుగు చూస్తుండటంతో అమెరికాలో ఆసక్తికర అంశాలెన్నో బయటపడుతున్నాయి. తాజాగా మాజీ ఆర్థిక మంత్రి, ఓపెన్ ఏఐ బోర్డు డైరెక్టరు లారీ సమ్మర్స్ రాజీనామా చేశారు. ఎప్‌స్టీన్‌తో ఆయనకు సన్నిహిత సంబంధాలున్నట్లు ఆ ఈమెయిళ్లలో బయటపడింది. 'ఓపెన్ ఏఐ బోర్డు ఆఫ్ డైరెక్టరు పదవి నుంచి వైదొలగాలని సమ్మర్స్ నిర్ణయించుకున్నారు. ఆయన నిర్ణయాన్ని గౌరవిస్తున్నాం. ఆయన అందించిన సేవలకు కృతజ్ఞతలు' అని ఓపెన్ ఏఐ బోర్డు బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించింది. హార్వర్డ్ విశ్వవిద్యాలయం మాజీ అధ్యక్షుడు అయిన సమ్మర్స్.. 2023 నవంబరులో ఓపెన్ ఏఐలో చేరారు. పాత బోర్డు.. ఆ సంస్థ సీఈవో శామ్ ఆల్ట్‌మాన్‌ను తొలగించగా.. సమ్మర్స్ వచ్చి మళ్లీ తీసుకొచ్చారు.

ప్రాసెస్డ్ ఆహారంతో ప్రబలుతున్న దీర్ఘకాలిక వ్యాధులు

దిల్లీ: చక్కెర, ఉప్పు, కొవ్వు వంటి ఆరోగ్యానికి హానికరమైన పదార్థాలు ఎక్కువగా ఉండే అల్ట్రాప్రాసెస్డ్ ఆహార పదార్థాలను తినడం ప్రపంచ వ్యాప్తంగా పెరిగిపోయిందని, రానున్న రోజుల్లో ఏమాత్రం ప్రాసెస్ చేయని శుద్ధ ఆహారాన్ని తీసుకోవడం పూర్తిగా కనుమరుగయ్యే అవకాశం ఉందని లాన్సెట్ జర్నల్ ప్రచురించిన ఒక అధ్యయన పత్రం పేర్కొంది. ఇలాంటి ఆహారాన్ని తీసుకోవడం అధికమవుతుండటంతో ప్రపంచ వ్యాప్తంగా దీర్ఘకాల రోగాలు ప్రబలిపోతున్నాయని వెల్లడించింది. 'అల్ట్రా ప్రాసెస్డ్ ఫుడ్స్ అండ్ హ్యూమన్ హెల్త్' అనే శీర్షికతో ఈ జర్నల్ మూడు కథనాలను ప్రచురించింది. అతిగా ప్రాసెస్ చేసిన ఆహారాన్ని నిర్మూలించి ప్రపంచ వ్యాప్తంగా ఆహార నాణ్యతను పెంచాల్సిన అవసరాన్ని ఈ కథనాలు నొక్కి చెప్పాయి. ఇందుకు కేవలం వినియోగదారుల ఆహారపు అలవాట్లలో మార్పు తెస్తే సరిపోదని అల్ట్రా ప్రాసెస్డ్ ఆహారాన్ని నియంత్రించడానికి సమన్వయంతో కూడుకున్న విధానాల రూపకల్పన అవసరమని పేర్కొన్నాయి. ఆ తరహా ఆహార పదార్థాల ఉత్పత్తి, మార్కెటింగ్, వినియోగాలను నియంత్రించాల్సిన అవసరం ఉందని వెల్లడించాయి.

నా తల్లిని భారత్ రక్షించింది

- ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలిపిన హసీనా కుమారుడు



దిల్లీ/ఢాకా: తన తల్లిని హత్య చేయాలన్న కుట్ర జరిగిందని, అయితే ఆమెను సకాలంలో భారత్ రక్షించిందని బంగ్లా మాజీ ప్రధాని షేక్ హసీనా కుమారుడు సాజిబ్ వాజెద్ తెలిపారు. ఇందుకు తాను మోదీకి కృతజ్ఞతలు తెలుపుతున్నానని చెప్పారు. విద్యార్థుల ఉద్యమం కారణంగా గతేడాది ఆగస్టు 5న బంగ్లా ప్రధాని పదవికి రాజీనామా చేసి హసీనా భారత్‌కు పారిపోయి వచ్చిన సంగతి తెలిసిందే. అయితే ఆ సమయంలో తన తల్లిని చంపేందుకు ఉగ్రవాదులు ప్రణాళికలు రచించారని, భారత్ రక్షించిందని వాజెద్ అన్నారు. తన తల్లికి బంగ్లాదేశ్ ట్రైబ్యునల్ ఇటీవల విధించిన మరణశిక్ష రాజ్యాంగ విరుద్ధం, అక్రమమని పేర్కొన్నారు. "భారత్ ఎల్లప్పుడూ మంచి మిత్రదేశంగా ఉంది. సంక్షోభ సమయంలో నా తల్లి ప్రాణాలు కాపాడింది. ఆమె (హసీనా) బంగ్లాదేశ్ వీడకపోయి ఉంటే మిలిటెంట్లు ఆమె హత్యకు కుట్రలు చేసేవారు. నా తల్లి ప్రాణాలు కాపాడినందుకు ప్రధాని మోదీ ప్రభుత్వానికి నేను ఎల్లప్పుడూ కృతజ్ఞుడిని. అప్పగింత జరగాలంటే న్యాయ ప్రక్రియను అనుసరించాలి. బంగ్లాదేశ్‌లో ప్రస్తుతం రాజ్యాంగ, చట్టవిరుద్ధమైన ప్రభుత్వం ఉంది. నా తల్లిని దోషిగా నిర్ధారించేందుకు, విచారణను త్వరగా ముగించేందుకు చట్టాలను సవరించారు. పార్లమెంటు అనుమతి లేకుండా చట్టాలను సవరించలేం. న్యాయవాదులను పెట్టుకునేందుకు కూడా నా తల్లిని అనుమతించలేదు. విచారణకు ముందే 17 మంది న్యాయమూర్తులను తొలగించి ధర్మాసనంలో ఎలాంటి అనుభవం లేని కొత్త జడ్జిలను నియమించారు. వారికి రాజకీయ సంబంధాలు ఉన్నాయి" అని సాజిబ్ వాజెద్ అన్నారు. లష్కరే తయ్యిబా ఉగ్రవాదుల అడ్డాగా బంగ్లాదేశ్ మారిందని తెలిపారు. ఈ ఉగ్రవాద సంస్థకు యూనస్ నేతృత్వంలోని ప్రస్తుత ప్రభుత్వం అండదండలందిస్తోందని ఆరోపించారు.

ఇంటర్‌పోల్‌ను ఆశ్రయించనున్న బంగ్లాదేశ్

షేక్ హసీనా అప్పగింత విషయంలో ఇంటర్‌పోల్ సాయాన్ని అభ్యర్థించాలని బంగ్లాదేశ్ నిర్ణయించింది. ఈ మేరకు కసరత్తు చేస్తున్నట్లు ఆ దేశ ప్రాసిక్యూటర్ గాజీ తమీమ్ తెలిపారు. హసీనాతో పాటు, బంగ్లా మాజీ హోంమంత్రి అసదుజ్జమాన్ ఖాన్ కమాల్‌కు బంగ్లాదేశ్ అంతర్జాతీయ నేర ట్రైబ్యునల్ ఇటీవల మరణశిక్ష విధించిన సంగతి తెలిసిందే. వీరిపై రెడ్ నోటీసులు జారీ చేయాలని గతంలో ఇంటర్‌పోల్‌కు బంగ్లాదేశ్ విజ్ఞప్తి చేస్తూ లేఖ పంపింది. తాజాగా మరణశిక్ష పడటంతో మళ్లీ దరఖాస్తు పంపించాలని నిర్ణయించింది.

ఏబీసీ న్యూస్ లైసెన్సును రద్దు చేస్తా

- విలేకరి ప్రశ్నలతో ఆగ్రహం వ్యక్తంచేసిన ట్రంప్

న్యూయార్క్: సౌదీ యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్‌తో కలిసి మంగళవారం శ్వేతసౌధంలో ఏర్పాటు చేసిన సంయుక్త మీడియా సమావేశంలో పాల్గొన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. ఏబీసీ న్యూస్ విలేకరి మేరీ బ్రూస్‌పై అగ్గిమీద గుగ్గిలమయ్యారు. సంస్థ లైసెన్సును రద్దు చేస్తానని హెచ్చరించారు. ఆమె ఓ ఉగ్ర జర్నలిస్టు అని ధ్వజమెత్తారు. మీడియా సమావేశంలో నేతలిద్దరినీ ఏబీసీ న్యూస్ చీఫ్ కరస్పాండెంట్ అయిన మేరీ బ్రూక్ 3 ప్రశ్నలు అడిగారు.

✦ ట్రంప్‌ను ఉద్దేశించి.. 'అధ్యక్షుడిగా ఉన్నప్పుడు.. సౌదీ అరేబియాలో మీ కుటుంబం వ్యాపారం చేయడం సమంజసమేనా..' అని అడిగారు.

సల్మాన్‌ను ఉద్దేశించి.. 'జర్నలిస్టు ఖషోగ్గీని మీరే హత్య చేయించారని అమెరికా నిఘా వర్గాలు నిర్ధారణకు వచ్చాయి.. ఈ సమయంలో మీరు అధ్యక్షుడి కార్యాలయంలో ఉండటంపై సెప్టెంబరు 11 బాధితులు ఆగ్రహంగా ఉన్నారు.. మిమ్మల్ని అమెరికన్లు ఎందుకు నమ్మాలి..' అని ప్రశ్నించారు.

✦ అదే ప్రశ్నను అధ్యక్షుడికీ సంధించారు.

ట్రంప్ సమాధానమిస్తూ.. సౌదీ అరేబియాలో తన కుటుంబ వ్యాపారాలను సమర్థించుకున్నారు. ఖషోగ్గీ హత్యలో అమెరికా నిఘా విభాగం ఇచ్చిన నివేదికను తోసిపుచ్చారు. యువరాజు సల్మాన్ స్పందిస్తూ.. ఖషోగ్గీ హత్య బాధాకరమని, పెద్ద తప్పిదమని పేర్కొన్నారు. అనంతరం ట్రంప్ స్పందిస్తూ విలేకరిపై విరుచుకుపడ్డారు. 'ఏబీసీ న్యూస్ లైసెన్సు వెనక్కి తీసుకోవాలని ఆలోచిస్తున్నా. ఎందుకంటే మీవన్నీ ఫేక్ న్యూస్. మీరు 97శాతం ట్రంప్‌పై వ్యతిరేకతతో ఉంటారు. ఎన్నికల్లో నేను భారీ మెజారిటీతో గెలిచానంటే మీవన్నీ నమ్మదగిన వార్తలు కావని అర్థం' అని వ్యాఖ్యానించారు.

✦ అమెరికాకు నాటోయేతర అతి పెద్ద మిత్ర దేశంగా సౌదీ అరేబియాను పరిగణిస్తున్నట్లు ట్రంప్ ప్రకటించారు. ఇరుదేశాల మధ్య రక్షణ, వాణిజ్య, భద్రతా సహకారాన్ని పెంపొందిస్తామని వెల్లడించారు.

ఆమె ధైర్యం, దేశభక్తి నాకు స్ఫూర్తి

- ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా రాహుల్

దిల్లీ: భారత మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా బుధవారం కాంగ్రెస్ ఘనంగా నివాళులర్పించింది. దేశం కోసం నిర్భయంగా నిర్ణయాలు తీసుకున్న ఆమె స్వభావం తనకు స్ఫూర్తినిస్తుందని రాహుల్ గాంధీ ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. ఇందిర స్మృతి చిహ్నం 'శక్తిస్థల్' వద్ద కాంగ్రెస్ అగ్రనాయకులు సోనియాగాంధీ, పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ నాయకుడు రాహుల్ గాంధీ నివాళులు అర్పించారు. "అన్యాయంపై పోరాడేందుకు ఆమె ధైర్యం, దేశభక్తి, నైతికత నాకు స్ఫూర్తినిస్తూనే ఉంటాయి. ఎలాంటి పరిస్థితుల్లోనైనా దేశ ప్రయోజనాలే ముఖ్యమని ఆమె నుంచి ప్రేరణ పొందాను" అని రాహుల్ 'ఎక్స్'లో పేర్కొన్నారు.

దేశ పురోగతిపై చెరగని ముద్ర: ఖర్గే


"అపారమైన రాజకీయ ధైర్యాన్ని ప్రదర్శించిన ఇందిరాగాంధీ క్రియాశీల నాయకత్వం ఎప్పటికీ స్ఫూర్తిగా నిలుస్తుంది. ఆమె అచంచలమైన సంకల్పం, దేశ ప్రజలకు సేవ చేయాలనే అంకితభావం దేశ పురోగతిలో చెరగని ముద్ర వేశాయి. దేశ సమగ్రత, ఐక్యత సంరక్షణకు ఆమె చేసిన అంతిమ త్యాగానికి కోటి వందనాలు" అని మల్లికార్జున ఖర్గే 'ఎక్స్'లో తెలిపారు.

సంక్షేమ యుగానికి నాంది పలికారు: జైరాం రమేశ్

దేశంలో కల్లోల పరిస్థితులు ఏర్పడినప్పటికీ ఇందిరాగాంధీ ధైర్యంగా నిలబడి నాయకత్వం వహించారని, సంక్షేమ యుగానికి నాంది పలికారని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ కొనియాడారు.

శక్తి స్వరూపిణి: కాంగ్రెస్

'పలు రాజకీయ సవాళ్లు ఎదురైనప్పటికీ శక్తి స్వరూపిణి, ఇందిరా జీ ధైర్యంగా నిలబడి దేశాన్ని సమగ్ర అభివృద్ధితో ఆధునాతన ప్రపంచం వైపు నడిపించారు. న్యాయం, ఐక్యత, పురోగతి పట్ల ఆమెకు ఉన్న నిబద్ధత, క్రియాశీల నాయకత్వం కాంగ్రెస్‌ను ముందుకు నడిపించే మార్గంగా మారింది. పాక్ నుంచి బంగ్లాదేశ్ విముక్తి, దేశంలో వ్యవసాయ స్వయం సమృద్ధితో పాటు దేశ ప్రయోజనాల కోసం ప్రపంచ దేశాలకు సవాళ్లు విసిరారు' అని కాంగ్రెస్ అధికారిక వెబ్‌సైట్‌లో గుర్తుచేసుకుంది.



దిల్లీలోని సంవిధాన్ సదన్ సెంట్రల్ హాలులో బుధవారం ఇందిరా గాంధీ చిత్రపటానికి నివాళులు అర్పించిన రాహుల్‌గాంధీ, సోనియాగాంధీ, మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు తదితరులు

ఇందిర, లక్ష్మీబాయిలకు మోదీ నివాళులు

'మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ఆమెకు నివాళులు' అని ప్రధాని మోదీ బుధవారం 'ఎక్స్'లో పేర్కొన్నారు. రాణీ ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి సందర్భంగా మోదీ మరో పోస్టులో ఆమెకు నివాళులు అర్పించారు. మొదటి స్వాతంత్ర్య పోరులో ఆమె ధైర్యం, పరాక్రమం నేటికి ప్రజల హృదయాల్లో ఉత్సాహాన్ని నింపుతుంది' అని కొనియాడారు.

అల్ ఫలా ఛైర్మన్ అక్రమార్జన రూ.415 కోట్లు

- విదేశాలకు పారిపోయే యోచనలో ఉన్నారన్న ఈడీ
- 13 రోజుల కస్టడీకి అప్పగించిన కోర్టు

దిల్లీ: తమ అదుపులో ఉన్న అల్ ఫలా గ్రూపు ఛైర్మన్ జవాద్ అహ్మద్ సిద్దీకీ అక్రమంగా కొన్ని వందల కోట్లు ఆర్జించారని, దేశం విడిచి పారిపోయే యోచనలో ఉన్నారని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఆరోపించింది. ట్రస్టుకు చెందిన విద్యాసంస్థల్లోని విద్యార్థుల నుంచి అక్రమ మార్గాల్లో ఈ మొత్తాన్ని సంపాదించారని, దీనిపై మరింత లోతుగా ప్రశ్నించేందుకు రెండువారాలపాటు తమ కస్టడీకి అప్పగించాలని కోరింది. హరియాణాలోని ఫరీదాబాద్‌లో ఉన్న అల్ ఫలా విశ్వవిద్యాలయానికి, దిల్లీ ఎర్రకోట సమీపాన ఉగ్రదాడికి సంబంధం ఉన్న నేపథ్యంలో రోజంతా సోదాల అనంతరం సిద్దీకీని ఈడీ మంగళవారం అరెస్టు చేసిన విషయం తెలిసిందే. అర్ధరాత్రి దాటాక అదనపు సెషన్స్ న్యాయమూర్తి శీతల్ చౌధరీ ప్రధాన్ నివాసంలో అతనిని హాజరుపరిచారు. ఒంటిగంట వరకు వాదనలు కొనసాగాయి. విశ్వవిద్యాలయం, దానిని నియంత్రిస్తున్న ట్రస్టు కలిసి తప్పుడు గుర్తింపు పత్రాలతో విద్యార్థుల తల్లితండ్రుల్ని ప్రలోభపెట్టి కనీసం రూ.415.10 కోట్లను నేరపూరితంగా ఆర్జించినట్లు ఇంతవరకు బయటపడిందని ఈడీ తరఫు న్యాయవాదులు వివరించారు. అతని కుటుంబ సభ్యులు గల్ఫ్ దేశాల్లో నివసిస్తున్నారని, భారీ ఆర్థిక వనరులున్న సిద్దీకీ కూడా అక్కడికే పారిపోయే ప్రయత్నాల్లో ఉన్నట్లు తెలిపారు. పరారైపోతే ఈ కేసు విచారణకు అంతరాయం కలుగుతుందని చెప్పారు. ఆదాయపు పన్ను ఎగవేత కోణంలోనూ దర్యాప్తు చేయాల్సి ఉందని, నగదు అక్రమ చలామణి నిరోధక చట్టం కింద సకాలంలో ఆస్తుల జప్తు జరగాలని వివరించారు. అల్ ఫలా గ్రూపు సంస్థల ఆదాయానికి, ఆస్తులకు మధ్య చాలా అంతరం ఉందన్నారు. నేర తీవ్రత, దర్యాప్తు ఇంకా ప్రాథమిక దశలో ఉన్న దృష్ట్యా 13 రోజులపాటు కస్టడీకి అప్పగిస్తున్నట్లు న్యాయమూర్తి ప్రకటించి, ఆ మేరకు ఆదేశాలిచ్చారు.

20 ఏళ్లు దాటిన

వాహనాల ఫిట్‌నెస్ పరీక్ష ఫీజు భారీగా పెంపు

దిల్లీ: పాత వాహనాల వినియోగాన్ని తగ్గించేందుకు కేంద్రం పలు చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా ఇప్పటికే ఇటువంటి వాహనాల రెన్యువల్ ఫీజులను భారీగా పెంచిన ప్రభుత్వం.. తాజాగా 20 ఏళ్లు దాటిన వాహనాల ఫిట్‌నెస్ పరీక్ష ఫీజులను పెంచింది. రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ (మోర్త్) ఈ నెల 11న తేదీన జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం.. ఇక నుంచి వాణిజ్య వాహనాలకు 15 ఏళ్లకు బదులుగా 10ఏళ్లనే ప్రామాణికంగా తీసుకుంటారు. ఇందుకోసం 3 రకాలుగా వాహనాలను వర్గీకరించారు. అవి.. 10-15, 15-20, 20ఏళ్లకు పైబడినవి.

✦ ఇక నుంచి 20 ఏళ్లు దాటిన లైట్ మోటార్ వాహనాలకు (ఎల్ఎంవీలు) ఫిట్‌నెస్ పరీక్ష ఫీజు రూ.15,000 చెల్లించాలి. ఇది గతంలో రూ.10,000 ఉండేది.

✦ 20 ఏళ్లు దాటిన భారీ ట్రక్కులు, బస్సులకు గతంలో ఫిట్‌నెస్ పరీక్ష ఫీజు రూ.3,500 ఉండేది. దాన్ని ప్రస్తుతం రూ.25,000కు పెంచారు.

✦ 20 ఏళ్లు దాటిన మధ్యశ్రేణి వాణిజ్య వాహనాలకు ఫిట్‌నెస్ ఫీజు రూ.20,000 చెల్లించాలి.

✦ 20 ఏళ్లు దాటిన ద్విచక్ర వాహనాలకు ఇక నుంచి రూ.2,000 చెల్లించాలి. గతంలో ఇది రూ.600గా ఉండేది.

'ఓట్ల చోరీ' అంటూ ఈసీపై పసలేని ఆరోపణలు

- రాహుల్‌పై 272 మంది ప్రముఖుల ధ్వజం

దిల్లీ: సామర్థ్యంలేక ఎన్నికల్లో పదేపదే ఓడిపోతూ ఎన్నికల సంఘంపై (ఈసీ) కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ పసలేని ఆరోపణలు చేస్తున్నారని 272 మంది ప్రముఖులు విమర్శించారు. ఈసీ ప్రతిష్ఠను దెబ్బతీసేలా ఆయన.. నమ్మలేని అంశాలపై మొండిగా వాదిస్తున్నారని ఆరోపించారు. 'తీవ్రమైన ఆరోపణలు చేస్తున్న ఆయన ఎక్కడా అఫిడవిట్ రూపంలో ఫిర్యాదు చేయడం లేదు. తాను చేస్తున్న ఆరోపణల బాధ్యతల నుంచి తప్పించుకునేలా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వోద్యోగులు తమ విధులను సక్రమంగా నిర్వహించకుండా అడ్డుపడుతున్నారు' అని ఓ సంయుక్త ప్రకటనలో మాజీ న్యాయమూర్తులు, విశ్రాంత బ్యూరోక్రాట్లు, పదవీ విరమణ చేసిన సీనియర్ సైనికాధికారులు విమర్శించారు. పదే పదే ఓడిపోవడంతో అసహనానికి గురవుతున్న రాహుల్ గాంధీ.. ప్రజల మనసులను గెలిచేందుకు నిర్మాణాత్మక వ్యూహాల్లేకుండా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. నేషనల్ గ్రీన్ ట్రైబ్యునల్ ఛైర్మన్ ఆదర్శ్ కుమార్ గోయెల్, మాజీ జడ్జీలు జస్టిస్ ఎస్.ఎన్.ధింగ్రా, జస్టిస్ హేమంత్ గుప్తా, 'రా' మాజీ చీఫ్ సంజీవ్ త్రిపాఠి తదితరులు ప్రకటనపై సంతకాలు చేశారు.

లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు

- 14 మంది మృతి

సైడాన్ (లెబనాన్): లెబనాన్‌పై ఇజ్రాయెల్ విరుచుకుపడుతోంది. గత 24 గంటలుగా వివిధ ప్రాంతాల్లో బాంబుల వర్షం కురిపించింది. ఈ దాడుల్లో 14 మంది మృతి చెందారు. సైడాన్ నగరంలోని శరణార్థి శిబిరంపై చేసిన దాడిలోనే 13 మంది ప్రాణాలు కోల్పోయారు. హమాస్, హెజ్‌బొల్లా నెట్‌వర్క్‌లే లక్ష్యంగా ఈ వైమానిక, డ్రోన్ దాడులు నిర్వహిస్తున్నామని ఇజ్రాయెల్ పేర్కొంది.

నల్సా కార్యనిర్వాహక అధ్యక్షుడిగా జస్టిస్ విక్రమ్‌నాథ్



జస్టిస్ విక్రమ్‌నాథ్

ఈనాడు, దిల్లీ: జాతీయ న్యాయ సేవల ప్రాధికార సంస్థ (నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ-నల్సా) కార్యనిర్వాహక అధ్యక్షుడిగా సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విక్రమ్‌నాథ్ నియమితులయ్యారు. ఈ నెల 24 నుంచి జస్టిస్ విక్రమ్‌నాథ్ నియామకం అమల్లోకి వస్తుంది. ఈ మేరకు కేంద్ర న్యాయశాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు ఈ పదవిలో జస్టిస్ సూర్యకాంత్ ఉన్నారు. ఈ నెల 23న సీజేఐ జస్టిస్ గవాయ్ పదవీ విరమణ చేసిన తర్వాత 24న జస్టిస్ సూర్యకాంత్ ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టబోతున్నారు. దాంతో ఆ స్థానంలో జస్టిస్ విక్రమ్‌నాథ్‌ను నియమిస్తూ న్యాయశాఖ ఉత్తర్వులు వెలువరించింది. సుప్రీంకోర్టు న్యాయమూర్తుల్లో సీనియారిటీ పరంగా రెండో స్థానంలో ఉన్న వారిని ఈ పదవిలో నియమిస్తారు. జస్టిస్ సూర్యకాంత్ ప్రధాన న్యాయమూర్తి పదవి నుంచి 2027 ఫిబ్రవరి 9న పదవీ విరమణ చేసిన తర్వాత సీజేఐ స్థానంలోకి జస్టిస్ విక్రమ్‌నాథ్ రానున్నారు. ఆయన 2027 సెప్టెంబరు 23 వరకు ఆ పదవిలో ఉంటారు. వీరి స్వరాష్ట్రం ఉత్తర్‌ప్రదేశ్. ఇదివరకు అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తిగా, గుజరాత్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా సేవలందించారు. 2021 ఆగస్టు 31న సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టారు. గుజరాత్‌హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఉన్నప్పుడు కోర్టు కార్యకలాపాలను యూట్యూబ్ ద్వారా ప్రత్యక్షంగా ప్రసారం చేయించిన తొలి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పేరుపొందారు.

రేపటి నుంచి మోదీ దక్షిణాఫ్రికా పర్యటన

దిల్లీ: దక్షిణాఫ్రికా ఆధ్వర్యంలో జరగనున్న జీ20 దేశాల 20వ శిఖరాగ్ర సదస్సులో పాల్గొనేందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈనెల 21 నుంచి 23 వరకు జొహన్నెస్‌బర్గ్‌లో పర్యటిస్తారు. వరుసగా నాలుగో దఫా దక్షిణార్ధ గోళంలో ఈ శిఖరాగ్ర సదస్సు జరగడం విశేషం. సదస్సులో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ జీ20 ఎజెండాపై భారత వైఖరిని స్పష్టం చేస్తారు. ఈ సమావేశంలో భాగంగా జరిగే మూడు సెషన్లలోనూ ఆయన ప్రసంగించనున్నారు. ఈ సందర్భంగా మోదీ పలువురు ప్రపంచ దేశాధినేతలతో ద్వైపాక్షిక చర్చలు జరుపుతారని భావిస్తున్నారు. దక్షిణాఫ్రికా నిర్వహించే ఇండియా - బ్రెజిల్- దక్షిణాఫ్రికా సమావేశంలో కూడా మోదీ పాల్గొంటారని విదేశీ వ్యవహారాల శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

కేంద్రీకృత పర్యవేక్షణే వన్యప్రాణి సంరక్షణకు హేతువు: సుప్రీం

దిల్లీ: దేశంలో పెద్ద పులుల సంరక్షణ విజయవంతం కావడానికి నిరంతర కేంద్రీకృత పర్యవేక్షణే కారణమని సుప్రీంకోర్టు బుధవారం అభిప్రాయపడింది. బట్టమేక పిట్ట (గ్రేట్ ఇండియన్ బస్టర్డ్) సంరక్షణకు సంబంధించిన ఒక వ్యాజ్యంపై తీర్పును రిజర్వు చేస్తూ జస్టిస్ పి.ఎస్.నరసింహ, జస్టిస్ ఎ.ఎస్.చందూర్కర్‌లతో కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. రాజస్థాన్, గుజరాత్‌లలో అధికంగా ఉండే బట్టమేక పిట్ట క్రమంగా అంతరించిపోతోంది. తమ నివాస ప్రాంతాల్లోని విద్యుత్ ట్రాన్స్‌మిషన్ లైన్లు, సౌర విద్యుత్ లైన్లతో ఢీకొంటున్న కారణంగా ఇవి అంతరించిపోతున్నాయి. ఈ పిట్టల కళ్లు పక్కలకు ఉండటంతో అవి ఎగిరే సమయంలో ఎదురుగా వచ్చే విద్యుత్ తీగల్ని తప్పించుకునేందుకు ఎగిరే దిశ మార్చుకోలేకపోతున్నాయి. ఈ వ్యాజ్యంపై అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్యా భాటి కేంద్ర ప్రభుత్వం తరఫున వాదనలు వినిపించారు. వన్యప్రాణి సంరక్షణ ప్రభుత్వ బాధ్యతని ఆమె స్పష్టం చేశారు. వాదోపవాదాల సందర్భంగా ధర్మాసనం.. 1973లో ప్రారంభమైన పెద్ద పులుల సంరక్షణ ప్రాజెక్టును ప్రస్తావించింది. కేంద్రీకృత పర్యవేక్షణే పెద్ద పులుల సంరక్షణ ప్రాజెక్టు విజయానికి ప్రధాన కారణమని, బట్టమేక పిట్టల సంరక్షణకు అలాంటి కేంద్ర అధికారి ఎవరని న్యాయమూర్తులు ప్రశ్నించారు. అలాంటి కేంద్రీకృత ప్రాధికార సంస్థగానీ, అధికారిగానీ లేరని కోర్టుకు ఐశ్వర్యా భాటి తెలియజేశారు.

విస్తృత ధర్మాసనానికి నివేదించే విషయం పరిశీలిస్తాం

- తలాక్-ఎ-హసన్‌పై సుప్రీంకోర్టు

దిల్లీ: భారతీయ ముస్లింలు ఆచరిస్తున్న తలాక్-ఎ-హసన్ అనే విడాకుల పద్ధతి చెల్లుబాటవుతుందా లేదా అన్నది ఐదుగురు సభ్యుల విస్తృత రాజ్యాంగ ధర్మాసనానికి నివేదించే విషయం పరిశీలిస్తామని సుప్రీంకోర్టు బుధవారం పేర్కొంది. ఈ తరహా విడాకుల్లో భర్త తరఫున భార్యకు మరొకరు నోటీసు ఇచ్చే పద్ధతిని తప్పుబట్టింది. తన భార్యకు విడాకులిచ్చే క్రమంలో ఒక వ్యక్తి నెలకోసారి "తలాక్" అనే మాటను ఆమెను ఉద్దేశించి ఉచ్చరిస్తారు. ఇలా మూడు నెలల పాటు ప్రకటిస్తే విడాకుల ప్రక్రియ పూర్తవుతుంది. ఆలోగా భార్యాభర్తల మధ్య సయోధ్య కుదిరితే ఈ ప్రక్రియ ఆగిపోతుంది. ముమ్మారు (ట్రిపుల్) తలాక్ పేరుతో ప్రాచుర్యం పొంది, ముస్లింలు ఆచరించిన మరో విడాకుల పద్ధతి రాజ్యాంగ విరుద్ధమని 2017లో అత్యున్నత న్యాయస్థానం తీర్పు వెలువరించిన విషయం తెలిసిందే. తలాక్-ఎ-హసన్ పద్ధతిలో ముస్లిం భర్తలు తమ భార్యలకు ఇతరుల ద్వారా, ముఖ్యంగా న్యాయవాది ద్వారా, విడాకుల నోటీసు ఇచ్చే పద్ధతిని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల్ భుయాన్, జస్టిస్ ఎన్.కోటీశ్వర్ సింగ్‌ల ధర్మాసనం తీవ్రంగా తప్పు పట్టింది.

విమర్శిస్తే తప్పులేదుగానీ.. అందరినీ ఒకే గాటన కట్టొద్దు

- హైకోర్టును విమర్శించిన వ్యక్తికి సుప్రీం హితవు

దిల్లీ: న్యాయ వ్యవస్థపై విమర్శలు చేస్తే తమకు అభ్యంతరం లేదుగానీ.. అందరినీ ఒకే గాటన కట్టేలా వ్యాఖ్యలు చేయరాదని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. పంజాబ్, హరియాణా హైకోర్టు న్యాయమూర్తులపై ఆరోపణలు చేసిన సామాజిక కార్యకర్త పర్దీప్ శర్మను హెచ్చరించి వదిలేసింది. 'అనేక మంచి విషయాల్ని మీరు లేవనెత్తారుగానీ.. మీరు అందరినీ ఒకే గాటన కడుతూ ఏకపక్ష ఆరోపణలు చేయడం తగదు. న్యాయ వ్యవస్థపై విమర్శలు చేస్తే మాకు అభ్యంతరం లేదు. అయితే ఆ విమర్శలు ఒక పద్ధతి ప్రకారం ఉండాలి' అని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల్ భుయాన్, జస్టిస్ ఎన్.కోటీశ్వర్ సింగ్‌లతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. పిటిషనరు బేషరతుగా క్షమాపణ తెలపడంతో హైకోర్టు ఆయనను కోర్టు ధిక్కార నేరం నుంచి విముక్తుణ్ని చేసిందని ఆయన తరఫు న్యాయవాది అత్యున్నత న్యాయస్థానానికి తెలియజేశారు. అయితే పిటిషనరు చండీగఢ్‌లో మొక్కలు నాటాలని హైకోర్టు ఆదేశించిందని వివరించారు. చండీగఢ్‌లో పచ్చదనం అవసరమేనని, హైకోర్టు అలా ఆదేశించడం స్వాగతించదగినదేనని జస్టిస్ సూర్యకాంత్ వ్యాఖ్యానించారు.

అవయవాల మార్పిడిపై జాతీయ విధానం

- కేంద్రానికి సుప్రీంకోర్టు ఆదేశం

దిల్లీ: రాష్ట్రాలను సంప్రదించి దేశమంతటికీ ఒకే విధమైన అవయవ మార్పిడి విధానాన్ని, నిబంధనలను రూపొందించాలని కేంద్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. అవయవాల దానంలో, వాటిని కేటాయించడంలో పారదర్శకతను తీసుకురావడంతో పాటు సమర్థమైన వ్యవస్థను రూపొందించాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్ ధర్మాసనం సూచించింది. 'ఇండియన్ సొసైటీ ఆఫ్ ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంటేషన్' దాఖలు చేసిన ప్రజాహిత వ్యాజ్యంపై విచారణ సందర్భంగా ఈ ఆదేశాలను జారీ చేసింది.

కోర్టు మార్గదర్శకాల్లో ముఖ్యమైనవి.. : ✦ మానవ అవయవాల మార్పిడి చట్టం(1994)కు 2011లో చేసిన సవరణలను స్వీకరించి అమలుపరిచేలా ఆంధ్రప్రదేశ్‌ను ఒప్పించాలి. ✦ 2014లో తీసుకొచ్చిన 'మానవ అవయవాలు, కణాల మార్పిడి నిబంధనల'ను కర్ణాటక, తమిళనాడు, మణిపుర్ రాష్ట్రాలు ఇంకా అమలు చేయడం లేదు. సత్వరమే పాటించేలా ఆయా రాష్ట్రాలను ఒప్పించాలి. ✦ అవయవాలు, కణాల మార్పిడికి సంబంధించి అండమాన్-నికోబార్, లక్షద్వీప్ కేంద్ర పాలిత ప్రాంతాలు, మణిపుర్, నాగాలాండ్ రాష్ట్రాలకు ఇప్పటికీ సొంత సంస్థలు లేవు. వాటిని ఏర్పాటు చేయాలి. ✦ అవయవ దాతల సంక్షేమానికి, వారు మోసాలకు గురికాకుండా చేయడానికి మార్గదర్శకాలను రూపొందించాలి. ✦ అవయవ మార్పిడిలో కుల, లింగ వివక్షతలను రూపుమాపాలి.

కుమార్తెపై అత్యాచారం.. కేరళలో తండ్రికి 178 ఏళ్ల జైలుశిక్ష

మలప్పురం: కన్న కూతురిపై అత్యాచారానికి పాల్పడిన ఓ కామాంధుడికి 178 ఏళ్ల కఠిన కారాగార శిక్షను విధిస్తూ కేరళలోని ఓ కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. బాధిత బాలిక మలప్పురం జిల్లా అరీకోడ్ పట్టణ వాస్తవ్యురాలు. 2022 జూన్‌లో ఎనిమిదేళ్ల కుమార్తెపై తండ్రి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఆపై మరో రెండుసార్లు ఈ దారుణానికి ఒడిగట్టాడు. బాధిత బాలిక దారుణాన్ని తల్లికి చెప్పింది. దీంతో ఆమె ఆగ్రహంతో భర్తను నిలదీయడంతో అతడు ఇంటి నుంచి వెళ్లిపోయాడు. కొన్ని రోజులకు బాలిక చదివే తరగతిలో మంచి, చెడు స్పర్శలపై ఓ టీచర్ పాఠాన్ని చెబుతుండగా.. బాధిత బాలిక తనకు జరిగిన విషయాన్ని చెప్పేసింది. టీచర్ ఫిర్యాదు మేరకు అరీకోడ్ పోలీసులు కేసు నమోదు చేశారు.

'బిల్లుల ఆమోదానికి రాష్ట్రపతికి గడువు విధింపు'పై తీర్పు నేడు

దిల్లీ: రాష్ట్రాల శాసనసభలు ఆమోదించి పంపించిన బిల్లులకు సమ్మతి తెలిపే విషయంలో రాష్ట్రపతి, గవర్నర్లకు న్యాయస్థానం గడువు విధించడంపై దేశ ప్రథమ పౌరురాలు ద్రౌపదీ ముర్ము సంధించిన ప్రశ్నల (ప్రెసిడెన్షియల్ రిఫరెన్స్)పై సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం గురువారం తీర్పు వెలువరించనుంది. సీజేఐ జస్టిస్ బి.ఆర్.గవాయ్ నేతృత్వంలోని ఈ ధర్మాసనంలో జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ పి.ఎస్.నరసింహ, జస్టిస్ ఎ.ఎస్.చందూర్కర్ సభ్యులుగా ఉన్నారు. పది రోజుల పాటు అన్ని పక్షాల వాదనలను ఆలకించిన ధర్మాసనం సెప్టెంబరు 11న తీర్పు రిజర్వు చేసింది. రాజ్యాంగ అధికరణం 143(1) ప్రకారం తనకున్న అధికారాన్ని వినియోగిస్తూ రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము మే నెలలో పలు ప్రశ్నలతో సీజేఐకి లేఖ రాశారు. రాష్ట్రపతి విచక్షణ అధికారాల పరిధిలోకి వచ్చే రాష్ట్రాల బిల్లులకు ఆమోదం అంశంలో న్యాయస్థానం గడువు విధించడం ఎంత వరకు న్యాయ సమ్మతమో తెలపాలంటూ సుప్రీంకోర్టు అభిప్రాయాన్ని కోరారు.

టిబెటన్ ఆధ్యాత్మిక గురువు సోనమ్ లామా మాతృభూమి సేవ





హాంకాంగ్ నుంచి ఛత్తీస్‌గఢ్‌లోని సర్గూజాకు ఏటా వచ్చే టిబెటన్ ఆధ్యాత్మిక గురువు సోనమ్ లామా (54) ఈ ఏడాది కూడా బాలల కోసం పలు కానుకలు తీసుకొచ్చారు. స్థానిక ఆదివాసీ, ఆదివాసీయేతర విద్యార్థులకు స్వెటర్లు, చెప్పులు, బూట్లు, దుప్పట్లు తదితర అవసరమైన వస్తువులను అందజేశారు. తన కుటుంబం సూచన మేరకు గత తొమ్మిదేళ్లుగా ఈ సేవా కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నానని, ఇది తన బాధ్యతగా ఆయన తెలిపారు. ఇదే జిల్లాలో 'మినీ టిబెట్'గా పేరొందిన కొండప్రాంతం మైన్‌పాట్‌లో పుట్టిన సోనమ్ లామా హాంకాంగ్ చేరుకొని అక్కడ ఆధ్యాత్మిక గురువుగా ఉన్నారు. అక్కడి దాతల నుంచి సేకరించిన విరాళాలు, వస్తువులను స్వస్థలంలోని పేదలకు, చిన్నారులకు ఏటా ఇలా స్వయంగా పంచిపెడుతున్నారు. విదేశాల్లో ఉన్నత స్థానంలో ఉన్నప్పటికీ మాతృభూమిని మరిచిపోకుండా ఇలా ఏటా వచ్చి సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని స్థానికుడైన బిట్టూ సింగ్ తెలిపారు.

నక్సలైట్లతో ఎదురుకాల్పులు.. మధ్యప్రదేశ్ ఇన్‌స్పెక్టర్ మృతి

రాజ్‌నంద్‌గావ్: ఛత్తీస్‌గఢ్-మధ్యప్రదేశ్ సరిహద్దులో బుధవారం నక్సలైట్లు, పోలీసులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో మధ్యప్రదేశ్‌కు చెందిన పోలీసు ఇన్‌స్పెక్టర్ ఆశిశ్ శర్మ మృతి చెందారు. నిఘా వర్గాల సమాచారం మేరకు ఛత్తీస్‌గఢ్‌లోని బోరతలావ్ సమీపంలోని కంగురా అడవిలో రెండు రాష్ట్రాలకు చెందిన భద్రతా సిబ్బంది నక్సలైట్ల కోసం గాలింపు చర్య చేపట్టారు. ఈ సందర్భంగా ఇరుపక్షాల మధ్య ఎదురుకాల్పులు చోటు చేసుకున్నాయి. ఈ ఘటనలో మధ్యప్రదేశ్ పోలీసు దళానికి చెందిన ఆశిశ్ శర్మ తీవ్ర గాయాలపాలయ్యారు. ఆయన్ను వెంటనే చికిత్స కోసం వాయుమార్గంలో డోంగార్‌గఢ్‌లోని ఆసుపత్రికి తరలించారు. అక్కడ ఆయన చికిత్స పొందుతూ మరణించారని ఓ పోలీసు అధికారి వెల్లడించారు.

ఆర్వో ప్లాంట్లను 45 రోజుల్లో పూర్తి చేయాలి

బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత

ఈనాడు, అమరావతి: బీసీ గురుకులాలు, వసతిగృహాల్లో చేపట్టిన ఆర్వో ప్లాంట్ల ఏర్పాట్లను 45 రోజుల్లో పూర్తి చేయాలని అధికారులను బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత బుధవారం ఓ ప్రకటనలో ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా 922 బీసీ వసతిగృహాల్లో ఆర్వో ప్లాంట్లకు రూ.16.85 కోట్లు, 55 గురుకులాల్లో ఆర్వో ప్లాంట్లకు రూ.3.44 కోట్లు ప్రభుత్వం విడుదల చేసిందని తెలిపారు. విద్యార్థులకు సురక్షిత నీరు అందించడంలో జాప్యం జరగకూడదని స్పష్టం చేశారు.

హడ్కో రుణాలు చెల్లించేందుకు ఏడీసీఎల్‌కు రూ.75 కోట్లు విడుదల

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో విమానాశ్రయాల అభివృద్ధి పనులకు హౌసింగ్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (హడ్కో) నుంచి తీసుకున్న రుణాలను తిరిగి చెల్లించేందుకు ఏపీ విమానాశ్రయాల అభివృద్ధి సంస్థ (ఏడీసీఎల్‌)కు రూ.75 కోట్లు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు తగిన చర్యలు తీసుకోవాలని ఏపీఏడీసీఎల్ ఎండీని ఆదేశించింది.

అంబేడ్కర్ స్టడీ సర్కిళ్లలో వసతుల కల్పనకు నిధుల మంజూరు

ఈనాడు, అమరావతి: విశాఖ, విజయవాడ, తిరుపతిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్టడీ సర్కిళ్లలో వసతుల కల్పనకు ప్రభుత్వం నిధులు మంజూరుచేసింది. మరమ్మతులు, బెడ్స్ కొనుగోళ్లకు రూ.19.60 లక్షలు విడుదల చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీచేసింది.

విశాఖ భాగస్వామ్య సదస్సు ఖర్చులకు రూ.5 కోట్లు విడుదల

ఈనాడు, అమరావతి: విశాఖలో ఈ నెల 14, 15న భాగస్వామ్య సదస్సు నిర్వహణ ఏర్పాట్లు చేసినవారికి రూ.5 కోట్లు విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. సదస్సు నిర్వహణ ఖర్చులు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిపాదనలు అందించారు. ఈ మేరకు నిధులు విడుదల చేస్తూ ఈ మొత్తాన్ని చెల్లించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్, పరిశ్రమల శాఖ కమిషనర్‌ను ఆదేశించింది.

చిన్నారికి నామకరణం చేసిన జగన్

ఈనాడు, అమరావతి: మంగళగిరి నియోజకవర్గం నూతక్కికి చెందిన బోళ్ల వెంకటరెడ్డి, చందనాదేవి దంపతుల కుమార్తెకు మాజీ సీఎం జగన్ నామకరణం చేశారు. బుధవారం జగన్‌ను ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి తమ కుమార్తెకు నామకరణం చేయాలని కోరగా.. ఈ మేరకు చిన్నారికి మోక్షితా రెడ్డి అని నామకరణం చేశారు.

పాలిటెక్నిక్‌ల ఆధునికీకరణకు రూ.కోటి

ఈనాడు, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న తొమ్మిది పాలిటెక్నిక్ కళాశాలల ఆధునికీకరణకు ప్రభుత్వం రూ.కోటి మంజూరుచేస్తూ ఉత్తర్వులు జారీచేసింది. కంప్యూటర్ ఇంజినీరింగ్ విభాగంలో పరికరాలు, యంత్రాల కొనుగోలుకు ఈ నిధులను ఖర్చు చేయనుంది. విజయవాడ, తిరుపతి, ప్రొద్దుటూరు, కర్నూలు, రాజమహేంద్రవరం, ఓబులవారిపల్లె, వేంపల్లె, కమలాపురం, ఆదోని పాలిటెక్నిక్‌లకు ఈ నిధులను మంజూరు చేసింది.

జమ్మలమడుగు వైకాపా సమన్వయకర్తగా ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి

ఈనాడు, అమరావతి: జమ్మలమడుగు శాసనసభ నియోజకవర్గ సమన్వయకర్తగా ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డిని వైకాపా నియమించింది. సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్‌గా మాజీ ఎమ్మెల్యే ఎం.సుధీర్‌కుమార్ రెడ్డిని నియమిస్తూ వైకాపా కేంద్ర కార్యాలయం బుధవారం ఓ ప్రకటన విడుదల చేసింది.

హిడ్మా స్వగ్రామంలో అలుముకున్న నిశ్శబ్దం

చర్ల, న్యూస్‌టుడే: మద్వి హిడ్మా మరణవార్తతో ఆదివాసీ ప్రాంతాల్లో నిశ్శబ్ద వాతావరణం అలుముకుంది. ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు అగ్రనేత 'హిడ్మా' చనిపోవడంతో ఛత్తీస్‌గఢ్‌లోని ఆయన సొంత గ్రామమైన 'పువర్తి'లో బుధవారం విషాద వాతావరణం నెలకొంది. ఇక్కడి ఆదివాసీలు మీడియాతో మాట్లాడేందుకు నిరాకరించారు. పువర్తిలోని బండేపారలో హిడ్మా నివాసం ఉంది. ఆ ఇంట్లో ఆయన తల్లి పుంజి మాత్రమే నివాసముంటున్నారు. హిడ్మా మరణవార్తతో ఆ ఇంటికి పెద్దఎత్తున నేషనల్ మీడియా బృందం చేరుకోగా.. పుంజి విలపిస్తూ కనిపించారు. ఆయన కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి.

డిప్యుటేషన్ల మంత్రం.. అక్రమాల తంత్రం

- బదిలీ చేసిన పంచాయతీల్లోనే చక్రం తిప్పుతున్న కార్యదర్శులు
- అవినీతికి అంటకాగుతున్న జిల్లా పంచాయతీ అధికారులు

ఈనాడు, అమరావతి: కృష్ణా జిల్లాలో మూడు కీలక పంచాయతీల్లో కార్యదర్శులు డిప్యుటేషన్‌పై సేవలు అందిస్తున్నారు. ఎన్టీఆర్ జిల్లాలో అత్యధిక వార్షికాదాయం కలిగిన మరో పంచాయతీలో సమీపంలోని ఇంకో పంచాయతీ కార్యదర్శి డిప్యుటేషన్‌పై పనిచేస్తున్నారు. ఆస్తి పన్ను, పన్నేతర ఆదాయం, ఆర్థిక సంఘం నిధులు ఎక్కువగా వస్తున్న కృష్ణా, ఎన్టీఆర్‌తోపాటు గుంటూరు, బాపట్ల, పల్నాడు, ఏలూరు, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో 150కిపైగా పంచాయతీల్లో కార్యదర్శులు ఇలాగే చక్రం తిప్పుతున్నారు. కార్యదర్శులకు కొరత లేకపోయినా.. వేర్వేరుచోట్ల ఇప్పటికే పనిచేస్తున్న కార్యదర్శులు కొందరిని ఏరికోరి డిప్యుటేషన్లపై అధికారులు నియమిస్తున్నారు. వీరు తమ పంచాయతీల్లో పరిపాలన వ్యవహారాలు చూస్తూనే వేరొక పంచాయతీలో పని చేయాలి. ఇది సాధ్యమయ్యే పనేనా? జిల్లా పంచాయతీ అధికారులు కలెక్టర్లను ఒప్పించి మరీ కార్యదర్శులను డిప్యుటేషన్లపై ఎందుకు నియమిస్తున్నారు? ఈ ప్రశ్నలకు 'లంచగొండితనమే' అన్న సమాధానం బహిరంగంగానే వినిపిస్తోంది.

నిబంధనలకు తూట్లు

ఒక పంచాయతీలో పనిచేసే గ్రేడ్-1 కార్యదర్శులు వేరొక ప్రాంతానికి బదిలీపై వెళ్లడానికి ఇష్టపడడం లేదు. ఐదేళ్లపాటు ఒకేచోట పనిచేసినవారిని నిబంధనల ప్రకారం బదిలీ చేయాలి. ఇందుకోసం జిల్లా పంచాయతీ అధికారుల సాయంతో కార్యదర్శులు డిప్యుటేషన్ అస్త్రం ప్రయోగిస్తున్నారు. జిల్లా అధికారులు వీరిని తప్పనిసరి పరిస్థితుల్లో బదిలీ చేసి మళ్లీ వెనక్కి తీసుకొచ్చేస్తున్నారు. గ్రేడ్-1 పంచాయతీల్లో రాష్ట్రవ్యాప్తంగా 250 మందికిపైగా ప్రస్తుతం ఇలాగే పనిచేస్తున్నట్లు తెలుస్తోంది. బదిలీ చేసిన ప్రాంతంలో వీరు పేరుకే పని చేస్తుంటారు. డిప్యుటేషన్‌పై వెళ్లిన పంచాయతీల్లోనే చక్రం తిప్పుతారు. అప్పటికే పనిచేసిన పంచాయతీ కావడమే ఇందుకు కారణం. ఈ విషయంలో జిల్లా పంచాయతీ అధికారులు కలెక్టర్లను తప్పుదోవ పట్టిస్తున్నారు.

ప్రతి పనికీ కార్యదర్శుల అక్రమ వసూళ్లు!

- ఇంటి నిర్మాణ అనుమతులకు (బిల్డింగ్ ప్లాన్ అప్రూవల్) కనిష్ఠంగా రూ.25వేలు, గరిష్ఠంగా రూ.2లక్షలు వసూలు చేస్తున్నారు.
- కొత్త ఇంటికి ఆస్తిపన్ను వేసేందుకు రూ.5-10 వేలు తీసుకుంటున్నారు.
- ఇళ్లనుంచి వ్యర్థాల సేకరణకు గ్రీన్ అంబాసిడర్ల సంఖ్య రికార్డుల్లో ఎక్కువ చూపించి తక్కువ మందితో పని చేయిస్తారు. మిగిలిన కార్మికుల జీతాలు తమ బినామీల బ్యాంకు ఖాతాల్లో వేయించుకుని సొమ్ము చేసుకుంటున్నారు.
- చెరువుల వేలం పాటలు ఎక్కువకు పాడించి తక్కువ మొత్తానికి చలానా కడుతున్నారు. మిగతా మొత్తాలు జేబులో వేసుకుంటున్నారు.
- బంధువుల పేర్లతో సీఎఫ్ఎంఎస్ ఐడీలు రూపొందించి రకరకాల అత్యవసర పనుల పేర్లతో నిధులు మళ్లించేస్తున్నారు.
- వీధి దీపాల నిర్వహణకు ఎలక్ట్రికల్ వస్తువులు కొనుగోలు చేసినట్లు బిల్లులు డ్రా చేస్తున్నారు. వాస్తవంగా ఎలక్ట్రికల్ వస్తువులు పంచాయతీలకు చేరవు.
- ప్రజల నుంచి ఆస్తిపన్ను వసూలు చేసి ఖాతాకు జమ చేయకుండా సొంతానికి వాడుకుంటున్నారు.
- పంచాయతీ కార్యాలయం తనిఖీలకు వచ్చే జిల్లా పంచాయతీ అధికారులకు (డీపీవో) కొందరు రూ.లక్ష నుంచి రూ.రెండు లక్షలు సమర్పించుకుంటున్నారు.
- తనిఖీల కోసం వచ్చినపుడల్లా డివిజినల్ పంచాయతీ అధికారులకు రూ.25 వేలు చొప్పున చెల్లిస్తున్నారు.

ఇది నిర్లక్ష్యం కాదా?

- పంచాయతీలపై పర్యవేక్షణ వ్యవస్థలు పలు జిల్లాల్లో నిద్రావస్థలో ఉన్నాయి. కార్యదర్శులు ఏం చేస్తున్నారో తెలుసుకోలేని స్థితిలో జిల్లా, డివిజనల్ స్థాయి పంచాయతీ అధికారులు ఉన్నారు. ప్రజలకు అందించే సేవల నుంచి వివిధ రకాల కొనుగోళ్ల వరకు పెద్దఎత్తున అవకతవకలు చోటుచేసుకుంటున్నా పట్టించుకోవడం లేదు. ఆస్తి పన్ను, లీజు మొత్తాల వసూళ్లు పక్కదారి పడుతున్నా తనిఖీల్లేవు. 500 ఆస్తులకు (ఆస్తి పన్ను అసెస్‌మెంట్లు) ఒకటే ఫోన్ నంబరు కార్యదర్శులు వేసే వరకు అధికారులు గుర్తించలేకపోవడం ద్వారా పర్యవేక్షణలో డొల్లతనం బయటపడుతోంది.

ఆర్డర్ ఎలా ఇచ్చారో 'పోల్'పోవడం లేదు!

- డిస్కంలలో 'శాంపిల్' పేరుతో ఒకే కంపెనీ నుంచి 15 వేల స్తంభాల కొనుగోలు
- టెండరు లేకుండానే ఒప్పందం

ఈనాడు, అమరావతి: టెండర్లు పిలిస్తే కాంట్రాక్టర్లు సిండికేట్ కావడం చూశాం. అస్మదీయుడికి టెండరు కట్టబెట్టాలని అధికారులు భావిస్తే.. అతనికే టెండరు దక్కేలా నిబంధనలు పెట్టడం చూశాం. ఆ రెండూ కాకుండా.. టెండరు లేకుండా రూ.5 కోట్ల విలువైన పనులు ఇవ్వడం ఎక్కడైనా చూశారా? అదీ 'శాంపిల్' అంటూ ఇచ్చేయడం ఏనాడైనా విన్నారా? దక్షిణ విద్యుత్తు పంపిణీ సంస్థ(ఎస్పీడీసీఎల్), కేంద్ర విద్యుత్తు పంపిణీ సంస్థ (సీపీడీసీఎల్) 'శాంపిల్' అనే సరికొత్త విధానానికి తెరతీశాయి. దీని కింద ఏకంగా 15 వేల స్తంభాలు కొంటున్నాయి. అదెలాగంటే..

ఒక వ్యక్తి 6 నెలల క్రితం పల్నాడు జిల్లాలో విద్యుత్తు స్తంభాల తయారీ యూనిట్ ఏర్పాటుచేసినట్లు సమాచారం. అతని నుంచి 8.3 మీటర్లు, 9.1 మీటర్ల విద్యుత్తు స్తంభాలు కొనేందుకు డిస్కంలు ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. దీనికి 'శాంపిల్' విధానాన్ని అనుసరించాయి. దీనికోసం ఒక్కో డిస్కం శాంపిల్ కింద 50-100 స్తంభాలు కొనుగోలు చేసి.. వాటి నాణ్యత పరిశీలించిన తర్వాత టెండరు ద్వారా ఆర్డర్ ఇస్తే ఫర్వాలేదు. ఇవేమీ లేకుండా సుమారు 15 వేల స్తంభాలు కొనేందుకు సదరు తయారీ కంపెనీతో డిస్కంలు ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి.

- రెండు డిస్కంల పరిధిలో 15 విద్యుత్తు సర్కిళ్లు ఉన్నాయి. ఒక్కో సర్కిల్‌కు 1,000 స్తంభాలు శాంపిల్‌గా సరఫరా చేయాలని అధికారులు ఆర్డర్ ఇచ్చారు.
- 8.3 మీటర్ల పొడవు ఉండే స్తంభం సుమారు రూ.2,700, 9.1 మీటర్ల పొడవు ఉండే స్తంభం రూ.3,200 వరకు ఉంటుంది. ఈ లెక్కన ఒక్కో సర్కిల్ పరిధిలో సుమారు రూ.30 లక్షలు స్తంభాల కొనుగోలుకు డిస్కంలు ఖర్చు చేసే అవకాశం ఉంది.
- ఈ లెక్కన 15 సర్కిళ్లకు కలిపి 15 వేల స్తంభాలు డిస్కంలు కొంటున్నాయి. సాధారణంగా డిస్కంలు అప్రూవ్డ్ వెండర్ నుంచే స్తంభాలు కొనుగోలు చేస్తాయి. ఇక్కడ అవేమీ లేకపోవడం గమనార్హం.

పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అనుచరుడి ఆర్థిక అవకతవకలు

తెదేపా కేంద్ర కార్యాలయంలో ఫిర్యాదు

ఈనాడు, అమరావతి: వైకాపా హయాంలో చిన్నగొట్టిగల్లు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో అప్పటి సీఈవో, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అనుచరుడు సహదేవరెడ్డి ఉన్న సమయంలో పెద్ద ఎత్తున ఆర్థిక అవకతవకలు జరిగాయని తిరుపతి జిల్లా చిన్నగొట్టగల్లుకు చెందిన ప్రభాకర్ ఆరోపించారు. ఈ మేరకు మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో బుధవారం ఫిర్యాదు చేశారు. వివిధ సమస్యలతో తరలివచ్చిన బాధితుల నుంచి మంత్రి గొట్టిపాటి రవికుమార్, మాజీ ఎమ్మెల్సీ అశోక్‌బాబు వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. తన పొలాన్ని ఆక్రమించి చంపేస్తానని బెదిరిస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని పశ్చిమగోదావరి జిల్లా ఏనుగువారిలంకకు చెందిన నాగమణి ఫిర్యాదు చేశారు. తన భూమిని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని పల్నాడు జిల్లా రాజుపాలేనికి చెందిన బాధితుడు కోరారు.

ఏపీలో ఫిన్లాండ్ ఆట ఆధారిత అభ్యాసం అమలు

- జిల్లాకో అంగన్‌వాడీలో ప్రయోగాత్మకంగా చేపట్టనున్న విద్యాశాఖ
- ఫిన్లాండ్‌లో పర్యటన వివరాలు వెల్లడించిన ఐఏఎస్ అధికారుల బృందం

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో ఫిన్లాండ్‌లోని 'ఆట ఆధారిత అభ్యాసం' విధానాన్ని ప్రయోగాత్మకంగా అమలు చేయనున్నట్లు విద్యాశాఖ ప్రకటించింది. జిల్లాకు ఒక అంగన్‌వాడీలో ఫిన్నిష్ పూర్వ శిశువిద్య అమలుకు సహకారం అందించేందుకు ఫిన్నిష్ నేషనల్ ఏజెన్సీ ఫర్ ఎడ్యుకేషన్(ఈడీయూఎఫ్ఐ) ఆమోదం తెలిపినట్లు పేర్కొంది. మానవ వనరుల అభివృద్ధిశాఖ కార్యదర్శి కోన శశిధర్ ఆధ్వర్యంలో ఐఏఎస్‌లు నారాయణ భరత్ గుప్తా, విజయరామరాజు, బి.శ్రీనివాసరావు, గణేష్ కుమార్‌లతో కూడిన బృందం ఇటీవల ఫిన్లాండ్‌లో పర్యటించింది. అక్కడి విద్యావ్యవస్థపై అధ్యయనం చేసి వివరాలు వెల్లడించింది. ఫిన్లాండ్ పూర్వ శిశువిద్య విధానం అమలుతో భవిష్యత్తు తరాలకు మెరుగైన పునాదులు వేయడానికి మార్గం సుగమం అవుతుందని అధికారుల బృందం పేర్కొంది. ఆంధ్రా మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్‌కు ఈ విధానం దోహదపడుతుందని వెల్లడించింది.

ప్రామాణిక పరీక్షలు లేని మూల్యాంకన విధానం

"ఫిన్లాండ్‌లో ప్రాథమిక ఉపాధ్యాయులకు ఐదేళ్ల మాస్టర్ డిగ్రీ విద్యార్హత తప్పనిసరి. తనిఖీలు, ర్యాంకింగ్ లాంటి వ్యవస్థలు ఉండవు. ఉపాధ్యాయులు తమ బోధనా విధానాలు, మూల్యాంకనాలను వారే నిర్ణయించుకునే స్వయం ప్రతిపత్తి ఉంది. ప్రామాణిక పరీక్షలు లేని మూల్యాంకన విధానం లాంటి అంశాలు విద్యార్థి మనోవికాసానికి ప్రాధాన్యం ఇస్తున్నాయి. హెల్సింకి విశ్వవిద్యాలయంలోని ప్లేఫుల్ లెర్నింగ్ సెంటర్, వర్టియోక్యూలా డేకేర్ సందర్శనలు "ఆట అనేది అభ్యాసానికి మాధ్యమం, విరామం కాదు" అనే సూత్రాన్ని రుజువు చేశాయి. పూర్వ శిశువిద్యలో 'డ్యాన్సింగ్ మోస్ ఎమోషన్ బోర్డు' లాంటి సాధనాలు పిల్లల భావోద్వేగ పరిశీలనకు అద్భుతంగా ఉపయోగపడుతున్నాయి. ప్రిన్సిపల్‌కు పూర్తి పరిపాలనా అధికారం ఉంటుంది. మున్సిపాలిటీలు కేవలం నిధులు, మౌలిక సదుపాయాలకే పరిమితమవుతాయి" అని పేర్కొంది.

అమరావతి నాలెడ్జ్ హబ్‌కు బెంచ్‌మార్కు

"హెల్సింకిలోని ఊడి గ్రంథాలయం అమరావతిలో ఏర్పాటుచేసే నాలెడ్జ్ హబ్‌కు ఒక బెంచ్ మార్కుగా నిలుస్తుంది. ఫ్యాకల్టీ అభివృద్ధి కార్యక్రమాలు, ఇన్నోవేషన్ స్ప్రింట్‌లు, డిజైన్ ఫ్యాక్టరీ నమూనా ఆధారంగా ప్రయోగాత్మకంగా ప్రోటోటైపింగ్ హబ్‌లను ఏర్పాటు చేయడానికి సంస్థలను గుర్తించాం. ఫిన్నిష్ నేషనల్ ఏజెన్సీ ఫర్ ఎడ్యుకేషన్ మద్దతుతో అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాభివృద్ధిలో మార్పులు తీసుకురానున్నాం. యూనివర్సిటీ ఆఫ్ ఆర్ట్స్ హెల్సింకిలో కళల విద్యలో ఉత్తమ పద్ధతులు, స్టూడియో ఆధారిత బోధన, మెంటార్‌షిప్ శిక్షణ, ఆల్టో యూనివర్సిటీలో డిజైన్ ఫ్యాక్టరీలో విభాగాల అనుసంధానం, ఓపెన్ ప్రోటోటైపింగ్ ల్యాబ్స్, స్టార్టప్‌లకు మెంటారింగ్ వ్యవస్థలపైన అధ్యయనం చేశాం" అని తెలిపింది.

కొనసాగుతున్న మృతదేహాల గుర్తింపు ప్రక్రియ

- సౌదీలో సహాయక చర్యలు పర్యవేక్షిస్తున్న తెలంగాణ మంత్రి అజారుద్దీన్

ఈనాడు, హైదరాబాద్: ఉమ్రా యాత్రకు వెళ్లి బస్సు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి మృతదేహాలు గుర్తించే ప్రక్రియ, డీఎన్ఏ పరీక్షలు కొనసాగుతున్నాయని తెలంగాణ మంత్రి మహ్మద్ అజారుద్దీన్ తెలిపారు. కుటుంబీకుల కోరిక మేరకు అక్కడే అంతిమ సంస్కారాలు నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసేందుకు సౌదీ అధికారులతో చర్చిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉమ్రా బస్సు ప్రమాదంలో మరణించిన యాత్రికుల మృతదేహాలకు తదుపరి కార్యక్రమాలు, బాధిత కుటుంబాలకు సహాయక చర్యల కోసం సోమవారం రాత్రి మైనార్టీ సంక్షేమశాఖ కార్యదర్శి షఫీయుల్లా, ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్‌తో కలిసి మంత్రి సౌదీ అరేబియా చేరుకున్నారు. ఆయన జెడ్డాలోని కాన్సుల్ జనరల్ ఆఫ్ ఇండియా ఫహద్ అహ్మద్‌ఖాన్ సూరీ, స్థానిక సౌదీ అధికారులతో మాట్లాడారు. సౌదీ అరేబియాలోని(రియాద్) భారత రాయబారి డాక్టర్ సుహేల్ అజాజ్ ఖాన్‌తో చర్చలు నిర్వహించి, తదుపరి సహాయ సహకారాలపై చర్చించారు. జాప్యం జరగకుండా ఉండేందుకు, రవాణా అవసరాల కోసం సౌదీలో తనకున్న వ్యక్తిగత పరిచయాలను ఉపయోగిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రమాదం నుంచి బయటపడిన షోయబ్‌తో మాట్లాడి సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.

ఎన్‌కౌంటర్లపై న్యాయవిచారణ జరపాలి: సీపీఎం

ఈనాడు, అమరావతి: అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి ఏజెన్సీలో మంగళ, బుధవారాల్లో జరిగిన వరుస ఎన్‌కౌంటర్లపై న్యాయవిచారణ జరపాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. 'మావోయిస్టులను ముందుగానే నిర్బంధించి, అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచే అవకాశం ఉన్నా పోలీసులు అన్యాయంగా ఎన్‌కౌంటర్ చేశారని తెలుస్తోంది. ఈ ఎన్‌కౌంటర్లను ఖండిస్తున్నాం. గిరిజనులు మావోయిస్టులకు సహకరిస్తూ, మిలీషియాగా పనిచేస్తున్నారని పోలీసులు వేధిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ వేధింపులు, నిర్బంధాన్ని వెంటనే నిలిపివేయాలి' అని డిమాండ్ చేశారు.

మద్యం లంచాలతో చెవిరెడ్డి కుటుంబం కొనుగోలు చేసిన ఆస్తులు

ఈనాడు, అమరావతి: 2021 నుంచి 2023 మధ్య చెవిరెడ్డి భాస్కరరెడ్డి, ఆయన కుటుంబసభ్యులు మద్యం ముడుపుల సొత్తుతో పలు ఆస్తులు కొన్నారు. వీటి జప్తునకు సిట్ చర్యలు చేపట్టింది. వాస్తవంగా ఈ ఆస్తులను ఎక్కువ ధరలకు కొన్నప్పటికీ తక్కువకు కొన్నట్లు చూపించి.. నల్లధనాన్ని వైట్‌లోకి మార్చుకున్నారని సిట్ గుర్తించింది. ఆస్తుల వివరాలివీ..

1. డాక్యుమెంట్ నంబరు 1369/2021, తేదీ: 27.04.2021, తొట్టంబేడు సబ్‌రిజిస్ట్రార్ - ఒల్లూరు, కేవీబీపురంలో 47.12 ఎకరాల భూమి కొన్నారు. (కేవీఎస్ ఇన్‌ఫ్రా పేరిట 36.52 ఎకరాలు) **విలువ: రూ.3.29 కోట్లు**
2. డాక్యుమెంట్ నంబరు 2184/2021, తేదీ: 07.08.2021, తొట్టంబేడు సబ్‌రిజిస్ట్రార్ - ఒల్లూరు, కేవీబీపురంలో 2.47 ఎకరాల భూమి కొన్నారు. **విలువ: రూ.7.66 లక్షలు**
3. డాక్యుమెంట్ నంబరు 2862/2022, తేదీ: 25.08.2022, తొట్టంబేడు సబ్‌రిజిస్ట్రార్ - తొట్టంబేడు, కేవీబీపురం, తిరుపతిలో 7.41 ఎకరాల భూమి కొన్నారు. **విలువ: రూ.22.98 లక్షలు**
4. డాక్యుమెంట్ నంబరు 3422/2022, తేదీ: 09.09.2022, పుత్తూరు సబ్‌రిజిస్ట్రార్ - వడమాలపేట, తిరుపతిలో 0.36 ఎకరాల భూమి కొన్నారు. (కేవీఎస్ ఇన్‌ఫ్రా పేరిట 0.185 సెంట్లు). **విలువ: రూ.3.25 లక్షలు**
5. డాక్యుమెంట్ నంబరు 3423/2022, తేదీ: పుత్తూరు సబ్‌రిజిస్ట్రార్- వడమాలపేట, తిరుపతిలో 0.37 ఎకరాల భూమి కొన్నారు. (కేవీఎస్ ఇన్‌ఫ్రా పేరిట 0.185 సెంట్లు). **విలువ: రూ.3.33 లక్షలు**
6. డాక్యుమెంట్ నంబరు 3424/2022, తేదీ: 09.09.2022, పుత్తూరు సబ్‌రిజిస్ట్రార్- వడమాలపేట, తిరుపతిలో 0.21 ఎకరాల భూమి కొన్నారు. **విలువ: రూ.1.94 లక్షలు**
7. డాక్యుమెంట్ నంబరు 6105/2022, తేదీ: 25.10.2022, తిరుపతి రూరల్ సబ్‌రిజిస్ట్రార్- వడమాలపేట, తిరుపతిలో 0.26 ఎకరాల భూమి కొన్నారు. **విలువ: రూ.2.34 లక్షలు**
8. డాక్యుమెంట్ నంబరు 6106/2022, తేదీ: 25.10.2022, తిరుపతి రూరల్ సబ్‌రిజిస్ట్రార్ - పూడి గ్రామం, వడమాలపేటలో 0.21 ఎకరాల భూమి కొన్నారు. **విలువ: రూ.1.89 లక్షలు**
9. డాక్యుమెంట్ నంబరు 3794/2022, తేదీ: 2.11.2022, తొట్టంబేడు సబ్‌రిజిస్ట్రార్- ఒల్లూరు, కేవీబీపురంలో 0.5 ఎకరాల భూమి కొన్నారు. **విలువ: రూ.1.55 లక్షలు**
10. డాక్యుమెంట్ నంబరు 493/2022, తేదీ: 30.01.2023, రేణిగుంట సబ్‌రిజిస్ట్రార్- చెన్నయ్యగుంట, రేణిగుంటలో 6752 చదరపు గజాల భూమి కొన్నారు. **విలువ: రూ.52.65 లక్షలు**
11. డాక్యుమెంట్ నంబరు 2561/2023, తేదీ: 12.05.2023, తిరుపతి రూరల్ సబ్‌రిజిస్ట్రార్ - రేణిగుంటలో 0.352 ఎకరాలు. **విలువ: రూ.7.05 లక్షలు**
12. డాక్యుమెంట్ నంబరు 3014/2023, తేదీ: 31.05.2023, తిరుపతి రూరల్ సబ్‌రిజిస్ట్రార్- ఏర్పేడు, రేణిగుంటలో 3.5 ఎకరాల భూమి కొన్నారు. **విలువ: రూ.31.85 లక్షలు**
13. డాక్యుమెంట్ నంబరు 2163/2022, తేదీ: 24.06.2023, పుత్తూరు సబ్‌రిజిస్ట్రార్- వడమాలపేట తిరుపతిలో 13.5 ఎకరాల భూమి కొన్నారు. **విలువ: రూ.1.21 కోట్లు**
14. డాక్యుమెంట్ నంబరు 5003/2023, తేదీ: 02.09.2023, తిరుపతి రూరల్ సబ్‌రిజిస్ట్రార్, సూరప్పకాశం, రేణిగుంటలో 0.20 ఎకరాల భూమి కొన్నారు. **విలువ: రూ.5.40 లక్షలు**
15. డాక్యుమెంట్ నంబరు 7193/2023, తేదీ: 15.12.2023, తిరుపతి రూరల్ సబ్‌రిజిస్ట్రార్, వడమాలపేటలో 0.24 ఎకరాల భూమి కొన్నారు. **విలువ: రూ.5.28 లక్షలు**
16. డాక్యుమెంట్ నంబరు 4883/2023, తిరుపతి రూరల్ సబ్‌రిజిస్ట్రార్, తిరుచానూరు గ్రామంలో 0.73 ఎకరాల భూమి. **విలువ: రూ.73.25 లక్షలు**
17. డాక్యుమెంట్ నంబరు 4884/2023, తిరుపతి రూరల్ సబ్‌రిజిస్ట్రార్, తిరుచానూరులో 0.73 ఎకరాల భూమి. **విలువ: రూ.73.25 లక్షలు**
18. డాక్యుమెంట్ నంబరు 4885/2023, తిరుపతి రూరల్ సబ్‌రిజిస్ట్రార్, తిరుచానూరులో 0.73 ఎకరాల భూమి. **విలువ: రూ.73.25 లక్షలు**
19. డాక్యుమెంట్ నంబరు 4886/2023, తిరుపతి రూరల్ సబ్‌రిజిస్ట్రార్, తిరుచానూరులో 0.73 ఎకరాల భూమి. **విలువ: రూ.73.25 లక్షలు**
20. డాక్యుమెంట్ నంబరు 519/2023, తిరుపతి రూరల్ సబ్‌రిజిస్ట్రార్ తుమ్మలగుంట, తిరుపతిలో 145.22 చదరపు గజాల భూమి. **విలువ: రూ.14.53 లక్షలు**
21. డాక్యుమెంట్ నంబరు 3159/2020, తిరుపతి రూరల్ సబ్‌రిజిస్ట్రార్, తుమ్మలగుంట, తిరుపతిలో 134.58 చదరపు గజాల భూమి. **విలువ: రూ.10.37 లక్షలు**
22. డాక్యుమెంట్ నంబరు 3160/2021, తిరుపతి రూరల్ సబ్‌రిజిస్ట్రార్, తుమ్మలగుంట, తిరుపతిలో 179.86 చదరపు గజాల భూమి. **విలువ: రూ.13.85 లక్షలు**
23. డాక్యుమెంట్ నంబరు 4131/2021, తిరుపతి రూరల్ సబ్‌రిజిస్ట్రార్, తుమ్మలగుంట, తిరుపతిలో 253.33 చదరపు గజాల భూమి. **విలువ: రూ.19.52 లక్షలు**
24. డాక్యుమెంట్ నంబరు 5601/2021, తిరుపతి రూరల్ సబ్‌రిజిస్ట్రార్, తుమ్మలగుంట, తిరుపతిలో 110 చదరపు గజాల భూమి. **విలువ: రూ.8.47 లక్షలు**

సినీ నటి ప్రత్యూష మృతి కేసులో తీర్పు రిజర్వ్ చేసిన సుప్రీంకోర్టు



ఈనాడు, దిల్లీ: రెండు దశాబ్దాల క్రితం సంచలనం సృష్టించిన సినీ నటి ప్రత్యూష మృతి కేసులో హైకోర్టు విధించిన జైలుశిక్షను సవాల్ చేస్తూ నిందితుడు గుడిపల్లి సిద్ధార్థరెడ్డి; నిందితుడికి విధించిన శిక్షను పెంచాలంటూ ఆమె తల్లి సరోజినీదేవి దాఖలు చేసిన క్రిమినల్ అప్పీళ్లపై జస్టిస్ రాజేశ్ బిందల్, జస్టిస్ మన్మోహన్‌లతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం బుధవారం తీర్పును రిజర్వ్ చేసింది. ప్రత్యూష, సిద్ధార్థరెడ్డి హైదరాబాద్‌లో ఇంటర్ చదువుతున్నప్పుడు ప్రేమించుకున్నారు. ఇంటర్ పూర్తయిన అనంతరం ప్రత్యూష సినిమాల్లోకి వెళ్లగా... సిద్ధార్థరెడ్డి ఇంజినీరింగ్‌లో చేరాడు. 2002 ఫిబ్రవరి 23న సాయంత్రం 7.30-8 గంటల మధ్య ఇద్దరూ విషం తాగిన పరిస్థితిలో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేరారు. ప్రత్యూష 24న చనిపోయారు. చికిత్స అనంతరం మార్చి 9న సిద్ధార్థరెడ్డి డిశ్చార్జి అయ్యాడు. వారు కూల్‌డ్రింక్‌లో పురుగుమందు కలిపి తాగినట్లు పరీక్షల్లో గుర్తించారు. ఆర్గానోఫాస్ఫేట్ కారణంగా ప్రత్యూష మరణించారని... ఊపిరాడకుండా చేయడం, మరణానికి ముందు ఆమెపై లైంగిక దాడి జరగలేదని రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ముగ్గురు వైద్యుల బృందం నివేదిక ఇచ్చింది. దీని ఆధారంగా దర్యాప్తు జరిపిన సీబీఐ... నిందితుడిపై 306 (ఆత్మహత్యకు పురికొల్పడం), 309 (ఆత్మహత్యకు యత్నించడం) సెక్షన్ల కింద ఛార్జిషీట్ దాఖలు చేసింది. నిందితుడు సిద్ధార్థరెడ్డికి హైదరాబాద్ మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి ఐదేళ్ల కఠిన కారాగారశిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ 2004 ఫిబ్రవరి 23న తీర్పు చెప్పారు. దీనిపై సిద్ధార్థరెడ్డి హైకోర్టును ఆశ్రయించగా... జైలుశిక్షను రెండేళ్లకు తగ్గిస్తూ, జరిమానాను రూ.50 వేలకు పెంచుతూ 2011 డిసెంబరు 28న తీర్పు వెలువరించింది. దీనిపై సిద్ధార్థరెడ్డి, సరోజినీదేవి 2012లో సుప్రీంకోర్టులో అప్పీళ్లు దాఖలు చేశారు. సీబీఐ తరఫున సీనియర్ న్యాయవాది నచికేత జోషి వాదనలు వినిపిస్తూ... కేసులో సాక్ష్యాధారాలన్నీ నిరూపితమయ్యాయన్నారు. ప్రత్యూషను ఆత్మహత్య చేసుకొనేలా ఉసిగొల్పినందున సెక్షన్ 302 కింద శిక్ష విధించాలని, సాధ్యం కాకపోతే సెక్షన్ 306 కింద గరిష్ఠ శిక్ష విధించాలని విన్నవించారు. మృతురాలు, నిందితుడు ఇద్దరూ కలిసి పురుగుమందు తీసుకున్నందువల్ల ఆత్మహత్యకు ఉసిగొల్పాడన్న అంశం ఉత్పన్నం కాదని నిందితుడి తరఫున సీనియర్ న్యాయవాదులు నాగముత్తు, ఎల్.నరసింహారెడ్డి వాదించారు.

ప్రొవిజనల్ లిస్టులు ప్రకటించాకే.. మెడికల్ సీట్ల తుది జాబితాలు

వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్



ఈనాడు, అమరావతి: వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశాలకు అర్హులైన అభ్యర్థుల తుది జాబితాలు వెల్లడించే ముందు ప్రొవిజనల్ లిస్టులు ప్రకటించాలని ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం అధికారులను వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశించారు. ఇటీవల ముగిసిన కన్వీనర్ కోటా ఎంబీబీఎస్ ప్రవేశాల జాబితా ప్రకటన వివాదాస్పదమైంది. తుది దశలో కొందరు విద్యార్థులు.. నీట్ పరీక్షలో తమ కన్నా తక్కువ మార్కులు వచ్చిన వారికి సీట్లు కేటాయించారంటూ అభ్యంతరాలు వ్యక్తంచేశారు. సాంకేతిక లోపాలు గుర్తించిన వర్సిటీ అధికారులు సవరణ చేయడంతో సీట్లు పొందిన కొందరు ప్రవేశాలకు అర్హత కోల్పోయారు. ఈ పరిణామాలు మంత్రి దృష్టికి రావడంతో ముందుగా ప్రొవిజనల్ జాబితాలు ప్రకటించాలని.. వాటిపై అభ్యంతరాల స్వీకరణకు కొంత గడువు ఇచ్చి.. వాటిని పరిశీలించాకే తుది జాబితా విడుదల చేయాలని సూచించారు. ఈ మేరకు ప్రస్తుతం జరుగుతున్న పీజీ కోర్సుల ప్రవేశాలకు, బీడీఎస్, ఇతర కోర్సులకు కూడా ఇదే విధానాన్ని అవలంబించాలని ఎన్టీఆర్ ఆరోగ్య వర్సిటీ నిర్ణయించింది.

2027 నాటికి దేశంలోనే నెం.1గా ఏపీ పర్యాటకం

ఏపీటీడీసీ ఛైర్మన్ నూకసాని బాలాజీ

ఈనాడు, అమరావతి: రాష్ట్రాన్ని 2027 నాటికి పర్యాటక రంగంలో అగ్రస్థానంలో నిలపడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఏపీ పర్యాటకాభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ నూకసాని బాలాజీ అన్నారు. సీఎం చంద్రబాబు, విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేశ్ కృషితో విశాఖలో జరిగిన సీఐఐ భాగస్వామ్య సదస్సులో రూ.లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకొచ్చారని తెలిపారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. "ఫుడ్ ప్రాసెసింగ్, విద్యుత్తు, పర్యాటకం, పరిశ్రమలు, ఐటీ, ఎలక్ట్రానిక్స్ తదితర 12 రంగాల్లో భారీగా పెట్టుబడులు వచ్చాయి. నియోజకవర్గస్థాయిలో ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటుతో స్థానిక యువతకు పెద్దఎత్తున ఉద్యోగాలు రానున్నాయి" అని బాలాజీ తెలిపారు.

నారమల్లి పద్మజకు రూ.13.90 లక్షల వేతన బకాయిల చెల్లింపు

ఈనాడు, అమరావతి: వైకాపా నేత, ఆ పార్టీకి అధికార ప్రతినిధిగా పని చేసిన నారమల్లి పద్మజకు రూ.13.90 లక్షల వేతన బకాయిలు విడుదల చేస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. జగన్ హయాంలో మహిళా, శిశు సంక్షేమ శాఖకు సలహాదారుగా విధులు నిర్వర్తించిన ఆమెకు.. 2023 డిసెంబరు నుంచి 2024 మే వరకు ఉన్న వేతన బకాయిల్ని చెల్లించేందుకు పాలనాపరమైన అనుమతులిచ్చింది.

నాణ్యతలేని పత్తి కొనుగోలుకు కేంద్రానికి ప్రతిపాదనలు పంపాం

వ్యవసాయ మార్కెటింగ్ శాఖ సంచాలకులు విజయసునీత

ఈనాడు, అమరావతి: తేమ ఎక్కువగా ఉన్న, రంగు మారిన పత్తిని తగ్గింపు ధరకు కొనుగోలు చేసేందుకు కేంద్రానికి ప్రతిపాదనలు పంపామని వ్యవసాయ మార్కెటింగ్ శాఖ సంచాలకులు విజయసునీత తెలిపారు. సీసీఐ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని 11 మార్కెట్ యార్డులు, 66 జిన్నింగ్ మిల్లుల ద్వారా పత్తి కొనుగోలు చేస్తున్నామన్నారు. నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఉన్న పత్తిని కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి మద్దతు ధర పొందాలని కోరారు. కొనుగోలు ప్రక్రియ పర్యవేక్షణకు జిల్లా స్థాయిలో జేసీ, కొనుగోలు కేంద్రాలవారీగా మార్కెటింగ్ అధికారుల ఆధ్వర్యంలో కమిటీలు ఏర్పాటు చేశామని ఓ ప్రకటనలో వివరించారు. 'బుధవారం వరకు 3,643 మంది రైతుల నుంచి రూ.78.13 కోట్ల విలువైన 99,623 క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేశాం. కపాస్ యాప్‌ను సీఎం యాప్‌తో అనుసంధానించాం' అని పేర్కొన్నారు.

ఆధార్ ఆధారిత బయోమెట్రిక్ హాజరు అమలులో సమస్యలు పరిష్కరించాలి

ఎన్ఎంసీని కోరిన ఏపీ ప్రభుత్వ వైద్యుల సంఘం

ఈనాడు, అమరావతి: వైద్య కళాశాలల్లో టీచింగ్ వైద్యులకు తప్పనిసరి చేసిన ఆధార్ ఆధారిత బయోమెట్రిక్ హాజరు వ్యవస్థ (ఏఈబీఏఎస్)ను పునఃపరిశీలించి, అమలులో ఎదురయ్యే సమస్యలు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వైద్యుల సంఘం (ఏపీజీడీఏ) జాతీయ వైద్య మండలి(ఎన్ఎంసీ)ని కోరింది. ఈ మేరకు ఎన్ఎంసీకి రాసిన లేఖను సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ జయధీర్ బాబు, డాక్టర్ రమేష్ కుమార్ బుధవారం విడుదల చేశారు. ఏఈబీఏఎస్ వ్యవస్థలో మార్పులను స్వాగతిస్తున్నామని.. వైద్యుల సూచనలు కూడా పరిగణనలోకి తీసుకుని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు వర్తించే చట్టబద్ధమైన సర్వీసు రూల్స్ కాపాడేలా సవరణలు చేయాలని కోరారు. ప్రభుత్వ వైద్యకళాశాల బోధకులకు యాజమాన్యం ఆమోదించి అనుమతించిన సెలవులను హాజరుగా పరిగణించి, హాజరు శాతం లెక్కింపులో చేర్చాలని విజ్ఞప్తి చేశారు. ఇతర కళాశాలలకు పరీక్షల విధులు, కేంద్ర- రాష్ట్ర స్థాయి సమావేశాలు, ప్రభుత్వ సమావేశాలు, శిక్షణ కార్యక్రమాలకు ప్రస్తుతం సెలవు తీసుకుని వెళ్లాల్సి వస్తోందని, రాత్రి విధుల తర్వాత సెలవులను ఆయా కళాశాలల్లో హాజరుగా పరిగణనలోకి తీసుకునే వెసులుబాటు కల్పించాలన్నారు. హాజరు శాతం లెక్కింపు నెల, మూడు నెలలకు బదులు.. మొత్తం విద్యా సంవత్సరాన్ని పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. రాష్ట్ర స్థానిక సెలవులు, ప్రభుత్వం ప్రత్యేక సందర్భాల్లో ఇచ్చే సెలవులు హాజర్ పోర్టల్‌లో సెలవు రోజులుగా కనిపించడం లేదని, వీటి అప్‌డేట్‌కు ఎన్ఎంసీ అనుమతి ఇవ్వాలని కోరారు.



ధాన్యం దేవీ నమోస్తుతే..!

దేవుళ్లకు సంబంధించిన అనేక విగ్రహాలను మీరు చూసే ఉంటారు.. కానీ అందులో వడ్ల గింజలతో రూపొందించిన విగ్రహాలను ఎప్పుడైనా చూశారా.. కచ్చితంగా చూసి ఉండరు.. అలాంటి విగ్రహాలను చూడాలంటే మీరు హరియాణాలోని కురుక్షేత్రలో జరిగే అంతర్జాతీయ గీతా ఉత్సవానికి వెళ్లాల్సిందే. ఈసారి పశ్చిమ బెంగాల్ నుంచి వచ్చిన కృష్ణ సింగ్ వడ్ల గింజలతో అరుదైన విగ్రహాలను రూపొందించి ఈ ఉత్సవంలో ప్రదర్శనకు ఉంచారు. వడ్ల గింజలతో రూపొందించిన దుర్గా దేవి విగ్రహం సందర్శకులను విశేషంగా ఆకర్షించింది. బోల్‌పుర్ శాంతినికేతన్‌కు చెందిన కృష్ణ సింగ్ కుటుంబం తరతరాలుగా ఈ కళను నమ్ముకుని జీవిస్తోంది. –ఈటీవీ భారత్

బుడి.. బడి అడుగుల్లోనే భూతద్దం!



‘ఆరో తరగతి విద్యార్థి.. ఉపాధ్యాయుడు బోర్డుపై రాసింది కాకుండా.. పక్కనే కూర్చున్న స్నేహితుడి పుస్తకంలో చూసి రాసుకుంటున్నాడు. పాఠశాలలో కంటి వైద్య శిబిరం నిర్వహించడానికి వచ్చిన ఓ వైద్యుడు గమనించి బోర్డుపై ఉన్న అక్షరాలను చదవమన్నారు. బాలుడు సరిగా కనిపించడంలేదని చెప్పడంతో పరీక్షలు చేసి దూర దృష్టి లోపం ఉందని తేల్చారు. అనంతరం కళ్లద్దాలు ఇచ్చారు.’

ఆలోచించే శక్తిని కోల్పోతున్నారు

ఒకప్పుడు పిల్లల్ని ఎత్తుకుని కథలు చెబుతూ, ఆటలు ఆడిస్తూ అన్నం తినిపించేవారు. ప్రస్తుతం ఉరుకుల పరుగుల జీవితంలో తల్లిదండ్రులకు ఆ ఓపిక లేక పిల్లల చేతికి ఫోన్ ఇచ్చి పనులు చేసుకుంటున్నారు. వారిని ఏదోరకంగా బిజీగా ఉంచడానికి యత్నిస్తున్నారు. క్రమేణా ఫోన్ లేనిదే వారు అన్నం తినడం లేదు. మూడేళ్లలోపు చిన్నారులకు మొబైల్ ఫోన్ ఇవ్వడం వారి కంటి చూపుపై ప్రభావం చూపించి చిన్న వయసులోనే అద్దాలు పెట్టుకోవాల్సిన దుస్థితికి దారితీస్తోంది. అద్దాలు వాడుతున్న వారిలో పదేళ్లలోపు పిల్లల సంఖ్య పెరుగుతోంది. అతిగా ఫోన్ వాడకం వల్ల స్వతహాగా ఆలోచించే శక్తి, సృజనాత్మకతను కూడా కోల్పోతున్నారని వైద్యులు చెబుతున్నారు.



పిల్లలు చెప్పలేరు..

పిల్లలకు కళ్లు లాగడం, నీళ్లు కారడం, ఎర్రగా అవ్వడం, మంట, తలనొప్పి వంటి కారణాలతో తల్లిదండ్రులు వైద్యుల్ని సంప్రదిస్తున్నారు. పరీక్షిస్తే అప్పటికే వారికి దృష్టిలోపం ఉంటోంది. 4 సంవత్సరాల వరకు పిల్లలు ఇవేమీ చెప్పలేరు. 5 నుంచి 10 ఏళ్ల వారే ఈ కారణాలు ఎక్కువగా చెబుతుంటారు. వారిలో సగం మందిలో దృష్టి లోపం ఉంటుందని వైద్యులు చెబుతున్నారు.



దృష్టి పరిమితి తగ్గుతోంది..

బయట ఆడుకుంటే దూరంగా ఉన్న వస్తువులు, మనుషుల్ని గమనిస్తారు. ఫలితంగా చిన్నప్పటి నుంచే 100 - 200 అడుగుల దూరం వరకు దృష్టి ఆక్టివేట్ అయ్యేది. ప్రస్తుతం ఫోన్‌ను 30 సెంటీమీటర్లలోపే పెట్టుకోవడం వల్ల దృష్టి పరిమితి తగ్గుతోంది (దృష్టి లిమిటేషన్ జరుగుతుంది). మైదానాల్లో ఆడుకోవడం వల్ల కొన్ని హార్మోన్స్ విడుదలై రెటీనా ప్రకాశవంతమయ్యే అవకాశం ఉంది. గ్రామాల్లో బయట ఆడుకోవడానికి ఆస్కారం ఎక్కువ. అందుకే వారితో పోలిస్తే పట్టణాల్లోని పిల్లల్లోనే దృష్టిలోపం అధికంగా ఉంటుంది.

ఇవి చేయాలి

- ఫోన్‌ను పూర్తిగా దూరం ఉంచాలి.
- రకరకాల రంగులున్న పుస్తకాలు, ఆటవస్తువులు ఇవ్వాలి.
- ఫోన్ కాకుండా ఇంకా వేటిపై ఆసక్తి చూపిస్తున్నారో గుర్తించి, అటువైపు ప్రోత్సహించాలి. మనం ఊరికే ఫోన్ వాడితే వారు అదే కావాలంటుంటారు. కాబట్టి మనమూ మారాలి.
- వీలైనంత వరకు మైదానాలకు తీసుకెళ్లాలి. శారీరక శ్రమ ఉండేలా చూడాలి.
- చిన్నప్పటి నుంచే ఆటలు, నృత్యం వంటి వాటిలో ప్రోత్సహించాలి.

కన్ను పెరగడం లేదు



8 ఏళ్ల వరకు పిల్లల్లో అవయవం(కన్ను) అభివృద్ధి చెందుతుంది. ఫోన్ నుంచి వచ్చే వెలుతురు ప్రభావం కన్ను పెరుగుదలపై పడుతుంది. రెటీనా దెబ్బ తింటుంది. కంటి కండరాలపై ఒత్తిడి పడి కన్ను పరిమాణం పెరగడం లేదు. ఫలితంగా జీవితాంతం మయోపియా (దూరపు చూపు కనిపించదు)తో ఉండిపోతున్నారు.

జాగ్రత్తలు తల్లిదండ్రులవే..

‘ఫోన్ ఇస్తేనే తింటా. పాఠశాలకు వెళ్తా. పడుకుంటామని పిల్లలు మారాం చేస్తున్నారంటూ తల్లిదండ్రులు వస్తుంటారు. ఫోన్ వాడకుండా మార్గాలు చెప్పమంటారు. మీ కళ్లు పనిచేయవని చెప్పినా పిల్లలకు అర్థమయ్యే వయసు కాదు. కాబట్టి తల్లిదండ్రులే జాగ్రత్తలు తీసుకోవాలి. చిన్న వయసులోనే కంటి సమస్యలు గుర్తిస్తే.. వారి చూపును కాపాడవచ్చు’

– డాక్టర్ లింబాద్రి, కంటి వైద్య నిపుణుడు, కామారెడ్డి

- ఈనాడు డిజిటల్, కామారెడ్డి



అర్థమైందా.. మాస్టార్లూ!

టీచర్లు శ్రద్ధగా పాఠాలు వింటున్న ఈ దృశ్యం ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి జడ్పీ హెచ్‌ఎస్‌లోనిది. వీరే కాదు రాష్ట్రంలో ప్రస్తుతం అత్యధిక ఉపాధ్యాయులు ఇలానే పరీక్షకు కుస్తీ పడుతున్నారు. ఎందుకిలా అనుకుంటున్నారా..? గతంలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) రాయనివారంతా రెండేళ్లలోపు.. ఆ పరీక్షలో క్వాలిఫై కావాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో చాలా మంది ఈ నెల 15 నుంచి ఆన్‌లైన్‌లో టెట్ దరఖాస్తులు సమర్పిస్తున్నారు. బడిలోనే రోజుకో గంట సన్నద్ధమవుతున్నారు. ఇంద్రవెల్లి జడ్పీ హెచ్‌ఎస్‌లో మొత్తం 47 మందిలో 30 మందికి టెట్ అర్హత లేదు. వారంతా ప్రస్తుతం దరఖాస్తు చేశారు. రోజూ సాయంత్రం ఒక్కో సబ్జెక్టు టీచర్ వారికి పాఠాలు చెబుతుండగా.. ఇలా విద్యార్థుల్లా వింటున్నారు.

– న్యూస్‌టుడే, కలెక్టరేట్ (ఆదిలాబాద్)





ఎవరైనా ఇబ్బంది పెడితే.. పెన్ను తీసుకో బాలికా..

గంగాధర మండలం గర్షకుర్తి ప్రభుత్వ పాఠశాలలో ఫిర్యాదుల బాక్స్ తాళం చేవిని సీఐకి అందిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

బాలికల భద్రతకు కరీంనగర్ జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో కొత్తగా స్నేహిత ఫిర్యాదు బాక్స్‌లను ఏర్పాటు చేస్తున్నారు. కలెక్టర్ పమేలా సత్పతి సూచనతో.. జిల్లాలో ‘స్నేహిత’ కార్యక్రమం ద్వారా.. బాలికల రక్షణ చట్టాలపై విద్యార్థినుల్లో అవగాహన కల్పించేందుకు ఉపాధ్యాయులు, విద్యార్థినులతో కలిపి ఇప్పటికే కమిటీలు వేశారు. ప్రతి మంగళవారం ప్రతి మండలంలో రెండు పాఠశాలల్లో స్నేహిత కార్యక్రమాన్ని నిర్వహించి బాలికలను చైతన్యపరుస్తున్నారు. అలానే పాఠశాల సిబ్బంది నుంచి, బయటి వ్యక్తుల నుంచి ఏమైనా ఇబ్బందులు ఎదుర్కొంటే ధైర్యంగా ఫిర్యాదు చేసేందుకు స్నేహిత ఫిర్యాదు పెట్టెలను ఇటీవల గంగాధర మండలం గర్షకుర్తిలోని ప్రభుత్వ పాఠశాలలో కలెక్టర్ ప్రారంభించారు. మండల స్థాయిలోని షీటీం బృందాలు ప్రతి వారం ఈ పెట్టెలను తెరిచి.. విద్యార్థినులు చేసిన ఫిర్యాదులను పరిశీలించి చర్యలు తీసుకుంటారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు ఈ బాక్స్‌లు ఏర్పాటు చేసే పనిలో నిమగ్నమయ్యారు. ప్రతి బాక్స్‌పై హెల్ప్‌లైన్ నంబర్లు ముద్రిస్తున్నారు.

– న్యూస్‌టుడే, కరీంనగర్ విద్యావిభాగం



ఇవి చాలా మామూలు విషయాలే కానీ..

- మీరు ఉదయాన్ని ఎలా గడుపుతారు?
- ఎలాంటి పుస్తకాలు చదువుతారు?
- ఏ విధమైన కార్యక్రమాలు వీక్షిస్తారు?
- మీ సన్నిహితుల్లో ఎలాంటి వారున్నారు?
- మీతో మీరు ఏం మాట్లాడుకుంటారు?
- మీ శక్తిని వేటి కోసం వినియోగిస్తారు?

వినడానికి మామూలుగా అనిపించే ఈ విషయాలకు మీ జీవితాన్ని మార్చే శక్తి ఉంది. మీ అలవాట్ల ఎంపికపై ప్రత్యేక శ్రద్ధ పెట్టండి.


–ఆండ్రూ రీడ్, ఫుట్‌బాల్ కోచ్

అదిరిందయ్యా... చంద్రం!

ఈ చిత్రం చూస్తే.. మిత్రులంతా సరదాగా ద్విచక్ర వాహన పోటీ పెట్టుకున్నారేమో అనిపిస్తోంది కదూ.. కానీ, వాళ్లు పంట నూర్పిడి చేస్తున్నారు. నిర్మల్ జిల్లా ముథోల్‌లోని కోలిగల్లీ కాలనీకి చెందిన పోతన్న తనకున్న 20 గుంటల స్థలంలో వరి సాగు చేశారు. కోతకు రావడంతో పొలాన్ని కోయించి కుప్పవేశారు. తొలుత ట్రాక్టర్‌తో నూర్పిడి చేయించే ప్రయత్నం చేసినా.. చిన్న విస్తీర్ణం కావడంతో కుదరలేదు. దీంతో పోతన్న స్నేహితులు ముందుకొచ్చి తమ ద్విచక్ర వాహనాలతో ఇలా నూర్పిడి చేశారు.

– న్యూస్‌టుడే, ముథోల్








క్యాంపస్‌లో ‘హీరో’ అంటే సైకిలే

సంగారెడ్డి జిల్లా కందిలోని ఐఐటీ హైదరాబాద్ విద్యార్థులు.. డ్రైవర్ లేకుండా నడిచే కారును ఆవిష్కరించారు. అయితే వారు మాత్రం తరగతి గదులకు, మెస్‌కు, హాస్టళ్లకు సైకిళ్ల మీదే వెళుతుంటారు. ఐఐటీ హైదరాబాద్ క్యాంపస్ 654 ఎకరాల్లో విస్తరించి ఉంది, 5 వేలకు పైగా విద్యార్థులు చదువుకుంటున్నారు. తరగతి గదులు, ప్రయోగశాలలు, మెస్‌లు, హాస్టళ్ల మధ్య కి.మీ., అంతకుమించి ఎక్కువ దూరం ఉండడంతో విద్యార్థుల సౌకర్యం కోసం యాజమాన్యం వెయ్యికిపైగా సైకిళ్లను అందుబాటులో ఉంచింది. విద్యార్థులు వాటిని వినియోగిస్తూ.. సమయాన్ని ఆదా చేసుకోవడంతో పాటు ఫిట్‌నెస్‌నూ పొందుతున్నారు. ఇదే జిల్లాలోని చౌటకూరు మండలం సుల్తాన్‌పూర్‌లోని జేఎన్‌టీయూ క్యాంపస్ 162 ఎకరాల్లో విస్తరించి ఉంది. ఇక్కడ 1600కు పైగా విద్యార్థులు చదువుతున్నారు. ఇక్కడ సైతం వందల సైకిళ్లను అందుబాటులో ఉంచగా.. విద్యార్థులు రయ్ రయ్ మంటూ తరగతులకు వెళుతున్నారు. – ఈనాడు, సంగారెడ్డి

పనిని, పర్యటనలను ఒకేసారి ఆస్వాదిస్తారా!

ఈనాడు, హైదరాబాద్: సమావేశాలు, వ్యాపార కార్యకలాపాల కోసం దేశవిదేశాల నుంచి హైదరాబాద్‌కు వచ్చే వారు... తమ పని ముగిశాక హోటల్ గదులకే పరిమితం కాకుండా రాష్ట్రాన్ని చుట్టివచ్చేలా పర్యాటకాభివృద్ధి సంస్థ యాత్రల ప్యాకేజీలను సిద్ధం చేసింది. ఒకే యాత్రలో పని, పర్యాటకం... అందించే ఉద్దేశంతో ‘తెలంగాణను చూడండి’ అనే నినాదంతో... ‘హైదరాబాద్ పిలుస్తోంది.. పని చేయడానికైనా, పర్యటించడానికైనా, ఆశ్చర్యాలకైనా’ అనే ట్యాగ్‌లైన్‌తో ముందుకొచ్చింది. ఔత్సాహికుల వీలును బట్టి ఒక పూట, ఒక రోజు, రెండు రోజుల్లో తెలంగాణను వీక్షించేలా వివిధ రకాల టూర్లను సిద్ధం చేసింది.



ఒక్క రోజులో...

☛ **చౌమొహల్లా ప్యాలెస్ నుంచి బుద్ధ విగ్రహం వరకు:** ఒక రోజు యాత్రలో భాగంగా హైదరాబాద్‌లో పర్యటించొచ్చు. అద్భుత రాజభవనమైన చౌమొహల్లా ప్యాలెస్ నుంచి మొదలై చార్మినార్, మక్కామసీదు, లాడ్‌బజార్, సాలార్‌జంగ్ మ్యూజియం, గోల్కొండ కోటను చుట్టేసి హుస్సేన్‌సాగర్‌లో బుద్ధ విగ్రహం సందర్శనతో ఈ యాత్ర ముగుస్తుంది.

☛ **రామోజీ ఫిల్మ్ సిటీ:** ప్రపంచంలోనే అతిపెద్ద ఫిల్మ్ సిటీ యాత్ర ఉదయం 8 గంటలకు మొదలై రాత్రి 8 గంటలకు ముగుస్తుంది.

ఒక్క పూటలో..

☛ నిజాంల రాజసాన్ని, వారి చరిత్రను చూపించే యాత్ర ఇది. ఒక ట్రిప్‌లో ఫలక్‌నుమా, చౌమొహల్లా ప్యాలెస్‌లను చూపిస్తారు. మరో ట్రిప్‌లో చార్మినార్, గోల్కొండ కోటలను వీక్షించొచ్చు.

☛ **పోచంపల్లి హ్యాండ్లూమ్:** చేనేతకు ప్రసిద్ధి చెందిన పోచంపల్లి గ్రామంలో ఈ పర్యటన ఉంటుంది.

రెండు రోజుల్లో...

☛ **నాగార్జునసాగర్–బుద్ధవనం:** కృష్ణా నది ఒడ్డున 280 ఎకరాల్లో విస్తరించిన ప్రపంచంలోనే అతిపెద్ద బౌద్ధ థీమ్ పార్క్ ఇది. రెండు రోజుల యాత్రలో భాగంగా నాగార్జునకొండ దీవిలోని బౌద్ధ క్షేత్రం అవశేషాలను, శతాబ్దాల నాటి చరిత్ర ఆనవాళ్లున్న మ్యూజియం చూపిస్తారు. హరిత హోటల్‌లో వసతి, రాత్రివేళ క్యాంప్ ఫైర్ ఉంటాయి.

☛ **వరంగల్:** ఈ యాత్ర ఉదయం యాదగిరిగుట్టలో లక్ష్మీనరసింహ స్వామి దర్శనంతో మొదలవుతుంది. కొలనుపాకలో జైన, సోమేశ్వర ఆలయాల సందర్శన ఉంటుంది. తర్వాత వరంగల్ కోట, భద్రకాళి ఆలయం, వేయి స్తంభాల గుడి, యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప ఆలయం, చివరగా ఆహ్లాదకరమైన లక్నవరం చెరువు సందర్శనతో ముగుస్తుంది.

కిటికీ తెరచుకొని.. 40 ఏళ్లు!



ఇంట్లో తలుపులు, కిటికీలు తెరిస్తే గాలి వెలుతురు ఎలా వస్తుందో... కంప్యూటర్ రంగంలోనూ ఓ కిటికీ తెరచుకొని... సరికొత్త వెలుగులకు శ్రీకారం చుట్టింది! అదే విండోస్!

కంప్యూటర్ అక్షరాస్యత ఉన్నవారిలో మైక్రోసాఫ్ట్ విండోస్ అంటే తెలియని వారు అరుదే. పర్సనల్ కంప్యూటర్ విభాగంలో ఎక్కువ ఆదరణ కలిగిన ఆపరేటింగ్ సిస్టంగా మైక్రోసాఫ్ట్ విండోస్ కొనసాగుతోంది. ప్రస్తుతం విండోస్ 11 ఆధునిక వర్షన్ కాగా.. తొలి వర్షన్ విండోస్ 1.0 విడుదలై నేటికి 40 ఏళ్లు (1985, నవంబరు 20) అవుతోంది. ఎంఎస్-డాస్, 16-బిట్ షెల్ ప్రోగ్రాం (ఎంఎస్ డాస్ ఎగ్జిక్యూటివ్)పై నడిచే విండోస్ 1.0 ద్వారా పర్సనల్ కంప్యూటర్‌లో మల్టీటాస్కింగ్, మౌస్ వినియోగం ప్రారంభమయ్యాయి. క్యాలిక్యులేటర్, పెయింట్, నోట్‌పాడ్ తదితర బిల్ట్ ఇన్ ప్రోగ్రామ్స్ అందుబాటులోకి వచ్చాయి. విండోస్ 1.0లో స్వల్ప మార్పులతో నాలుగు వర్షన్లను మైక్రోసాఫ్ట్ విడుదల చేసింది. అప్పట్లో ఈ ఆపరేటింగ్ సిస్టమ్‌పై మిశ్రమ స్పందనలు వినిపించినా... పెద్దసంఖ్యలో హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ తయారీదారుల నుంచి మైక్రోసాఫ్ట్‌కు మద్దతు లభించింది. 1987లో ఈ సంస్థ విండోస్ 2.0ని విడుదల చేసింది. అత్యధిక కాలం నడిపిన విండోస్ 1.0కు 2001 డిసెంబరు 31న సంస్థ సపోర్ట్ నిలిపివేసింది.

– ఈనాడు ప్రత్యేక విభాగం



కాఫీ కప్పులు చెబుతాయి మావోయిస్టుల కథలు

ఛత్తీస్‌గఢ్‌లోని జగదల్‌పుర్‌లో ఓ ప్రత్యేక కాఫీ కేఫ్ రాష్ట్ర ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయి చేతుల మీదుగా ఇటీవల ప్రారంభమైంది. ప్రభుత్వానికి లొంగిపోయిన నక్సలైట్లు, గతంలో నక్సలైట్ల హింస కారణంగా బాధితులుగా మారిన వారు పనిచేస్తున్న ఈ కేఫ్‌కు ‘పండుమ్’ అని పేరు పెట్టారు. గోండి భాషలో ‘పండుగ’ అని దీని అర్థం. బస్తర్ సాంస్కృతిక మూలాలను ప్రతిబింబించే ఈ పేరుకు ‘జహా హర్ కప్ ఏక్ కహానీ కెహతా హై’ (ఇక్కడ ప్రతి కప్పు ఓ కథ చెబుతుంది) అనే ట్యాగ్ లైను జోడించారు. భిన్నమైన నేపథ్యంతో వచ్చి ఇక్కడ పనిచేస్తున్న సిబ్బంది ప్రారంభించిన కొత్త జీవితాలకు సూచికగా అలా పెట్టారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో ఈ కేఫ్‌ను ఏర్పాటు చేశారు. పదిహేనేళ్లు నక్సలైటుగా తుపాకీ పట్టుకొని అడవుల్లో తిరిగి ఇటీవల లొంగిపోయిన బస్తర్ ప్రాంతవాసి ఫూల్‌మతి మాండవి మాట్లాడుతూ.. కుటుంబానికి, సమాజానికి ఇన్నేళ్లు దూరమై విలువైన కాలాన్ని తాను వృథా చేశానన్నారు. ఈ కేఫ్‌లో చక్కటి కాఫీతోపాటు బస్తర్ వంటకాలు అందుబాటులో ఉంటాయని నిర్వాహకుడు ప్రియాంక్ పటేల్ తెలిపారు.

ఈటీవీ భారత్



మిద్దె తోటకు.. గాలి నుంచే నీరు

మిద్దెతోటకు నిత్యం నీరు పెట్టడం మీకు సమస్యగా ఉందా? అస్సాంకు చెందిన యువ ఆవిష్కర్త నబజిత్ భరాలీ దీనికి ఓ పరిష్కారం చూపుతున్నారు. ధెమాజీ పట్టణానికి చెందిన నబజిత్ వాతావరణంలోని తేమ నుంచి నీటిని ఉత్పత్తి చేసి, ఆ నీటిని స్వయంచాలకంగా మొక్కలకు అందించే యంత్రాన్ని రూపొందించారు. మిద్దెతోటలు, నర్సరీలు, పరిమిత స్థాయిలో నీరు - భూమి ఉన్న రైతులను దృష్టిలో పెట్టుకొని దీనికి రూపకల్పన చేశారు. చల్లబడిన ఉపరితలంపై వాతావరణ నీటి ఆవిరి ఘనీభవించే సూత్రం ఆధారంగా ఈ యంత్రం పనిచేస్తుంది. ఘనీభవించిన నీటి బిందువులను సేకరించి నిల్వ చేయడం ద్వారా ఎయిర్ టు వాటర్ జనరేటరులా ఇది నడుస్తుంది. నర్సరీల్లో ఒకసారి అమర్చాక స్వయంచాలకంగా నీటిని విడుదల చేస్తుంది. ఈ యంత్రం ద్వారా కేవలం 12 పైసల ఖర్చుతో లీటరు నీటిని ఉత్పత్తి చేయవచ్చు.

మాంచెస్టర్ ఆఫ్ బిహార్
ఐఐటీయన్ల ఫ్యాక్టరీ నేడు

బిహార్‌లోని వెనుకబడిన ప్రాంతమైన గయా జిల్లాలో ఆ ఊరు ఎక్కడో విసిరేసినట్టుగా ఉంటుంది. వెయ్యి గడపలున్న గ్రామంలో దాదాపుగా అందరూ చేనేత కార్మికులే కాగా.. ఏకంగా 200 మందికి పైగా ఐఐటీయన్లు, ఇంజినీర్లు ఉండటం విశేషం. గతంలో నాణ్యమైన చేనేత వస్త్రాల తయారీతో ‘మాంచెస్టర్ ఆఫ్ బిహార్’గా పేరొందిన పట్వాటోలీ గ్రామం ఇప్పుడు ఐఐటీయన్ల ఫ్యాక్టరీగా విరాజిల్లుతోంది. దాదాపు మూడు దశాబ్దాల క్రితం ఈ ఊరి నుంచి ఓ విద్యార్థి తొలిసారిగా ఐఐటీ అర్హత సాధించాడు. ఆ స్ఫూర్తితో ఐఐటీ లక్ష్యంగా ఎంతోమంది గ్రామ విద్యార్థులు శ్రమిస్తూనే ఉన్నారు. దేశమంతా రూ.లక్షలు వెచ్చించి ఖరీదైన కోచింగ్ సెంటర్లలో చాలా మంది చేరుతుండగా.. పట్వాటోలీ విద్యార్థులు స్థానిక శిక్షణతోనే ఐఐటీ లేదా ఇంజినీరింగ్ కళాశాలల్లో అలవోకగా ప్రవేశాలు పొందుతున్నారు. ఈ ఊరి నుంచి వెళ్లి ఐఐటీల్లో చదువుతున్న విద్యార్థులు గ్రామంలో ఐఐటీ లక్ష్యంగా చదువుతున్న మిగతా విద్యార్థులకు సలహాలు, సూచనలు ఇవ్వడం మొదలుపెట్టారు. వివిధ ఐఐటీల నిపుణులతో వీరికి ఆన్‌లైన్ తరగతులు చెప్పిస్తున్నారు. సెలవు రోజుల్లో సీనియర్లు గ్రామానికి వచ్చి విద్యార్థులకు సూచనలు చేస్తూ తోడ్పాటునందిస్తున్నారు. ‘వృక్ష్ ఫౌండేషన్’ సాయంతో ఇక్కడి విద్యార్థులకు డిజిటల్ బోర్డు తదితర ఆధునిక విధానాలతో బోధన అందుతోంది. ఈ ఏడాది జేఈఈ మెయిన్స్‌లో పట్వాటోలీ నుంచి 40 మంది అర్హత సాధించారు. –ఇంటర్నెట్ డెస్క్



ఐ బొమ్మ రవి లాంటి వారెందరో!

- తమిళనాడు అడ్డాగా 100 మంది పైరసీకారులు
- పోలీసులకు సవాల్‌గా మారిన కేటుగాళ్ల గుర్తింపు

ఈనాడు, హైదరాబాద్: ఆరేళ్లుగా 21వేల సినిమాలు పైరసీ చేసిన ఐ బొమ్మ నిర్వాహకుడు రవి అరెస్ట్‌తో ఈ దందా ఆగిపోతుందని పోలీసులు భావించడంలేదు. దేశవ్యాప్తంగా అతడి లాంటి దళారులు వేలల్లో ఉంటారని విశ్లేషిస్తున్నారు. తమిళనాడు అడ్డాగా చేసుకొని సుమారు 100 మంది తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ సినిమాలను థియేటర్లలో రికార్డు చేసి వెబ్‌సైట్లకు విక్రయిస్తున్నారు. పైరసీ కట్టడిలో భాగంగా ఇప్పటి వరకు హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు 9 మందిని అరెస్ట్ చేశారు. ఇదే చొరవ మిగిలిన రాష్ట్రాల్లో చూపగలిగితే ఆ మహమ్మారి నుంచి బయటపడతామని సినీ ప్రముఖులు అభిప్రాయపడుతున్నారు. దేశం నలువైపులా పాకిన పైరసీ కేటుగాళ్లను గుర్తించటం పోలీసులకు సవాల్‌గా మారింది.

ఎవరెలా చేస్తున్నారంటే..

✦ హైదరాబాద్‌కు చెందిన జానా కిరణ్‌కుమార్ థియేటర్ మధ్యలో సీటు రిజర్వ్ చేసుకునేవాడు. పాప్‌కార్న్ ప్యాకెట్ మధ్యలో సెల్‌ఫోన్ ఉంచి యాప్ సహాయంతో కొత్త సినిమాలు చిత్రీకరించేవాడు. 40 సినిమాలు పైరసీ చేసి టెలిగ్రామ్ యాప్ ద్వారా విక్రయించి క్రిప్టోకరెన్సీ రూపంలో కమీషన్ తీసుకునేవాడు.

✦ తమిళనాడుకు చెందిన రాజ్ అమలదాస్ 2020 నుంచి తమిళ్‌బ్లాస్టర్.నెట్, తమిళ్‌బ్లాస్టర్స్.వైన్ వంటి పేర్లతో నాలుగు వెబ్‌సైట్‌లు నిర్వహిస్తున్నాడు. సామాజిక మాధ్యమాల్లో నిరుద్యోగులు, విద్యార్థులను ఆకట్టుకొనేవాడు. కమీషన్‌కు ఆశపడిన వారి ద్వారా థియేటర్లలో సినిమాలు చిత్రీకరించి ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్‌ల నిర్వాహకుల నుంచి ప్రతి నెలా రూ.8-9లక్షలు సంపాదించేవాడు.

✦ బిహార్‌కు చెందిన కుర్రాడు అశ్విన్‌కుమార్ తన గదినే పైరసీ కేంద్రంగా మార్చుకున్నాడు. కొత్త సినిమాలు భద్రపరిచే సర్వర్లలోకి బగ్ పంపి విడుదలకు ముందే హెచ్‌డీ క్వాలిటీతో డౌన్‌లోడ్ చేసేవాడు. ఇతడు అరెస్టయ్యేనాటికి 120 హెచ్‌డీ సినిమాలను పైరసీ చేసి వెబ్‌సైట్‌లకు విక్రయించాడు.

గేమింగ్ యాప్‌ల చేతిలో కీలుబొమ్మలు

పలు భాషల సినిమాలు పైరసీ చేసిన నిందితులు ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్‌యాప్‌ల చేతిలో కీలుబొమ్మలుగా మారినట్టు హైదరాబాద్ సీపీ సజ్జనార్ స్పష్టం చేశారు. ఉచిత సినిమాల ఆశ చూపి వ్యక్తిగత సమాచారం సేకరిస్తున్నారు.



రవి నుంచి స్వాధీనం చేసుకున్న సామగ్రి పరిశీలిస్తున్న హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనార్

ప్రస్తుతం ఇన్వెస్ట్‌మెంట్, డిజిటల్ అరెస్ట్ బాధితులు పెరిగేందుకు పైరసీ సినిమాల వెబ్‌సైట్‌లు ప్రధాన కారణమని పోలీసు అధికారి విశ్లేషించారు. గేమింగ్‌యాప్‌ల మాయలో పడి 45 కోట్ల మంది దేశప్రజలు ఏటా రూ.20వేల కోట్లు నష్టపోతున్నట్టు ప్రభుత్వం అంచనా వేసింది.

హిందూత్వమే నా శ్వాస

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్

ఈనాడు, కరీంనగర్: హిందూత్వమే తన శ్వాస అని.. నోటి నుంచి ఆ మాట ఆగిపోతే తన శ్వాస ఆగిపోయినట్లేనని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. హుజూరాబాద్‌లో బుధవారం నిర్వహించిన కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పోలింగ్ బూత్ కమిటీ సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా సంజయ్ మాట్లాడుతూ.. గత జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో హిందూత్వవాదం వల్లే 48 సీట్లు గెలిచామన్నారు. ముస్లింలు, క్రైస్తవులు అనే తేడా లేకుండా ప్రధాని మోదీ అందరికీ సంక్షేమ పథకాలను అందిస్తుంటే.. ముస్లింలు మాత్రం భాజపాకు ఓటు వేయడం లేదన్నారు.